సోమవారం
28•08•2017
హైదరాబాద్
• వెల.5 రూ.
• సంపుటి 7 • సంచిక 81
• పేజీలు : 16 + 24

నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక
WWW. NTNEWS.COM
/NTDAILYONLINE

PUBLISHED FROM HYDERABAD I KARIMNAGAR I WARANGAL I KHAMMAM I NALGONDA I MAHABUBNAGAR I NIZAMABAD

రైతు సమన్వయ సమితుల ఏర్పాటుకు శ్రీకారం



ఇంచార్జీలుగా మంత్రులు

గ్రామ, మండల, జిల్లాల వారీగా ఏర్పాటు

సెప్టెంబర్ 9నాటికి పూర్తిచేయాలని నిర్ణయం

సమితుల స్వరూపంపై మార్గదర్శకాలు జారీ

ప్రతి సమన్వయ సమితికి ఒక కో-ఆర్డినేటర్

రాష్ట్ర రైతు సమన్వయ సమితి సభ్యుల ఎంపికను పర్యవేక్షించనున్న సీఎం కేసీఆర్!

సమితులకు నోడల్ ఏజెన్సీగా వ్యవసాయశాఖ

రాష్ట్రస్థాయిలో నోడల్ అధికారిగా వ్యవసాయశాఖ కమిషనర్

జిల్లాస్థాయిలో నోడల్ అధికారిగా కలెక్టర్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

అన్నదాతలకు దన్నుగా నిలిచేందుకు రైతు సమన్వయ సమితుల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. రైతులను సంఘటితం చేయడంలో కీలకమైన ముందడుగు వేసింది. ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ఆలోచనలకు అనుగుణంగా గ్రామ, మండల, జిల్లా, రాష్ట్రస్థాయి రైతు సమన్వయ సమితుల ఏర్పాటు, ఇందులో సభ్యుల సంఖ్య, ఎంపిక విధానం తదితర కీలక అంశాలతో ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులు జారీచేసింది. గ్రామస్థాయి నుంచి జిల్లాస్థాయి రైతు సమన్వయ సమితి సభ్యులు, కో-ఆర్డినేటర్ సభ్యుడిని నామినేటెడ్ పద్ధతిలో ఖరారు చేసే బాధ్యతను ఆయా జిల్లాలవారీగా ఇంచార్జీ మంత్రులకు అప్పగించారు. ఇంచార్జీ మంత్రుల పేర్లను సైతం జీవోలో పేర్కొన్నారు. ఈ మొత్తం ప్రక్రియను సెప్టెంబర్ 9నాటికి పూర్తిచేయాలని ఉత్తర్వుల్లో సూచించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిననాటి నుంచి రైతు సంక్షేమం కోసం తీసుకున్న అన్ని చర్యలను, రైతు సమగ్ర సర్వే తీరుతెన్నులు, ఎకరానికి ప్రతి సీజన్‌లో రూ.4వేల పెట్టుబడి, ప్రస్తుతం అత్యంత కీలకమైన రైతు సమితుల ఏర్పాటు అంశాలను జీవోలో వివరించారు. గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు సమితుల్లో ఎంతమంది సభ్యులు ఉండాలన్న అంశాన్ని సీఎం కేసీఆర్ ఖరారు చేశారు. జిల్లా రైతు సమన్వయ సమితుల సమాహారంగా ఏర్పాటుచేయనున్న రాష్ట్ర రైతు సమన్వయ సమితి సభ్యుల ఎంపికను స్వయంగా ముఖ్యమంత్రి పర్యవేక్షిస్తారని వ్యవసాయశాఖ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. రాష్ట్ర రైతు సమన్వయ సమితి వద్ద రూ.500కోట్ల మూలనిధి ఏర్పాటు చేయనున్నారు. కనీస మద్దతు ధర విషయంలో రైతులకు ఇబ్బందులు తలెత్తినప్పుడు ఈ నిధులను

మిగతా 2వ పేజీలో



సింధు రజతానందం



బ్యాడ్మింటన్ వరల్డ్ చాంపియన్‌షిప్‌లో రన్నరప్

ఫైనల్లో పోరాడి ఓడిన తెలుగమ్మాయి

భారత్‌కు రెండు పతకాలు

ఇప్పటికే కాంస్యం గెలిచిన సైనా

వివరాలు ఖేల్‌లో



మూడు రోజులుగా కురుస్తున్న వానలకు జయశంకర్ భూపాలపల్లి జిల్లా వాజేడు అటవీప్రాంతంలోని బొగత జలపాతం ఆదివారం ఉధృతరూపంలో ఉరుకులు పెడుతున్న దృశ్యం

నేటి నుంచి భారీ వర్షాలు

చురుగ్గా నైరుతి రుతుపవనాలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

వాయవ్య బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం ఉత్తర ఒడిశా, బెంగాల్‌కు ఆనుకొని స్థిరంగా కదులుతున్నది. ఆంధ్రప్రదేశ్ మీదుగా మరో ఉపరితల ఆవర్తనం ఏర్పడటంతో నైరుతి రుతుపవనాలు చురుగ్గా కదులుతున్నాయి. ఫలితంగా గత మూడు రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. రాగల 24 గంటల్లో ఇది అల్పపీడనంగా బలపడి వచ్చే మూడు రోజులపాటు రాష్ట్రవ్యాప్తంగా భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. గురువారం నుంచి వర్షాలు కాస్త తగ్గుముఖం పట్టవచ్చునని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారి నాగరత్న తెలిపారు. శనివారం ఉదయం 8.30 నుంచి ఆదివారం ఉదయం 8.30 వరకు రాష్ట్రంలో అత్యధికంగా భూపాలపల్లి జిల్లాలో 7 సెం.మీ. వర్షపాతం నమోదైంది. కొత్తగూడెం 6 సెం.మీ., దోమ 5 సెం.మీ., మక్లూరు, అలంపూర్‌లో 4 సెం.మీ. చొప్పున, లింగంపేట, గట్టు, చెన్నూరు, ములుగు, వర్ని, కొల్లాపూర్‌లో 3 సెం.మీ. చొప్పున, పాలకుర్తి, దామరగిద్ద, కాళేశ్వరం, అచ్చంపేట, కోస్గి, గండీడ్, నారాయణఖేడ్, సరూర్‌నగర్, కొడంగల్, మెదక్, రుద్రూర్(ఏ)లో 2 సెం.మీ. చొప్పున, ఆసిఫాబాద్, ఆర్మూర్, జడ్చర్ల, నర్మెట్ట, మహబూబ్‌నగర్, యాచారం, భీంగల్, ఎల్లారెడ్డి, హన్మకొండ, భిక్కనూరులో సెంటీమీటర్ చొప్పున వర్షం కురిసింది.

ప్రాజెక్టుల్లోకి భారీ వరద

గోదావరి పరీవాహక ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలకు పలు ప్రాజెక్టుల్లోకి వరద వచ్చి చేరుతున్నది. అన్నింటికంటే నిజామాబాద్ జిల్లాలోని శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి భారీగా ఇన్‌ఫ్లో వచ్చి చేరుతున్నది. ఆదివారం ఉదయం 2,333 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

మిగతా 2వ పేజీలో



విశ్వాసాల పేర హింసను ఉపేక్షించం

చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటే చూస్తూ ఊరుకోం

దోషులెవరైనా శిక్ష అనుభవించాల్సిందే

ఓడీఎఫ్‌లో ఆదర్శంగా 2.3లక్షల గ్రామాలు

జన్‌ధన్ యోజనను పలు దేశాలు పరిశీలిస్తున్నాయి

'జమైత్ ఉలేమాయే హింద్' కృషికి అభినందనలు

'మన్‌కీ బాత్'లో ప్రధానమంత్రి నరేంద్రమోదీ

5

భద్రతా వలయంలో రోహతక్

డేరా బాబాకు శిక్ష ఖరారయ్యేది నేడే

హెలికాప్టర్‌లో జైలుకు రానున్న న్యాయమూర్తి

రేపటి వరకు పంజాబ్, హర్యానాల్లో మొబైల్, ఇంటర్నెట్, సామూహిక ఎస్సెమ్మెస్‌లపై నిషేధం.. అందుబాటులో సైన్యం



ఆదివారం హర్యానాలోని రోహతక్ జిల్లా సునారియా జైలు వద్ద భారీగా మోహరించి ఉన్న భద్రతాబలగాలు

వర్షాతిరేకాలు.. హరిత పందిళ్లు

- 24.20 కోట్లు దాటిన హరితమొక్కలు
- ఖమ్మం జిల్లాలో వందశాతం లక్ష్యం పూర్తి
- తక్కువ లక్ష్యం సాధించిన జిల్లాలపై ప్రత్యేక దృష్టి
- నేడు ఎమ్మెల్యేలకు లేఖలు రాయనున్న మంత్రి జోగు రామన్న


హైదరాబాద్ శివారులోని ఓ నర్సరీలో పంపిణీకి సిద్ధంగా ఉన్న మొక్కలు (ఫైల్)



ప్రత్యేక ప్రతినిధి, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో గత కొన్ని రోజులుగా విస్తారంగా వర్షాలు కురుస్తుండటంతో హరిత హారం కార్యక్రమం మరింత ఊపందుకున్నది. జూలై 12 నుంచి ప్రారంభమైన మూడో విడుత హరితహారం కార్యక్రమంలో మొత్తం లక్ష్యంలో 55 శాతం ఇప్పటికే పూర్తి కావడం విశేషం. 45 రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా రికార్డుస్థాయిలో 24.20 కోట్ల మొక్కలు నాటినట్లు రికార్డులు వెల్లడిస్తున్నాయి. ఈసారి అడవుల్లో 4 కోట్ల మొక్కలను నాటాలని లక్ష్యంగా పెట్టుకోగా ఇప్పటికే దాదాపు 3 కోట్ల మొక్కలను నాటినట్లు అధికారులు పేర్కొన్నారు. లక్ష్యంలో 50 నుంచి 60 శాతం కంటే తక్కువ మొక్కలు నాటిన జిల్లాలపై ప్రత్యేకంగా దృష్టిసారించాలని అధికారులను అటవీ, పర్యావరణశాఖల మంత్రి జోగురామన్న ఆదేశించారు. ఈ విషయంలో ప్రత్యేక చొరవ తీసుకోవాలని కోరుతూ ఆయన సోమవారం ఎమ్మెల్యేలకు లేఖలు రాయనున్నారు. ఖమ్మం జిల్లాలో వందశాతం లక్ష్యం పూర్తి చేయడంపై కలెక్టర్‌తోపాటు ఇతర అధికారులను మంత్రి అభినందించారు. ఖమ్మం జిల్లాలో మొత్తం 1.85 కోట్ల మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకోగా ఇప్పటికే లక్ష్యాన్ని అధిగమించినట్లు అధికారులు వెల్లడించారు. 95.47 శాతం మొక్కలను నాటి నిజామాబాద్ రెండో స్థానంలో నిలిచింది. వరంగల్ రూరల్ జిల్లాలో 93.74 శాతం లక్ష్యాన్ని పూర్తిచేశారు. గ్రీన్ బ్రిగేడ్ బృందాల ఏర్పాటు మంచి ఫలితాన్నిస్తున్నది.

ఇప్పటివరకు 25 వేలకు పైగా కమిటీలు ఏర్పాటయ్యాయి. నేటివరకు దాదాపు పది కోట్ల మొక్కలకు జియోట్యాంగింగ్ చేసినట్లు అధికారులు తెలిపారు. రిజర్వ్ ఫారెస్ట్ ప్రాంతాల్లో యుద్ధప్రాతిపదికన మొక్కలు నాటుతున్నందున అధికారులెవరూ హెడ్‌క్వార్టర్లను వదిలి వెళ్లరాదని అటవీశాఖ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ పీకే ఝా ఆదేశాలు జారీ చేశారు.

రేషన్ బియ్యం లెక్కలకూ ఓ యాప్!

పౌరసరఫరాలశాఖ ఆలోచన

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రేషన్ బియ్యం పంపిణీలో మరింత పారదర్శకత తీసుకొచ్చేందుకు పౌరసరఫరాలశాఖ ప్రత్యేకంగా ఓ మొబైల్ యాప్‌ని రూపొందించేందుకు సన్నాహాలు చేస్తున్నది. పౌరసరఫరాలశాఖ మంత్రి ఈటల రాజేందర్‌తో ఐటీ నిపుణులు చర్చించిన తర్వాత యాప్‌కు రూపకల్పన చేయనున్నట్టు ఆ శాఖ కమిషనర్ సీవీ ఆనంద్ తెలిపారు. క్షేత్రస్థాయిలో జరుగుతున్న అక్రమాలను నిరోధించడంతోపాటు రేషన్ బియ్యం కేటాయింపు, తరలింపు తదితర వివరాలన్నింటినీ ఎక్కడి నుంచైనా ఈ యాప్ ద్వారా తెలుసుకునేందుకు వీలుకలుగుతుందని చెప్పారు. ఇప్పటికే ఈ పాస్ (ఎలక్ట్రానిక్ పాయింట్ ఆఫ్ సేల్), పోర్టబులిటీ తదితర సాంకేతిక విధానాలను అధికారులు అమలు చేస్తున్నారు. ఈ యాప్ ద్వారా గోదాముల నుంచి చౌకధరల దుకాణాల వరకు బియ్యం నిల్వల తీరుతెన్నులను స్వయంగా తెలుసుకునే అవకాశం కలుగుతుంది. ఒకవేళ నిల్వలు ఉన్నప్పటికీ.. డీలర్ లేవని చెబితే యాప్ ద్వారా అసలు విషయం బయటపడుతుంది. బియ్యాన్ని నల్లబజారుకు తరలించే అవకాశం లేకుండాపోతుంది. డీలర్లు, మిల్లర్లకు కూడా యాప్ వల్ల ఉపయోగాలు ఉన్నాయి. తన పరిధిలో ఉన్న కార్డుల సంఖ్య, పంపిణీకి సంబంధించిన వివరాలను డీలర్ ఎప్పటికప్పుడు తెలుసుకునే వీలుంటుంది. దీపం కనెక్షన్ల వివరాలు సైతం యాప్‌లో పొందుపరుస్తారు. తద్వారా పౌరసరఫరాలశాఖ పరిధిలో జరిగే అన్ని సేవలు ప్రజలకు అందుబాటులోకి రానున్నాయి.

టీఎస్‌పీఎస్సీ వెబ్‌సైట్‌లో టీజీటీ హాల్ టికెట్లు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణ గురుకులాల్లోని టీజీటీ కొలువుల భర్తీ కోసం నిర్వహించనున్న మెయిన్స్ పరీక్షకు సంబంధించిన హాల్‌టికెట్లను వెబ్‌సైట్‌లో ఉంచినట్టు టీఎస్‌పీఎస్సీ తెలిపింది. ఈ నెల 29న ఫిజికల్ సైన్స్, సోషల్ సైన్స్, 30న సైన్స్ పరీక్ష జరుగనున్నది. హాల్‌టికెట్‌లోని మార్గదర్శకాలను అనుసరించి అభ్యర్థులు పరీక్షకు హాజరు కావాలని టీఎస్‌పీఎస్సీ ఆదివారం ఒక ప్రకటనలో సూచించింది.

ప్రశాంతంగా పలు పరీక్షలు

పీజీటీ భాషా పండిట్‌తోపాటు మరో మూడు మూడు క్యాటగిరీలకు సంబంధించి ఆదివారం నిర్వహించిన పరీక్ష ప్రశాంతంగా పూర్తయినట్టు టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి వాణీప్రసాద్ తెలిపారు. ఆదివారం హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో 130 పరీక్షకేంద్రాల్లో 463 అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, నాలుగు ఇన్‌స్పెక్టర్ ఆఫ్ బాయిలర్స్, ఏడు వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ల ఖాళీలకు పరీక్ష జరిగినట్టు తెలిపారు.

నేటి పరీక్షకు ఏర్పాట్లు సిద్ధం

సోమవారం జరుగనున్న గురుకులాల్లోని పీజీటీ ఇంగ్లిష్ పరీక్ష అన్ని ఏర్పాట్లుచేసినట్టు వాణీప్రసాద్ తెలిపారు.


నేటి నుంచి భారీ వర్షాలు

మొదటిపేజీ తరువాయి...

ఉండగా, సాయంత్రానికి ఒక్కసారిగా ఇన్‌ఫ్లో 26,375 క్యూసెక్కులకు పెరిగింది. నిర్మల్ జిల్లా కడెం ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరి జలకళను సంతరించుకుంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 700 అడుగులు (7.603 టీఎంసీలు) కాగా, ప్రస్తుతం 698.300 అడుగులు (7.164 టీఎంసీల) వద్ద ఉంది. నిజాంసాగర్ ప్రాజెక్టులోకి 1247 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉన్నది. పోచారం ప్రాజెక్టులో ఆదివారం సాయంత్రానికి 1.778 టీఎంసీలకు నీటి నిల్వ ఉన్నది. కల్యాణి ప్రాజెక్టుకు 771 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతున్నది. సింగూర్ ప్రాజెక్టులోకి 6,386 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరింది. వారం రోజులుగా రెండున్నర టీఎంసీల నీరు చేరిందని ప్రాజెక్టు అధికారులు తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం తాలిపేరు ప్రాజెక్టుకు వరదపోటు తగ్గింది. ఎగువ ప్రాంతం నుంచి వరద భారీగా వస్తుండటంతో ఆదివారం సాయంత్రం 10 గేట్లు ఎత్తి 35 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు.

ముహూర్తం


సూర్యోదయం: 6.05 గంటలకు


సూర్యాస్తమయం: 6.29 గంటలకు

హేవళంబి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు, భాద్రపదమాసం, శుక్లపక్షం. నక్షత్రం: విశాఖ రాత్రి 8.11 వరకు తదుపరి అనురాధ. రాశి: తుల మధ్యాహ్నం 1.32 వరకు తదుపరి వృశ్చిక. అమృతఘడియలు: ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 12.06 వరకు. రాహుకాలం: ఉదయం 7.38 నుంచి ఉదయం 9.11 వరకు, దుర్ముహూర్తం: ఉదయం 11.52 నుంచి మధ్యాహ్నం 12.42 వరకు తిరిగి మధ్యాహ్నం 3.11 నుంచి సాయంత్రం 4.00 వరకు. వర్జ్యం: లేదు.

లోకం పోకడ


ఇకనుంచి మీ మనోవికారాన్ని దూరం చేసే మీ ధ్యాన కేంద్రం ఇదే!

ఇంచార్జీలుగా మంత్రులు

మొదటిపేజీ తరువాయి...

రాష్ట్ర రైతు సమన్వయ సమితి వినియోగించుకునే వీలు కల్పించారు.

ప్రతి సీజన్‌కు రూ.4వేల పెట్టుబడి

వ్యవసాయానికి పెట్టుబడి పథకం కింద రాష్ట్రంలోని ప్రతి రైతుకు ప్రతి సీజన్‌లో ఎకరానికి రూ.4వేలు పెట్టుబడి ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. ఈ మొత్తాన్ని విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు ఇతర పెట్టుబడికి రైతులు వినియోగించుకునేలా ప్రభుత్వం వెసులుబాటు కల్పించింది. ఈ పథకాన్ని 2018-19 ఏడాది నుంచి అమల్లోకి తెచ్చేందుకు వేగంగా ముందుకు సాగుతున్నది. వానాకాలంతోపాటు యాసంగి పంటవేసే రైతులకు ప్రతి ఎకరాకు రూ.4వేల పెట్టుబడి ఇవ్వనున్నారు. సాధారణ పంటలతోపాటు ఉద్యాన పంటలు పండించే అన్నదాతలకు కూడా ఈ పథకం వర్తిస్తుందని ఉత్తర్వుల్లో స్పష్టంచేశారు.

రైతు సమగ్ర సర్వేతో తుది రూపు

సీఎం కేసీఆర్ దిశానిర్దేశంలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న రైతుల సంఖ్య, సాగుచేస్తున్న పంటల వివరాల సేకరణకు వ్యవసాయశాఖ రైతు సమగ్ర సర్వే ప్రారంభించింది. ఈ ఏడాది మే నుంచి జూలై వరకు వ్యవసాయ విస్తరణ అధికారులంతా ప్రతి రైతు ఇంటికి వెళ్లి వివరాలు సేకరించారు. కొన్ని ప్రాంతాల్లో రెవెన్యూపరంగా సమస్యలు వెలుగుచూశాయి. ఈ నేపథ్యంలో రెవెన్యూ, వ్యవసాయశాఖ ఉన్నతాధికారులతో సీఎం కేసీఆర్ పలు దఫాలుగా సమావేశాలు నిర్వహించి సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు చేశారు. వ్యవసాయ, రెవెన్యూ అధికారుల సమన్వయంతో గ్రామసభలు నిర్వహించి.. రైతులకు సంబంధించిన భూముల వివరాలను సేకరించారు. వీటి ఆధారంగా రైతు సమన్వయ సమితులను ఏర్పాటు చేయనున్నారు.

రైతుకు దన్నుగా ప్రభుత్వం

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచే సీఎం కేసీఆర్ నాయకత్వంలో అనేక రైతు సంక్షేమ నిర్ణయాలతో ప్రభుత్వం ముందుకు వెళుతున్నది. ఓ వైపు సాగునీటి సమస్యకు పరిష్కారం చూపుతూనే దిగుబడి పెంపు, పంటలకు గిట్టుబాటు ధర కల్పించడం, మార్కెట్ సదుపాయాలు పెంచేలా సీఎం కేసీఆర్ అనేక కీలక నిర్ణయాలు తీసుకున్నారు.

- రుణమాఫీ అమలుతో రైతులకు అప్పుల బాధ నుంచి విముక్తి కల్పించారు.
- ఉత్పాదకతను పెంచి గిట్టుబాటు ధర కల్పించారు.
- భారీ, మధ్యతరహా, చిన్ననీటిపారుదల రంగాల అభివృద్ధి కోసం పెద్దఎత్తున పెట్టుబడులు పెట్టారు
- వ్యవసాయానికి 24 గంటల ఉచిత కరెంటు సరఫరా చేస్తున్నారు.
- క్రాప్ కాలనీలను ప్రోత్సహిస్తున్నారు.
- సూక్ష్మసేద్యానికి ప్రోత్సాహం అందిస్తున్నారు.
- గోదాములను నిర్మించి పెద్దఎత్తున పంటల నిల్వకు అవకాశం కల్పించారు.
- పాలీహౌస్‌లను ప్రోత్సహిస్తున్నారు.
- వ్యవసాయంలో ఆధునిక పద్ధతులకు ప్రోత్సాహం అందిస్తున్నారు.
- ప్రతి ఐదువేల ఎకరాలకు ఒక వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈవో)ని నియమించడం ద్వారా రైతులకు సమయానుగుణంగా విత్తనాలు, ఎరువుల పంపిణీ చేపడుతున్నారు.
- వ్యవసాయంలో యాంత్రీకరణను ప్రోత్సహిస్తున్నారు.
- ఈ-నామ్, మార్కెట్ సంస్కరణలు చేపట్టారు.
- ఇప్పుడు రైతు సమన్వయ సమితుల ఏర్పాటుతో రైతుల్లో మరింత ఆత్మస్థైర్యం నింపాలని సీఎం కేసీఆర్ నిర్ణయించారు.

సమన్వయ సమితిలో చేరే అన్నదాతలకు ఉండాల్సిన అర్హతలు

- గ్రామంలో నివాసం ఉంటూ పట్టా భూమిలో వ్యవసాయం చేస్తున్న రైతులకే గ్రామ రైతు సమన్వయ సమితిలో సభ్యుడిగా ఉండేందుకు అర్హత ఉంటుంది.
- సమితి సభ్యుల్లో 1/3 వంతు మంది మహిళా రైతులు తప్పక ఉండాలి.
- సమితి సభ్యుల్లో గ్రామంలోని అన్ని సామాజికవర్గాలకు చెందిన రైతులకు ప్రాధాన్యం ఉండాలి.
- గ్రామ, మండల, జిల్లా, రాష్ట్రస్థాయి రైతు సమన్వయ సమితి సభ్యుల్లో ఒక కో-ఆర్డినేటర్‌ను ప్రభుత్వం నామినేషన్ పద్ధతిలో ఎంపికచేస్తుంది.
- రైతు సమన్వయ సమితులకు వ్యవసాయశాఖ నోడల్ ఏజెన్సీగా వ్యవహరిస్తుంది. రాష్ట్రస్థాయిలో వ్యవసాయశాఖ కమిషనర్ నోడల్ అధికారిగా వ్యవహరిస్తారు. జిల్లాస్థాయిలో కలెక్టర్ జిల్లా నోడల్ అధికారిగా వ్యవహరిస్తారు. కలెక్టర్‌కు సహాయాధికారిగా జిల్లా వ్యవసాయాధికారి ఉంటారు.
- గ్రామ, మండల, జిల్లా రైతు సమన్వయ సమితుల సభ్యులు, కో-ఆర్డినేటర్ల ఖరారు బాధ్యతను జిల్లాలవారీగా ఇంచార్జీ మంత్రులకు అప్పగించారు.

రైతు సమన్వయ సమితుల స్వరూపం..

సమితిస్థాయి	సమితి పేరు	సభ్యుల సంఖ్య
రెవెన్యూ గ్రామం	గ్రామ రైతు సమన్వయ సమితి	15
మండలం	మండల రైతు సమన్వయ సమితి	24
జిల్లా	జిల్లా రైతు సమన్వయ సమితి	24
రాష్ట్రం	రాష్ట్ర రైతు సమన్వయ సమితి	42

గ్రామ, మండల, జిల్లా స్థాయి సమన్వయ సమితుల ఖరారు కోసం జిల్లాలవారీగా మంత్రులకు అప్పగించిన ఇంచార్జీ బాధ్యతల వివరాలు..

మంత్రి	జిల్లాలు
1.పోచారం శ్రీనివాస్‌రెడ్డి	నిజామాబాద్, కామారెడ్డి
2. కడియం శ్రీహరి	జనగామ, వరంగల్ రూరల్, వరంగల్ అర్బన్
3.ఈటల రాజేందర్	కరీంనగర్, పెద్దపల్లి
4. కే తారక రామారావు	రాజన్న సిరిసిల్ల, జగిత్యాల
5. టీ హరీశ్‌రావు	సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట
6. జోగు రామన్న	ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్
7. ఇంద్రకరణ్‌రెడ్డి	నిర్మల్, మంచిర్యాల
8. మహేందర్‌రెడ్డి	రంగారెడ్డి, వికారాబాద్, మేడ్చల్
9. జగదీశ్‌రెడ్డి	నల్లగొండ, సూర్యాపేట, యాదాద్రిభువనగిరి
10.తుమ్మల నాగేశ్వర్‌రావు	ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం
11. లక్ష్మారెడ్డి	మహబూబ్‌నగర్
12. జూపల్లి కృష్ణారావు	నాగర్‌కర్నూల్, వనపర్తి, జోగుళాంబ గద్వాల
13. అజ్మీరా చందులాల్	భూపాలపల్లి, మహబూబాబాద్

భూ రికార్డుల సరళీకరణ

- గ్రామ రెవెన్యూలో ఉండే తొమ్మిది రకాల రికార్డులు రద్దు
- కొత్తగా నాలుగు రకాలకు ప్రతిపాదన
- సర్వే పుస్తకాల్లో మార్పులు.. సబ్ డివిజన్లు తొలిగింపు
- అన్ని భూములకు కొత్తనంబర్లు



హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

భూ పంచాయతీలకు చరమగీతం పాడాలని నిర్ణయించిన తెలంగాణ సర్కారు ఆ దిశగా వడివడిగా అడుగులు వేస్తున్నది. ఇప్పటికే రికార్డుల సరళీకరణ, ప్రక్షాళన ఏవిధంగా ఉండాలో అధికారులకు దిశానిర్దేశం చేసిన ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ఇందుకు ప్రజాప్రతినిధులను కార్యోన్ముఖులను చేశారు. భూ రికార్డుల ప్రక్షాళన పూర్తయ్యే వరకు ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఇతర ప్రజాప్రతినిధులు ఎవరూ హైదరాబాద్‌కు రావొద్దని ఆదేశించారు. రికార్డుల ప్రక్షాళనను ఇప్పటికే నల్సార్ లా యూనివర్సిటీ సౌజన్యంతో ల్యాండెస్సా సంస్థ ఎనిమిది గ్రామాల్లో ప్రయోగాత్మకంగా చేపట్టింది. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలంలోని ములకలకాలువలో ఈ మధ్య రికార్డుల ప్రక్షాళన పూర్తిచేశారు. ఇదే తరహా రికార్డుల ప్రక్షాళనకు సర్కారు సన్నద్ధమవుతున్నది. సమగ్ర భూ సర్వేకు వెళ్లాలని నిర్ణయించిన సీఎం కేసీఆర్.. రంగారెడ్డి జిల్లా కలెక్టర్ రఘునందన్ నేతృత్వంలో సర్వే, రికార్డుల ప్రక్షాళన ఏవిధంగా చేయాలన్నదానిపై కమిటీ వేశారు. ఈ కమిటీ మూడు గ్రామాల్లో శాంపిల్ సర్వే నిర్వహించి, రికార్డులు పరిశీలించి నివేదిక ఇచ్చింది.

నాలుగు రకాల రికార్డులు మాత్రమే

గ్రామస్థాయిలో ప్రభుత్వం ఇప్పటివరకు తొమ్మిది రకాల రెవెన్యూ రికార్డులను నిర్వహిస్తున్నది. ఇన్ని రికార్డుల గందరగోళానికి ఫుల్‌స్టాప్ పెట్టాలని, కొత్తగా నాలుగురకాల గ్రామస్థాయి రికార్డులను కమిటీ ప్రతిపాదించింది. గతంతో ఉన్న సర్వే రికార్డుల స్థానంలోనూ మార్పులు చేస్తున్నారు. ప్రతిపాదిత గ్రామ రిజిస్టర్‌లో చౌఫస్లా- ఖాతాలవారీ రిజిస్టర్, డిమాండ్ కలెక్షన్- బ్యాలెన్స్ రిజిస్టర్, రోజువారీ కలెక్షన్ రిజిస్టర్, రీ కన్సిలేషన్ రిజిస్టర్, సాగునీటి వసతి భూముల రిజిస్టర్, రిసిప్ట్ ఫర్ ల్యాండ్ రెవెన్యూ అకౌంట్స్‌ను పూర్తిగా తొలిగించనున్నారు. వీటిస్థానంలో ప్రభుత్వ భూముల రిజిస్టర్, పహాణీలు, ఖాతావారీ రిజిస్టర్, మ్యుటేషన్ (మార్పుల) రిజిస్టర్లను ఉనికిలోకి తీసుకురావాలని భావిస్తున్నారు. ఇప్పటివరకు ఉన్న సర్వే రికార్డుల్లో సేత్వార్‌తోపాటు వసూల్ బాకీ అకౌంట్స్ మాత్రమే ఉండేవి. వీటిస్థానంలో సేత్వార్‌తోపాటు కో రిలేషన్ స్టేట్‌మెంట్ అకౌంట్స్ నిర్వహించాలని రఘునందన్ కమిటీ ప్రతిపాదించినట్టు తెలిసింది.

ప్రతిపాదిత నాలుగు రిజిస్టర్లలో ఉండే వివరాలు

ప్రభుత్వ భూముల రిజిస్టర్‌లో..: గ్రామాల వారీ సర్వేనంబర్, భూమి విస్తీర్ణం, భూమి స్వభావం, మొత్తం విస్తీర్ణంలో సాగుకు పనికిరాని, అసైన్‌మెంట్‌కు పనికిరాని భూమి-కారణాలు, అసైన్‌మెంట్ కేటాయింపునకు యోగ్యమైన భూమి, అసైన్‌మెంట్‌పై పట్టా ఇచ్చిన భూమి, మిగిలి ఉన్న విస్తీర్ణం, భూ కేటాయింపు వివరాలు, చెట్ల పట్టాలు మంజూరు చేసిన వివరాలు, కౌలుకు ఇవ్వబడిన భూమి తదితర వివరాలు ఉంటాయి.

పహాణీలో.. : పట్టాదారు ఖాతా నంబర్, సర్వే నంబర్, పూర్తి విస్తీర్ణం, భూమి స్వభావం (పట్టా లేదా ఇనామ్ లేదా ప్రభుత్వ భూమి), మెట్ట లేదా మాగాణి వివరాలు, యజమాని పేరు, సాగుచేసే విధానం, భూ వినియోగం, 22(ఏ) జాబితాలో చేర్చిందా లేదా, భూమిపై గల వివాదాలు, ఇందులో వ్యవసాయశాఖ పూరించాల్సిన సాగు వివరాలు కూడా పొందుపరుస్తారు. వానాకాలం, యాసంగి సీజన్లలో భూమిలో ఏ పంట, ఎంత విస్తీర్ణంలో సాగు చేస్తున్న వివరాలు నమోదు చేస్తారు. జలాధారంతో సాగు చేసే భూముల వివరాలను నీటిపారుదల శాఖ నమోదు చేస్తుంది. బ్యాంకులు ఇచ్చే రుణ వివరాలు కూడా పొందుపరచాలని సూచించారు.

ఖాతాలవారీ రిజిస్టర్‌లో.. : యజమాని పేరు, పూర్తి చిరునామా, మొబైల్‌నంబర్, ఆధార్‌నంబర్, ప్రస్తుత ఖాతా నంబర్, సర్వే నంబర్, తరి, కుష్కి (మెట్ట) వివరాలు, భూమి విస్తీర్ణం, సంక్రమించిన విధానం, ఇతరులకు బదిలీ అయిన విధానం పొందుపరుస్తారు.

మార్పుల రిజిస్టర్‌లో..: మార్పునకు ప్రతిపాదించిన భూమి సర్వే నంబర్, మార్పునకు ప్రతిపాదించిన నిబంధన, మార్పు సమాచారం ఇచ్చిన వ్యక్తి వివరాలు, ప్రతిపాదించిన మార్పుల సంక్షిప్త వివరాలు, రికార్డింగ్ అధికారి నిర్ణయం, ఉత్తర్వు నంబర్, తేదీ ఉంటుంది.

ప్రతిపాదిత సర్వే రికార్డుల్లో ఉండే వివరాలు

నమూనా సేత్వార్ రిజిస్టర్‌లో..: జిల్లా, మండలం, గ్రామం పేర్లు, సర్వే నంబర్, మొత్తం విస్తీర్ణం, ప్రభుత్వ, పట్టా, ఇనామ్ భూముల వివరాలు, ప్రభుత్వ భూమి స్వరూపం, ఖాతాదారు పేరు, ఖాతా నంబరు, సవరణలు ఉంటాయి.

కో రిలేషన్ రిజిస్టర్‌లో..: ఖాతానంబరు, ఖాతాదారు పేరు, పాతఖాతా నంబరు, భూమిపై ఉన్నవారు, మెట్ట, భగాయత్, తరి, పంటల అంచనా తదితరాలు ఉన్నాయి.

సబ్‌డివిజన్ల గందరగోళానికి తెర

నిజాంకాలంలో జరిగిన సమగ్ర భూ సర్వే రికార్డులే నేటికీ ఆధారంగా ఉన్నాయి. సమైక్య రాష్ట్రంలో ప్రభుత్వ భూములను అడ్డగోలుగా కబ్జా చేసేందుకు బైనంబర్లను సృష్టించడంతో గందరగోళ పరిస్థితి ఏర్పడింది. రికార్డుల ప్రక్షాళన, సమగ్ర భూ సర్వేలో భాగంగా బై నంబర్లకు తొలిగించాలని భావిస్తున్నారు. పట్టా భూములకు బై నంబర్లు తీసేసి, ప్రతి ఒక్కరి భూమికి ఒక సర్వే నంబర్ ఇవ్వాలని కమిటీ సూచించింది. భూ రికార్డుల్లో పారదర్శకత తీసుకురావడానికి భూ సమాచారాన్ని ఇంటర్నెట్‌తో అనుసంధానం చేయనున్నారు. ఇదే సమయంలో ఏ భూమి ఎంత ఉన్నదనేది నిర్ధారించి హద్దులు నిర్ణయిస్తారు.


పంపిణీకి సిద్ధంగా ఉన్న బతుకమ్మ చీరెలు

నేటి నుంచి జిల్లాలకు బతుకమ్మ చీరెలు

హైదరాబాద్ జిల్లాలో అత్యధిక లబ్ధిదారులు

తర్వాతి స్థానాల్లో రంగారెడ్డి, మేడ్చల్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలోని పేద మహిళలకు పంపిణీ చేసే బతుకమ్మ చీరెలను సోమవారం నుంచి జిల్లాలకు పంపించనున్నారు. ఇందుకు చేనేత, జౌళిశాఖ అధికారులు ఏర్పాట్లు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా తెల్లరేషన్ కార్డు ఉన్న 1,04,57,610 మంది మహిళలందరికీ చీరెలను అందజేయనున్నారు. మహిళలకు సెప్టెంబర్ 18 నుంచి 20 వరకు చీరెలను పంపిణీ చేస్తారు. జిల్లాలకు సరఫరా చేయడానికి అవసరమైన చీరెలు సిరిసిల్లలో పూర్తికావొస్తుండగా వాటి ప్రాసెసింగ్, ప్రింటింగ్ ప్రక్రియ చురుగ్గా సాగుతున్నది. సిరిసిల్లతోపాటు సూరత్ నుంచి చీరెలను తీసుకొస్తున్నారు. హైదరాబాద్‌లో సిద్ధంగా ఉన్న చీరెలను సోమవారం సాయంత్రం నుంచి జిల్లాలకు పంపిణీ చేస్తారు. సూరత్ నుంచి సోమవారం జిల్లాలకు చీరెల పంపిణీ ప్రక్రియ మొదలుకానున్నది. అక్కడి నుంచి జిల్లాలకు చేరడానికి మూడు రోజులు సమయం పడుతుందని తెలుస్తున్నది. అన్నిరకాల డిజైన్ల చీరెలు ఒక జిల్లాకు రెండు మూడు దఫాలుగా చేరవేస్తారు. కుల, మతాల కతీతంగా 18 ఏండ్లు పైబడిన తెల్ల రేషన్‌కార్డు ఉన్న మహిళలకు చీరెలను పంపిణీ చేస్తారు. జిల్లాలవారీగా లబ్ధిదారుల సంఖ్యను అధికారులు గుర్తించారు. హైదరాబాద్ జిల్లాలో అత్యధికంగా 7,67,160మంది ఉండగా ఆ తరువాత రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలు ఉన్నాయి. చీరెల పంపిణీ బాధ్యతలను జిల్లా కలెక్టర్లకు అప్పగించారు. చీరెలను నిల్వచేయడానికి అవసరమైన గోడౌన్లను కూడా సిద్ధం చేశారు. చేనేత, జౌళి శాఖ, టెస్కో అధికారులు జిల్లా కేంద్రం వరకు చీరెలను రవాణా చేస్తారు. అక్కడి నుంచి గ్రామాలకు చేర్చే బాధ్యత కలెక్టర్లకు అప్పగించారు. లబ్ధిదారులు చీరెలను రేషన్‌షాపుల్లో తీసుకోవాల్సి ఉంటుంది.

జిల్లాలవారీగా చీరెలు అందుకునే లబ్ధిదారుల వివరాలు

జిల్లా పేరు	లబ్ధిదారుల సంఖ్య
ఆదిలాబాద్	2,29,162
భద్రాద్రి కొత్తగూడెం	3,25,100
హైదరాబాద్	7,67,160
జగిత్యాల	3,45,950
జనగామ	2,00,475
జయశంకర్ భూపాలపల్లి	2,39,848
జోగుళాంబ గద్వాల	1,85,388
కామారెడ్డి	3,31,206
కరీంనగర్	3,24,413
ఖమ్మం	4,48,799
కుమ్రంభీం ఆసిఫాబాద్	1,69,139
మహబూబాబాద్	2,69,522
మహబూబ్‌నగర్	4,61,223
మంచిర్యాల	2,54,916
మెదక్	2,59,236
మేడ్చల్	6,00,969
నాగర్‌కర్నూల్	2,69,191
నల్లగొండ	5,07,853
నిర్మల్	2,48,425
నిజామాబాద్	5,13,739
పెద్దపల్లి	2,50,977
రాజన్న సిరిసిల్ల	2,00,923
రంగారెడ్డి	6,29,426
సంగారెడ్డి	4,37,406
సిద్దిపేట	3,49,186
సూర్యాపేట	3,51,935
వికారాబాద్	2,99,534
వనపర్తి	1,83,321
వరంగల్ అర్బన్	3,02,647
వరంగల్ రూరల్	2,59,729
యాదాద్రి భువనగిరి	2,40,812
మొత్తం	**1,04,57,610**

రియల్.. నయా జోష్!

జీఎస్టీ, రెరాపై స్పష్టతతో జోరందుకున్న అమ్మకాలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: జీఎస్టీ (వస్తు సేవా పన్ను), రెరా (రియల్‌ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ) పై సరైన అవగాహన లేక కొన్నాళ్లు మందగించిన నిర్మాణ రంగ మార్కెట్.. ఇప్పుడు జోరందుకుంది. ఆగస్టు మొదటి వారం నుంచి హైదరాబాద్ పరిసరాల్లోని పలు గృహ నిర్మాణ సముదాయాలను సందర్శించే కొనుగోలుదారుల సంఖ్య పెరుగడమే ఇందుకు నిదర్శనం. 2017 జనవరి 1 తర్వాత ప్రారంభమైన నిర్మాణాలన్నీ 'రెరా' వద్ద నమోదు చేసుకోవాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఇందుకోసం దాదాపు మూడునెలల దాకా గడువునిచ్చింది. జీఎస్టీపై నిర్మాణ రంగంలో స్పష్టత ఏర్పడింది. ఫలితంగా అమ్మకాలపై సింహభాగం నిర్మాణ సంస్థలు దృష్టి సారించాయి. సరిగ్గా ఇదే సమయంలో కొనుగోలుదారులూ సొంతింటి ఎంపికకు అడుగులు ముందుకేస్తున్నారు. ప్రధానంగా ఆగస్టు మొదటి వారం నుంచి తుది ప్రాజెక్టును ఎంచుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. కొనుగోలుదారులను ఆకట్టుకోవడానికి నిర్మాణ సంస్థలు పలు రాయితీలను ప్రకటించడం గమనార్హం. హైదరాబాద్‌లో జూలై చివరిదాకా ఇండ్లను కొనడానికి యజమానులు వెనుకడుగు వేసేవారు. వీరంతా 'రెరా'పై స్పష్టత ఏర్పడేంత వరకూ వేచి చూశారు. దానిపై రాష్ట్ర ప్రభుత్వం స్పష్టత ఇచ్చింది. దీంతో కొనుగోలుదారుల్లో మార్పు వచ్చింది. గృహాలను కొనుగోలు చేసేందుకు మొగ్గుచూపుతున్నారు. ఉప్పల్, ఎల్బీనగర్, నాగోల్ వంటి ప్రాంతాల నుంచి గచ్చిబౌలి, నానక్‌రాంగూడ వంటి ప్రాంతాల్లో ఇండ్లను కొనుక్కుంటున్నవారి శాతమూ పెరిగినట్టు పలువురు డెవలపర్లు చెప్తున్నారు. ఇందులో రూ. 45 లక్షల్లోపు రెండు పడక గదుల ఫ్లాట్లను కొనేవారి శాతం పెరుగుతున్నదని అంటున్నారు.

ప్రత్యేకతలు దృష్టిలో పెట్టుకొని..

రెరా, జీఎస్టీ గురించి రకరకాల ఊహాగానాలు వినిపించాయి. కొనుగోలుదారులు రారేమోననే సందేహాలు మార్కెట్‌ను చుట్టుముట్టాయి. కానీ, అవన్నీ పటాపంచలయ్యాయి. నగరానికి గల ప్రత్యేకతలను దృష్టిలో పెట్టుకొని ఇతర ప్రాంతాలకు చెందినవారు సైతం ఫ్లాట్లను మళ్లీ కొంటున్నారు.

– పాండురంగారెడ్డి, క్రెడాయ్ హైదరాబాద్ ఎగ్జిక్యూటివ్ సభ్యుడు

కొత్త ఉత్సాహం

ఆగస్టులో ప్రాజెక్టులను సందర్శించే వారి సంఖ్య పెరిగింది. హైదరాబాద్‌లో ఇండ్ల ధరలు తక్కువ ఉన్నాయని గుర్తించిన ఐటీ ఉద్యోగులు ఇక్కడే ఇండ్లను తీసుకుంటున్నారు. ఇది బిల్డర్లలో కొత్త ఉత్సాహం నింపుతున్నది.

– టీ విద్యాసాగర్, తెలంగాణ బిల్డర్స్ ఫెడరేషన్ ఉపాధ్యక్షుడు

4,007 దళిత కుటుంబాలకు భూ పంపిణీ

ఇప్పటివరకు 10,562.16 ఎకరాల భూమి అందజేత

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత దళితులకు మూడెకరాల భూపంపిణీలో ప్రభుత్వం ముందడుగు వేస్తున్నది. 2014 ఆగస్టు 15న పథకం ప్రారంభమైన నాటి నుంచి ఇప్పటివరకు 10,562.16 ఎకరాల భూమిని రూ.447.35 కోట్లతో కొనుగోలు చేసి 4,007 దళిత కుటుంబాలకు అప్పగించింది. 2017-18 ఆర్థిక సంవత్సరంలో గత మూడు నెలల్లోనే 746.18 ఎకరాల భూమిని 279 దళిత కుటుంబాలకు అందజేసింది. మరో 3,500 దళిత కుటుంబాలకు 10,500 ఎకరాల భూ పంపిణీ లక్ష్యంగా ఎస్సీ అభివృద్ధిశాఖ కృషి చేస్తున్నది. ఇప్పటికే ఆయా జిల్లాల్లో అనుకూలమైన వ్యవసాయ భూములను అధికారులు గుర్తించి కొనుగోళ్ల కోసం



చర్యలు చేపట్టారు. పంపిణీ చేసిన భూమి లబ్ధిదారులకు ఉపయోగపడేలా అభివృద్ధి చేయడంపైనా ఆయా శాఖలు దృష్టిపెట్టాయి. పదెకరాలను ఒక యూనిట్‌గా, బ్లాక్ ఏరియాగా విభజించి, ఉపాధి హామీ పథకం కింద రాళ్లు తొలగించడం, చదును చేయడం వంటి పనులు చేపడుతున్నారు. ఇందిర జలప్రభ పథకం కింద నీటి సౌకర్యంపై దృష్టి పెట్టారు. జియాలజిస్టులతో సర్వే చేయించి, గ్రూపులుగా, వ్యక్తిగతంగా బోర్‌వెల్స్ ఏర్పాటు చేసి నీటివసతి కల్పించడపై భూగర్భజలశాఖ దృష్టిపెట్టింది.

ఇప్పటివరకు పంపిణీ చేసిన భూములు, లబ్ధిదారుల సంఖ్య

ఆర్థిక సంవత్సరం	లబ్ధిదారుల సంఖ్య	భూ పంపిణీ ఎకరాల్లో
2014-15	797	2,140.24
2015-16	1,997	5,287.56
2016-17	934	2,388.18
2017-18	279	746.18
మొత్తం	4,007	10,562.16

నేడు హైదరాబాద్‌కు రాజ్యసభ కమిటీ

పెద్దనోట్ల రద్దు పరిణామాలపై అధికారులతో భేటీ

ప్రత్యేక ప్రతినిధి, నమస్తే తెలంగాణ: పెద్దనోట్ల రద్దు తర్వాత రాష్ట్రంలో నెలకొన్న పరిణామాలపై అధ్యయనం చేయడానికి కేంద్రప్రభుత్వం నియమించిన రాజ్యసభ కమిటీ సోమవారం హైదరాబాద్‌కు రానున్నది. దాదాపు 15 మంది సభ్యులతో కూడిన ఈ కమిటీ హోటల్ మారియట్‌లో సమావేశమై ఆర్థిక, పోలీస్‌శాఖ అధికారుల నుంచి వివరాలను సేకరించనున్నది. పెద్దనోట్ల రద్దుకు ముందు, తర్వాత నకిలీ నోట్ల చెలామణి, కేసుల నమోదు వంటి అంశాలపై వివరాలను తెలుసుకోనున్నది. పెద్దనోట్లను ఎందుకు రద్దు చేయాల్సి వచ్చింది, అందుకు దారితీసిన పరిస్థితులు, అనంతర పరిణామాలపై పార్లమెంటరీ కమిటీ దేశవ్యాప్తంగా అధ్యయనం చేస్తున్నది. ఇందులో భాగంగా సోమవారం కమిటీ తెలంగాణకు వస్తున్నది. దేశంలో నకిలీనోట్ల చెలామణి పెరిగిందని, మితిమీరిన నల్లధనం దేశ ఆర్థికవ్యవస్థను చిన్నాభిన్నం చేస్తున్నదన్న కారణంగా గత ఏడాది నవంబర్ ఎనిమిదిన పెద్దనోట్లను రద్దుచేసిన విషయం తెలిసిందే. ఇది ఎంతవరకు వాస్తవమనే విషయంపై కమిటీ అధ్యయనం చేస్తున్నది. అన్ని రాష్ట్రాల నుంచి వివరాలను సేకరించిన తర్వాత పార్లమెంట్‌కు నివేదికను సమర్పించనున్నది.

సగం తగ్గిన రూ.2 వేల నోట్ల సరఫరా

నెల క్రితం 80-90 శాతం వరకు రెండువేల నోట్లు చెలామణి అయ్యేవి. చిల్లర దొరుకడం కష్టంగా ఉండేది. క్రమంగా రూ.2వేల నోట్ల చెలామణి తగ్గుతున్నది. తక్కువ విలువ కలిగిన 100, 500 నోట్ల సరఫరా పెరిగింది. ప్రస్తుత ఆర్థికసంవత్సరం మొదలైన నాటినుంచి ఇప్పటివరకు రాష్ట్రంలోని బ్యాంకులకు ఆర్బీఐ నుంచి దాదాపు రూ. 60 వేల కోట్లకుపైగా నగదు వచ్చింది. ఇందులో సగానికి పైగా 500,100 నోట్లే ఉన్నాయి. నగదు కొరత వల్ల జూన్ వరకు రైతులతోపాటు చాలామంది ఇబ్బందులు పడ్డారు. కానీ, నేడు పరిస్థితి మారింది. రెండువేల నోట్ల సరఫరా సగానికి సగం తగ్గింది. త్వరలో రూ. 200 నోటు అందుబాటులోకి వస్తున్నందున నెల రోజుల నుంచి 2వేల నోట్ల పంపిణీ చాలా వరకు తగ్గింది. జూన్‌నాటికి 25-30శాతం వరకే ఉన్న చిన్ననోట్ల పంపిణీ ఇప్పుడు ఒక్కసారిగా 70 శా తానికి పెరిగింది. అన్నిరకాల నోట్లు బ్యాంకుల్లో చాలినంత ఉన్నాయని బ్యాంకు అధికారులు తెలిపారు.

సాయుధ బలగాలపై పూర్తి విశ్వాసం

- రక్షణరంగంలో నూతన ఒరవడులు సృష్టించాలి
- కేంద్ర మంత్రి అరుణ్‌జైట్లీ పిలుపు
- బీడీఎల్‌లో రాకెట్ పరీక్ష కేంద్రం, భానూర్‌లో అస్త్ర క్షిపణి కార్యాలయం ప్రారంభం



హైదరాబాద్ శేరిగూడలోని బీడీఎల్‌లో అధునాతన క్షిపణి 'ఎల్ఆర్ఎస్ఏఎమ్' నమూనాతో కేంద్ర మంత్రి అరుణ్ జైట్లీ

ఇబ్రహీంపట్నం/పటాన్‌చెరు రూరల్, నమస్తే తెలంగాణ: రక్షణరంగంలో నూతన ఒరవడులు తీసుకురావడం కోసం శాస్త్రవేత్తలు కృషిచేయాలని కేంద్ర రక్షణ, ఆర్థికశాఖమంత్రి అరుణ్‌జైట్లీ పేర్కొన్నారు. దేశ భౌగోళిక ప్రాంతాల రక్షణ విషయంలో మనం సంసిద్ధంగా ఉన్నామని, ఇది మన ఉత్తమ రక్షణ అని పేర్కొన్నారు. మన సాయుధ బలగాలపై అందరికీ విశ్వాసం ఉన్నదని, అయితే మరిన్ని సౌకర్యాలు కల్పించి పటిష్ఠం చేయాల్సిన అవసరం ఉన్నదని వివరించారు. ఆదివారం రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం నగరపంచాయతీ పరిధిలోని శేరిగూడలో ఉన్న భారత్ డైనమిక్స్ లిమిటెడ్ (బీడీఎల్) యూనిట్‌లో రాకెట్ పరీక్ష కేంద్రం భవనాన్ని ప్రారంభించారు. రెండోదశ యూనిట్ భవన విస్తరణ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం పటాన్‌చెరు మండలం భానూర్‌లోని బీడీఎల్ యూనిట్‌లో అస్త్ర క్షిపణుల తయారీ ప్రాజెక్టు కార్యాలయాన్ని, యూనిట్‌లో కొత్తగా ఏర్పాటుచేసిన ఐదు మెగావాట్ల సోలార్ విద్యుత్ ప్లాంట్‌ను ప్రారంభించారు. రెండు కార్యక్రమాల్లో పాల్గొన్న మంత్రి మాట్లాడుతూ దేశం అనేక సవాళ్లను ఎదుర్కొంటున్నదని, శాస్త్రవేత్తలు రక్షణరంగం విషయంలో కొత్త ఆలోచనలవైపు అడుగులు వేయాలని చెప్పారు. అస్త్ర క్షిపణులను మరింత అభివృద్ధి చేస్తామని, 10నుంచి 15 క్షిపణులను భానూర్ యూనిట్లో తయారుచేస్తారని, భవిష్యత్తులో 50 క్షిపణులను తయారుచేయాలని లక్ష్యం పెట్టుకున్నామని వివరించారు. మంత్రివెంట రక్షణ ఉత్పాదక మంత్రిత్వశాఖ కార్యదర్శి అశోక్‌కుమార్‌గుప్తా, బీడీఎల్ నిర్వాహక సంచాలకుడు వారణాసి ఉదయ్‌భాస్కర్, ఇబ్రహీంపట్నం బీడీఎల్ ఇన్‌చార్జి నారాయణ, ఆర్డీవో మధుకర్‌రెడ్డి, ఏసీపీ మల్లారెడ్డి, తహసీల్దార్ వెంకట్‌రెడ్డి, సీఐ స్వామి పాల్గొన్నారు. అనంతరం సంగారెడ్డి జిల్లాలోని ఓడీఎఫ్‌ను మంత్రి సందర్శించారు. రక్షణరంగంలోని పరిశ్రమల్లో 25శాతం వాటా ప్రైవేటుకు ఇస్తున్నందుకు బీడీఎల్ యూనియన్ నాయకులు నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఇదిలా ఉండగా చింతపండు వ్యాపారులు, బేగంబజార్ వర్తక సంఘం ప్రతినిధులు జైట్లీని కలిసి చింతపండుపై గతంలో పన్ను లేదని, జీఎస్టీలో దానిపై 12 శాతం పన్ను విధించారని, మిర్చి, పత్తి, పసుపు, ఇతర వాణిజ్య పంటల కొనుగోళ్లలో తలెత్తిన ఇబ్బందులను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. వచ్చేనెల హైదరాబాద్‌లో జరిగే జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో చర్చిస్తామని జైట్లీ హామీ ఇచ్చినట్లు బీజేపీ నాయకులు తెలిపారు.

నౌకాదళానికి అధునాతన క్షిపణి

దూర లక్ష్యాలను సైతం ఛేదించేందుకు రూపొందించిన అధునాతన క్షిపణి 'లాంగ్ రేంజ్ సర్ఫేస్ టు ఎయిర్ మిస్సైల్(ఎల్ఆర్ఎస్ఏఎమ్)'ని రక్షణశాఖ మంత్రి ఆరుణ్ జైట్లీ ఆదివారం భారత నావికాదళానికి అందజేశారు. పలు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు హైదరాబాద్ వచ్చిన ఆయన.. డీఆర్డీవో, ఐఏఐ (ఇజ్రాయెల్ ఎయిర్‌క్రాఫ్ట్ ఇండస్ట్రీస్) సంయుక్తంగా అభివృద్ధి చేసిన ఈ క్షిపణిని రక్షణశాఖకు అప్పగించారు. త్రివిధ దళాలు (నేవీ, ఎయిర్‌ఫోర్స్, ఆర్మీ) ఉపయోగించుకునేందుకు వీలుగా ఈ క్షిపణిని రూపొందించారు. దాడులను ముందే పసిగట్టడం, అధునాతన ఫైర్ కంట్రోల్ సిస్టం, ప్రతికూల వాతావరణంలోనూ పనిచేయడం దీని ప్రత్యేకత. గగనతల రక్షణకు ఇది కీలకం కానున్నది. అనంతరం ఇబ్రహీంపట్నంలోని బీడీఎల్‌లో రక్షణ ఉత్పత్తి విభాగం రూ.48 కోట్లతో నిర్మించిన రాకెట్ మోటార్ స్టాటిక్ టెస్ట్ ఫెసిలిటీని జాతికి అంకితంచేశారు. దీంతో 50 టన్నుల సామర్థ్యం గల ఉపరితల క్షిపణిని ఇక్కడ నుంచి పరీక్షించేందుకు మార్గం సుగమమైంది. దీన్ని అభివృద్ధి చేయడంలో డీఆర్డీవో, బీడీఎల్ కీలక పాత్ర పోషించాయి. 1000 కిలోల పేలుడు పదార్థం, 50 టన్నుల బరువు గల అన్ని రకాల ఉపరితల క్షిపణులను ఇక్కడి నుంచి పరీక్షించవచ్చు. రక్షణ అభివృద్ధికి సహకారం అందిస్తున్న తెలంగాణ సర్కారు.. 632 ఎకరాల స్థలాన్ని బీడీఎల్‌కు ఇచ్చింది. రూ. 522 కోట్లతో క్షిపణుల తయారీ, పరీక్షల కోసం ప్రపంచస్థాయి సౌకర్యాలతో కూడిన కేంద్రాల ఏర్పాటుకు బీడీఎల్ ప్రయత్నిస్తున్నది.

ఉద్యోగుల విభజనపై ఇరురాష్ట్రాల సీఎస్‌ల భేటీ నేడు

ఏపీలో పనిచేస్తున్న నాలుగోతరగతి ఉద్యోగులను వెనుకకు తెచ్చే అంశంపై తుదినిర్ణయం

సెప్టెంబర్ చివరి నాటికి సమస్యల పరిష్కారం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఏపీ, తెలంగాణ రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు సోమవారం సమావేశం కానున్నారు. తెలంగాణ సీఎస్ ఎస్పీ సింగ్, ఏపీ సీఎస్ దినేశ్‌కుమార్ తెలంగాణ సచివాలయం సీబ్లాక్‌లోని సమావేశ మందిరంలో ఉద్యోగుల విభజనకు సంబంధించిన కీలక అంశాలపై చర్చించనున్నారు. ప్రధానంగా రాష్ట్రానికి చెందిన నాలుగోతరగతి ఉద్యోగులను వెనక్కి తీసుకువచ్చే అంశంపై తుది నిర్ణయం తీసుకునే అవకాశాలు ఉన్నాయని సమాచారం. ఇందుకోసం రీ ఆర్గనైజేషన్ సెల్ 24 పేజీల ఎజెండా సిద్ధం చేసింది. కేంద్రప్రభుత్వ డీవోపీటీ ఉన్నతాధికారులు కూడా సమావేశానికి హాజరవుతారు. కమలనాథన్ కమిటీ ఇప్పటివరకు 55,870 మంది ఉద్యోగులను విభజించింది. ఇందులో ఏపీకి 31,611 మంది, తెలంగాణకు 24,259 మంది ఉద్యోగులను కేటాయించింది. రెండు రాష్ట్రాలకు చెందిన 1,302 రాష్ట్రస్థాయి పోస్టుల విభజనపై వివాదాలు తారస్థాయికి చేరుకున్నాయి. దీంతో సమావేశానికి ప్రాధాన్యం ఏర్పడింది. తెలంగాణ సచివాలయంలో ఏపీ స్థానికత కలిగిన 24మంది ఎస్వోలు.. స్వరాష్ట్రం వెళ్లేందుకు దరఖాస్తు చేసుకుని ఉత్తర్వులకోసం ఎదురుచూస్తున్న రెండువేల మంది ఏపీ ఉద్యోగుల సమస్యలు, ఏపీలో పనిచేస్తున్న తెలంగాణ స్థానికతగల 635 మంది నాలుగోతరగతి ఉద్యోగులు, 11మంది డ్రైవర్లు, ఇద్దరు హెవీవెహికల్ డ్రైవర్లు, 71 మంది రికార్డు అసిస్టెంట్లు, డూప్లికేటింగ్ ఆపరేటర్ల సమస్యలను పరిష్కరించేందుకు చర్చలు దోహదపడుతాయని భావిస్తున్నారు. సెప్టెంబర్ చివరినాటికి ఈ సమస్యలన్నింటినీ కొలిక్కి తీసుకొనిరావాలని అధికారులు భావిస్తున్నారు. ఏపీలో పనిచేస్తున్న తెలంగాణకు చెందిన నాలుగో తరగతి ఉద్యోగులను బేషరతుగా స్వరాష్ట్రానికి పంపించాలని టీఎన్జీవో అధ్యక్షుడు కారం రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మామిండ్ల రాజేందర్, టెస్సా అధ్యక్షుడు కస్తూరి వెంకటేశ్వర్లు విజ్ఞప్తి చేశారు. ఏపీకి వెళ్లేందుకు సిద్ధంగా ఉన్న 24మంది ఎస్వోలను స్వరాష్ట్రానికి పంపించాలని టీజీవో వ్యవస్థాపక అధ్యక్షుడు, ఎమ్మెల్యే వీ శ్రీనివాస్‌గౌడ్, టీజీవో అధ్యక్షురాలు వీ మమత, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణలు పేర్కొన్నారు.

ఎగుమతుల స్థాయికి ఉద్యానపంటల సాగు



హైదరాబాద్ నెక్లెస్‌రోడ్డులోని పీపుల్స్‌ప్లాజాలో తెలంగాణ ఉద్యాన మహోత్సవం సందర్భంగా ఆదివారం ఏర్పాటుచేసిన స్టాళ్లను తిలకిస్తున్న వ్యవసాయ, ఉద్యాన, పట్టుపరిశ్రమశాఖల మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

రాయితీలను సద్వినియోగం చేసుకోవాలి

ఉద్యాన మహోత్సవం ప్రారంభోత్సవంలో మంత్రి పోచారం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రానికి అవసరమైన కూరగాయలు, పండ్లు, పూలు పండించడమే కాకుండా, ఎగుమతి చేసేస్థాయికి రావాలని వ్యవసాయ, ఉద్యాన, పట్టుపరిశ్రమశాఖల మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఉద్యాన పంటల సాగుకు ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను సద్వినియోగం చేసుకొని అధిక దిగుబడులు పొందేందుకు రైతులు కృషిచేయాలని ఆయన కోరారు. రైతుల ఆదాయం పెంచడం ద్వారా ఆత్మహత్యల రహిత తెలంగాణను సాధించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, తెలంగాణ ఉద్యాన, పట్టుపరిశ్రమశాఖల ఆధ్వర్యంలో హైదరాబాద్ నెక్లెస్ రోడ్డులోని పీపుల్స్‌ప్లాజాలో ఐదు రోజులపాటు జరిగే 'తెలంగాణ ఉద్యాన మహోత్సవం-2017'ను ఆదివారం మంత్రి పోచారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ, ప్రైవేటు విత్తన, నర్సరీ సంస్థలు తమ ఉత్పత్తులతో ఏర్పాటుచేసిన స్టాల్స్‌ను మంత్రితోపాటు ప్రజాప్రతినిధులు, అధికారులు పరిశీలించారు. ప్రదర్శన, అమ్మకాలు ఈ నెల 31 వరకు ప్రజలకు అందుబాటులో ఉంటాయి. రాష్ట్రంలోని 18,800 రెవెన్యూ గ్రామాలను 3,600 యూనిట్లుగా విభజించి సెప్టెంబర్ 1 నుంచి 9 వరకు గ్రామ రైతు సమన్వయ సంఘాలను ఏర్పాటు చేయనున్నట్టు మంత్రి పోచారం ఈ సందర్భంగా తెలిపారు. సెప్టెంబర్ 10 నుంచి 14 వరకు మండల రైతు సమన్వయ సంఘాలను ఏర్పాటు చేసి, రిసోర్స్ పర్సన్ల ద్వారా సదస్సులను ఏర్పాటు చేస్తామని చెప్పారు. రైతు సమగ్ర సర్వే వివరాలను పూర్తిస్థాయిలో పరిశీలించి సమన్వయకర్త, అగ్రికల్చర్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (ఏఈవో) సంతకాలతో కూడిన రికార్డు ఆధారంగా ఎకరాకు రూ. 4 వేల నగదును రైతుల ఖాతాల్లోకి బదిలీ చేస్తామన్నారు. రెండు పంటలు పండించే ఉద్యాన రైతులకు ఏడాదికి రూ.8 వేలు నగదు అందుతుందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఎమ్మెస్ ప్రభాకర్, ఎమ్మెల్యేలు మదన్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి, డెయిరీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ లోక భూమారెడ్డి, మాజీ డిప్యూటీ స్పీకర్ కొప్పుల హరీశ్వర్‌రెడ్డి, వ్యవసాయ, ఉద్యాన, పట్టుపరిశ్రమశాఖల కార్యదర్శి పార్థసారథి, ఉద్యానశాఖ కమిషనర్ ఎల్ వెంకట్రాంరెడ్డి, ఉద్యానశాఖ జీఎం, విత్తన ధ్రువీకరణ సంస్థ డైరెక్టర్ డాక్టర్ కేశవులు రైతులు పాల్గొన్నారు. హార్టికల్చర్ విస్తరణ అధికారులను నియమించేందుకు చర్యలు తీసుకోవాలని హార్టికల్చర్ డిప్లొమా అభ్యర్థులు మంత్రికి విజ్ఞప్తి చేశారు.

నిధుల విడుదలలో కేంద్రం జాప్యం


ఇంకా పూర్తిగా విడుదల కాని స్మార్ట్, స్వచ్ఛభారత్ నిధులు

వరంగల్ అభివృద్ధికి డీపీఆర్‌లు సిద్ధం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: స్మార్ట్ సిటీ, స్వచ్ఛభారత్ వంటి పథకాలను వేగంగా అమలు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం వేగంగా కార్యక్రమాల్ని రూపొందిస్తున్నా నిధులు సమకూర్చడంలో కేంద్రం ఆలస్యం చేస్తున్నది. స్వచ్ఛభారత్ పథకంలో భాగంగా రాష్ట్రానికి కేంద్రం దాదాపు రూ.413.74 కోట్లను కేటాయించినా ఇందులో కేవలం 42.23 శాతం నిధులను మాత్రమే ఇంతవరకూ విడుదల చేసింది. మిగతా నిధుల కోసం రాష్ట్ర పురపాలకశాఖ కృషి చేస్తున్నది. కమ్యూనిటీ, పబ్లిక్ టాయిలెట్ల నిర్మాణానికి కేంద్రం రూ.20.24 కోట్లను మంజూరు చేసినా ఇప్పటివరకూ మనకు అందిన నిధులు కేవలం రూ.1.34 కోట్లు మాత్రమే. మన రాష్ట్రం నుంచి పదహారు పట్టణాలు మాత్రమే ఓడీఎఫ్‌గా అర్హత సాధించాయి. దీనికి సంబంధించి ఆరు పట్టణాల రీ సర్టిఫికేషన్ ప్రక్రియలో సీడీఎంఏ విఫలమైంది. సెప్టెంబరు 30 లేదా అంతకంటే ముందే, ఓడీఎఫ్ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేసే దిశగా పురపాలక శాఖ అడుగులు వేస్తున్నది.

'స్మార్ట్' వరంగల్ కోసం ప్రణాళికలు..

పురపాలక శాఖ మంత్రి కల్వకుంట్ల తారకరామారావు సూచనల మేరకు గ్రేటర్ వరంగల్‌ను స్మార్ట్ సిటీగా ముస్తాబు చేయడానికి రంగం సిద్ధమవుతున్నది. వరంగల్‌లో సివరేజి ట్రీట్‌మెంట్ ప్లాంట్, కాకతీయ మ్యూజికల్ గార్డెన్‌ల ఏర్పాటుకు అధికారులు సమగ్ర నివేదికలు తయారు చేశారు. స్మార్ట్ రోడ్లు, పబ్లిక్ గార్డెన్ వంటివి అభివృద్ధి చేయనున్నారు. దీంతో పాటు వరంగల్‌లో ట్రాఫిక్ కంట్రోల్ సిస్టమ్‌ను కూడా ఏర్పాటు చేస్తారు. వరంగల్ నగర పరిధిలో రోప్ వే, మల్టీలెవెల్ పార్కింగ్ కాంప్లెక్స్, రూఫ్‌టాప్ సోలార్ పీవీ, హన్మకొండ ప్లాజా వంటి వాటిని అభివృద్ధి చేయడానికి టెండర్ల ప్రక్రియను వచ్చే నెలలోగా పూర్తి చేయనున్నారు. పబ్లిక్ గార్డెన్ అభివృద్ధికి 'నీరి' విధానాన్ని అవలంబించాలని గ్రేటర్ వరంగల్ కార్పొరేషన్ ప్రయత్నిస్తున్నది. సివరేజి ట్రీట్‌మెంట్ ప్లాంట్ ఏర్పాటులో ఐఐటీ బాంబే మోడల్‌ని వినియోగిస్తే 80 శాతం దాకా ఖర్చు తగ్గుతుందని భావిస్తున్నది. ఈ రెండు విధానాలపై అధ్యయనం చేస్తున్నది. వరంగల్ కార్పొరేషన్‌కు 'ఏ' క్రెడిట్ రేటింగ్ లభించడంతో నిధుల సమీకరణకు మున్సిపల్ బాండ్లను విడుదల చేసే అవకాశంపై దృష్టి సారించాలని ఇటీవల కేంద్ర గృహనిర్మాణ మంత్రిత్వశాఖ సూచించింది. స్మార్ట్ సిటీ మిషన్‌తో అనుసంధానం చేసి భద్రకాళి చెరువు ఫోర్‌షోర్ అభివృద్ధి చేయడానికి ప్రయత్నాలు జోరుగా జరుగుతున్నాయి.



నాకు నిజమైన ధైర్యం అంటే ఏమిటో తెలుసు.
నిజమైన దయ అంటే ఏమిటో కూడా తెలుసు.

మో యాన్



ఎలాన్

ఏమన్నా గానీ
ఇవాళ పద్యం రాసే తీర్త!
రోడ్ల కిరువైపులా రాలిపడ్డ
తంగేడుపూల రెక్కలను
పొట్లాలు కట్టి
ఇవే పేదల కవిత్వమని
దశదిశలా చాటిస్తా.
మోదుగుపూల మాలలు గుచ్చి
కారును అలంకరించి
ఆకాంక్షల రథంగా మార్చేస్తా!

ఏమన్నాగానీ
వేలకొద్ది మైళ్లుగా వ్యాపించిన
తెలంగాణా రోడ్ల మీద
అలసట లేకుండా
అదేపనిగా ఉరుకులు పెడ్తా.

నదులు
తిరిగి కాలువల్లోకి
ప్రవహించినట్టు
పట్నాలను
పల్లెలదాకా ఈడ్చుకపోతా!

చిన్నప్పుడు
విడిపోయిన అభాగ్యమిత్రుల
పిల్లల కండ్లల్లో
నక్షత్రాలు వెలిగించి
కొత్త ఆకాశాన్ని వేలాడదీస్తా.

బిక్కుబిక్కుమనే బిడియం
చిక్కుల్లో చిక్కుకున్న దైన్యం
ఆత్మవిశ్వాసానికి
అవధులు లేవని
చిన్నబోయి కూర్చున్న లేత రెక్కలకు
ఎగిరే రెక్కలు మొలిపిస్తా

చౌరస్తాల దగ్గర ఆగి
ఒకేసారి నాలుగు దిక్కులకు
వ్యాపించే గాలినౌతా
ప్రేమనౌతా
హామీనౌతా
ధీమానౌతా
నన్ను నేను కరిగించుకొని
కరుణామృత ధారనౌతా
ఉత్సాహ ధనుస్సును చేతబట్టి
నవజీవన బాణాలను వదుల్తా

ఏమన్నాగానీ
ఇవాళ పద్యం రాసే తీర్త!

- డాక్టర్ ఎన్.గోపి

స్వార్థం ముళ్ల కంప



మధురిమలు మాయమైన వేళ
మమతల కోవెల ఎప్పుడో ఎండిపోయింది
పచ్చనోట్ల చెట్టు నీడలో
పరవశం తప్ప
సుఖనిద్ర ఎక్కడిది?
మనిషిని పల్కరించటం ఎప్పుడో
మాయమయ్యింది
పచ్చనోటు కనిపించాలి
పలకరించాలి
కౌగలించుకోవాలి
ఇప్పుడు
అన్నా, తమ్ముడు, అక్కా, చెల్లెలు
నాన్న, అమ్మ–
అన్నీ భవ బంధాలు
'నాది' అనే ముళ్లకంపలో ఇరుక్కున్నాయి
అవి బయటకు రావు
ఎక్కడో దారి తప్పినట్టున్నాం మనం
అన్నీ పోగొట్టుకున్నాం
అనురాగపు చెట్టు నీడ
అడవిలో కూడా కనిపించటం లేదు
ఆత్మీయత మల్లె తీగె పూసినా
వాసనలివ్వటం లేదు
ఆప్యాయత చిరుగాలి
కిటికీ దాటి రావటం లేదు
ఇప్పుడు మిగిలింది స్వార్థం ఒక్కటే..

- సీహెచ్ మధు, 99494 86122

WWW.NTNEWS.COM
నమస్తే తెలంగాణ
హైదరాబాద్
సోమవారం, 28 ఆగస్టు 2017

సమగ్ర నిఘంటువు అవసరం

తెలంగాణ విముక్తమై స్వతంత్ర రాష్ట్రంగా అవతరించిన తర్వాత రాష్ట్రానికి సంబంధించిన అవసరాలు ఒక్కటొక్కటిగా ముందుకువస్తున్నాయి. వాఙ్మయ రంగానికి చెందిన అవసరాలు అందులో ప్రధానమైనవి. తెలంగాణ భాషకు కోల్పోయిన ఆత్మగౌరవాన్ని సంపాదించడం ప్రథమ కర్తవ్యంగా మన ముందుకువచ్చింది. స్వాతంత్ర్యానంతరం రేడియో పత్రికల వ్యాప్తి బాగా పెరిగింది. దీనివల్ల ప్రసార మాధ్యమాలకు ఒక భాష అవసరమైంది. ప్రసార మాధ్యమాల్లో తెలుగు వస్తున్న దశలో గోదావరి మండలంలో వ్యవహరించే భాష ప్రసార మాధ్యమాల్లోకి ఎక్కింది. ఈ భాష ప్రసార మాధ్యమాల్లో నిలదొక్కుకున్న తర్వాత ఇది శిష్టవ్యవహార భాషగా, తెలుగు ప్రమాణ భాషగా అంగీకరించబడుతూ వచ్చింది. దీని తర్వాతి దశలో పాఠ్యపుస్తకాల్లో ఇతరత్రా గ్రంథ రచనల్లో కూడా ఇదే భాష శిష్ట వ్యవహార భాషగా అంగీకరించబడి ప్రచారంలోకి వచ్చింది. దీని కారణంగా తెలుగులోని మిగతా మండలాల భాషలు మాండలిక భాషగా వ్యవహారానికి గురయ్యాయి. నాటి తెలంగాణ ప్రాంతంలో ఉన్న వేర్వేరు జిల్లాల్లోని యాసలు మాండలికం పేరుతో తక్కువ చూపునకు గురయ్యాయి. ముఖ్యంగా తెలంగాణ ప్రాంత యాసలు వైముఖ్యానికి గురయ్యాయి.

భాషా శాస్త్రం ప్రకారం ఏ భాషకైనా ఒకటే విలువ ఉంటుంది. ఒక భాష మంచి భాష కావడం ఒక భాష చెడ్డ భాష కావడం అనేది ఉండదు. అంతేకాదు ప్రతి భాషలోనూ ఒక అందం ఉంటుంది. ఏ భాషకైనా విలువను దాని వ్యవహర్తలు ఆరోపిస్తారు. ఏ భాషకైనా విలువ అనేది అంతర్గతంగా ఉండదు. తెలంగాణ భాషని ఈసడించిన వారికి ఈ శాస్త్ర విలువ తెలియకపోవడమే ఈసడింపునకు కారణం. కానీ ఈ ఈసడింపుని భాషావేత్తలు కూడా చేశారు. ఇదే బాధాకరమైనది.

ఈ నేపథ్యంలో రాష్ట్ర ఆవిర్భావం తర్వాత తెలంగాణలో ప్రవర్తిల్లే భాష, పాలనా భాషగా అధికారికంగా అన్నిస్థాయిల్లో అమలు చేయవలసిన అవసరం ఏర్పడింది. అలాగే విద్యా బోధనలో పాఠ్యపుస్తకాల తయారీలో తెలంగాణ తెలుగును అమలు పరుచవలసిన అవసరం ఏర్పడింది. పాలనా భాషగా భాష వినిమయానికి గానీ, విద్యా బోధనలో వినిమయానికి గాని తెలంగాణ తెలుగును అమలుచేసే దిశలో కొంత సాధనా సంపత్తి అవసరం. అంటే కొన్ని పరికరాలు కావాలి. ఈ సాధనా సంపత్తిలో మొదటగా అవసరం అయ్యేది నిఘంటువులు. పాఠ్యప్రణాళికలు పాఠ్యపుస్తకాల తయారీలో కాని అధికారభాషగా తెలంగాణ తెలుగు అమలుచేసే క్రమంలో కాని మొదట అవసరమయ్యేది నిఘంటువే. అందుకే తెలంగాణ భాషకు నిఘంటువు తయారుచేయడం అనేది తక్షణావసరం. ఈక్రమంలో తెలంగాణ భాషకు వెంటనే ఏ విధమైన నిఘంటువు కావాలి. దాని తయారీ ఎలా జరుగాలనే విషయమై చర్చించడమే ఇక్కడి ఉద్దేశం.

ప్రసార మాధ్యమాల్లో అంటే టీవీ, రేడియో, పత్రికలు, సినిమాల్లో తెలంగాణ తెలుగు అమలు అనేది ఆయా వ్యవస్థలు వారికి వారే చేసుకోవలసి ఉంది. తెలంగాణ ఏర్పడిన తర్వాత వచ్చిన కొత్త తెలుగు పత్రికలు అన్నీ ఇంతకుముందు ఏ భాషను వినియోగిస్తున్నాయో అదే భాషను నేటికీ వినియోగిస్తున్నాయి కానీ తెలంగాణ యాసను వినియోగించడం లేదు. కొన్ని ఛానళ్లు మధ్యమధ్యలో యాంకర్ల ద్వారా ఈ భాషను వినియోగిస్తున్నాయి. పత్రికలు కొన్ని శీర్షికలు కొన్ని పదాల వినియోగం తప్ప పూర్తి వార్తలకు తెలంగాణ భాషను వినియోగించడం లేదు. దీనికి ప్రత్యక్ష కారణాలున్నాయి. వాటిలో ఒకటి పూర్తిస్థాయి నిఘంటువు లేకపోవడమే.

తెలుగులో నిఘంటువుల చరిత్ర చాలా పెద్దదే. పదహారో శతాబ్దంలో వచ్చిన కవిచౌడప్ప రాసిన పద్య నిఘంటువు దగ్గరి నుంచి నిన్నమొన్నటి శ్రీహరి నిఘంటువు అన్నమయ్య పదకోశం దాకా తెలుగులో నిఘంటువుల సంఖ్య చాలా పెద్దది. వివిధ అవసరాల కోసం ప్రయోజనాల కోసం తయారుచేసినవి దాదాపు 130 నిఘంటువుల దాకా ఉన్నాయి.

వచ్చిన నిఘంటువుల్లో కొన్నింటిలో తెలంగాణ వ్యవహార పదాలు కూడా చోటుచేసుకున్నాయి. లంకసాని చక్రధరరావు నేతృత్వంలో వచ్చిన తెలుగు వ్యుత్పత్తి కోశంలో తెలంగాణ యాసపదాలు చోటుచేసుకున్నాయి. ఇందులో మొత్తం ఒక లక్షా ఎనిమిదివేల పదాలు ఉండి ఎనిమిది సంపుటాలుగా వచ్చింది. ఉమ్మడి రాష్ట్రంలో ఉన్న ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ తయారుచేసిన వృత్తి పదకోశాలు చాలా విలువైనవి. ఈ కోశాల్లో తెలంగాణ ప్రాంతంలో ఉన్న పద సంపదను కూడా వారు సేకరించి చేర్చారు. ఈ నిఘంటు నిర్మాణాల్లో గౌడవృత్తి, బెల్లం వృత్తి, సారా నీరాలకు సంబంధించిన నిఘంటువు ఒకటి ప్రత్యేకంగా ఆచార్య చేకూరి రామారావుగారి ఆధ్వర్యంలో తయారైంది. ఈ నిఘంటువులో కూడా తెలంగాణ జిల్లాల్లో ని పద సంపదను సేకరించడం జరిగింది. ఈ ప్రాజెక్టులో ఈ వ్యాసకర్త అప్పుడు పరిశోధక విద్యార్థిగా ఉండి పాల్గొన్నాడు.

కరీంనగర్ ఆదిలాబాద్ జిల్లాల్లో వృత్తి పదకోశాల తర్వాత చెప్పుకోదగిన కృషి తెలుగు అకాడమీ చేసింది. జిల్లాల వారీగా మాండలిక పదకోశాలను ఇది తయారుచేసింది. ఆచార్య రవ్వా శ్రీహరి గారు నల్గొండ జిల్లాకు చెందిన మాండలిక నిఘంటువును తయారు చేశారు. ఇటీవల నలిమెల భాస్కర్ తెలంగాణ పదకోశాన్ని తయారు చేశారు. ఇది ఒక చిన్న ప్రయత్నమే అయినా అభినందించదగినది. ఇటీవలే మహబూబ్ నగర్ జిల్లా భాషకు నిఘంటువు తయారైంది. దీన్ని కపిలవాయి లింగమూర్తి గారు తయారుచేశారు. ప్రత్యేకించి క్షేత్రపరిశోధన చేసి జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో, వ్యవహారంలో ఉన్న పదాలను సేకరించి నిఘంటువును సమగ్రంగా రూపొందించారు. జిల్లాలో వ్యవహారంలో ఉన్న అన్ని ఉర్దూ పదాలను కూడా సేకరించారు. ఉర్దూ పదాలు తెలుగులో ఎలా కలిసిపోయి ఏ ఉచ్చారణతో ఉన్నాయో అదే పద్ధతిలో ఆ పదాలను సేకరించారు. ఇది చాలా అవసరం.

> **తెలంగాణ ప్రాతం నుంచి వచ్చిన ప్రాచీన కావ్యాలు పాల్కుర్కి సోమనాథుడి దగ్గరి నుంచి గోల్కొండ కవుల దాకా చాలా ఉన్నాయి. వాటి నుంచి కావ్య భాషకు చెందిన పదాలు చాలా మనకు లభిస్తాయి. ఇవికాకా ఆనాటికి వ్యవహారంలో ఉన్న చాలా తెలంగాణ పదాలు మనకు లభిస్తాయి. వాటిని కూడా మనం ఈ కోశంలోనికి గ్రహించ వలసి ఉంది. ఇలాంటి బృహత్ కార్యక్రమం ప్రభుత్వం మాత్రమే చేయగలదు.**


ఈ నేపథ్యంలో నేడు తెలంగాణ భాషకు సమగ్రమైన నిఘంటువు కావాలి. తెలంగాణ ప్రాంతం మొత్తంలో నేడు వ్యవహారంలో ఉన్న భాషలో ఉన్న అన్ని పదాలను సేకరించాలి. అదెంత పరిమాణంలో ఎన్ని సంపుటాల్లో ఉన్నా సరే, అన్ని జిల్లాల్లో వ్యవహారంలో ఉన్న భాషలోని పదాలు అన్నింటినీ సేకరించాలె. ఆయా పదాలు ఏయే అర్థాల్లో నేడు వినియోగంలో ఉన్నాయో వివరంగా చెప్పవలసి ఉన్నది. నామవాచకాలు, క్రియా పదాలు, విశేషణ, విశేష్య పదాలు అన్ని రకాల వాటిని ప్రత్యేకించి చేర్చవలసి ఉంది. తెలంగాణ ప్రాంత భాషలోనే చాలా ప్రాచీనమైనవి అచ్చతెలుగు పదాలు వ్యవహారంలో అధికంగా ఉన్నాయని ఇప్పటికే చాలామంది భాషావేత్తలు గుర్తించి వివరించారు. ఆచార్య నారాయణరెడ్డి, ఆచార్య యశోదా రెడ్డిగారు ఈ భాషా పదాలను వివరించారు.

తెలంగాణ భాషకు నిఘంటువు అంటే పైన చెప్పినట్లుగా ఇది అన్ని జిల్లాల భాషను సేకరించే సమగ్రమైన నిఘంటువు. దీన్ని తెలంగాణ వ్యవహారపద కోశం అని వ్యవహరించవచ్చు. ఇది అన్ని విధాల సమగ్రమైన వ్యవహార కోశం కావాలి. ఇలాంటి నిఘంటు నిర్మాణానికి కొన్ని శాస్త్రీయమైన పద్ధతులున్నాయి. ఇది కాక ఈ నిఘంటువు కోసం తిరిగి శాస్త్రీయంగా క్షేత్రపరిశోధన చేసి పదాలను సేకరించవలసి ఉంటుంది. ప్రతి జిల్లాను కొన్ని భాగాలుగా చేసుకొని ఒక్కో భాగానికి కొన్ని గ్రామాల చొప్పున నిర్ణయించుకొని పటం సహాయం ద్వారా ఆయా గ్రామాలకు వెళ్లి పద సేకరణ చేయాలి.

తెలంగాణ ప్రాతం నుంచి వచ్చిన ప్రాచీన కావ్యాలు పాల్కుర్కి సోమనాథుడి దగ్గరి నుంచి గోల్కొండ కవుల దాకా చాలా ఉన్నాయి. వాటి నుంచి కావ్య భాషకు చెందిన పదాలు చాలా మనకు లభిస్తాయి. ఇవికాకా ఆనాటికి వ్యవహారంలో ఉన్న చాలా తెలంగాణ పదాలు మనకు లభిస్తాయి. వాటిని కూడా మనం ఈ కోశంలోనికి గ్రహించ వలసి ఉంది. ఇలాంటి బృహత్ కార్యక్రమం ప్రభుత్వం మాత్రమే చేయగలదు. తెలుగు విశ్వవిద్యాలయం ఇప్పటికే ఒక తెలంగాణ నిఘంటువును తయారుచేసే పనిని చేపట్టింది. దానికి ఒక కమిటీ కూడా ఏర్పడిందని తెలుస్తున్నది. అది నిఘంటు నిర్మాణాన్ని విజయవంతంగా చేసి మంచి నిఘంటువును తీసుకురావాలని ఆశిద్దాం.

- పులికొండ సుబ్బాచారి, 94404 93604

కవి - కలం



కలమెప్పుడూ ప్రకృతి చుట్టే
అద్దంలా పరమార్థంలా
ఆస్వాధిస్తూ..అభివర్ణిస్తూ
కవి ఎప్పుడూ యంత్రం చుట్టే
భారంగా బానిసగా
వాడుతూ.. దాసోహమంటూ

కలం వొలికిన సుభాషితాలెన్ని
కవి నిలిపిన సుగుణాలెన్ని ?

కలానికెపుడూ పల్లె అంటే మైత్రి
చేను చెరువు రైతన్న నేతన్న
బతుకు చిత్రం గీసే కుంచెలా
ఔన్నత్యం కాచే కంచెలా..
కవికెపుడూ పట్నం అంటే ప్రీతి
పైసా పరువు అవార్డు రివార్డు
ఊహాలోకం ఏలె ఉత్తుత్తి రేడులా
పట్నం వీడని పల్లె ప్రతినిధిలా ..

కలం వొలికిన సుభాషితాలెన్ని
కవి నిలిపిన సుగుణాలెన్ని ?

కలం దేశభక్తి విరజిమ్మే కాంతి రేఖ
భవితను చూపుతూ కర్తవ్యం బోధిస్తూ
నరనరాన అభిమానం నింపే సిరంజిలా
అక్షర గుండ్లను పేల్చే ఫిరంగిలా..

కవి స్వార్థ పంజరంలో తనను తాను
బంధించుకున్న స్వేచ్ఛా జీవి
హృదయాన్ని వినమని కలానికి చెప్పి
తాను మెదడుని వింటూ
అక్షరాలకే పరిమితమైన ఆదర్శ జీవి..

కలం వొలికిన సుభాషితాలెన్ని
కవి నిలిపిన సుగుణాలెన్ని !!

- సుధీంద్ర భార్గవ, 9949120680

'సినారె సాహితీ వైభవం' జాతీయ సదస్సు

ఉస్మానియా యూనివర్సిటీ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా యూనివర్సిటీ తెలుగు శాఖ, ఉన్నత విద్యామండలి, తెలంగాణ ప్రభుత్వ ఆధ్వర్యంలో 'సినారె సాహితీ వైభవం' జాతీయ సదస్సు 2017 ఆగస్టు 30, 31 తేదీల్లో నిర్వహించబడుతున్నది. వేదిక: యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల రూమ్ నెం:57.

ప్రారంభ సమావేశం ఆగస్టు 30న ఉదయం 10 గంటలకు మొదలవుతుంది. ఆచార్య సూర్యా ధనుంజయ్ అధ్యక్షతన జరుగు సభలో గౌరవ అతిథులుగా ఆచార్య ఎస్.రామచంద్రం, ఆచార్య ఎన్.గోపి, ఆచార్య టి.పాపిరెడ్డి, ఆచార్య ఎస్వీ సత్యనారాయణ, ఆచార్య టి.కృష్ణారావు హాజరవుతారు. ఆచార్య వెలుదండ నిత్యానందరావు సదస్సు లక్ష్యం వివరిస్తారు.

రెండు రోజుల్లో జరిగే వివిధ సెషన్లకు సభాధ్యక్షులుగా..ఆచార్య మసన చెన్నప్ప, ఆచార్య టి.కిషన్‌రావు, ఆచార్య ఎస్వీ రామారావు, ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి, ఆచార్య పి.సుమతీ నరేంద్ర, ఆచార్య మాదిరెడ్డి అండమ్మ వ్యవహరిస్తారు. డాక్టర్ సల్ల విజయకుమార్, డాక్టర్ ఎం.దేవేంద్ర, నలిగంటి శరత్, డాక్టర్ పుట్ట యాదేశ్, కె.డి.డి. మృణాళిని, యడవెల్లి సైదులు సభా నిర్వాహకులుగా వ్యవహరిస్తారు. ఈ సెషన్లలో.. ఆచార్య బి.విశ్వనాథ్, ఆచార్య ఎండ్లూరి సుధాకర్, డాక్టర్ వి.త్రివేణి, ఆచార్య రాచపాళెం చంద్రశేఖర్‌రెడ్డి, డాక్టర్ జి.బాల శ్రీనివాసమూర్తి, డాక్టర్ తిరుపతి భూక్య, డాక్టర్ సాగి కమలాకర శర్మ, ఆచార్య బన్న అయిలయ్య, ఆచార్య కొలకలూరి ఆశాజ్యోతి, ఆచార్య పిల్లలమర్రి రాములు, డాక్టర్ పి.వారిజారాణి, ఆచార్య మాడభూషి సంపత్‌కుమార్, ఆచార్య శరత్ జ్యోత్స్నారాణి, ఆచార్య పి.కనకయ్య, డాక్టర్ సి.కాశీం, ఆచార్య మేడిపల్లి రవికుమార్, డాక్టర్ ఎన్.రజని, డాక్టర్ కె.లావణ్య, డాక్టర్ ఎస్.రఘు, ఆచార్య గోనానాయక్, డాక్టర్ ఎం.గీతావాణి, డాక్టర్ ఏలె విజయలక్ష్మి సినారె రచనలపై పత్రాలు సమర్పిస్తారు.

ఆచార్య సూర్య ధనుంజయ్ అధ్యక్షతన జరుగు ముగింపు సమావేశంలో గౌరవ అతిథులుగా ఆచార్య సీహెచ్ గోపాలరెడ్డి, ఆచార్య ఆర్.లింబాద్రి, డాక్టర్ నందిని సిధారెడ్డి, ఆచార్య హెచ్.వెంకటేశ్వర్లు హాజరవుతారు. డాక్టర్ ఎస్.రఘు సదస్సు నివేదిక సమర్పిస్తారు. తిరునగరి శ్రీనివాస్ సభానిర్వహణ చేస్తారు.

- ఆచార్య సూర్యా ధనుంజయ్, సదస్సు సంచాలకులు, 9849104187
- డాక్టర్ ఎస్. రఘు, సదస్సు సమన్వయకర్త, 9848208533

జాగృతి కవితాంజలి
(రాష్ట్రవ్యాప్త కవి సమ్మేళనం)

తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో 31 జిల్లాల్లో సాహితీ జాతర ఆగస్టు 2 నుంచి సెప్టెంబర్ 9 వరకు జరుగుతున్నది. ఈ నేపథ్యంలో 'జాగృతి కవితాంజలి' (రాష్ట్రవ్యాప్త కవి సమ్మేళనం) 2017 ఆగస్టు 30న సుచిత్ర చౌరస్తాలోని బొమ్మరిల్లు బాంక్వెట్ హాల్‌లో జరుగుతుంది. అందరికీ ఆహ్వానం. (గమనిక: బోయిన్‌పల్లి నుంచి కొంపల్లి వెళ్లే దారిలో బొమ్మరిల్లు బాంక్వెట్ హాల్ ఉన్నది. సికింద్రాబాద్ నుంచి 229 నంబర్ బస్సు ఉంటుంది.

- తెలంగాణ జాగృతి

సాహితీ సవ్యసాచి ద్వా.నా.శాస్త్రి

తెలుగులో విమర్శనాత్మక సాహిత్యం కొరవడిన సమయంలో ఆయన తన కళాన్ని ఝళిపించినవాడు. నాలుగున్నర దశాబ్దాలుగా ఎత్తిన కలం దించకుండా విమర్శనారంగంలో నిరంతర కృషి చేస్తున్నవాడు. ఆయన వ్యాసాలు రచయిత హృదయావిష్కరణకు అద్దం పడుతాయి. ప్రాచ్యలక్షణ పరిజ్ఞానాన్ని, పాశ్చాత్య వివేచనాన్ని సమన్వయిస్తూ ఆధునిక పాఠకులకు అవలీలగా అర్థమయ్యే రీతిలో వివరించడంలో ఆయనది అనుభవమున్న కలం. వస్తు వైవిధ్యం, సామాజిక స్పృహ, స్పష్టత నిండిన కవిత్వాన్ని అందించడంలో ఆయనకు ఆయనే సాటి. శతాధిక రచనలు, అంతకుమించిన పురస్కారాలు అందుకున్న సాహితీ సవ్యసాచి ద్వాదశి నాగేశ్వర శాస్త్రి.



ద్వానాశాస్త్రి కోస్తాంధ్ర ప్రాంతానికి చెందినవాడు కానీ హైదరాబాద్‌లో స్థిరపడటమే కాకుండా తెలంగాణ ప్రాంత కవులు,సాహిత్యాన్ని ప్రేమించినవాడు. తెలంగాణ రాష్ట్ర ఆకాంక్షను సమర్థించడమే కాకుండా సభలు, సమావేశాల్లో పాల్గొన్నవాడు. తెలంగాణకు జై కొట్టి తెలంగాణ సాహితీకారులను, ఇక్కడి సాహితీ సంపదను పరిచయం చేస్తూ రచనలూ చేయడం విశేషం.

1970లో రచనా వ్యాసంగంలోకి అడుగుపెట్టిన ద్వానాశాస్త్రి విమర్శనా సాహిత్యానికి పెద్దపీట వేస్తూ అనేక వ్యాసాలు, పుస్తకాలు రాశారు. వివిధ పత్రికలు, పుస్తకాల్లో వేలాది వ్యాసాలూ రాశారు. ఎంత ఎదిగినా ఒదిగి ఉండే వ్యక్తిత్వం ద్వానా సొంతం. కవి, పరిశోధకుడు, రచయిత, విమర్శకుడిగా ఎన్నో రచనలు చేసినప్పటికీ ఎక్కడకూడా దర్పాన్ని ప్రదర్శించని నిగర్వి. గడిచిన 46 ఏండ్లుగా వేలాది వ్యాసాలు, పుస్తకాలు ఆయన ప్రచురించారు. సమాధిలో స్వగతాలు–వచన కవిత, వాఙ్మయ లహరి– వ్యాససంపుటి, సాహిత్య సాహిత్యం – వ్యాస సంపుటి, మారేపల్లి రామచంద్ర కవితా సమీక్ష– ఎం.ఫిల్. సిద్ధాంత వ్యాసం, ద్రావిడ సాహిత్య సేతువువ్యాస ద్వాదశి, వ్యాస సంపుటి అక్షర చిత్రాలు, అరుదైన ఛాయాచిత్రాలు సాహిత్య సంస్థలు – పీహెచ్‌డీ సిద్ధాంత వ్యాసం, ఆంధ్ర సాహిత్యం, మన తెలుగు తెలుసుకుందాం, ద్వానా కవితలు, శతజయంతి సాహితీమూర్తులు సంపాదకత్వం,తెలుగు సాహిత్య చరిత్ర, నానీలలో సినారె, సినారె కవిత్వంలో ఉక్తులు, సూక్తులు ఇలా వందకు పైగా పుస్తకాలు ఆయన కలం నుంచి పురుడుపోసుకున్నాయి. ఆయన 800 పేజీల తెలుగు సాహిత్య చరిత్రతో సహా యాభైకి పైగా గ్రంథాలు, వెలకొద్దీ వ్యాసాలూ, రెండువేల సమీక్షలు రచించారు.

ద్వానా శాస్త్రి తన రచనల్లో తెలంగాణ సాహిత్యానికి పెద్దపీట వేశారు. అసలైన తెలుగు పదాలు తెలంగాణ మాండలికంలోనే కనిపిస్తాయని, మిగిలిన తెలుగు ప్రాంతంలో సంస్కృత పదాలు కనిపిస్తాయని ద్వానా అంటారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తొలినాళ్లలో తెలంగాణ సాహితీ మిత్రులను ఈ లోకానికి పరిచయం చేస్తూ 'తెలంగాణ సాహిత్య రత్నాల వీణ' పేరుతో ద్వానాశాస్త్రి ప్రత్యేక సంచిక తీసుకువచ్చారు. పాల్కుర్కి సోమన నుంచి నందిని సిధారెడ్డి వరకు సుమారు 110 మంది కవులు, రచయితలు, వారి రచనలను పరిచయం చేస్తూ ఈ పుస్తకాన్ని తీసుకురావడం విశేషం. దీన్ని ప్రముఖ విద్యావేత్త చుక్కా రామయ్యకు అంకితమిచ్చారు. 'నవ కవితాజలధి దాశరథి' పేరుతో దాశరథి వ్యక్తిత్వం, రచనలు, ఉద్యమ నేపథ్యం తదితర అంశాలతో 2011లోనే ఆయన పుస్తకాన్ని తీసుకువచ్చారు. దీన్ని ఆయన సతీమణి లక్ష్మికి అంకితమిచ్చారు. తెలంగాణ పోటీ పరీక్షలకు వెళ్లే విద్యార్థులకు, ఉద్యోగార్థులకు ఉపయోగపడే 'తెలంగాణ సాహితీ సంపద' పేరుతో మరో సంచికను తీసుకురావడంతో పాటు దాన్ని మలి తెలంగాణ ఉద్యమంలో తొలి అమరవీరుడు శ్రీకాంతాచారికి అంకితమిచ్చాడు. ద్వానా శాస్త్రి హైదరాబాద్ వచ్చి స్థిరపడిన తర్వాత ఇదే తన పుట్టినూరు అని నమ్మారు. కవి శ్రీనాథుడు తన కాశీఖండంలో 'ఉన్న ఊరు కన్నతల్లి ఒక్కరూపు' అన్న మాటలను స్ఫూర్తిగా తీసుకున్న ద్వానా తెలంగాణ కవులతో మమేకం కావడంతో పాటు ఇక్కడి సాహితీ సంస్థలతోనూ కలిసి పనిచేశారు. ఉద్యమ నేపథ్యాన్ని గమనించిన ఆయన తెలంగాణ ఉద్యమం సమంజసమైనదేనని విశ్వసించడమేకాకుండా ప్రజలు కోరుకుంటున్నపుడు అంగీకరించవలసిందే అని ఉద్యమకారుల పక్షాన నిలిచారు.

1972 నుంచి నేటి వరకు విభిన్న పత్రికల్లో వేలాది పుస్తక సమీక్షలు చేస్తున్న ఏకైక వ్యక్తి ద్వానాశాస్త్రి. వందేళ్లనాటి ఛాయా చిత్రాలు, అరుదైన పుస్తకాలు, అలనాటి విశేష కవితలు, వెలుగులోకి ఆయన తీసుకువచ్చారు. ద్వానా రాసిన 'తెలుగు సాహిత్య చరిత్ర' పది ముద్రణలు పొందింది. కీర్తిశేషులైన 62 మంది సాహితీ ప్రముఖుల జీవిత విశేషాలను వారి కూతుళ్లు, కుమారులచే సేకరించి 'మా నాన్నగారు' పేరిట పుస్తకంగా వెలువరించారు. పోటీ పరీక్షలలో తెలుగు భాషా సాహిత్యాలపై ఎనిమిది పుస్తకాలు రాశారు, ప్రాచీన కవిత్వంలో 'వ్యక్తిత్వ వికాసం ఉందని మొదట పుస్తకం రాసింది ద్వానానే. ప్రాచీన కాలం నుంచి నేటి వరకు సాహిత్యంలో గల హాస్యనిధిని 'తెలుగు సాహిత్యంలో హాస్యామృతం' పేరుతో పుస్తకంగా తీసుకొచ్చారు.

> **1972 నుంచి నేటి వరకు విభిన్న పత్రికల్లో వేలాది పుస్తక సమీక్షలు చేస్తున్న ఏకైక వ్యక్తి ద్వానాశాస్త్రి. వందేళ్ల నాటి ఛాయా చిత్రాలు, అరుదైన పుస్తకాలు, అలనాటి విశేష కవితలు, వెలుగులోకి ఆయన తీసుకువచ్చారు. ద్వానా రాసిన 'తెలుగు సాహిత్య చరిత్ర' పది ముద్రణలు పొందింది.**

డాక్టర్ ద్వాదశి నాగేశ్వర శాస్త్రి (ద్వా.నా.శాస్త్రి) సాహిత్యంలో పలు ప్రయోగాలు చేసి అంతర్జాతీయ రికార్డులు సొంతం చేసుకున్నారు. ఏకధాటిగా 12 గంటల పాటు తెలుగు భాషా సాహిత్యాలపై ప్రసంగించి ప్రపంచ రికార్డు నెలకొల్పారు.

ద్వానా శాస్త్రి 2014లో 'శతక సాహిత్యంలో వ్యక్తిత్వ వికాసం' అనే అంశం మీద 188 నిమిషాల పాటు ప్రసంగం ద్వారా జీనియస్ బుక్ రికార్డ్, 2015లో 'పలకరిస్తే ప్రసంగం' పేరుతో 6 గంటల నిర్విరామ ప్రసంగంతో వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకున్నారు.

- మధుకర్ వైద్యుల, 9182777409


వర్షోత్సవం

ముందుగానే
ఊరించింది కాలం అద్భుతంగా
మట్టినంతా దుక్కులతో మర్లేశినారు
సేద్యమంటేనే ఎడతెగని పని
పదునురాగానే విత్తనాలేశారు
బహుసక్కని మొలకల పెరుగుదల
పచ్చపచ్చని రంగుల కలబోత
చూడముచ్చటైన అందాల దృశ్యమాలిక.
అంతలోనే..
భగ్గుమన్న ఎండలతో బోరుమన్నారు
ముక్కోటి దేవుళ్ళకు దండాలు పెట్టారు
ఊరూర కప్పతల్లీ ఆటలాడారు.
రోజులాగే ఎదురు చూపులు
నింగి నుంచి రాలే చినుకులకై
అదునుపోతుందని అంతులేని దిగులు
మొక్కల ఆయువును కాపాడాలనే తపన
అవకాశం ఉరిమింది భరోసానిస్తూ
రైతుల కళ్లల్లో మెరుపులు మెరిశాయి
పంట చేలల్లో పడకేసిన తనువులు
విచ్చుకున్నాయి పువ్వుల్లేక్క.
ముసురుతో తరువులు ముడుచుకున్నాయి
టపటపలాడిస్తూ పిట్టలు లేచాయి
జలధారలతో జలపాతాలు ఉరకలెత్తాయి
అన్నదాతల మనసుల్లో చిగురులు
తొడిగాయి
తలమునకలైనారు వర్షోత్సవంలో..!

- గోపగాని రవీందర్, 9440979882

కొత్త పుస్తకాలు


యాభై సంవత్సరాల జ్ఞాపకాలు



ఒక జాతి చరిత్రలో యాభై ఏండ్ల కాలం ఏమంత ఎక్కువ కాకపోయినప్పటికీ తక్కువ కూడా కాదు. వెనుదిరిగి చూసుకుంటే 1929–1979 వరకు జరిగిన కాలం ప్రపంచ చరిత్రలోనూ, దేశ చరిత్రలోనూ ముఖ్యమైన ఘట్టం. ఈ కాలంలో దేశంలో వచ్చిన మార్పులు మరే యాభై ఏండ్లలో రాలేదని చెపవచ్చు. ఈ కాలానికి సాక్షీభూతంగా దేవులపల్లి రామానుజరావుగారి వీక్షణమే ఇది.

రచన: డాక్టర్ దేవులపల్లి రామానుజరావు, వెల: రూ.100
ప్రతులకు: తెలంగాణ సారస్వత పరిషత్, తిలక్‌రోడ్, అబిడ్స్ హైదరాబాద్, ఫోన్:040-24753724

మునగాల పరగణా 'కథలు–గాథలు'



మునగాల పరగణాకు నాలుగైదు శతాబ్దాల చరిత్ర ఉంది. మునగాల పరగణా ప్రజలకు తమ జమీందారుపై చేస్తున్న రెండు మూడు దశాబ్దాల పోరాట చరిత్ర ఉన్నది. ఈ క్రమంలో ప్రజల ఆరాట పోరాటాలు, జమీందారుల పాలనా తీరును చెప్పేవే ఈ 'కథలు–గాథలు'.

రచన: గుడిపూడి సుబ్బారావు, వెల: రూ. 150
ప్రతులకు: అన్ని ప్రధాన పుస్తక కేంద్రాలు


చైతన్య శిఖరాలు (వ్యాసాల సంకలనం)



జయరాముడు ప్రభుత్వ ఉద్యోగిగా పనిచేసినా, ఒక ప్రాపంచిక దృక్పథాన్ని కలిగి ఉన్నారు. పదవీ విరమణ తర్వాత కూడా దాన్ని కొనసాగిస్తూ భిన్నమైన సమస్యల మీద సమాజాన్ని చైతన్యపర్చాలనే బాధ్యతతో ఈ వ్యాసాలను రాశారు. రాజ్యాధికారం నిక్షిప్తమై ఉన్న చోట పనిచేస్తూ ప్రత్యామ్నాయ రాజకీయాల పట్ల ఆసక్తి, సానుభూతితో రాసిన, సమాజం పట్ల బాధ్యతతో రాసిన వ్యాస సంకలనం ఇది.

రచన: వి.జయరాముడు, వెల: రూ.150
ప్రతులకు: వి.జయరాముడు, ఇంటి నెం:3-3-76/1, చైతన్య విలాస్ కాలనీ, హైదర్‌గూడ, హైదరాబాద్–48, సెల్:9848215650

స్నేహగీతాలు (వచన కవితా కుసుమ సౌరభాలు)



సృష్టిలో తీయనిది స్నేహమేనన్నది అందరికీ అనుభవమే. మనిషి జీవితంలో ప్రేమ, స్నేహం రెండు అంశాలు ప్రధాన భూమిక వహిస్తాయి. ఇవే నిజానికి మనిషిని తీర్చిదిద్దుతాయి, ఉన్నతీకరిస్తాయి. అలాంటి ఉన్నతమైన స్నేహంపై రచయిత కల్వకోట ఉన్నత భావాలతో ఉత్తమ కవిత్వాన్ని అందించారు.

రచన: కల్వకోట వేంకట సంతోష్‌బాబు
వెల: రూ. 50, ప్రతులకు: కె.వి. సంతోష్‌బాబు
ఇంటి నెం:3–1–269, సీవీఆర్ఎన్ రోడ్, సౌమ్యసాయి నిలయం తక్షణ్ దవాఖాన వెనుక వీధి, కరీంనగర్–505001
సెల్:9849085727

Printed and Published by Damodar Rao Divakonda, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.437, Near Velama Kalyana Mandapam, Devara Yamjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078, Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: Katta Shekar Reddy. Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.

జమిలి ఎన్నికలకు సై!



- 2024 నుంచి అమలు చేయాలన్న నీతి ఆయోగ్
- సాధ్యాసాధ్యాలపై చర్చించాలని కేంద్రానికి సూచన

న్యూఢిల్లీ, ఆగస్టు 27: దేశవ్యాప్తంగా లోక్‌సభ, అసెంబ్లీలకు ఒకేసారి ఎన్నికలు జరుపాలని నీతి ఆయోగ్ కేంద్ర ప్రభుత్వానికి సూచించింది. జమిలి ఎన్నికల విధానాన్ని 2024 నుంచి అమలుచేయాలని, రెండు దశల్లో ఎన్నికలు పూర్తి చేయాలని చెప్పింది. 'మూడేండ్ల అజెండా' పేరుతో నీతిఆయోగ్ ఇటీవల కేంద్రానికి అందించిన నివేదికలో ఈ మేరకు తన అభిప్రాయాన్ని వెల్లడించింది. పలు దఫాల్లో ఎన్నికలు జరుగడం వల్ల పాలనకు అంతరాయం ఏర్పడుతున్నదని పేర్కొన్నది. దేశానికి ఎంతో మేలు చేసే జమిలి ఎన్నికల విధానంపై విస్తృత చర్చ తర్వాతే తుది నిర్ణయం తీసుకోవాలని అభిప్రాయపడింది. వివిధ రంగాల నిపుణులతో ఓ కమిటీని వేసి సాధ్యాసాధ్యాలపై నివేదిక తెప్పించుకోవాలని సూచించింది. ఈ క్రమంలో కొన్ని రాష్ట్ర ప్రభుత్వాల కాలపరిమితి తగ్గించాల్సి ఉంటుందని, మరికొన్ని రాష్ట్ర ప్రభుత్వాల కాలపరిమితి పొడిగించాల్సి ఉంటుందని చెప్పింది. జమిలి ఎన్నికల కోసం ఎంతో కసరత్తు చేయాల్సి ఉంటుందని, అవసరమైతే రాజ్యాంగానికి కొన్ని మార్పులు, చేర్పులు చేయాల్సి ఉంటుందని స్పష్టంచేసింది. తమ సలహాలను, సూచనలను కేంద్ర ఎన్నికల కమిషన్ పరిశీలించాలని, 2018 మార్చి నాటికి తుది నిర్ణయం ప్రకటించాలని సూచించింది. గత ఏడాది దీపావళి సందర్భంగా బీజేపీ నిర్వహించిన కార్యక్రమంలో ప్రధాని మోదీ మాట్లాడుతూ జమిలి ఎన్నికలను ప్రస్తావించారు. అన్ని రాజకీయ పార్టీలు చర్చించి ఈ అంశంపై తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉందని చెప్పారు. ఈ ఏడాది గణతంత్ర దినోత్సవ ప్రసంగంలో అప్పటి రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ సైతం జమిలి ఎన్నికల విధానంపై చర్చ జరుగాల్సి ఉన్నదన్నారు. దేశంలో ఎన్నికల ఖర్చు ప్రతిసారి పెరిగిపోతున్నది. 2009లో జరిగిన ఎన్నికలకు రూ.1,100 కోట్లు ఖర్చుకాగా, 2014 నాటికి అది రూ.4 వేల కోట్లకు చేరింది. దాదాపు కోటి మంది ఉద్యోగులు ఎన్నికల కోసం పనిచేయాల్సి వచ్చింది. పలు విడుతల్లో ఎన్నికలు నిర్వహించడం వల్ల భద్రతా బలగాలపైనా అదనపు భారం పడడంతోపాటు, దాడుల ముప్పు పెరుగుతున్నది. టీచర్లు ఎక్కువగా విధులకు వెళ్తుండడంతో విద్యారంగంపై చెడు ప్రభావం పడుతున్నదనే విమర్శలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో జమిలి ఎన్నికల అంశం తెరపైకి వచ్చింది.

హింసను పునరావృతం కానివ్వం: హర్యానా డీజీపీ

- 38కి చేరిన మృతులు.. ఢిల్లీలోనూ హై అలర్ట్
- డేరా ఆస్తుల వివరాలు సేకరిస్తున్న పంజాబ్, హర్యానా

చండీగఢ్ / న్యూఢిల్లీ, ఆగస్టు 27: డేరా సచ్చా సౌదా అధినేత గుర్మీత్ రాం రహీంకు సోమవారం శిక్ష ఖరారు కానున్న నేపథ్యంలో హర్యానాలో ఉద్రిక్తత నెలకొంది. తమ పోలీసులకు ప్రస్తుతం రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణే ప్రథమ ప్రాధాన్యం అని హర్యానా డీజీపీ బీఎస్ సంధూ చెప్పారు. శుక్రవారం పంచ్‌కులలో జరిగిన హింసను పునరావృతం కానివ్వబోమని ఆదివారం మీడియాతో అన్నారు. హింసాకాండకు పాల్పడిన వారిపై 52 కేసులు నమోదు చేసి 926 మందిని అరెస్ట్ చేశామన్నారు. గుర్మీత్‌ను దోషిగా నిర్ధారించిన తర్వాత జరిగిన హింసలో మృతి చెందిన వారి సంఖ్య 38కి చేరుకున్నది. పంచ్‌కులలో 32 మంది, సిర్సాలో ఆరుగురు మరణించారు. రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసినందుకు దేశ ద్రోహం సెక్షన్ కింద ఒక మహిళతోపాటు ఎనిమిది మంది గుర్మీత్ మద్దతుదారులను అరెస్ట్ చేశామని పానిపట్ డీఎస్పీ ఆత్మారాం తెలిపారు. డేరా మద్దతుదారులపై రెండు దేశద్రోహం కేసులు నమోదు చేశామని పోలీసులు తెలిపారు. అయితే పూర్తి వివరాలు వెల్లడించలేదు. తాజా పరిస్థితిపై మంగళవారం హైకోర్టుకు నివేదిక సమర్పిస్తామన్నారు. హైకోర్టు ఆదేశాల మేరకు డేరా సచ్చా సౌదాకు చెందిన ఆస్తుల వివరాలను పంజాబ్, హర్యానా ప్రభుత్వాల రెవెన్యూ శాఖలు సేకరిస్తున్నాయి. డేరా ఖాతాల కోసం బ్యాంకర్లను కోరినట్లు గుర్గావ్ డిప్యూటీ కమిషనర్ వినయ్ ప్రతాప్ సింగ్ తెలిపారు. ఢిల్లీలోనూ పోలీసులు హైఅలర్ట్ ప్రకటించారు. నార్త్, సెంట్రల్ ఢిల్లీ మినహా దేశ రాజధాని 'హస్తిన' అంతటా నిషేధాజ్ఞలు అమలులో ఉన్నాయి.

విశ్వాసాల పేర హింసను ఉపేక్షించం

- ఓడీఎఫ్‌లో ఆదర్శంగా 2.3లక్షల గ్రామాలు
- జన్‌ధన్ యోజనను పలు దేశాలు పరిశీలిస్తున్నాయి
- 'మన్‌కీ బాత్'లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ
- 'జమాయత్ ఉలేమాయే హింద్' కృషికి అభినందన

న్యూఢిల్లీ, ఆగస్టు 27: విశ్వాసాల పేర హింసకు పాల్పడితే ఉపేక్షించే ప్రసక్తే లేదని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టంచేశారు. చట్టం ముందు అందరూ సమానమేనని, దోషులెవరైనా శిక్ష అనుభవించకతప్పదని అన్నారు. తనను తాను దైవంగా చెప్పుకునే డేరా సచ్చా సౌదా అధినేత గుర్మీత్ రాం రహీం సింగ్‌ను ఉద్దేశించి మోదీ ఈ వ్యాఖ్యలు చేసినట్లు స్పష్టమవుతున్నది. చట్టాన్ని చేతుల్లోకి తీసుకునే హక్కు ఎవరికీ లేదని చెప్పారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకునేందుకు ప్రయత్నిస్తే ఎంతటివారినైనా చూస్తూ ఉరుకోబోమని హెచ్చరించారు. బుద్ధుడి నుంచి మహాత్మాగాంధీ వరకు అహింసే భారతీయ జీవనమార్గంగా చూపిన గడ్డపై హింసకు తావులేదని అని అన్నారు. అహింసను మించిన ధర్మమేదీ లేదని పేర్కొంటూ 'అహింసో పరమో ధర్మః' అని గుర్తుచేశారు. డాక్టర్ అంబేద్కర్ రూపొందించిన రాజ్యాంగం కష్టనివారణకు సాయపడి, అందరికీ న్యాయం అందిస్తుందని తెలిపారు. 'పర్వదినాలను వేడుకగా జరుపుకొంటున్న తరుణంలో దేశంలో ఎక్కడైనా హింస చెలరేగినట్లే వార్తలు వస్తే స్పందించకుండా ఎలా ఉంటాం?' అని మోదీ ప్రశ్నించారు. ఆదివారం రేడియో కార్యక్రమం 'మన్‌కీ బాత్' 35వ ఎడిషన్‌లో ప్రధానమంత్రి మోదీ మాట్లాడారు. 30నిమిషాల తన ప్రసంగంలో ప్రధాని పలు అంశాలను శ్రోతలతో పంచుకున్నారు. భిన్నత్వంలో ఏకత్వమే భారతీయ ఆత్మ అని అన్నారు. ముస్లింల సంస్థ జమాయత్-ఉలేమాయే-హింద్ సంస్థ ఇటీవల చూపిన చొరవను ప్రధాని ప్రశంసించారు. ఆ సంస్థ కార్యకర్తలు ఇటీవలి గుజరాత్ వరదల సందర్భంగా 22 దేవాలయాలు, రెండు మసీదులను శుభ్రం చేశారని తెలిపిన మోదీ దానిని సామరస్యతకు స్ఫూర్తిదాయక ఉదాహరణగా పేర్కొన్నారు. భారత యువత కంప్యూటర్లు, మొబైల్ ఫోన్లకు పరిమితం కాకుండా మైదాన క్రీడల్లో రాణించాలన్నారు. ఆరుగురు భారతీయ మహిళా నావికులు ప్రపంచ యాత్రకు బయల్దేరడం తనకెంతో గర్వంగా ఉందని వివరించారు. ఫీఫా అండర్-17 వరల్డ్ కప్ పోటీల్లో పాల్గొనేందుకు భారత్ వస్తున్న ప్రతి దేశపు జట్టుకు తాను స్వాగతం పలుకుతున్నానని తెలిపారు.



జన్‌ధన్ యోజన విజయవంతమైంది

ప్రధానమంత్రి జన్‌ధన్ యోజన విజయవంతమైందని, ఈ స్కీమ్‌ను ఎన్నో దేశాలు నిశితంగా గమనిస్తున్నాయని మోదీ వ్యాఖ్యానించారు. 30కోట్ల కుటుంబాలు కొత్తగా బ్యాంకు ఖాతాలు పొందాయని, ఈ జన్‌ధన్ ఖాతాల్లో రూ.65వేల కోట్లు డిపాజిట్ల రూపంలో ఉన్నాయని వెల్లడించారు. అక్టోబర్ 28తో జన్‌ధన్ యోజన ప్రారంభించి మూడేండ్లు పూర్తవుతుందని పేర్కొన్నారు. వ్యవస్థకు పన్ను రూపంలో వచ్చే కొంత మొత్తం కూడా ఎంతో మంది పేదల జీవితాల్లో వెలుగులు నింపుతుందని తెలిపారు. వినాయక ఉత్సవాలను పర్యావరణహితంగా జరుపుకోవాలని ప్రధాని మోదీ కోరారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలవాడకం గతంతో పోలిస్తే గణనీయంగా తగ్గిందన్నారు. వినాయకచవితి, కేరళలో ఓనమ్, గుజరాత్‌లో నవరాత్రులు, బెంగాల్‌లో దుర్గాపూజ, ముస్లింల ఈదుల్‌జుహా, జైనుల 'సంవత్సరి' పండుగలను ప్రస్తావించిన మోదీ దేశవ్యాప్తంగా ఆధ్యాత్మిక శోభ వెల్లివిరుస్తున్నదని పేర్కొన్నారు.

ఆదర్శంగా 2.3లక్షల గ్రామాలు

రెండులక్షల 30వేల గ్రామాల్లో ఇప్పుడు బహిరంగ మలవిసర్జన లేదని, ప్రస్తుతం దేశంలోని 67శాతం మందికి వ్యక్తిగత మరుగుదొడ్లు ఉన్నాయని మోదీ వెల్లడించారు. స్వచ్ఛభారత్ కార్యక్రమానికి మూడేండ్లు పూర్తవుతున్న నేపథ్యంలో అక్టోబర్ 2 గాంధీజయంతికి ముందు 15రోజులపాటు 'సచ్ఛతే సేవ' అనే పేరిట క్యాంపెయిన్ చేపట్టాలని దేశప్రజలకు మోదీ పిలుపునిచ్చారు. భావి పౌరులను తీర్చిదిద్దే సమయంలోనే వారికి అన్ని అంశాలపైనా ఉపాధ్యాయులు అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు.



భద్రతాబలగాల నిఘాలో నిర్మానుష్యంగా ఉన్న సిర్సా పట్టణం



రోహతక్ పట్టణంలో బందోబస్తు నిర్వహిస్తున్న సీఆర్‌పీఎఫ్ బలగాలు

- బహుళ అంచెల భద్రతా వలయంలో రోహతక్
- జైలుకు హెలికాప్టర్‌లో రానున్న న్యాయమూర్తి
- రేపటి వరకు పంజాబ్, హర్యానాల్లో మొబైల్ ఇంటర్నెట్, సామూహిక ఎస్సెమ్మెస్‌లపై నిషేధం
- సిర్సాలో బ్రాడ్‌బాండ్, ఇంటర్నెట్ సేవలు రద్దు
- రెండు రాష్ట్రాల్లోని సున్నిత ప్రదేశాల్లో ఫ్లాగ్ మార్చ్
- అందుబాటులో సైన్యం

దారుణాల బాబాకు నేడే శిక్ష ఖరారు

చండీగఢ్, ఆగస్టు 27: ఇద్దరు మహిళలపై లైంగికదాడి కేసులో దోషిగా నిర్ధారణ అయిన డేరా సచ్చా సౌదా అధినేత గుర్మీత్ రాం రహీం సింగ్‌కు సోమవారం మధ్యాహ్నం 2.30 గంటలకు హర్యానా రాష్ట్రం పంచ్‌కులలోని సీబీఐ ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి జగ్దీప్ సింగ్ శిక్ష ఖరారు చేయనున్నారు. పంచ్‌కులలో ఉద్రిక్త పరిస్థితుల దృష్ట్యా తీర్పు చెప్పేందుకు రాష్ట్ర ప్రభుత్వం రోహతక్ జిల్లాలోని సునారియా జైలులోనే తాత్కాలిక కోర్టు ఏర్పాట్లు చేస్తున్నది. సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం దోషిగా నిర్ధారించిన తర్వాత శుక్రవారం గుర్మీత్‌ను రోహతక్ జిల్లా సునారియా జైలుకు తరలించిన సంగతి తెలిసిందే. జైలు పరిసరాల్లో కిలోమీటర్ దూరం వరకు నిషేధాజ్ఞలు అమలులో ఉన్నాయి. రోహతక్ జిల్లా పరిధిలో 28 కంపెనీల పారా మిలిటరీ బలగాలతో భద్రతా ఏర్పాట్లు చేస్తున్నామని రోహతక్ ఐజీ నవదీప్ విర్క్ చెప్పారు. రోహతక్, సిర్సాల్లో ప్రస్తుత పరిస్థితుల్లో అవసరమైతే అందుబాటులో ఉండాలని సైన్యాన్ని హర్యానా ప్రభుత్వం కోరింది. అయితే డేరా ప్రధాన కార్యాలయంలోకి వెళ్లేందుకు ఇంకా తమకు అనుమతి రాలేదని సైన్యం తెలిపింది. సిర్సా మినహా హర్యానాలోని మిగతా ప్రదేశాల్లో కర్ఫ్యూ ఎత్తేశారు. హర్యానాలోని పంచ్‌కుల, సిర్సా, రోహతక్, ఫతేబాద్ జిల్లాలు పూర్తిగా భద్రతా సంస్థల నిఘా నీడలో ఉన్నాయి. సైనిక, భద్రతా సంస్థలు ఆయా ప్రాంతాల్లో పౌరుల్లో భరోసా కల్పించేందుకు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించాయి. పంజాబ్, హర్యానా ప్రభుత్వాలు ఈ నెల 29న (మంగళవారం) ఉదయం 11.30 గంటల (72 గంటలపాటు) వరకు మొబైల్ నెట్, ఎస్సెమ్మెస్ సర్వీసులను నిషేధిస్తూ ఆదేశాలు జారీచేశాయి. ఈ నెల 29 వరకు జీ, 3జీ, 4జీ, జీఆర్పీఎస్ ఫోన్ల నుంచి వాయిస్ కాల్స్ మినహా ఎస్సెమ్మెస్ సర్వీసులు నిలిపివేస్తూ హర్యానా ప్రభుత్వం ఆదివారం నిర్ణయం తీసుకున్నది. శనివారమే ఈ సర్వీసులను సస్పెండ్‌చేసిన పంజాబ్ ప్రభుత్వం మంగళవారం వరకు పొడిగించింది. సిర్సాలోని డేరా సచ్చా సౌదా ప్రధాన కార్యాలయం పరిధిలో ఈ నెల 29వ వరకు బ్రాడ్‌బాండ్, ఇంటర్నెట్ లీజ్ లైన్ల సేవలను హర్యానా ప్రభుత్వం నిలిపివేసింది. ఇప్పటికీ సిర్సాలోని డేరా ప్రధాన కేంద్రంలో 30వేల మంది అభిమానులు ఉన్నారని తెలుస్తున్నది. అంబాలా, రోహతక్ తదితర ప్రాంతాల్లో తదుపరి ఆదేశాలు జారీచేసే వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుంది. రాష్ట్రమంతటా సోమవారం విద్యా సంస్థలకు సెలవు ప్రకటించారు.



కుటుంబ సభ్యులతో డేరా బాబా రాంరహీం సింగ్ (ఫైల్)

డేరా ప్రేమీల సామూహిక ఆత్మాహుతి యత్నం?

గుర్మీత్‌కు న్యాయస్థానం శిక్ష ఖరారుచేసిన తర్వాత 'ప్రేమీలు'గా పేర్కొనే డేరా సచ్చా సౌదా అభిమానులు సామూహిక ఆత్మాహుతికి పాల్పడే అవకాశాలున్నాయని నిఘావర్గాలకు విశ్వసనీయ సమాచారం అందింది. వారు ఇందుకోసం 'పౌఢే భీజో' అనే సంకేత నామం వాడుతారని గుర్తించారు. ఈ నేపథ్యంలో సౌదా అభిమానులుగా ఉండే వారిని పూర్తిగా అదుపులోకి తీసుకున్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణే తమకు ప్రథమ ప్రాధాన్యం అని హర్యానా డీజీపీ బీఎస్ సంధూ తెలిపారు. ఇప్పటివరకు 52 కేసులు నమోదు చేశామన్నారు. గుర్మీత్‌ను జైలుకు తరలించకుండా అడ్డుకున్నందుకు ఆయన ఏడుగురు వ్యక్తిగత భద్రతాగార్డులపై దేశ ద్రోహం, హత్యాయత్నం కింద పోలీసులు కేసులు నమోదు చేశారు.

సునారియా జైలులో తాత్కాలిక కోర్టు

గుర్మీత్ రాం రహీం సింగ్‌ను దోషిగా ఖరారు చేసిన న్యాయమూర్తి జగ్దీప్‌సింగ్ సోమవారం ఆయనకు శిక్షను ఖరారు చేయనున్నారు. భద్రతా కారణాల రీత్యా జైలులోనే తాత్కాలిక కోర్టును ఏర్పాటు చేశారు. డేరా బాబాను ఉంచిన సునారియా జైలులోనే ఆయనకు శిక్షను వినిపించనున్నారు. న్యాయమూర్తి జగ్దీప్ సింగ్‌ను హెలికాప్టర్‌లో అక్కడికి తరలించనున్నారు.

'డేరా'లో ప్రత్యేక నగదు వ్యవస్థ!

సిర్సా, ఆగస్టు 27: డేరా సచ్చా సౌధా ప్రధాన కార్యాలయం ఉన్న సిర్సాలో గుర్మీత్ సింగ్ అనుచరులు ఏకంగా ప్రత్యేక నగదు వ్యవస్థను రూపొందించుకున్నారు. సుమారు 800 ఎకరాల సువిశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన దుకాణాలు, కార్యాలయాల్లో చిల్లర కొరతను అధిగమించేందుకు రూ.10,రూ.5 ప్లాస్టిక్ కాయిన్లు, టోకెన్లను కస్టమర్లకు ఇస్తున్నారు. వీటిపై 'ధన్ ధన్ సద్గురు తేరాహీ ఆసరా.. డేరా సచ్చా సౌధా, సిర్సా' అని ముద్రించి ఉంటుంది. ఈ టోకెన్లు, కాయిన్లను కస్టమర్లు దుకాణాల్లో ఇచ్చి తమకు నచ్చిన వస్తువులను కొనుగోలు చేస్తారు. ఉదాహరణకు ఓ కస్టమర్ రూ.70 విలువైన వస్తువును కొనుగోలు చేసి రూ.100 ఇస్తే, మిగిలిన రూ.30కి మూడు ప్లాస్టిక్ టోకెన్లను ఇస్తారు. డేరా చీఫ్ గుర్మీత్ అరెస్టు నేపథ్యంలో సిర్సాలోని ప్రధాన ఆశ్రమానికి వెళ్లిన మీడియా ప్రతినిధులకు కూడా భారత కరెన్సీ స్థానంలో ప్లాస్టిక్ కాయిన్స్ ఇవ్వడం గమనార్హం.

రోహతక్ జైలులోనే కోర్టు

- తీర్పుకోసం ఏర్పాట్లు చేస్తున్న అధికారులు

రోహతక్, ఆగస్టు 27: లైంగికదాడి కేసులో దోషిగా తేలిన డేరా బాబా గుర్మీత్ రామ్ రహీంసింగ్ జైలుశిక్షను నేడు (సోమవారం) ఖరారు చేయనున్న నేపథ్యంలోని సునారియా జిల్లా జైలునే కోర్టుగా మార్చేశారు. రోహతక్ పట్టణానికి పదికిలోమీటర్ల దూరంలో ఉన్న చిన్న గ్రామం సునారియా. అక్కడి జైలులోనే సీబీఐ ప్రత్యేక న్యాయమూర్తి తీర్పు వెలువరించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని పంజాబ్, హర్యానా ఉమ్మడి హైకోర్టు ఆదేశాలిచ్చింది. బాబా అంటే అయిష్టం చూపే జాట్‌ల జనాభా అధికంగా ఉన్నందునే సునారియాను ఎంపిక చేసి ఉంటారని భావిస్తున్నారు. ఓ ఫర్నిచర్ షాపు నుంచి తెచ్చిన బెంచీలు, టేబుళ్లతో కోర్టు రూమ్‌ను సిద్ధంచేశారు. మధ్యాహ్నం 2 గంటలకు కోర్టు శిక్ష ఖరారు చేయనుందని ఐజీ నవదీప్ విర్క్ వెల్లడించారు.

డేరా భూములపై ఆర్డీఓ ఆరా

- నల్లగొండ జిల్లా వెల్మినేడులో ఉన్న భూములను పరిశీలించిన ఆర్డీవో
- నోటీసులు జారీ చేసి స్వాధీనం చేసుకుంటామని స్పష్టీకరణ

చిట్యాల: బాబా గుర్మీత్ రాంరహీం సింగ్‌కు చెందిన డేరా సచ్చా సౌదా సంస్థలకు సంబంధించి నల్లగొండ జిల్లా వెల్మినేడులో ఉన్న భూములను ఆదివారం ఆర్డీవో వెంకటాచారి పరిశీలించారు. మొదట చిట్యాల తహసీల్దార్ కార్యాలయంలో ఆయా భూములకు సంబంధించిన రికార్డులను ఆయన పరిశీలించారు. అనంతరం వెల్మినేడుకు వెళ్లి డేరాకు సంబంధించిన భూములను, అందులో ఉన్న అసైన్డ్ భూములను, ఆశ్రమ ప్రతిపాదిత ప్రాంతాన్ని పరిశీలించారు. భూములకు రక్షకుడుగా ఉంటున్న శ్యాంలాల్‌తో మాట్లాడి వివరాలు రాబట్టారు. అసైన్డ్ భూములను తాము కొనుగోలు చేయలేదని 99 సంవత్సరాల వరకు లీజుకు తీసుకున్నామని శ్యాంలాల్ వివరించారు. అనంతరం భూములకు సంబంధించిన రైతులు కూరాకుల నర్సింహ, గోలి ఆంజనేయులు తదితరులతో ఆర్డీవో మాట్లాడారు. తమ పెద్దలు భూములను లీజుకు ఇచ్చారని, తమ ప్రమేయమేమీ లేదని వారు చెప్పారు. అసైన్డ్ భూములకు సంబంధించిన నోటీసులిచ్చి, వాటిని స్వాధీనం చేసుకుంటామని ఆర్డీవో తెలిపారు. ఆయన వెంట తహసీల్దార్ విశాలాక్షి, ఆర్ఐ పృథ్వీధర్ ఉన్నారు.

డేరా సచ్చా సౌదా ఆధ్యాత్మిక కేంద్రాన్ని నెలకొల్పుతామని చెప్పి, గుర్మీత్ అనుచరులు హైదరాబాద్ - విజయవాడ ప్రధాన రహదారి పక్కనే వెల్మినేడులో 2008-2009 మధ్య దశల వారీగా సుమారు 56 ఎకరాల భూమిని కొనుగోలు చేశారు. అయితే ఈ భూములకు రక్షకుడిగా వ్యవహరించే ఒక వ్యక్తి మాత్రమే ఉండి అతను తరచూ ఇక్కడికి వచ్చి వెళ్లే వాడని స్థానికులు తెలిపారు. సదరు భూములతో పాటు వాటి పక్కనే ఉన్న 7.24 ఎకరాల అసైన్డ్ భూమిని కూడా ఆక్రయించుకొని ప్రహరీ నిర్మిస్తున్నారని స్థానికులు ఫిర్యాదు చేయడంతో అధికారులు నిర్మాణాన్ని నిలిపివేయించారు. ఈ అసైన్డ్ భూమిని తమకు కేటాయించాలని కోరుతూ డేరాబాబా అనుచరులు కోర్టును ఆశ్రయించగా, విచారణ జరిపి నిర్ణయం తీసుకోవాలని కోర్టు అధికారులను ఆదేశించింది.



వెల్మినేడులో డేరా సౌదా భూములకు సంరక్షకుడిగా ఉన్న శ్యాంలాల్ నుంచి వివరాలు సేకరిస్తున్న ఆర్డీఓ వెంకటాచారి

అసైన్డ్ భూముల వివరాలు: డేరా సచ్చా సౌదా పేరిట ఆశ్రమం కోసం కొనుగోలు చేసిన భూములలో 7.24 ఎకరాల అసైన్డ్ భూమి ఉంది. గ్రామంలోని 98 సర్వే నెంబర్‌లో 3.30 ఎకరాలు, 102 సర్వే నెంబర్‌లో 1.34 ఎకరాలు, 132 సర్వే నెంబర్‌లో 2 ఎకరాల అసైన్డ్ భూమి ఉన్నట్లు రెవెన్యూ అధికారులు గుర్తించారు.



ప్రభుత్వం ఏర్పాటు చేసిన బస్సులో గ్రామాలకు వెనుదిరుగుతున్న డేరా మద్దతుదారులు

మళ్లీ హింసాకాండ చెలరేగవచ్చు

- నేటి తీర్పు నేపథ్యంలో నిఘా వర్గాల హెచ్చరిక

చండీగఢ్, ఆగస్టు 27: లైంగికదాడి కేసులో దోషిగా తేలిన డేరా బాబా గుర్మీత్ రామ్ రహీంసింగ్ సోమవారంనాడు శిక్షను ఖరారు చేయనున్న నేపథ్యంలో మళ్లీ హింసాకాండ చెలరేగవచ్చని నిఘావర్గాలు హెచ్చరిస్తున్నాయి. 'పరిస్థితులు ఉద్రిక్తంగానే ఉన్నాయని రాష్ట్ర సీఐడీ విభాగం ఐజీ నివేదిక ఇచ్చారు. మరికొద్ది రోజులు అల్లర్లు కొనసాగవచ్చని భావిస్తున్నారు. మరీ ముఖ్యంగా ఆగస్టు 28న కోర్టు శిక్ష ఖరారు చేయనుండటంతో ఆ రోజు హింసాకాండ చెలరేగే సూచనలు కనిపిస్తున్నాయని ఇంటెలిజెన్స్ నివేదికలో పేర్కొన్నది' అని హోంశాఖ అదనపు ప్రధాన కార్యదర్శి రామ్ నివాస్ తెలిపారు. సోమవారంనాడు శాంతిభద్రతలను కాపాడేందుకే అత్యధిక ప్రాధాన్యతనిస్తామని హర్యానా డీజీపీ బీఎస్ సాంధు చెప్పారు. డేరా సచ్చా సౌదాకు చెందిన రాష్ట్రంలోని 103 'నామ్ చర్చ ఘర్'లను జల్లెడ పట్టామని తెలిపారు. ఈ తనిఖీల్లో ఒక పెద్ద కత్తి, ఒక ఖడ్గం, 19 పదునైన ఆయుధాలు లభ్యమయ్యాయయని, రాష్ట్రవ్యాప్తంగా జరిగిన తనిఖీల్లో 104 కర్రలు, 48 ఇనుప రాడ్లు, 21 డీజిల్, పెట్రోల్ బాటిళ్లు, రెండు గడ్డిని కత్తిరించే కత్తులు, మూడు గొడ్డళ్లు, ఐదు కొడవళ్లు, రెండు రంపాలు, రెండు కత్తెర్లు, 2574 లాఠీలు, 66 పెప్పర్‌స్ప్రేలు స్వాధీనం చేసుకున్నామని డీజీపీ వెల్లడించారు. సోమవారం సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం తీర్పు అనంతరం సిర్సాలోని ప్రధాన ఆశ్రమంలో అణువణువూ గాలించేందుకు భద్రతాదళాలు సిద్ధమవుతున్నాయి.

సిర్సా 'డేరా'లో 30 వేల మంది ప్రేమీల తిష్ట

సిర్సాలోని డేరా సచ్చా సౌధా ప్రధాన కేంద్రంలో ఇప్పటికీ సుమారు 30 వేల మంది గుర్మీత్ రాం రహీం సింగ్ అభిమానులు తిష్ట వేశారు. లోపల నుంచి బయటకు రావాలని పదేపదే అధికార యంత్రాంగం విజ్ఞప్తి చేసినా గుర్మీత్ 'ప్రేమీ' అభిమానులు అందుకు నిరాకరిస్తున్నారు.ఒక మీడియా వ్యాన్‌పై డేరా మద్దతు దారులు దాడి చేశారని అనుమానిస్తున్నారు. డేరా ప్రధాన కేంద్రంలో తిష్ట వేసిన వారు ఎటువంటి అవాంఛనీయ చర్యలకు దిగకుండా దాని చుట్టూ పోలీసులు, సైన్యం భద్రతావలయం ఏర్పాటు చేశారు. పంజాబ్, హర్యానాల్లో 500 మందికి పైగా డేరా మద్దతుదారులను అదుపులోకి తీసుకున్నారు.


గుర్మీత్ మద్దతుదారులు సొంతూళ్లకు వెళ్లేందుకు బస్సులు

సిర్సాలోని డేరా సచ్చా సౌధా ప్రధాన కేంద్రంలో ఉన్న గుర్మీత్ మద్దతుదారులు వారి సొంతూళ్లకు వెళ్లేందుకు ఐదు హర్యానా రోడ్‌వేస్ బస్సులు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని ఓ సీనియర్ అధికారి తెలిపారు. ఇప్పటికే ఎనిమిది కంపెనీల సైన్యం సిర్సాలో విధులు నిర్వహిస్తుండగా, మరో నాలుగు కంపెనీల సైన్యాన్ని ఆదివారం నియోగించారు. ఢిల్లీ - రోహతక్ - భటిండా సెక్షన్ మినహా మిగతా మార్గాల్లో 26 రైలు సర్వీసులు పునరుద్ధరించామని నార్తర్న్ రైల్వేస్ సీపీఆర్వో నీరజ్ శర్మ చెప్పారు. శుక్రవారం నాటి అల్లర్లలో హింసకు పాల్పడి గాయపడిన వారికి ఎటువంటి నష్ట పరిహారం చెల్లించబోమని పంజాబ్ సీఎం అమరీందర్‌సింగ్ స్పష్టం చేశారు.

దేశ్ బచావో.. బీజేపీ భగావో!

- పాట్నా మెగా ర్యాలీలో ఆర్జేడీ అధినేత లాలూ ప్రభృతుల పిలుపు
- గైర్హాజరైన కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియా, ఉపాధ్యక్షుడు రాహుల్, బీఎస్పీ అధినేత మాయావతి


పాట్నా, ఆగస్టు 27: కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీని వచ్చే ఎన్నికల్లో సాగనంపాలని ఆర్జేడీ అధ్యక్షుడు లాలూ ప్రసాద్ యాదవ్, పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ తదితరులు పిలుపునిచ్చారు. బీజేపీకి వ్యతిరేకంగా 'దేశ్ బచావో బీజేపీ భగావో' నినాదంతో ఆదివారం పాట్నాలోని గాంధీ మైదాన్‌లో ఆర్జేడీ అధ్యక్షుడు లాలూ ప్రసాద్ యాదవ్ నిర్వహించిన మెగా ర్యాలీకి పశ్చిమబెంగాల్ సీఎం మమతాబెనర్జీతోపాటు సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతలు గులాం నబీ ఆజాద్, సీపీ జోషి, జేడీయూ తిరుగుబాటు నాయకుడు శరద్ యాదవ్, ఆర్‌ఎల్డీ నాయకుడు జయంత్ చౌదరి, సీపీఐ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి, కార్యదర్శి డీ రాజా, జేఎంఎం నాయకుడు హేమంత్ సోరెన్, జేవీఎం అధ్యక్షుడు బాబూలాల్ మరాండీ, ఎన్సీపీ ఎంపీ తారిఖ్ అన్వర్ తదితరులు హాజరయ్యారు. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు సోనియా, ఉపాధ్యక్షుడు రాహుల్ గాంధీ, బీఎస్పీ అధినేత మాయావతి గైర్హాజరయ్యారు. సోనియా, రాహుల్ వీడియో సందేశాలను సభికులకు వినిపించారు. జేడీఎస్, డీఎంకే, నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్సీపీ), నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్సీ), అసోంలోని ఏఐయూడీఎఫ్, సీపీఐ ఎంఎల్, ఆరెస్పీ ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా లాలూ మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమికి కౌంట్‌డౌన్ మొదలైందన్నారు. తన కుటుంబంపై అవినీతి ఆరోపణలు చేయించిన నితీశ్ ప్రజా తీర్పును తోసిరాజన్నారని లాలూ మండిపడ్డారు. కానీ భవిష్యత్‌లో నితీశ్‌ను ఏ పార్టీ విశ్వసించదని అన్నారు. మిగతా నేతలు కూడా ప్రజాతీర్పునకు నితీశ్ ద్రోహం చేశారని ఆరోపించారు. జేడీయూ తిరుగుబాటు ఎంపీ అన్వర్ అలీతో కలిసి సభలో పాల్గొన్న సీనియర్ నేత శరద్ యాదవ్ మాట్లాడుతూ 125 కోట్ల మంది భారతీయుల కోసం మహా కూటమిని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. మమతాబెనర్జీ లాలూ, గులాం నబీ ఆజాద్, అఖిలేశ్ యాదవ్ తదితరులు మూడేండ్ల క్రితం 'అచ్ఛేదిన్' తీసుకొస్తానన్న ప్రధాని మోదీ హామీ ఏమైందని ప్రశ్నించారు. పశ్చిమ బెంగాల్ సీఎం మమతాబెనర్జీ మాట్లాడుతూ బీజేపీయేతర పాలిత రాష్ట్ర ప్రభుత్వాలను కేంద్రంలోని మోదీ సర్కార్ వేధిస్తున్నదన్నారు. బీజేపీయేతర పార్టీలను లొంగదీసుకునేందుకు కేంద్ర దర్యాప్తు సంస్థలను పావుగా వాడుకుంటున్నారని ఆమె ఆరోపించారు.




పాట్నాలో జరిగిన బహిరంగసభ వేదికపై మమతాబెనర్జీ, లాలూ యాదవ్, అఖిలేశ్ యాదవ్

వివాదాస్పదమైన జనం ఫొటో

ఆర్జేడీ నేత లాలూ ప్రసాద్‌యాదవ్ తన ట్విట్టర్‌లో పాట్నా ర్యాలీకి సంబంధించి పోస్టుచేసిన ఫొటో వివాదాస్పదమైంది. 'నా కోటలో నాకు ఎదురునిలిచే వారే లేరు. అవసరమైతే వచ్చి గాంధీ మైదానంలో వచ్చి లెక్క పెట్టుకోండి' అని పేర్కొంటూ లాలూ.. ఫొటోను ట్వీట్ చేశారు. ఇది ఫొటోషాప్‌లో మార్ఫింగ్ చేసిందని విమర్శలు వచ్చాయి. 'ఇదే చిత్రాన్ని.. లాలూ కోరుకున్నదానికంటే మరింత మెరుగ్గా ఫొటోషాప్ చేసి చూపిస్తా' అంటూ పీయూష్‌సింగ్ అనే వ్యక్తి పేర్కొన్నారు.



సభకు హాజరైన జనం



లాలూ ట్వీట్ చేసిన ఫొటో





గ్రేటర్‌లో గణేశ్ నవరాత్రుల సందడి కొనసాగుతున్నది. ఏ గల్లీ చూసినా భక్తి పాటలతో మారుమోగుతున్నది. ఆదివారం సెలవురోజు కావడంతో ఖైరతాబాద్ వినాయకుడి దర్శనానికి భక్తులు పోటెత్తారు. గంటల తరబడి క్యూలైన్లలో నిలబడి అనంత మహాగణపతిని దర్శించుకొని తన్మయత్వం పొందారు. మూడు రోజులు పూర్తి కావడంతో పలు ప్రాంతాల నుంచి విగ్రహాలు నిమజ్జనం కోసం ట్యాంక్‌బండ్‌కు తరలివచ్చాయి. దీంతో హుస్సేన్‌సాగర్ పరిసరాలు సందడిగా మారాయి.

రాష్ట్రంలో రెండు లక్షల వినాయక మండపాలు

పోలీసుల అనుమతితో లక్ష.. అనుమతి లేనివి మరో లక్ష

అన్నిచోట్లా భారీ బందోబస్తు, ముమ్మరంగా పెట్రోలింగ్

మండపాల వద్ద పాయింట్ బుక్స్.. ఆదివారం నుంచి మొదలైన నిమజ్జనం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రవ్యాప్తంగా ఈసారి భారీ సంఖ్యలో వినాయకులను ఏర్పాటు చేశారు. తాము దాదాపు లక్ష మండపాలకు అనుమతులు ఇచ్చామని పోలీసులు చెప్తున్నారు. పోలీస్ శాఖ వద్ద రిజిస్ట్రేషన్ లేకుండా మరో లక్ష మండపాలు ఉంటాయని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆదివారం మూడో రోజు కావడంతో నిమజ్జనం కూడా మొదలైంది. దీంతో నిమజ్జన ఏర్పాట్లు చేసిన చెరువుల వద్ద భారీ బందోబస్తుతోపాటు అవసరమైన చోట్ల క్రేన్‌లను అందుబాటులో ఉంచారు. మూడో రోజు ప్రశాంత వాతావరణంలో నిమజ్జనాలు జరిగాయని పోలీసులు తెలిపారు. డీజీపీ అనురాగ్‌శర్మ, అదనపు డీజీపీ అంజనీకుమార్ ఆదివారం అన్ని జిల్లాల పోలీస్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. మండపాలు, నిమజ్జనం బందోబస్తు ఏర్పాట్లను తెలుసుకోవడంతో పాటు పలు సూచనలు చేశారు.

అన్ని శాఖలతో సమన్వయం

నిమజ్జనం ప్రారంభమైన నేపథ్యంలో అన్ని శాఖలతో సమన్వయం చేస్తూ ముందుకు సాగుతున్నామని డీజీపీ అనురాగ్‌శర్మ తెలిపారు. ఇప్పటికే మండపాల నిర్వాహకులతో పలు ధఫాలుగా సమావేశమై తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించామన్నారు. మూడో రోజు నిమజ్జనం సందర్భంగా బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. ఎప్పటికప్పుడు జిల్లా పోలీస్ అధికారులతో మాట్లాడుతున్నామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పోలీసుల నుంచి దాదాపు లక్ష విగ్రహాలకు అనుమతులు ఇచ్చినట్టు అదనపు డీజీపీ (శాంతిభద్రతలు) అంజనీకుమార్ తెలిపారు. హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో 12 వేలు, రాచకొండలో 7,900, సైబరాబాద్‌లో 9 వేలు, వరంగల్‌లో 4 వేల విగ్రహాలు ఏర్పాటు చేశారన్నారు. అనుమతి తీసుకోకుండా ఇంకా భారీ సంఖ్యలో విగ్రహాలు ఏర్పాటు చేశారని, ఇవి అనుమతి తీసుకున్న వాటి కంటే ఎక్కువగా ఉన్నాయన్నారు. అపార్ట్‌మెంట్లు, చిన్నచిన్న బస్తీల్లో ఏర్పాటు చేస్తున్న విగ్రహాలకు అనుమతి తీసుకోవడం లేదని చెప్పారు. భద్రత, బందోబస్తు పరంగా అన్ని విగ్రహాలను సమానంగా చూస్తున్నామన్నారు. ప్రతి మండపం వద్ద పాయింట్ బుక్ ఏర్పాటు చేశామని, పెట్రోలింగ్ ముమ్మరం చేశామని చెప్పారు. నిర్వాహకులు కూడా తమకు సహకరిస్తున్నారని తెలిపారు. ఆదివారం తొలి నిమజ్జనం కావడంతో నిర్వాహకులు సాయంత్రం నుంచి విగ్రహాలను తరలించారని, ఈ మేరకు ఏర్పాట్లు చేశామని వివరించారు.

బంపరాఫర్!

ప్రభుత్వ ఉద్యోగులకు తక్కువ ధరలో రాజీవ్ స్వగృహ ఫ్లాట్లు

బండ్లగూడ, పోచారంలో అమ్మకానికి 3,710 ఇండ్లు.. వెబ్‌సైట్‌లో పూర్తి వివరాలు

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:

మేడ్చల్ జిల్లా పరిధిలోని బండ్లగూడ, పోచారంలో నిర్మించిన రాజీవ్ స్వగృహ ప్రాజెక్టుల్లోని ఫ్లాట్లను ప్రభుత్వ ఉద్యోగులకు తక్కువ ధరకు అమ్మేందుకు అంతా సిద్ధమైంది. బుకింగ్ విధానం, కిస్తీలు చెల్లించాల్సిన తీరుతోపాటు స్వగృహఫ్లాట్లకు సంబంధించిన పూర్తి వివరాలతో ప్రభుత్వం ఓ కొత్త వెబ్‌సైట్‌ను రూపొందించి అందుబాటులోకి తెచ్చింది. ఈ వెబ్‌సైట్‌లో ఫ్లాట్ల విస్తీర్ణం, ధర, పన్నులు, రిజిస్ట్రేషన్ వ్యవహారాలకు సంబంధించిన ప్రతి అంశాన్ని పొందుపరిచారు. ఈ రెండు ప్రాజెక్టుల నిర్మాణం 2007లో ప్రారంభించారు. 9, 5 అంతస్తుల్లో వీటిని నిర్మించారు. ఆ తర్వాత జరిగిన పరిణామాలు, ఆర్థిక మాంద్యంతో చాలా ఫ్లాట్లు అమ్మకుండా ఖాళీగా మిగిలిపోయాయి. వీటిని తక్కువ ధరకు ప్రభుత్వ ఉద్యోగులకు అందించాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు తెలంగాణ ఉద్యోగ సంఘాలతో ఈ ఏడాది ఫిబ్రవరి 6, జూన్ 19 తేదీల్లో ప్రభుత్వం సమావేశమైంది. వారి సలహాలు, సూచనలు స్వీకరించడంతోపాటు, వారి విన్నపాలను పరిగణనలోకి తీసుకున్నది. చర్చల తర్వాత ఫ్లాట్ల ధరలను ఖరారుచేసి అమ్మకానికి ఉంచింది. కొనుగోలుదారులు ఆన్‌లైన్ విధానంలో డబ్బు చెల్లించేలా ఏర్పాట్లు చేసింది. www.tsswagruha.cgg.gov.in వెబ్‌సైట్‌ను రూపొందించి అందులో పూర్తి వివరాలను పొందుపరిచింది. ముందువచ్చిన వారికి ముందు పద్ధతిన ఫ్లాట్లను కేటాయించనున్నట్టు అధికారులు తెలిపారు. బండ్లగూడలో 2,240 ఫ్లాట్లు అమ్మకానికి ఉండగా, పోచారంలో 1,470 ఫ్లాట్లు అందుబాటులో ఉన్నాయి. గతంలో కొనుగోలు చేసినవారితో పోల్చితే ప్రభుత్వ ఉద్యోగులకు విస్తీర్ణాన్ని అనుసరించి రూ.3 లక్షల నుంచి రూ.12 లక్షల వరకు తక్కువ ధరకే ఫ్లాట్లు లభించనున్నాయి



మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్ మండలంలోని పోచారంలో నిర్మించిన రాజీవ్ స్వగృహ ఇండ్లు

ప్రాజెక్టుల్లో ఫ్లాట్ల ధర

ప్రాజెక్టు	నిర్మాణం పూర్తయినవి చ.అడుగుకు(రూ.ల్లో)	పాక్షికంగా పూర్తయినవి చ.అడుగుకు(రూ.ల్లో)
బండ్లగూడ	1900	1700
పోచారం	1700	1500

ప్రాజెక్టుల్లో ప్రధానాంశాలు

	బండ్లగూడ	పోచారం
లేఅవుట్ విస్తీర్ణం(ఎకరాల్లో)	26.26	30
భవంతులు	33	19
నిర్మాణ వ్యయం (రూ. కోట్లలో)	544.01	404.28
మొత్తం ఫ్లాట్లు	2,746	1,650
ప్రజలకు అమ్మిన ఫ్లాట్లు	502	180
చ. అడుగు ధర (రూ.ల్లో)	2,713	2,246
ప్రభుత్వ ఉద్యోగులకు..		
ఫినిష్‌డ్ (చ.అ..రూ.ల్లో)	1,900	1700
సెమీ ఫినిష్‌డ్ (చ.అ.. రూ.ల్లో)	1,700	1500

ప్రభుత్వ ఉద్యోగులకు కలిగే ప్రయోజనం

	విస్తీర్ణం చ.అడుగుల్లో	ప్రయోజనం రూ. లక్షల్లో
బండ్లగూడ		
3 బెడ్‌రూం ఫ్లాట్ (క్లాసిక్)	1487	12.09
2 1/2 బెడ్‌రూం ఫ్లాట్ (ఇంట్రిన్సిక్)	1141	9.28
2 బెడ్‌రూం ఫ్లాట్ (బేసిక్)	798	6.49
సింగిల్ బెడ్‌రూం ఫ్లాట్(సివిక్)	545	4.4
పోచారం		
3 బెడ్‌రూం ఫ్లాట్ (క్లాసిక్)	1470	8.03
2 1/2 బెడ్‌రూం ఫ్లాట్ (ఇంట్రిన్సిక్)	1125	6.14
2 బెడ్‌రూం ఫ్లాట్ (బేసిక్)	767	4.19
సింగిల్ బెడ్‌రూం ఫ్లాట్ (సివిక్)	523	2.86

అమెరికాలో రోడ్డు ప్రమాదం

హైదరాబాదీ సుహాసినిరెడ్డి దుర్మరణం



మెహిదీపట్నం: అమెరికాలోని ఫ్లోరిడా రాష్ట్రంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో హైదరాబాద్‌కు చెందిన మహిళ మృతిచెందారు. ఎల్‌బీనగర్ అల్కాపురికి చెందిన బొజ్జ సురేశ్‌రెడ్డి ఫ్లోరిడాలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నారు. భార్య సుహాసినిరెడ్డి(35), కొడుకు సుచీర్‌తో కలిసి ఎనిమిదేండ్లుగా అక్కడే నివసిస్తున్నారు. ఇటీవలే సుచీర్ స్కూల్ మారాడు. దీంతో తమ ఇంటిని ఫ్లోరిడా నుంచి స్కూల్ దగ్గరగా ఉండే ప్రాంతానికి మార్చుతున్నారు. ఈ క్రమంలో భారత కాలమానం ప్రకారం శుక్రవారం ఉదయం 7 గంటల ప్రాంతంలో సుహాసిని, సుచీర్ కలిసి కారులో వెళ్తుండగా టంపా ప్రాంతంలో ఓ ట్రక్కు ఢీకొట్టింది. ప్రమాదంలో సుహాసిని అక్కడికక్కడే మృతిచెందగా, సుచీర్ గాయాలతో బయటపడ్డాడు. సురేశ్‌రెడ్డి కుటుంబ సభ్యులతోపాటు లంగర్‌హౌస్ ఓంనగర్‌లో నివాసం ఉండే సుహాసిని తల్లిదండ్రులకు విషయం తెలియడంతో రెండు కుటుంబాలు విషాదంలో మునిగిపోయాయి. రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకొని సుహాసిని మృతదేహాన్ని త్వరగా తెప్పించేలా చర్యలు తీసుకోవాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

ఫతేనగర్‌లో 4.55 లక్షలు చోరీ

అమీర్‌పేట్, నమస్తే తెలంగాణ: నగరంలోని ఫతేనగర్‌లో ఓ హార్డ్‌వేర్ షాప్ సహా వైన్‌షాప్ షట్టర్ తొలిగించిన దొంగలు రూ.4.55 లక్షలు దోచుకెళ్లారు. శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఫతేనగర్ ప్రధాన రహదారిలో ఉన్న భవానీ ట్రేడర్స్ అనే ఓ హార్డ్‌వేర్ షాప్ షట్టర్ తొలిగించి అందులోని రూ.4.5 లక్షల నగదును, పక్కనే ఉన్న ఓ వైన్‌షాపు షట్టర్ తొలిగించి కొన్ని సీసాలతోపాటు దాదాపు రూ.5 వేలు దొంగిలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు సనత్‌నగర్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఓల్టేజీ కన్వర్టర్‌లో బంగారం బిస్కెట్లు

శంషాబాద్‌లో కస్టమ్స్ తనిఖీల్లో 1.233 కిలోలు లభ్యం

స్మగ్లింగ్‌కు ఓ విమాన ప్రయాణికుడి విఫలయత్నం



బంగారం బిస్కెట్లు దాచిన ఓల్టేజీ కన్వర్టర్



అధికారులు స్వాధీనం చేసుకున్న బంగారం బిస్కెట్లు

శంషాబాద్: ఓల్టేజీ కన్వర్టర్‌లో 1.233 కిలోల బంగారం బిస్కెట్లను అమర్చి స్మగ్లింగ్‌కు పాల్పడుతున్న ఓ స్మగ్లర్‌ను శంషాబాద్ విమానాశ్రయంలో కస్టమ్స్ అధికారులు శనివారం అర్ధరాత్రి పట్టుకున్నారు. అధికార వర్గాల సమాచారం ప్రకారం.. దుబాయ్ కేంద్రంగా స్మగ్లింగ్ బంగారం రవాణా చేస్తున్న ఆపరేటర్‌కు చెందిన ఏజెంట్ ద్వారా హైదరాబాద్‌కు వస్తున్న శ్యాంబాబు అనే ప్రయాణికుడి ఓల్టేజీ కన్వర్టర్‌లో బంగారం బిస్కెట్లను అమర్చారు. గుర్తు పట్టకుండా ఉండేందుకు పైనుంచి కాపర్ వైండింగ్ చేశారు. దానిని ఓ కాటన్ బాక్స్‌లో పెట్టి మిగతా సామగ్రితో కలిపి తీసుకొచ్చాడు. కన్వర్టను శంషాబాద్‌లో దిగిన తర్వాత ఇవ్వాలని ఏజెంట్ చెప్పాడు. ఈ క్రమంలో శంషాబాద్‌లో దిగిన తర్వాత కాటన్ బాక్స్‌ను బయటకు తెస్తుండగా కస్టమ్స్ అధికారులు శ్యాంబాబును తనిఖీ చేశారు. కన్వర్టర్‌లో రూ.36,86,670 విలువైన 1.233 కిలోల బంగారాన్ని అధికారులు గుర్తించారు. బంగారాన్ని స్వాధీనం చేసుకుని, నిందితుడిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.



మెదక్ జిల్లా మనోహరాబాద్‌లో మృతుడి కుటుంబానికి చెక్కును అందజేస్తున్న ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే రామలింగారెడ్డి

కార్యకర్తలకు అండగా టీఆర్‌ఎస్

- **మృతుడి కుటుంబానికి రూ.2 లక్షల చెక్కు అందజేత**

తూప్రాన్, నమస్తే తెలంగాణ: టీఆర్‌ఎస్ కార్యకర్తలకు, వారి కుటుంబాలకు పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. మెదక్ జిల్లా మనోహరాబాద్ మండల కేంద్రానికి చెందిన టీఆర్‌ఎస్ కార్యకర్త కేశబోయిన కృష్ణ గత ఏడాది రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. పార్టీ ఇన్సూరెన్స్ ద్వారా మృతుడి భార్య అనురాధకు మంజూరైన రూ.2 లక్షల చెక్కును అంచనాల కమిటీ చైర్మన్, దుబ్బాక ఎమ్మెల్యే సోలిపేట రామలింగారెడ్డితో కలిసి ఎంపీ ప్రభాకర్‌రెడ్డి ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్యకర్తలకు ఏ ఆపద వచ్చినా సీఎం కేసీఆర్ ఆదుకుంటారన్నారు.

మహారాష్ట్ర గ్యాంగ్ పనేనా?

రూ.4 కోట్ల విలువైన సిగరెట్‌ల దోపిడీపై పోలీసుల అంచనా.. ప్రాథమిక ఆధారాలు లభ్యం.. ముఠాపై నిఘా?

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: సంచలనం సృష్టించిన రూ.4 కోట్లు విలువ చేసే సిగరెట్ డంప్ దోపిడీ కేసుపై పోలీసులు పట్టు సాధిస్తున్నారు. వారం రోజుల పాటు రాచకొండ పోలీసులు జరిపిన విచారణలో దొరికిన ఆధారాలను విశ్లేషించగా.. ఈ దోపిడీకి పాల్పడింది మహారాష్ట్రకు చెందిన గ్యాంగ్‌గా అంచనాకు వచ్చారు. దర్యాప్తులో భాగంగా లభించిన వేలిముద్రలు, సీసీ పుటేజీలు విశ్లేషించడం, పలువురి వాగ్మూలం ఆధారంగా పోలీసులకు ఈ ముఠా గురించి కొంత సమాచారం లభించింది. ఈ క్రమంలో పోలీసులు దాదాపు 500 సీసీ కెమెరాల పుటేజీలను విశ్లేషించారు. ప్రస్తుతం నగరంలో గణేశ్ నవరాత్రుల బందోబస్తు ఉండడంతో సిబ్బంది కొరత ఏర్పడింది. దీంతో ముఠా సమాచారం తెలిసినా వారిని హుటాహుటిన వెళ్లి అరెస్ట్ చేసే పరిస్థితి లేదు. ఈ నేపథ్యంలో గ్రేటర్‌లో హడావిడి ముగిసేవరకు ఈ ముఠాపై నిఘా పెట్టారు. దొంగల పూర్తి వివరాలను సేకరించే పనిలో పడ్డారు. దర్యాప్తు విషయాలు బయటికి వస్తే నిందితులు తప్పించుకునే అవకాశం ఉండడంతో ఇతర రాష్ట్రాల పోలీసుల సహకారంతో వారిని నీడలా వెంటాడుతున్నారు. ఈ దోపిడీలో మొత్తం 14 మంది దుండగులు పాలుపంచుకొన్నారని, వారు ఇన్నోవా కారు, లారీలో వచ్చారని గుర్తించారు. ఆయా వాహనాల నంబర్ల ఆధారంగా వారు తప్పుడు నంబర్ ప్లేట్లు వాడి ఉంటారని అనుమానిస్తున్నారు. ఈ నెల 19వ తేదీన పెద్ద అంబర్‌పేట్ సమీపంలో సిగరెట్లు దోపిడీ చేసిన తర్వాత పోలీసులకు ఆధారాలు దొరుకకుండా తికమకపెట్టే ఉద్దేశంతో రూటు మార్చి అటూ ఇటూ ప్రయాణించారని తెలిసింది. ఈ ముఠా గతంలోనూ ఇదే తరహాలో పలుమార్లు సిగరెట్ డంప్‌లను దోచుకున్నట్టు తెలుస్తున్నది. మరో వారం రోజుల్లో దొంగలను అరెస్ట్ చేసే అవకాశం ఉన్నది.

70 లీటర్ల కల్తీ పాలు స్వాధీనం

- **25 పాల పౌడర్ ప్యాకెట్లు సీజ్.. నిర్వాహకుడి అరెస్ట్**



పాల పౌడర్‌తో తయారు చేసిన కల్తీ పాలు

మేడిపల్లి: పౌడర్‌తో కల్తీ పాలను తయారు చేసి నగరంలో విక్రయించి సొమ్ము చేసుకుంటున్న తయారీ కేంద్రంపై ఎస్‌వోటీ పోలీసులు దాడి చేసి నిర్వాహకుడిని అరెస్ట్ చేశారు. కేంద్రంలో ఉన్న 70 లీటర్ల కల్తీ పాలను, 25 పాల పౌడర్ ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. మేడిపల్లి పోలీసుల కథనం ప్రకారం.. ఘట్‌కేసర్ మండలం ప్రతాప్‌సింగారం గ్రామానికి చెందిన అనుమల శేఖర్‌రెడ్డి స్థానికంగా పాల వ్యాపారి. కొన్నేండ్లుగా కిలో పాల పౌడర్ ప్యాకెట్‌ను 20 లీటర్ల నీటిలో కలిపి కల్తీ పాలను తయారు చేస్తున్నాడు. ఈ కల్తీ పాలను పలువురి నుంచి సేకరించిన (ఆవు, బర్రె పాలు) స్వచ్ఛమైన పాలల్లో కలిపి నగరంలోని పలు స్వీట్‌షాపులకు, హోటళ్లకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నాడు. విశ్వసనీయ సమాచారంతో మల్కాజిగిరి జోన్ ఎస్‌వోటీ సీఐ నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం కల్తీ పాలను తయారు చేస్తున్న ఇంటిపై దాడి చేశారు. కల్తీ పాలను పరిశీలించి నిర్వాహకుడు శేఖర్‌రెడ్డిని అదుపులోకి తీసుకుని, 70 లీటర్ల కల్తీ పాలను, 25 పాల పౌడర్ ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని మేడిపల్లి పోలీసులకు అప్పగించారు.

గ్రేటర్‌లో కూరగాయల కొరతకు చెక్

వర్టికల్, రూఫ్ గార్డెనింగ్‌ను ప్రోత్సహించేందుకు ఉద్యానవనశాఖ ప్రణాళిక

సేంద్రియ సాగుపై ప్రత్యేక దృష్టి.. ఔత్సాహికులకు ఎస్‌బీఐ ద్వారా రుణాలు

మార్గదర్శకాల రూపకల్పన అనంతరం బ్యాంకుతో ఒప్పందం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: అవసరానికి మించి రసాయన ఎరువులతో పండించిన కూరగాయల నుంచి హైదరాబాద్‌వాసులకు త్వరలోనే విముక్తి లభించనున్నది. రసాయన ఎరువుల వినియోగంతో పండించిన పంటల ద్వారా అనారోగ్యానికి గురవుతున్న నగర ప్రజలను.. వాటి నుంచి విముక్తి కల్పించేందుకు ఉద్యానవనశాఖ ప్రణాళికలు రూపొందిస్తున్నది. ప్రజలు ఎదుర్కొంటున్న కూరగాయలు, ఆకులకూరల కొరతను తీర్చడంతోపాటు కుటుంబానికి సరిపడే కూరగాయలు, ఆకుకూరలను స్వయం గా వారి ఇంట్లోనే సేంద్రియ పద్ధతిలో సాగుచేసుకునే అవకాశాన్ని ఉద్యానవనశాఖ కల్పించనున్నది. అందులో భాగంగా నగరంలో పెద్ద ఎత్తున రూఫ్ గార్డెనింగ్, వర్టికల్ గార్డెన్ సాగును ప్రోత్సహించాలని నిర్ణయించింది. రూఫ్, వర్టికల్ గార్డెన్‌ను సాగు చేయడానికి ఎంత మంది ఔత్సాహికులు ముందుకు వచ్చినా ఈ పథకం కింద అవసరమైన విత్తనాలు, సేంద్రియ ఎరువు, పరికరాలు, సాగుకు అవసరమైన సాంకేతిక సహకారాన్ని అందించడానికి ఉద్యానవనశాఖ సిద్ధంగా ఉన్నది. అంతేకాకుండా ఈ పథకానికి ఆర్థిక సహకారం అందించడానికి ప్రముఖ వాణిజ్య ఆర్థిక సంస్థ స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆసక్తి చూపుతున్నట్టు సమాచారం. రూఫ్ గార్డెనింగ్, వర్టికల్ గార్డెన్‌ల సాగుకు రూ.50 వేల వరకు రుణంగా ఇచ్చేందుకు ఎస్‌బీఐ ఆసక్తిగా ఉండడంతో.. ఈ స్కీంను గ్రేటర్ హైదరాబాద్‌లో పెద్ద ఎత్తున అమలు చేయాలని ఉద్యానవనశాఖ భావిస్తున్నది. ఈ పథకం అమలు కోసం అవసరమైన మార్గదర్శకాలను రూపొందించి, త్వరలోనే ఎస్‌బీఐ అధికారులతో సమావేశం కానున్నట్టు ఉద్యానవనశాఖ కార్యదర్శి సీ పార్థసారథి 'నమస్తే తెలంగాణ'కు తెలిపారు. ఎస్‌బీఐ అధికారులు సంసిద్ధత వ్యక్తం చేసిన వెంటనే హైదరాబాద్ నగరంలో ఎంపిక చేసిన డివిజన్లలో రూఫ్ గార్డెనింగ్, వర్టికల్ గార్డెన్ సాగును పెద్ద ఎత్తున ప్రారంభించడానికి చర్యలు తీసుకుంటామని ఉద్యానవనశాఖ ఉన్నతాధికారులు తెలిపారు.

జిందగీ పేజీ పై మీ అభిప్రాయాలు,
సలహాలు తెలియజేయండి.
zindagi@ntdaily.news
www.ntzindagi.com
/nt.zindagi

హైదరాబాద్
సోమవారం 28 ఆగస్టు 2017

WWW. NTNEWS.COM



రాఖీకపూర్.. ఐపీఎల్ -8 ఫైనల్ మ్యాచ్ చూసిన వారందరికీ సుపరిచితమైన పేరు. మ్యాచ్‌ను మరిచిపోయినా ఆ అందాలరాశిని మాత్రం ఎవరూ మరిచిపోరు. తనెవరో తెలియని వారు ఏదో సినిమా నటి అనుకొని ఉంటారు. కానీ, ఆమె ఒక వ్యాపారవేత్త. అంతేకాదు, సుమారు 235 బిలియన్ల రెవెన్యూ కలిగిన యస్ బ్యాంక్ మేనేజింగ్ డైరెక్టర్, సీఈవో రాణాకపూర్ ముద్దుల కూతురు. ఆయన కూతురుగా కంటే తనకంటూ ప్రత్యేక గుర్తింపు ఉండాలని కోరుకునే రాఖీ సొంతంగా రెండు కంపెనీలను నిర్వహిస్తున్నారు. తన అందంతోనే కాదు, తెలివితేటలతోనూ వ్యాపార రంగంలో రాణిస్తున్న రాఖీకపూర్ సక్సెస్‌మంత్ర ఇది.

అందమైన వ్యాపారి

భారతదేశంలో వ్యాపార దృక్పథం కలిగిన కుటుంబాల నుంచి వచ్చే వారి వారసులు తక్కువ సమయంలోనే సెలబ్రిటీలుగా అవతరిస్తున్నారు. తమ తెలివితేటలతో వ్యాపారాన్ని విస్తరించడం, సామాజిక సేవ, క్రీడలు, రచనావ్యాసంగం.. ఇలా ఏదో ఒక అభిరుచితో అందరినీ ఆకట్టుకుంటున్నారు. మహిళలు కూడా ఇందులో ఏ మాత్రం తీసిపోవడం లేదు. వారసత్వంగా వచ్చిన వ్యాపారాన్ని కాదని తమ సొంత విధిని నిర్వర్తిస్తూ తమదైన ప్రత్యేకతను చాటుకుంటున్నారు. వస్త్ర వ్యాపారం, ఆన్‌లైన్ షాపింగ్ సైట్లు, హస్తకళలు ఇలా ఏదో ఒక వ్యాపారంలో రాణిస్తున్నారు. భారతీయ వ్యాపారవేత్త రాఖీకపూర్ టాండన్ కూడా అదే కోవలోకి వస్తారు. కోట్లాది రూపాయల టర్నోవర్ కలిగిన తండ్రి వారసత్వ బ్యాంకింగ్ వ్యాపారాన్ని కాదని సొంత వ్యాపారాల్ని మొదలు పెట్టింది. గతంలో ఎవరికీ తెలియని ఆమె తొలిసారి ఐపీఎల్ చెన్నై సూపర్ కింగ్స్, ముంబై ఇండియన్స్ మధ్య జరిగిన మ్యాచ్‌లో సందడి చేసి అందరి దృష్టినీ ఆకర్షించారు.

వ్యక్తిగతం, కుటుంబం

విజయవంతమైన వ్యాపార కుటుంబ నేపథ్యం నుంచి వచ్చిన రాఖీకపూర్‌కు ఇద్దరు సోదరీమణులు ఉన్నారు. భారతీయ నాల్గవ అతిపెద్ద ప్రైవేటు బ్యాంకు ఐన యస్ బ్యాంక్ వ్యవస్థాపకుడు సీఈవో అయిన రాణాకపూర్, బిందూకపూర్‌ల ముద్దుల కూతురు రాఖీ. ఆమె వయస్సు 31 సంవత్సరాలు. ఎత్తు 5 అడుగుల 7 అంగుళాలు. రాఖీ కపూర్ 3 జూలై 1986న ఢిల్లీలో జన్మించారు. వార్టన్ స్కూల్ ఆఫ్ పెన్సిల్వేనియా విశ్వవిద్యాలయం నుంచి ఎంబీఏ చేశారు. ఫైనాన్స్ మేనేజ్‌మెంట్‌లో ఎంబీఏ చేయడానికి ఆ యూనివర్సిటీలో అవకాశం వచ్చిన కొద్దిమందిలో ఆమె ఒకరు. రాణాకపూర్ తర్వాత యస్ బ్యాంక్‌కు కాబోయే వారసురాలు రాఖీకపూరే అంటారు. ఆమె ఆయన రెండవ కూతురు. ఆమెకు ఒక అక్క, చెల్లి ఉన్నారు. రాఖీ తన సోదరీమణులైన రాధా, రోషిణీలతో చాలా సన్నిహిత బంధాన్ని కలిగి ఉంది. ఆమె అక్క అయిన రాధా 'ది డోల్ట్ క్రియేషన్స్' పేరుతో సొంత వ్యాపారాన్ని ప్రారంభించారు. ఆ తర్వాత 'ప్రెస్టన్' అనే సంస్థను కొనుగోలు చేశారు. ఇది ప్రధానంగా భారతదేశంలో డ్రైక్లీనింగ్ వ్యాపారం చేసే సంస్థ. రాఖీ స్క్వాష్, బాస్కెట్‌బాల్ ఆడడానికి ఎక్కువ ఆసక్తి చూపుతారు. క్రీడలు క్రమశిక్షణ, టీంవర్క్‌ను పెంపొందిస్తాయని ఆమె నమ్ముతారు. అంతేకాదు ఇండియన్ ఫుడ్ అంటే రాఖీకి చాలా ఇష్టం.

తండ్రే స్ఫూర్తి

పెరుగుతున్న సమయంలో రాఖీ ప్రతి రోజూ డిన్నర్ టేబుల్ దగ్గర బిజినెస్, ఫైనాన్స్ గురించి చర్చించేది. తండ్రి ఆఫీసులో ఆయనతో ఎక్కువ సమయం గడిపేది. 'ఆయన మా కోసం ఇంట్లోనే ఒక విద్యాకేంద్రాన్ని ఏర్పాటు చేశారు. పత్రికల్లో వచ్చే ఆసక్తికరమైన ఆర్టికల్స్ పిన్ చేసేవారు. స్ఫూర్తినిచ్చే ఎన్నో బుక్స్ మేం చదువడానికి తీసుకొచ్చేవారు' అని తన తండ్రి గురించి గుర్తు చేసుకుంటారామె.

ప్రభావశీలురాలు

చిన్నవయస్సులోనే తండ్రి బ్యాంకింగ్ రంగంలో కాలుమోపి అటు తర్వాత తనకంటూ ప్రత్యేకత ఉండాలనే సంకల్పంతో సొంత వ్యాపారాలు ప్రారంభిచారు రాఖీ. అనుకున్నట్లే వాటిలోనూ విజయం సాధించి ప్రత్యేకతను చాటుకున్నది. ఆమె సాధించిన విజయాల్ని గుర్తించిన 'ఇండియా టుడే' పత్రిక భారతదేశంలోని అత్యంత ప్రభావశీలురైన 25 మంది మహిళల్లో రాఖీకపూర్ ఒకరని ప్రకటించింది.

వివాహం, భర్త

వ్యాపారం బ్యాక్‌గ్రౌండ్ నేపథ్యంలో వచ్చే కుటుంబాల్లో ప్రేమ వ్యవహారాలు కార్పెట్ కిందనే నలిగిపోతాయి. ఒక ప్రముఖ వ్యాపారి కుమార్తె డేటింగ్ అంటే అంత సులభం కాదు. రాఖీ కూడా తన ప్రేమ, పెళ్లి వ్యవహారాన్ని 2015 వరకు ప్రపంచం నుంచి దాచి పెట్టింది. అందుకే ఆమె ప్రేమ సంబంధాల గురించి ఎవరికీ తెలియకుండా చాలా సహజంగా ఉండేది. ఏదేమైనా తన 26 సంవత్సరాల వయస్సులో తనకు ఇష్టమైన వాడిని మనువాడింది. అలా ఆ కుటుంబంలో ఒక విభిన్నమైన ప్రేమకథ ప్రారంభమైందనుకోవచ్చు. రాఖీకపూర్ భర్త పేరు అలెక్ష్ టాండన్. వారి వివాహం మార్చి 31, 2012న దుబాయ్‌లో జరిగింది. అలెక్ష్ దుబాయ్‌లో ప్రముఖ వ్యాపారవేత్త. వారి పెళ్లికి అంబానీలు, మిట్టల్స్‌లతో పాటు టెన్నిస్ ప్రముఖ ఆటగాడు బోరిస్ బెకర్ కూడా హాజరయ్యారు. వారిద్దరూ తమ వ్యాపారాల్లో బిజీగానే ఉన్నారు.

ఇల్లు, నికర ఆదాయం

ఇప్పటికీ రాఖీని 'ఐపీఎల్ ఫైనల్స్‌ను దొంగిలించిన అందమైన అమ్మాయి' అని అభిమానులు గుర్తు పెట్టుకున్నారు. ఆ తర్వాతే ఆమె ఒక వ్యాపారి కూతురని, స్వతహాగా వ్యాపారస్థురాలని ప్రపంచం గుర్తించింది. ప్రస్తుతం రాఖీ న్యూఢిల్లీలో నివసిస్తున్నారు. ఆమె తండ్రి మాత్రం ముంబైలోని సముద్రమట్టానికి చేరువలో 'సముద్ర భవన్'లో 27వ అంతస్తులో ఉంటున్నారు. రాఖీకపూర్ వ్యాపార నికర ఆదాయం రూ. 5315.3 కోట్ల కంటే ఎక్కువే అని అంచనా. ఆమె తదుపరి ప్రాజెక్ట్ బ్యాంక్ కోసం 2.0 వెర్షన్ పునఃసృష్టించే వ్యూహంలో ఉందట. ఆమె ఢిల్లీలో ఉన్నప్పటికీ తన అక్క, ఇతర కుటుంబసభ్యులతో ఎప్పుడు కూడా టచ్‌లో ఉంటారు. సెలవు దినాల్లో సంవత్సరానికి ఒకసారైనా, లేదా ఆదివారాల్లో అందరూ కలసి మధ్యాహ్న భోజనానికి కలుస్తుంటారు.

బిజినెస్, కెరీర్, కంపెనీ

రాఖీకపూర్ తొలుత అమెరికాలో బ్యాంకుల్లో పెట్టుబడులు పెట్టే ఉద్యోగం చేశారు. ఆమె జేపీ మోర్గాన్, గోల్డ్‌మాన్ సాచ్స్ అనే రెండు బ్యాంకులతో పెట్టుబడి ఒప్పందాలు కలిగి ఉంది. అయితే, ఆమె ఆకస్మికంగా తన కెరీర్‌ను మార్చుకొని తన సొంత సంస్థను ప్రారంభించే ఉద్దేశంతో ఇండియాకు తిరిగి వచ్చింది. రాస్ క్యాపిటల్ (ఇండియా) లిమిటెడ్‌ను స్థాపించి దానికి ఎమ్‌డీ, సీఈఓగా వ్యవరిస్తున్నారు. ఈ కంపెనీ ఆర్థికపరమైన సేవలందజేస్తుంది. ఈ మాతృసంస్థ మరో రెండు వ్యాపారాలను కూడా కలిగి ఉంది. వాటిలో ఒకటి రాస్ హౌజింగ్ ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్. ఇది రిటైల్ కస్టమర్లకు దీర్ఘకాలిక తనఖా (కుదువ)లో ఫైనాన్స్ అందిస్తుంది. ఇక రెండవది రూరల్ అగ్రి వెంచర్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్. ఇది పరిశ్రమల్లోని ప్రాజెక్టులకు మద్దతునిచ్చి పొదుపు సౌకర్యాన్ని కల్పిస్తుంది.



ఐపీఎల్‌లో మెరిసినవేళ..

2015లో జరిగిన ఐపీఎల్-8 ముగింపు బహుమతి పంపిణీ కార్యక్రమాల్లో పాల్గొని తొలిసారి ఆమె జాతీయ స్థాయిలో గుర్తింపు పొందారు. అవార్డుల వేడుకలో మిలియన్ల మందికి ఆరాధ్యురాలైంది రాఖీ. అలాగే నిమిషాల్లోనే సోషల్ నెట్‌వర్కింగ్ సైట్లలో ఆమె గురించి శోధించడం ప్రారంభించారు. ట్విట్టర్‌లో అత్య ధికంగా శోధింపబడిన వారిలో రాఖీ రెండవ స్థానంలో ఉన్నారు. ఆ తర్వాత తన తండ్రి రాణాతో కలిసి ఆమె అనేక వ్యాపార సదస్సులు, మీడియా సమావేశాలకు హాజరయ్యేవారు. ఐపీఎల్‌కు ప్రధాన స్పాన్సర్లలో యస్ బ్యాంక్ ఒకటి. ఆ బ్యాంక్ వ్యవస్థాపకుడు, ఆమె తండ్రి రాణా కపూర్ పక్షాన ప్రతినిధిగా ఐపీఎల్‌లో పాల్గొన్నారు. ఆ హోదాలోనే ప్రదానోత్సవానికి హాజరై విజేతలకు బహుమతులను అందించారు.

మొక్క మన హక్కు!



మొక్క మానవ జీవిత మనుగడకు దోహదం చేస్తుందంటున్నారు మైసూర్‌కు చెందిన బాలికలు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని వాళ్లు సూచిస్తూ నలుగురికీ ఆదర్శంగా నిలుస్తున్నారు. పాఠశాలలు.. కాలేజీలు.. కార్యాలయాల్లో తప్పనిసరిగా మొక్కలు నాటాల్సిన బాధ్యత ప్రతి ఒక్క పౌరుడిదీ అని పిలుపునిస్తున్నారు.

హరిత కాంక్షతో ఈ చైతన్య కార్యక్రమాన్ని చేపట్టారు మైసూర్‌లోని శ్రీవాణి విలాస్ బాలికల విద్యాలయ విద్యార్థులు. మొక్కల పరిరక్షణను బాధ్యతగా తీసుకోవాలని ప్రమోదాదేవీ అనే ఓ మహిళను చూసి నేర్చుకున్నారు. ప్రమోదాదేవీ మైసూర్ రాజవంశానికి చెందిన మహిళ. ఆమె తన చేతులమీదుగా ఎన్నో మొక్కలకు ప్రాణం పోసింది. ఎందరికో స్ఫూర్తినిచ్చింది. ఆమెను ఆదర్శంగా తీసుకున్న శ్రీవాణి విలాస్ విద్యార్థినులు ఓ నర్సరీని ఏర్పాటు చేశారు. వీటిలో చాలావరకు పూల మొక్కలు కూడా ఉన్నాయి. వీటిని మైసూర్ సిటీ రోడ్ల వెంట పెంచి రోడ్లను పుష్పమయం చేసేందుకు వాళ్లు ప్రయత్నిస్తున్నారు. త్వరలో రెండు వేల పూల మొక్కల్ని నాటేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. ఈ సీజన్‌లో దాదాపు 500 పూల మొక్కలు నాటారు. 'మొక్కలు నాటడం మన హక్కు. అరుదైన పూల మొక్కలను నేటి తరానికి పరిచయం చేయడం, వాటిని పరిరక్షించడం మా బాధ్యత. మొక్కలు నాటితేనే మనిషి మనుగడకు అవకాశం ఉంటుంది. పాఠశాల స్థాయిలోనే మాకు ఈ విషయంపై అవగాహన ఏర్పడడం.. ప్రతిష్టాత్మకంగా తీసుకొని మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టడం చాలా ఆనందంగా ఉంది. పాఠశాల యాజమాన్యంతో పాటు అధికారులు.. ప్రజా ప్రతినిధులు మా పనితీరును మెచ్చుకుంటున్నారు. మేం మరింత ఉత్సాహంతో పనిచేస్తున్నాం' అంటున్నారు శ్రీవాణి విలాస్ విద్యార్థినులు.

అంజీరాతో ఆరోగ్యం మెండు!



ఎప్పుడూ ఆకలితో ఉంటూ, కనిపించిన ప్రతి ఆహారాన్ని తినేస్తూ కొందరు ఊబకాయన్ని కొని తెచ్చుకుంటున్నారు. అది తగ్గించుకోవడానికి అంజీరా బాగా పనిచేస్తుంది.

అంజీరాలో ఔషధ గుణాలు ఎక్కువ. ఇందులో ఉండే పీచుపదార్థం, క్యాల్షియం, ఐరన్ ఆకలిని తగ్గించడం ద్వారా క్రమంగా బరువు తగ్గుతారు. ఈ పండ్లలో మాంసకృత్తులు, పిండి పదార్థాలు, కొవ్వు తక్కువగానూ, నీరు ఎక్కువగానూ ఉంటాయి. ఇది కూడా బరువు నియంత్రణలో ఉండడానికి తోడ్పడుతుంది. రక్తపోటు నియంత్రణలో ఉండడానికి కూడా అంజీరా బాగా పనిచేస్తుంది. ఇందులో ఉండే క్యాల్షియం, మెగ్నీషియం, పొటాషియం వంటి లక్షణాలు సమృద్ధిగా ఉంటాయి. అంజీర పండ్లలోని క్యారటోన్లు, ల్యూటిన్, టాన్నిస్, యాంటీ ఆక్సిడెంట్లు, ఖనిజాలు, విటమిన్లు, కరిగిపోయే పీచు పదార్థాలు మన ఆరోగ్యం స్థిరంగా ఉండేలా చేస్తాయి. ఈ పండ్లలో ఏ, ఈ, కే విటమిన్లు ఉంటాయి. కేలరీలు కూడా తగు మోతాదులో ఉంటాయి. ఒమెగా ఫ్యాటీ ఆమ్లాలు ఎక్కువగా ఉండడం వల్ల హృద్రోగ నివారణకు తోడ్పడుతాయి. ఎండు అంజీరాలో ఇవి మరింత ఎక్కువ ఉండడం వల్ల గుండె జబ్బుల నుంచి బయట పడవచ్చునని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు.

కండరాల్లో ఈనొప్పి ఎందుకు?

నా వయసు 39 సంవత్సరాలు. ఇంజినీరింగ్ కాలేజీలో లెక్చరర్ ఉద్యోగం చేస్తున్నాను. కాలేజీ బస్‌లో రోజూ ఒక మూడు గంటల పాటు ప్రయాణిస్తుంటాను. ఈ మధ్య నాలుగైదు వారాలుగా హఠాత్తుగా కాలి పిక్క కండరాలు బిగుసుకుపోయి విపరీతమైన నొప్పి వస్తున్నది. ఒక్కోసారి క్లాస్‌లో ఉండగా కూడా ఇలా జరుగుతున్నది. నొప్పి తట్టుకోలేక కళ్లలో నీళ్లు తిరుగుతున్నాయి. ఇలా ఎందుకు జరుగుతున్నది? దీనికి పరిష్కారం ఏమిటో తెలియజేయగలరు.

- సరళ కుమారి, హైదరాబాద్



అడుగండి చెబుతా

రోజూ గంటల తరబడి కూర్చోవడం, తర్వాత క్లాస్ రూంలో ఎక్కువ సమయం పాటు నిలబడడం వల్ల మీ కాలి కండరాల మీద ఒత్తిడి ఎక్కువగా ఉంటున్నది. నిద్ర, విశ్రాంతితో కండరాలు రిలాక్స్ అయ్యి తిరిగి శక్తి సంతరించుకుంటాయి. అయితే నిద్ర సరిపడినంత లేకపోయినా, తీసుకునే ఆహారంలో పోషకాలు తగినంతగా ఉండకపోయినా ఈ కోలుకునే ప్రక్రియ జరుగదు. అలాంటి సందర్భాల్లో కండరాలు బిగుసుకు పోవడం జరుగుతుంది. అందువల్ల విపరీతమైన నొప్పి వస్తుంది. దీన్ని ఇలాగే నిర్లక్ష్యం చేస్తే రోజు వారి పనులకు విఘాతం కలిగించేంత తీవ్రంగా మారుతుంది. ఇలా నిద్రలో కూడా జరుగవచ్చు. నొప్పికి హఠాత్తుగా నిద్ర నుంచి మెలకువ వచ్చి నిద్రకి కూడా ఆటంకం కలుగుతుంది. మీ లక్షణాలను బట్టి మీ కాళ్లలో మజిల్ క్రాంప్స్ సమస్యతో బాధపడుతున్నారని అనిపిస్తున్నది. దీన్ని చెర్లీ హార్స్ అంటారు.

ఈ సమస్య ఉన్నపుడు ఎప్పుడైనా మజిల్ క్రాంప్స్ రావచ్చు. నిద్రలో, పనిలో, విశ్రాంతిలో ఏ సమయంలోనైనా రావచ్చు. ఇలా బిగుసుకుపోయిన కండరాలు మిగతా కండరాలతో పోలిస్తే గట్టిగా అనిపిస్తాయి. ఒక్కోసారి మెలితిరిగినట్టు కూడా అనిపిస్తాయి. విపరీతమైన అలసట, డీహైడ్రేషన్, కొన్నిరకాల మందుల వాడకం వంటి అనేక కారణాలతో ఈ సమస్య రావచ్చు. కండరాలు విపరీతంగా అలసిపోవడం, వ్యాయామానికి సరిగ్గా స్ట్రెచ్ కాకపోవడం, రక్తంలో ఎలక్ట్రోలైట్స్ పరిమాణం తగ్గిపోవడం, కొలెస్ట్రాల్ ఎక్కువగా ఉండడం వంటి అనేక కారణాలతో ఈ సమస్య రావచ్చు.

ఈ సమస్య నుంచి బయట పడాలంటే పోషకాహారం తీసుకోవడం, తగినంత వ్యాయామం చెయ్యడం, తగినంత విశ్రాంతి తీసుకోవడం వంటి జాగ్రత్తలు తీసుకుంటే క్రమంగా ఈ సమస్య నుంచి బయటపడవచ్చు. కండరాలు బిగుసుకున్నపుడు బిగుసుకున్న భాగంలో చిన్నగా చేతితో మర్దన చెయ్యడం వల్ల ఉపశమనం లభిస్తుంది. ఎలక్ట్రోలైట్స్ కలిపిన నీళ్లు తాగడం, పండ్ల రసాలు తీసుకోవడం వంటి జాగ్రత్తల్ని పాటించినప్పటికీ సమస్య తగ్గకపోతే డాక్టర్‌ను సంప్రదించడం మంచిది. ఒక్కోసారి ఇది కాళ్లలో రక్తప్రసరణ తగ్గుతుందనడానికి సూచన కావచ్చు. కానీ ప్రతిసారీ అదే కారణం కాకపోవచ్చు. కాబట్టి పెద్దగా బాధపడాల్సిన పనిలేదు. చిన్నచిన్న జాగ్రత్తలతో మీ సమస్య నుంచి బయట పడవచ్చు.



డాక్టర్ దేవేందర్‌సింగ్
సీనియర్ వాస్కులార్ అండ్ ఎండో వాస్కులార్ సర్జన్
యశోద హాస్పిటల్స్
హైదరాబాద్

కథలు చెబుతుంది!

పిల్లలకు ఒకప్పుడు.. అమ్మమ్మ, నాన్నమ్మ, తాతయ్యలు రాత్రిపూట కూర్చోబెట్టుకొని కథలు చెప్పేవారు. కానీ ఇప్పుడు న్యూక్లియర్ ఫ్యామిలీల పుణ్యమాని ఆ కథలు కనుమరుగయ్యాయి. పిల్లలేమో ఫోన్లతో బిజీ అయిపోయారు. ఈ గ్యాప్ పోవడానికి, కమ్మని కథలు వినిపించడానికి సరళ మినీ ఒక వినూత్న ఆలోచన చేసింది.



'అనగనగా ఒకరోజు ఉండేవాడు..' అంటూ చెప్పే కథలు ఇప్పుడు ఇండ్లల్లో వినిపించడం లేదు. కారణం.. పెద్దవాళ్లు ఇంట్లో లేకపోవడమే! తల్లిదండ్రులేమో ఉద్యోగాలతో బిజీ అయిపోయారు. ఇక పిల్లలకు కథలు చెప్పే తీరిక వాళ్లకెక్కడిది? అందుకే స్మార్ట్‌ఫోన్లకు అడిక్ట్ చేసేస్తారు. పిల్లలు మెల్లగా వాటికి బానిసలైపోతారు. అలా కాకుండా అదే స్మార్ట్‌ఫోన్లలో కమ్మని కథలు వినిపించడానికి వచ్చేసింది సరళ మినీ. బెంగళూరుకి చెందిన ఈ రిటైర్డ్ టీచర్ చిన్నప్పుడు మహాభారత, రామాయణ కథలు బాగా చదివేదట. పైగా ఆమె తాతయ్య, అమ్మమ్మ, నాన్నమ్మలు ఆమెకు బోలెడు నీతి కథలు చెప్పేవారట. రోజూ ఆ కథల కోసం ఎంతగానో పరితపించేదట సరళ. కానీ తన మనమలు, మనుమరాండ్లకు ఆ భాగ్యం లేకుండా పోతుందే అని ఆలోచించింది. ఎందుకంటే వాళ్లు విదేశాల్లో ఉన్నారు. అక్కడికి తాను వెళ్లలేదు. కాబట్టి తన గొంతును వాళ్లకు చేర్చొచ్చు అనుకుంది. వాట్సప్‌లో చిన్నచిన్న కథలను రికార్డు చేసి వాళ్లకు పంపించేది. అది నచ్చిన కూతురు, కోడలు వాటిని మిగతా వాళ్లకు షేర్ చేసేవాళ్లు. అలా మొదలైన ఈ కథల అమ్మమ్మ ఇప్పటికి ఆరువేల మంది పిల్లలు ఈమె కథల కోసం ఎదురుచూసేలా చేసింది. 'కహానీవాలా నాని' పేరుతో ఈమె కథలను వారానికొకటి చొప్పున వినిపిస్తున్నది. నాలుగు నెలల క్రితం మొదలైన ఈమె కథలకు విదేశాల్లో సైతం శ్రోతలున్నారు. ఎనిమిది నిమిషాలు ఉండే ఒక్కో కథ కోసం ఎంతో శ్రమిస్తుంది సరళ. దాని గురించి పూర్తి రీసెర్చ్ చేసి గానీ ఆ ఆడియోని అప్‌లోడ్ చేయదట. మొత్తానికి ఆమె వినూత్న ఆలోచన ఇప్పటి పిల్లలకు నీతి కథలు వినే భాగ్యం దక్కేలా చేసింది.



మాంసాహారం ఇలా తినండి!

అధిక శక్తి వస్తుందని మాంసాహారం అతిగా తీసుకుంటే ప్రమాదమే. ప్రొటీన్లు ఎక్కువైతే కిడ్నీలపై పనిభారం ఎక్కువవుతుంది. వాటి పనితీరు నెమ్మదించే అవకాశం ఉంటుంది. ఫలితంగా మూత్ర విసర్జన సమస్యలు తలెత్తుతాయి. ప్రొటీన్ల జీవక్రియలో చివరి ఉత్పన్నం అమోనియా. దీన్ని కిడ్నీలు యూరియాగా మార్చి శరీరం బయటకు విసర్జిస్తాయి. కిడ్నీల పనితీరు సక్రమంగా లేకుంటే అదనంగా చేరిన అమోనియా రక్తంలోకి చేరి, రక్తప్రసరణ ద్వారా మెదడుకు వెళ్లే అవకాశం ఉంటుంది. దీనివల్ల కోమాలోకి వెళ్తారు.

ధాన్యంతో కలిపి...

మాంసాహారం తీసుకున్నప్పుడు వరి, గోధుమ, జొన్న లాంటి ఏదైనా ధాన్యంతో తయారుచేసిన పదార్థాలతో కలిపి తీసుకోవాలి. ఎందుకంటే ధాన్యంలో ఫైబర్ ఉంటుంది. మాంసాహారంలో ఉండదు. ధాన్యంలోని ఫైబర్ మాంసాహారం సక్రమంగా జీర్ణం కావడానికి, వ్యర్థాలు బయటకు పోవడానికి సహాయపడుతుంది.



నూనె ఇలా రాయండి..!

నిగనిగలాడే కురులు అందానికే కాదు.. ఆరోగ్యానికి కూడా సూచికలే. ఇటీవలి కాలంలో జుట్టు రాలే సమస్య ఉన్నవాళ్లు ఎక్కువగా ఉంటున్నారు. దీనికి పోషకాల లోపం, ఇతర ఆరోగ్య సమస్యలు ఒక కారణమైతే, జుట్టుకు నూనె రాసే విధానం కూడా మరో కారణం అవుతున్నది. అదెలాగంటే..

కురులను కండిషనింగ్ చేయడంలో నూనె పాత్ర కీలకమే. రాత్రిపూట నూనె రాసుకుని మరుసటి రోజున తలస్నానం చేయడం ద్వారా వెంట్రుకలు ఆరోగ్యంగా పెరుగుతాయి. ఈ నూనె రాయడంలో కూడా కొంచె జాగ్రత్తపడాలి.

- **దురుసుగా రుద్దడం :** వెంట్రుకలు చాలా సున్నితమైనవి. అతిగా రుద్దడం వల్ల అవి తొందరగా తెగిపోయి, రాలిపోయే అవకాశం ఉంటుంది. అందువల్ల నూనె రాసేటప్పుడు వెంట్రుకలను తలపై చర్మాన్ని మృదువుగా వలయాకారంలో నిమిరుతున్నట్టుగా రుద్దాలి. ఇలా నూనెతో మర్దన చేయడం వల్ల వెంట్రుకలకు బలం చేకూరి బాగా పెరుగుతాయి.
- **తడిజుట్టుకు రాయొద్దు! :** స్నానం చేసిన వెంటనే వెంట్రుకల తడి ఆరకముందే నూనె రాయడం మంచిది కాదు. వెంట్రుకల మొదళ్లు చాలా సున్నితంగా ఉంటాయి. తడిగా ఉన్నప్పుడు కొంచెం ఒత్తిడికి కూడా రాలిపోయేంత సున్నితంగా తయారవుతాయి. అందువల్ల తడిజుట్టుకు నూనె రాస్తే త్వరగా రాలిపోతాయి. అందుకే పూర్తిగా తడి ఆరిన తరువాతే నూనె రాయాలి.
- **చివర్లకూ తప్పనిసరి :** నూనె రాయమంటే జుట్టు కుదుళ్లకే పట్టించడం మనకు అలవాటు. వెంట్రుకలకు రాసినప్పటికీ వాటి చివర్లను పెద్దగా పట్టించుకోం. కాని చివర్లకు సరైన పోషణ లేకపోతే అవి చిట్లిపోతాయి. తద్వారా వెంట్రుకల పెరుగుదల దెబ్బ తింటుంది. జుట్టు రాలిపోవడానికి ఇది కూడా కారణమవుతుంది. జుట్టు మొదళ్లలోనే కాదు, చివర్లకు కూడా నూనె రాయాలి.
- **సరైన నూనె ఎంపిక :** తలకు రాసుకునే నూనె అనగానే ఎవరికైనా కొబ్బరినూనె మాత్రమే గుర్తుకు వస్తుంది. నూనెల్లో చాలా రకాలున్నాయి. కొబ్బరి నూనె పోషణకు మంచిది. బాదం నూనె వెంట్రుకల పెరుగుదలకు దోహదపడుతుంది. శికాకాయ నూనెలు కూడా వివిధ రకాల జుట్టుకు సరైన పోషణ ఇస్తాయి. డాక్టర్ సలహాతో మీ జుట్టుకు సరిపడే నూనెను ఎంచుకోవడం మేలు.

గుండె చికిత్సలో కొత్త దారులు



పెరుగుతున్న వేగం జీవనశైలిలో విపరీతమైన మార్పులు తెస్తున్నది. ఆ మార్పులకు అంత వేగంగా స్పందించలేని శరీరం ఇబ్బంది పడుతోంది. ఫలితంగా జీవనశైలికి సంబంధించిన ఆరోగ్యసమస్యలు చాలా పెరిగిపోతున్నాయి. వైద్య ప్రపంచం కూడా అందుకు తగిన రీతిలో కొత్తకొత్త ఆవిష్కరణలతో సవాళ్లకు సిద్ధ పడుతున్నది. అందులో భాగంగానే ఇండియా, యూఎస్‌ఏ చెందిన కార్డియో వాస్కులర్ రీసెర్చ్ ఫౌండేషన్ అనుభవాలను ఇక్కడి డాక్టర్లకు ప్రజలకు అందించేందుకు ఫ్యాక్ట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇటీవల హైదరాబాద్‌లో సదస్సు జరిగింది. ఆ వివరాలు క్లుప్తంగా...

...✍ భవాని

ప్రపంచ వ్యాప్తంగా దీర్ఘకాలిక రోగుల సంఖ్య గణనీయంగా పెరిగిపోతున్నది. డయాబెటిస్, బీపీ వంటి ఆరోగ్య సమస్యలు ప్రాణాంతకమైన దుష్ప్రభావాలను కలిగిస్తున్నాయి. ఇవి పరోక్షంగా గుండె, గుండెకు సంబంధించిన రక్తనాళాల సంబంధిత రోగుల సంఖ్య పెరగడానికి ముఖ్యకారణంగా ఉన్నాయి. గుండె సంబంధిత రక్తనాళాలకు సంబంధించిన సమస్యలను కార్డియో వాస్కులర్ సమస్యలు అని అంటారు. అంటే గుండెకు రక్త ప్రసరణ జరిపే రక్తనాళాలలో అడ్డంకులు ఏర్పడడం. ఇలా అడ్డంకులు ఏర్పడినపుడు రక్తనాళం పూర్తిగా మూసుకు పోయిన సందర్భంలో గుండెపోటు వస్తుంది. ఈ సమస్యకు సరైన సమయంలో స్పందించి, చికిత్స అందించగలిగితే ప్రాణాపాయం నుంచి బయటపడేందుకు మెరుగైన అవకాశాలు ఇప్పుడు అందుబాటులో ఉన్నాయి. వీటిలో చాలా రకాల అధునాతన చికిత్సా విధానాలు మాత్రమే కాదు ఉపయోగించే పరికరాలు, కొత్త ప్రక్రియలు కూడా అందుబాటులోకి వచ్చాయి. వాటిని మన దేశ నిపుణులకు అందుబాటులోకి తెచ్చేందుకు ఈ రకమైన సదస్సులు ఎంతో ఉపయుక్తంగా ఉంటాయి.

మార్పు అవసరం

భారతదేశంలోని జీవన శైలి కష్టపడి పనిచేసే వారికి అనువుగా ఉండేది. కానీ ఇప్పుడు ఎవరూ పెద్దగా శారీరకంగా శ్రమ పడడం లేదు, అలాగని అందుకు అనుగుణంగా ఆహారంలో మార్పులు చేసుకోవడం లేదు. అందువల్ల ఇక్కడ గుండెజబ్బులు చాలా ఎక్కువ. పాశ్చాత్యదేశాల్లో 50 సంవత్సరాల వయసులో గుండెపోటు వస్తే అది చాలా తక్కువ వయసులో వచ్చినట్టుగా భావిస్తారు. యంగ్ కార్డియాక్ పేషెంట్లుగా గుర్తిస్తారు. కానీ ఇక్కడ చాలా త్వరగా 30, 35 సంవత్సరాల వయసులోనూ గుండెపోటు బారిన పడేవారి సంఖ్య పెరుగుతూనే ఉంది. ఇందుకు కారణాలేమైనా వీటిని నివారించేందుకు, ఎదుర్కొనేందుకు ఎప్పుడూ సిద్ధంగా ఉండాలి. అందుకు ఆధునిక చికిత్సా విధానాల గురించిన అవగాహన ఇక్కడి వారికి చాలా అవసరం. ఎప్పటికప్పుడు ప్రపంచవ్యాప్తంగా కొత్త చికిత్సావిధానాల్లో వస్తున్న పురోగతి ఎప్పటికప్పుడు మన దేశంలోనూ అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరం ఉంది. సమయానికి గుండెపోటును గుర్తించడం, వెంటనే హాస్పిటల్‌కు చేరుకోవడం, ప్రథమ చికిత్స వంటి విషయాలన్నింటి గురించి ప్రతిఒక్కరికీ అవగాహన ఉండాలి. ముందుగా ఇలాంటి పరిస్థితి ఎదురుకాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, జీవన శైలిలో చేసుకోవాల్సిన మార్పులను గురించి కూడా అందరు తెలుసుకొని ఉండాలి. ఈ జాగ్రత్తలన్నీ కూడా ఇప్పుడు మన వారికి తప్పనిసరిగా తెలిసి తీరాల్సిన విషయాలు.

డా. రాహుల్ పొట్లూరి
కార్డియాలజిస్ట్
ఆస్టన్ మెడికల్ స్కూల్
యూకె



మనదేశంలో మొదటిసారి

అమెరికాకు చెందిన కార్డియోవాస్కులర్ రీసెర్చ్ ఫౌండేషన్ (సీఆర్ఎఫ్)కు చెందిన నిపుణులు మొదటిసారిగా వారి ప్రీమియర్ ఇంటర్‌వెన్షనల్ అనుభవాలను ఈ వేదిక ద్వారా మన నిపుణులతో పంచుకోవడం జరిగింది. ఆగష్టు 17 నుంచి 20 వరకు హైదరాబాద్‌లోని హెచ్‌ఐసీసీలో ఈ సదస్సు జరిగింది. ఈ సదస్సులో పాల్గొనేందుకు 1500 మందికి పైగా ప్రతినిధులతో పాటు 200 మందికి పైగా దేశవిదేశాలకు చెందిన ప్రొఫెసర్లు హాజరయినట్టు **ఫ్యాక్ట్స్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ శ్రీనివాస్ కుమార్** చెప్పారు. స్థానికంగా మాత్రమే కాదు జాతీయంగా, అంతర్జాతీయంగా చాలా ప్రాంతాల నుంచి వచ్చిన నిపుణులు పాల్గొని చాలా రకాల క్లిష్టతరమైన కొత్త టెక్నిక్‌లను ప్రదర్శించారని ఆయన అన్నారు. ఇందుకు నగరంలోని వివిధ హాస్పిటళ్లలో జరుగుతున్న సర్జరీలను అందుబాటులో ఉన్న అత్యంత అధునికమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ఈ సదస్సులో ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించే అవకాశం కల్పించారు.

అత్యాధునిక చికిత్సలెన్నో...

ఈ మధ్య కాలంలో గుండె సంబంధ సమస్యలు చాలా పెరిగిపోయాయి. గుండె రక్తనాళం పూర్తిస్థాయిలో మూసుకుపోయి గుండెపోటు బారిన పడుతున్న వారి సంఖ్య కూడా చాలా ఎక్కువగా ఉంటున్నది. ఇలా పూర్తిస్థాయిలో రక్తనాళంలో అడ్డంకు ఏర్పడినపుడు అందించే చికిత్సా విధానాన్ని సీటీఓ పీసీఐ(క్రానిక్ టోటల్ అక్లూషన్ పెర్క్యుటేనియస్ ఇన్వేసివ్ టెక్నిక్) అంటారు. ఈ రకమైన చికిత్స ఇప్పుడు పాశ్చాత్యా దేశాల్లో ఎక్కువగా జరుగుతున్నప్పటికీ మన దేశంలో ఇప్పుడిప్పుడే ఈ విధానంలో చికిత్స అందిస్తున్నారు. ఇలా పూర్తిస్థాయిలో రక్తనాళం మూసుకుపోవడానికి మూడు నెలల కంటే ఎక్కువ సమయం పడుతుంది. ఇలాంటి సందర్భంలో మామూలుగా స్టెంట్ వెయ్యడానికి ఉపయోగించే టెక్నిక్‌ను వాడడం కష్టం. అలాంటి సందర్భాల్లో ఈ విధానాన్ని ఉపయోగించి చికిత్స అందించడానికి వీలు పడుతుంది.

ఒక్కోసారి రక్తనాళంలో ఏర్పడిన అడ్డంకి చాలా కాలంగా ఉండిపోవడం వల్ల చాలా గట్టిపడిపోయి ఉంటుంది. అందువల్ల దాన్ని తొలగించడం లేదా తిరిగి మార్గం ఏర్పరచడం సాధ్యం కాదు. అలాంటి సందర్భాల్లో రక్తనాళంలో బ్లాకేజి ఉన్న భాగానికి వదిలి కుడి పక్కనుంచి బయటకు వచ్చి అక్కడ నుంచి కొత్తగా మరొక రక్తప్రసరణా మార్గాన్ని ఏర్పాటు చేసి స్టెంట్ అమరుస్తారు. ఈ రకమైన చికిత్స అందించగలిగే నిపుణులు పాశ్చాత్య దేశాల్లోనే అరుదుగా అందుబాటులో ఉన్నారు. మనదేశంలో కేవలం ఒకరిద్దరు మాత్రమే ఇందులో నైపుణ్యం కలిగి ఉన్నట్టు అంచనా. కేవలం కొన్ని హాస్పిటళ్లలో మాత్రమే ఈ రకమైన పరిజ్ఞానం అందుబాటులో ఉంది. ఇందుకు ఏర్పడిన బ్లాకేజి ఎంత సంక్లిష్టంగా ఉన్నదాన్ని బట్టి 2 నుంచి 5 గంటల సమయం పడుతుంది.

పరిశుభ్రతే శ్రీరామ రక్ష!



నల్లని మబ్బులు, చల్లని గాలి, తుంపర వాన, హరివిల్లు, నేలంతా పరుచుకున్న పచ్చిక, నిండిన చెలిమలు, చెరువులు, పండుగల వాతావరణంతో పాటు వర్షాకాలం చిన్నచిన్న అజాగ్రత్తల వల్ల అనారోగ్యాన్ని కూడా తెస్తుంది. ఈ కాలంలో ఆనందాలతో పాటు ఇన్ఫెక్షన్లు కూడా ఎక్కువే. జలుబు, ఫ్లూ వంటి చిన్నచిన్న ఇన్ఫెక్షన్లే కాదు, అమీబియాసిస్ వంటి పెద్ద పెద్ద సమస్యలకు కారణమయ్యే ఇన్ఫెక్షన్లు కూడా ఈ కాలంలోనే వ్యాపిస్తుంటాయి. వీటిని ఎదుర్కోవడానికి కావల్సింది అవగాహన. సరైన అవగాహనతో ఎలాంటి అనారోగ్యాన్నైనా నివారించడానికి అవకాశం ఉంటుంది.

వానా కాలం పండుగలతో మొదలవుతుంది. శ్రావణ మాసం ఎక్కడ చూసినా ఆధ్యాత్మిక శోభ కనిపిస్తుంటుంది. పరిశుభ్రమైన పరిసరాలు దైవ నివాసాలనే నానుడి ఉండనే ఉంది. ఇది వర్షాకాలంలో మరింత అవసరం ఎందుకంటే వర్షాకాలంలో తేమ వాతావరణం ఉండడం వల్ల సూక్ష్మజీవులు ఎక్కువగా వ్యాప్తించేందేందుకు అనుకూలంగా ఉంటుంది. అందువల్ల ఆహారం, నీరు త్వరగా కలుషితమయ్యేందుకు ఆస్కారాలు కూడా ఎక్కువ. తరచుగా ప్రయాణాలు చేసే వారిలో అందుకే వర్షాకాలంలో తరచుగా జీర్ణ సంబంధ ఇన్ఫెక్షన్లు కలుగుతుంటాయి. కడుపులో ఉబ్బరంగా ఉండడం, విరేచనాలు, వాంతుల వంటి సమస్యలు కనిపిస్తుంటాయి. ఒక్కోసారి బంక విరేచనాలు, నెత్తుటి విరేచనాలు కూడా కనిపించవచ్చు. ఇలా జరిగితే దాన్ని అమీబియాసిస్‌గా భావించాలి.

అమీబియాసిస్ అంటే...

అమీబియాసిస్ అనేది ప్రోటోజోవా జాతికి చెందిన సూక్ష్మజీవి వల్ల కలిగే ఇన్ఫెక్షన్. ఈ వ్యాధి కలిగించే సూక్ష్మ జీవి పేరు ఎంటమిబా హిస్టాలిటికా. ఈ జీవి లేదా దాని గుడ్లు కలిసిన ఆహార పదార్థాలు లేదా నీరు తీసుకున్నపుడు ఈ జీవి శరీరంలో చేరి ఇన్ఫెక్షన్ కలిగిస్తుంది. ఒక్కోసారి చేతుల మురికి ద్వారా కూడా కడుపులోకి చేరవచ్చు. నిజానికి ఆరుబయట మలమూత్ర విసర్జన ఈ వ్యాధి వ్యాప్తి చెందడానికి ప్రధాన కారణంగా చెప్పవచ్చు. పల్లెల్లో ఇంకా బహిరంగా విసర్జన కొనసాగుతుండడం వల్ల ఈ వ్యాధి వ్యాప్తి సాధారణమైపోయింది. నోటి ద్వారా ఇది జీర్ణవ్యవస్థలో చేరే ఈ సూక్ష్మజీవి పెద్దపేగులోకి చేరి అక్కడ సమస్యలు కలిగిస్తుంది. జీర్ణవ్యవస్థలోకి ప్రవేశించే ఈ జీవులు పేగులలో పలి పొరలను దెబ్బతీస్తాయి. ఇలా పేగులు దెబ్బతినడాన్ని అమీబిక్ కొలైటిస్ అంటారు. ఒక్కోసారి ఇవి రక్త ప్రవాహంలోకి చేరి కొన్ని సందర్భాల్లో కాలేయంలో కూడా చేరే ప్రమాదం ఉంటుంది. ఇలా లివర్‌ను చేరినపుడు అమీబిక్ లివర్ యాబ్సెసిస్ అంటారు. ఇలా లివర్‌లో సమస్య ఉన్నపుడు ఒక్కోసారి నీళ్ల విరేచనాల వంటి లక్షణాలు కనిపించకపోవచ్చు.

లక్షణాలు

- నీళ్ల విరేచనాలు అమీబియాసిస్‌లో ఒక లక్షణమే కానీ, నీళ్ల విరేచనాలు అయిన ప్రతిసారి అమీబియాసిస్ వల్ల కాకపోవచ్చు, సాధారణంగా ప్రయాణాల్లో వచ్చే ట్రావెలర్స్ డయేరియాను అమీబియాసిస్‌గా పొరపాటు పడే అవకాశం కూడా ఉంటుంది.
- ఈ వ్యాధి కలిగించే సూక్ష్మజీవి కడుపులో చేరినా కూడా చాలా మందిలో లక్షణాలు పెద్దగా కనిపించకపోవచ్చు.
- తీవ్రమైన కడుపునొప్పి,
- వికారం, ఒక్కోసారి వాంతులు కూడా
- జ్వరం, నీరసం

నిర్ధారణ

- అమీబియాసిస్‌ను నిర్ధారించడానికి మల పరీక్ష నిర్వహించాల్సి ఉంటుంది.

జాగ్రత్తలు

- బహిరంగా విసర్జనను పూర్తిగా బహిష్కరించాలి. ఎందుకంటే ఈ ఇన్ఫెక్షన్ గుడ్ల దశనుంచి కూడా వ్యాప్తి చెందుతుంది.
- వ్యక్తిగత శుభ్రత పాటించాలి. చేతులు తరచుగా శుభ్రంగా కడుక్కోవాలి. ముఖ్యంగా భోజనానికి ముందు, మలమూత్ర విసర్జన తర్వాత తప్పనిసరిగా చేతులు సబ్బు ఉపయోగించి శుభ్రంగా కడుక్కోవాలి.
- ప్రయాణాల్లో ఆహారం, నీటి విషయంలో జాగ్రత్తలు తీసుకోవడం మరవకూడదు.
- వండని పదార్థాలు కలుషితమైనపుడు అవి సరిగ్గా ఉడికించకపోవడం వల్ల కూడా అమీబియాసిస్ వ్యాప్తి చెందేందుకు అస్కారం ఉంటుంది.

డాక్టర్ నిఖిల్ మాథూర్
కన్సల్టెంట్ అండ్ హెడ్
ఎమర్జెన్సీ మెడిసిన్
కేర్ హాస్పిటల్స్
హైదరాబాద్



ఎదిగే పిల్లలకు...



పిల్లల శారీరక మానసిక పెరుగుదలకు అవసరమైన అన్నీ ఆహార పదార్థాలు వారికి అందేలా జాగ్రత్త పడాలి. ఈ పదార్థాలలో యాంటి ఆక్సిడెంట్లు, విటమిన్లు, ఖనిజాలు, ఫైబర్, కొవ్వులు, కార్బోహైడ్రేట్లు సరిపడా ఉండేలా చూసుకోవడం అవసరం.

- **గుడ్డు –** గుడ్డులో ప్రొటీన్ పుష్కలంగా ఉంటుంది. వీటిలో ఉండే కాల్షియం శరీరం గ్రహించడానికి సహాయపడే విటమిన్ డి కూడా సరిపడినంతా ఉంటుంది. ఉదయం అల్పాహారంలో ఒక గ్లాసు పాలతో పాటు ఒక గుడ్డును కూడా ఇవ్వడం వల్ల కడుపు నిండుగా ఉండడమే కాదు ఎక్కువ సమయం పాటు శక్తిమంతంగా ఉన్న అనుభూతి కలుగుతుంది
- **ఓట్ మీల్ –** కొన్ని పరిశోధనల ప్రకారం ఓట్ మీల్ తిన్న పిల్లలు స్కూల్లో మంచి ఏకాగ్రతను ప్రదర్శిస్తున్నారని తేలింది. ఓట్స్ తినే పిల్లలు అన్ని అంశాల్లోనూ ప్రతిభ కనబరుస్తున్నారట. ఫైబర్ ఎక్కువగా ఉండే తృణ ధాన్యాలు అంటే ఓట్సే. ఇవి చాలా తేలికగా మాత్రమే కాదు నిదానంగా కూడా జీర్ణం అవుతాయి. అందువల్ల పిల్లల్లో ఎక్కువ సమయం పాటు శక్తి స్థిరంగా ఉండటానికి ఇవి దోహదం చేస్తాయి.
- **పండ్లు–** ఏ పండు తిన్నా పిల్లల ఆరోగ్యానికి మేలు చేస్తాయి. పిల్లలు పండ్లు తినడం వల్ల వారి ఆరోగ్యానికి అవసరమయ్యే విటమిన్లు, మినరల్స్ మెండుగా అందుతాయి. పండ్లలో ఉండే ఫైబర్ పిల్లలు చురుకుగా ఉండేందుకు దోహదపడతాయి. కాబట్టి ప్రతి భోజనంలోనూ పిల్లల ఆహారంలో ఏదో ఒక పండు ఉండేలా జాగ్రత్త పడాలి.
- **గింజలు–** గుండె ఆరోగ్యానికి అవసరమయ్యే మంచి కొలెస్ట్రాల్ గింజల్లో ఎక్కువగా ఉంటుంది. ఉదయాన్నే కొన్ని బాదాములు లేక జీడిపప్పులు లేదంటే గుప్పెడు వెరుశనగ గుళ్లు ఇచ్చినా చాలు పిల్లలకు ఇవి తక్కువ మొత్తంలో కొవ్వును అందించడం వల్ల వారికి తగినంత శక్తి లభిస్తుంది. గింజలు పిల్లల మానసిక, శారీరక పెరుగుదలకు అన్ని విధాల సహాయ పడుతాయి.
- **పాలు –** పాలలో ప్రొటీన్, కాల్షియం మెండుగా ఉంటాయి. పిల్లల మెదడు కణజాలాల అభివృద్ధికి ఇవి ఎంతగానో తోడ్పడుతాయి. ఎముకలు బలంగా పెరగడానికి, దంతాల బలానికి కాల్షియం అవసరం. కాబట్టి రోజుకి కనీసం అర లీటరు పాలు లేదా పాల పదార్థాల రూపంలోనైనా సరె పిల్లలకు అందేలా చూడాలి.
- **ఆకుకూరలు –** ఆకుకూరల్లో ఐరన్, కాల్షియం, ఫోలిక్ యాసిడ్, విటమిన్ ఎ, సి పోషకాంశాలను కలిగి ఉంటాయి. కాబట్టి వారంలో కనీసం నాలుగు రోజులైనా ఆకుకూరలను పిల్లల ఆహారంలో చేర్చాలి.
- **పెరుగు –** పెరుగు తేలికగా జీర్ణం కావడానికి, జీర్ణవ్యవస్థలోని చెడు బ్యాక్టీరియాను నివారించడానికి దోహదం చేస్తుంది. పెరుగును ఏదైనా పండుతో కలిపి ఇవ్వడం వల్ల రుచికి రుచి, ఆరోగ్యానికి ఆరోగ్యం.
- **క్యాబేజ్ –** క్యాబేజ్‌లో ఫైటో న్యూట్రియంట్స్ ఎక్కువగా ఉంటాయి. శరీరంలో నిరోధకశక్తి పెంచడానికి దోహదం చేస్తాయి.
- **వాల్‌నట్స్–** వీటినే అక్రూట్ అని కూడా అంటారు. ఇవి అద్భుతమైన ప్రొటీన్ స్నాక్. వీటిలోని ఒమెగా 3 ఫ్యాటీయాసిడ్స్ మెదడును చురుకుగా ఉంచుతాయి.

ఫెడరల్ బ్యాంక్‌లో ఆఫీసర్/క్లర్క్‌లు

ఫెడరల్ బ్యాంక్ దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో ఖాళీగా ఉన్న ఆఫీసర్, క్లరికల్ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.

వివరాలు:

ఫెడరల్ బ్యాంక్ అనేది దేశంలో ప్రైవేట్ సెక్టార్‌లోని ఒక లీడింగ్ బ్యాంక్.

- **పోస్టు పేరు:** క్లర్క్
- **అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి 60 శాతం మార్కులతో బ్యాచిలర్ డిగ్రీ లేదా తత్సమాన పరీక్షలో ఉత్తీర్ణత.
- **వయస్సు:** 2017 జూలై 1 నాటికి 24 ఏండ్లకు మించరాదు.
- **పోస్టు పేరు:** ఆఫీసర్
- **అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి 60 శాతం మార్కులతో బ్యాచిలర్ డిగ్రీ లేదా తత్సమాన పరీక్షలో ఉత్తీర్ణత.
- **వయస్సు:** 2017 జూలై 1 నాటికి 26 ఏండ్లకు మించరాదు.
- **పే స్కేల్:** క్లర్క్‌కు రూ. 11765-31540/- , ఆఫీసర్‌కు రూ. 23700-42020/- ప్రదేశాన్ని బట్టి డీఏ, హెచ్‌ఆర్‌ఏ, సీసీఏతోపాటు బ్యాంక్ నిబంధనల ప్రకారం చెల్లిస్తారు. మెడికల్ బిల్లు, హెల్త్ స్కీమ్, కన్సెషన్ లీవ్, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ తదితర సౌకర్యాలు ఉంటాయి.
- **అప్లికేషన్ ఫీజు:** ఆఫీసర్ పోస్టులకు రూ. 700/- జనరల్, ఓబీసీ అభ్యర్థులు (రూ. 350/- ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు)
- క్లర్క్ పోస్టులకు రూ. 500/- జనరల్, ఓబీసీ అభ్యర్థులు (రూ. 250/- ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు)
- **ప్రొబేషనరీ పీరియడ్:** క్లర్క్‌కు 6 నెలలు, ఆఫీసర్‌కు రెండేండ్లు.
- **ఎంపిక:** ఆన్‌లైన్ ఆప్టిట్యూడ్ టెస్ట్,



గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూ ద్వారా.
- **పరీక్ష సిలబస్:** క్లర్క్ పోస్టుకు వెర్బల్ ఎబిలిటీ/ఇంగ్లిష్ లాంగ్వేజ్, లాజికల్ ఆప్టిట్యూడ్/రీజనింగ్, క్వాంటిటేటివ్/న్యూమరికల్ ఎబిలిటీ, జనరల్, సోషియో ఎకనామిక్ అండ్ బ్యాంకింగ్ అవేర్‌నెస్, కంప్యూటర్ అవేర్‌నెస్, డిజిటల్ బ్యాంకింగ్ అంశాలపై 90 మార్కులకుగాను, 90 ప్రశ్నలు ఇస్తారు. ఆఫీసర్ పోస్టుకు పైన పేర్కొన్న అంశాలతో మొత్తం 150 మార్కులకుగాను 150 ప్రశ్నలు ఇస్తారు.
- ఆప్టిట్యూడ్ టెస్ట్‌లో ప్రతి తప్పు సమాధానానికి 1/4 మార్కులను తగ్గిస్తారు.
- ఈ పరీక్ష తర్వాత సైకోమెట్రిక్ టెస్ట్ ఉంటుంది. దీన్ని 15 నిమిషాల్లో పూర్తిచేయాల్సి ఉంటుంది.
- **పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం, బెంగళూరు, చెన్నై (మనకు దగ్గరలో ఉన్న సెంటర్లు).
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో. వినియోగంలో ఉన్న ఈ-మెయిల్ ఐడీ, మొబైల్ నంబర్, విద్యార్హతలు, తదితర వివరాలను ఎంటర్ చేయాలి. నిర్ణీత నమూనాలో ఫొటో, సంతకాన్ని అప్‌లోడ్ చేయాలి.
- **దరఖాస్తులకు చివరితేదీ:** సెప్టెంబర్ 4
- **ఆన్‌లైన్ ఆప్టిట్యూడ్ టెస్ట్:** సెప్టెంబర్ చివరివారం
- **వెబ్‌సైట్:** www.federalbank.co.in

ఏఐఈఎస్‌ఎల్ లో టెక్నీషియన్లు

ఎయిర్ ఇండియా ఇంజినీరింగ్ సర్వీసెస్ లిమిటెడ్ (ఏఐఈఎస్‌ఎల్) దేశవ్యాప్తంగా ఖాళీగా ఉన్న ఎయిర్‌క్రాఫ్ట్ టెక్నీషియన్ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.

AIR INDIA AIR TRANSPORT SERVICES LIMITED
(A WHOLLY OWNED SUBSIDIARY OF AIR INDIA LTD)

వివరాలు:

ఏఐఈఎస్‌ఎల్ అనేది ఎయిర్ ఇండియా లిమిటెడ్ ఆధ్వర్యంలో నడిచే సంస్థ.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 14
- **అర్హతలు:** గుర్తింపు పొందిన సంస్థ లేదా డీజీసీఏ లైసెన్స్‌తో పాటు ఏఎంఈ డిప్లొమా/సర్టిఫికెట్, డిప్లొమా (మెకానికల్, ఎలక్ట్రికల్, ఇన్‌స్ట్రుమెంటేషన్, ఎలక్ట్రానిక్స్, టెలికమ్యూనికేషన్, రేడియో ఇంజినీరింగ్‌లో ఉత్తీర్ణత.
- **వయస్సు:** 35 ఏండ్లకు మించరాదు.

ట్రేడ్స్‌మేన్-5 పోస్టులు
- **అర్హతలు:** సంబంధిత ఐటీఐలో ఉత్తీర్ణత
- **వయస్సు:** 45 ఏండ్లకు మించరాదు.
- **అప్లికేషన్ ఫీజు:** రూ. 1000/-
- **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ద్వారా
- **దరఖాస్తు:** నిర్ణీత నమూనాలో దరఖాస్తులను నింపి సంబంధిత పర్సనల్ అధికారికి పంపాలి.
- **దరఖాస్తులకు చివరితేదీ:** సెప్టెంబర్ 1
- **ఇంటర్వ్యూతేదీ:** సెప్టెంబర్ 14
- **వెబ్‌సైట్:** www.airindia.in

ఏఎఫ్‌ఆర్‌ఐలో

జోధ్‌పూర్‌లోని ఆరిడ్ ఫారెస్ట్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఏఎఫ్‌ఆర్‌ఐ) వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న జేఆర్‌ఎఫ్ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.

వివరాలు:

అటవీ రంగంలో రిసెర్చ్ చేయడానికి రాజస్థాన్‌లోని జోధ్‌పూర్‌లో 1988లో ఏర్పాటుచేశారు.

- మొత్తం ఖాళీలు - 6
- జేఆర్‌ఎఫ్-3 పోస్టులు
- ఫీల్డ్ అసిస్టెంట్- 2 పోస్టులు



- రిసెర్చ్ అసోసియేట్- 1 పోస్టు
- **అర్హత:** ఎమ్మెస్సీ, బీఎస్సీలో ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణత.
- **వయస్సు:** ఆగస్టు 1 నాటికి 28 ఏండ్లకు (రిసెర్చ్ అసోసియేట్‌కు 35 ఏండ్లు) మించరాదు.
- ఎస్సీ, ఎస్టీలకు ఐదేండ్లు, పీహెచ్‌సీలకు పదేండ్లు వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.
- **ఎంపిక:** ఇంటర్వ్యూ ద్వారా
- **ఇంటర్వ్యూ తేదీ:** ఆగస్టు 30
- **వెబ్‌సైట్:** http://www.afri.res.in

'ఎల్‌ఐసీ'లో 264 పోస్టులు

- డిగ్రీ, ఎంబీఏ విద్యార్థులకు అవకాశం
- ఆన్‌లైన్ టెస్ట్, ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక
- చివరితేదీ సెప్టెంబర్ 7

ఎల్ ఐసీ హౌజింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ అసిస్టెంట్ మేనేజర్, అసిస్టెంట్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.



వివరాలు:

ఎల్ ఐసీ హౌజింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ ఎల్ ఐసీ అనుబంధ సంస్థ. దీన్ని 1989, జూన్ 19న ప్రారంభించారు. దీర్ఘకాలిక గృహరుణాలు అందిచడం దీని ప్రధాన లక్ష్యం.

- **అసిస్టెంట్ మేనేజర్ - 100 ఖాళీలు**
- **అసిస్టెంట్స్- 164 ఖాళీలు**
- రాష్ర్టాల వారీగా ఖాళీలు.. తెలంగాణ- 5, ఛత్తీస్‌గఢ్- 4, మధ్యప్రదేశ్- 10, బీహార్- 9, జార్ఖండ్- 1, ఒడిశా- 9, అసోం- 2, సిక్కిం- 1, త్రిపుర-1, పశ్చిమబెంగాల్- 10, ఉత్తరప్రదేశ్ (ఎన్‌సీఆర్ మినహాయించి)- 20, ఉత్తరాఖండ్- 1, ఢిల్లీ (ఎన్‌సీఆర్ కలుపుకొని)- 5, హర్యానా (ఎన్‌సీఆర్ మినహాయించి)- 1, పంజాబ్- 3, రాజస్థాన్- 9, చండీగఢ్- 3, కర్ణాటక- 10, గోవా- 1, ఆంధ్రప్రదేశ్- 11, పాండిచ్చేరి- 1, తమిళనాడు-22, గుజరాత్-10, మహారాష్ట్ర-15.

నోట్: అసిస్టెంట్ మేనేజర్‌లు దేశంలో ఎక్కడైనా పని చేయాల్సి ఉంటుంది. అసిస్టెంట్ పోస్టుకు దరఖాస్తు చేసుకునేవారు ఏదైనా ఒక రాష్ర్టాన్ని మాత్రమే ఎంచుకోవాలి.

- **పేస్కేల్:** అసిస్టెంట్ పోస్టు బేసిక్ పే నెలకు రూ. 13,890/- వీటికి అదనంగా అలవెన్స్‌లు కలుపుకొని నెలకు సుమారుగా రూ. 21, 236/- వరకు జీతం వస్తుంది.
- అసిస్టెంట్ మేనేజర్ పోస్టుకు బేసిక్ పే నెలకు రూ. 32,815/-, వీటికి అదనంగా అలవెన్స్‌లు ఇస్తారు. అన్ని కలుపుకొని నెలకు సుమారుగా రూ. 49,805/- జీతం వస్తుంది.
- **ప్రొబేషనరీ పీరియడ్:** అసిస్టెంట్ పోస్టు- 6 నెలలు. అసిస్టెంట్ మేనేజర్- ఏడాదిపాటు శిక్షణ ఇస్తారు. ఈ సమయంలో నెలకు రూ. 25 వేలు చెల్లిస్తారు. తర్వాత పోస్టును రెగ్యులర్ చేస్తారు.
- **వయస్సు:** పై రెండు పోస్టులకు 2017, జూలై 1 నాటికి 21 -28 ఏండ్ల మధ్య ఉండాలి.
- **విద్యార్హతలు:** అసిస్టెంట్ పోస్టు- ఏదైనా డిగ్రీలో కనీసం 60 శాతం మార్కులతో ఉత్తీర్ణత.
- అసిస్టెంట్ మేనేజర్ పోస్టు- కనీసం 60 శాతం మార్కులతో ఎంబీఏ ఉత్తీర్ణత.

ఎంపిక విధానం:
- అసిస్టెంట్ - ఆన్‌లైన్ ఎగ్జామ్, ఇంటర్వ్యూ
- అసిస్టెంట్ మేనేజర్- ఆన్‌లైన్ ఎగ్జామ్, ఇంటర్వ్యూ

ఆన్‌లైన్ ఎగ్జామ్:
- అసిస్టెంట్, అసిస్టెంట్ మేనేజర్ పోస్టులకు వేర్వేరుగా పరీక్షను నిర్వహిస్తారు.
- ఈ పరీక్ష ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటుంది.
- పరీక్ష కాలవ్యవధి- 2 గంటలు
- పరీక్షలో ఇంగ్లిష్ లాంగ్వేజ్- 50 మార్కులు, 50 ప్రశ్నలు, 35 నిమిషాలు.
- లాజికల్ రీజనింగ్- 50 మార్కులు, 50 ప్రశ్నలు, 35 నిమిషాలు.
- జనరల్ అవేర్‌నెస్- 50 మార్కులు, 50 ప్రశ్నలు, 15 నిమిషాలు.
- న్యూమరికల్ ఎబిలిటీ- 50 మార్కులు, 50 ప్రశ్నలు, 35 నిమిషాలు.
- మొత్తం 200 ప్రశ్నలు 120 మార్కులు.
- నెగెటివ్ మార్కింగ్ విధానం ఉంది. ప్రతి తప్పు జవాబుకు 0.25 మార్కులు కోతవిధిస్తారు.

ఇంటర్వ్యూ:
- పోస్టుల సంఖ్యనుబట్టి ఆన్‌లైన్ ఎగ్జామ్‌లో కటాఫ్ మార్కులను నిర్ణయించి, అభ్యర్థులను ఇంటర్వ్యూలకు పిలుస్తారు.

నోట్: ఇంటర్వ్యూలు పూర్తయిన తర్వాత వైద్యపరీక్షలు నిర్వహిస్తారు. దీనిలో అర్హత సాధించినవారికి పోస్టింగ్‌లు ఇస్తారు.

- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **ఫీజు:** అసిస్టెంట్/అసిస్టెంట్ మేనేజర్- రూ. 500/-
- **చివరితేదీ:** సెప్టెంబర్ 7
- **ఆన్‌లైన్ ఎగ్జామ్ తేదీలు:** అసిస్టెంట్ మేనేజర్- అక్టోబర్ 10
- అసిస్టెంట్- అక్టోబర్ 12
- **పరీక్ష కేంద్రాలు:** రాష్ట్రంలో హైదరాబాద్‌లో మాత్రమే ఉన్నాయి.
- **వెబ్‌సైట్:** http://www.lichousing.com

బీసీపీఎల్‌లో మేనేజర్లు

బ్రహ్మపుత్ర క్రాకర్ అండ్ పాలిమర్ లిమిటెడ్ (బీసీపీఎల్) వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న మేనేజర్, ఇంజినీర్, సీనియర్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.

వివరాలు:

కెమికల్స్ అండ్ పెట్రోకెమికల్స్ ప్రభుత్వ విభాగం ఆధ్వర్యంలో పనిచేస్తున్న కేంద్రప్రభుత్వరంగ సంస్థ అయిన బీసీపీఎల్‌ను 2007 జనవరి 8న స్థాపించారు.

- సీనియర్ మేనేజర్ (హెచ్ఆర్) - 2 పోస్టులు
- మేనేజర్ (కెమికల్) - 2 పోస్టులు
- మేనేజర్ (ఫైనాన్స్ అండ్ అకౌంట్స్) - 1 పోస్టు

Brahmaputra Cracker & Polymer limited

- డిప్యూటీ మేనేజర్ (కెమికల్) - 2 పోస్టులు
- డిప్యూటీ మేనేజర్ (హెచ్ఆర్) - 1 పోస్టు
- సీనియర్ ఇంజినీర్ (ఎలక్ట్రికల్)-1 పోస్టు
- సీనియర్ ఇంజినీర్ (ఇన్‌స్ట్రుమెంటేషన్)-1 పోస్టు
- సీనియర్ ఇంజినీర్ (మెకానికల్)-1 పోస్టు
- సీనియర్ ఆఫీసర్ (లా)-1 పోస్టు
- సీనియర్ ఆఫీసర్ (మార్కెటింగ్)-2 పోస్టులు
- **అర్హత:** సంబంధిత విభాగం నుంచి బీఈ/బీటెక్, బ్యాచిలర్ డిగ్రీ, ఎంబీఏ, బీకాం, ఎంఎస్‌డబ్ల్యూ, సీఏ, ఐసీడబ్ల్యూఏ, మాస్టర్ డిగ్రీ, లా/పీజీ లా డిగ్రీలో ఉత్తీర్ణత. సంబంధిత రంగంలో అనుభవం ఉండాలి.
- **ఎంపిక:** రాత పరీక్ష/ఇంటర్వ్యూ
- **దరఖాస్తు:** ఆన్‌లైన్ ద్వారా.
- **దరఖాస్తులకు చివరి తేదీ:** సెప్టెంబర్ 21
- **వెబ్‌సైట్:** www.bcplonline.co.in.

అడ్మిషన్స్

ఫారెస్ట్ మేనేజ్‌మెంట్‌లో డిప్లొమా

భోపాల్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారెస్ట్ మేనేజ్‌మెంట్ (ఐఐఎఫ్ఎం) 2018-20 అకడమిక్ ఇయర్‌కు పీజీ డిప్లొమా ఇన్ ఫారెస్ట్ మేనేజ్‌మెంట్ కోర్సులో ప్రవేశానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తుంది.



వివరాలు:

పర్యావరణం, అడవులు & పర్యావరణ మార్పు మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో పనిచేస్తున్న ఈ స్వతంత్ర ప్రతిపత్తి సంస్థ (ఐఐఎఫ్ఎం)ను 1982లో స్థాపించారు.

- పీజీ డిప్లొమా ఇన్ ఫారెస్ట్ మేనేజ్‌మెంట్ (పీజీడీఎఫ్ఎం)
- **కోర్సు వ్యవధి:** రెండేండ్లు
- **మొత్తం సీట్ల సంఖ్య:** 120
- **అర్హతలు:** బ్యాచిలర్ డిగ్రీలో 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత. ఎస్సీ, ఎస్టీ పీహెచ్‌సీ అభ్యర్థులు 45 శాతం మార్కులతో ఉత్తీర్ణత. డిగ్రీ ఫైనలియర్ చదువుతున్న అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. క్యాట్-2017, గ్జాట్-2018 స్కోర్ కార్డ్‌ను పరిగణనలోకి తీసుకుంటారు.
- పర్‌ఫార్మెన్స్ ఆధారంగా మొత్తం 120 సీట్లలో 20 సీట్లకు స్కాలర్‌షిప్ ఇస్తారు.
- **కోర్సు ఫీజు:** ట్యూషన్+ హాస్టల్ ఫీజులు కలుపుకొని రూ. 4,80,000 (జనరల్, ఓబీసీ అభ్యర్థులు), రూ. 2,88,000 (ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు)
- **టైప్ ఆఫ్ ప్రోగ్రామ్:** పుల్‌టైమ్ రెసిడెన్షియల్ ప్రోగ్రాం
- **అప్లికేషన్ ఫీజు:** రూ. 1000/- (ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ. 500/-)
- **రిజర్వేషన్‌లు:** వచ్చిన దరఖాస్తుల్లో ఎస్సీ-15%, ఎస్టీ 7.5%, పీహెచ్‌సీ-3%, ఓబీసీ అభ్యర్థులకు 27% సీట్లను కేటాయిస్తారు.
- **ఎంపిక:** క్యాట్/గ్జాట్ స్కోర్, గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూ ద్వారా
- **గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూ జరిగే ప్రదేశాలు:** భోపాల్, బెంగళూరు, న్యూఢిల్లీ, కోల్‌కతా
- **దరఖాస్తు:** ఆన్‌లైన్ ద్వారా.

చిరునామా: Chairperson,
PGDFM Admission Indian
Institute of Forest Management,
Nehru Nagar, Bhopal-462 003

- **వెబ్‌సైట్:**www.iifm.ac.in

వికలాంగుల సంక్షేమ శాఖలో..

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని వైకల్యత, వయోవృద్ధుల సంక్షేమశాఖ వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి అర్హులైన దివ్యాంగుల (పీహెచ్‌సీ) అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.



వివరాలు:

గ్రూప్-4 కేటగిరీలోని క్లరికల్ క్యాడర్, సబార్డినేట్ క్యాడర్ పోస్టులను భర్తీ చేస్తారు.

- మొత్తం ఖాళీల సంఖ్య- 80
- జిల్లాలోని గ్రూప్-4 కేటగిరీ పోస్టులు
- జూనియర్ అసిస్టెంట్- 4 పోస్టులు.. వీహెచ్-1, హెచ్‌హెచ్-1, ఓహెచ్-2 (జనరల్-1, మహిళ-1)
- **అర్హత:** బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణత. ఆఫీస్ ఆటోమేషన్ విభాగంలో పట్టు ఉండాలి.
- టైపిస్ట్-4 పోస్టులు.. వీహెచ్- 1, హెచ్‌హెచ్- 2 (జనరల్-1, మహిళ-1), ఓహెచ్ -1
- **అర్హత:** బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణత. ఇంగ్లిష్, తెలుగు టైప్‌రైటింగ్ తెలిసి ఉండాలి. ఇంగ్లిష్ హయ్యర్ గ్రేడ్‌తో గవర్నమెంట్ టెక్నికల్ ఎగ్జామినేషన్ ఉత్తీర్ణులై ఉండాలి.
- కర్‌కూన్ (రికార్డ్ అసిస్టెంట్)- 2 (వీహెచ్-1, ఓహెచ్ -1) పోస్టులు
- **అర్హత:** ఏదైనా బ్యాచిలర్ డిగ్రీలో ఉత్తీర్ణత.
- **సబార్డినేట్ కేటగిరీ పోస్టులు**
- ఆఫీస్ సబార్డినేట్-6 పోస్టులు.. వీహెచ్-2 (జనరల్-1, మహిళ-1), హెచ్‌హెచ్-2 (జనరల్-1, మహిళ-1), ఓహెచ్ -2
- **అర్హత:** ఏదైనా గుర్తింపు పొందిన సంస్థ నుంచి 7వ తరతగతి ఉత్తీర్ణత.
- చౌకీదార్- 4 పోస్టులు.. వీహెచ్-1, హెచ్‌హెచ్-1, ఓహెచ్ (జనరల్-1, మహిళ-1)
- కామాటీ/కామటూన్స్- 58 పోస్టులు.. వీహెచ్-19 (జనరల్-13, మహిళ-6), హెచ్‌హెచ్-19 (జనరల్-13, మహిళ-6), ఓహెచ్-20 (జనరల్-14, మహిళ-6)
- **అర్హత:** ఏదైనా గుర్తింపు పొందిన సంస్థ నుంచి 5వ తరగతి ఉత్తీర్ణత.
- క్లీనర్లు-2 పోస్టులు (హెచ్‌హెచ్-1, ఓహెచ్-1)
- **అర్హత:** చదవడం, రాయడం వచ్చి ఉండాలి.
- **వయస్సు:** 2017 జూలై 1 నాటికి 18 నుంచి 44 ఏండ్ల మధ్య ఉండాలి.
- **దరఖాస్తు:** వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలి. నిర్ణీత నమూనాలో దరఖాస్తులను పంపాలి.
- **చివరితేదీ:** సెప్టెంబర్ 11
- **వెబ్‌సైట్:** http://hyderabad.telangana.gov.in

సీఈఈఆర్ఐలో

సీఎస్ఐఆర్ - సెంట్రల్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (సీఈఈఆర్ఐ)లో సైంటిస్ట్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది.

వివరాలు:

సీఎస్ఐఆర్ - సెంట్రల్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ మినిస్ట్రీ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రిత్వశాఖ పరిధిలో పనిచేస్తుంది. ఈ కార్యాలయం రాజస్థాన్‌లోని పిలానీలో ఉంది.



- సైంటిస్ట్ - 16 ఖాళీలు (జనరల్ - 7, ఓబీసీ -4, ఎస్సీ- 3, ఎస్టీ - 2)
- **పేస్కేల్:** రూ. 77,178/-
- **వయస్సు:** 2017, సెప్టెంబర్ 11 నాటికి 32 ఏండ్లు మించరాదు.
- సీనియర్ సైంటిస్ట్- 2 పోస్టులు.
- **పేస్కేల్:** రూ. 89,832/-
- **వయస్సు:** 37 ఏండ్లు మించరాదు.
- ప్రిన్సిపాల్ సైంటిస్ట్- 2
- **జీతం:** నెలకు రూ. 13,5090/-
- **వయస్సు:** 45 ఏండ్లు మించరాదు.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** సెప్టెంబర్ 11
- **వెబ్‌సైట్:** www.ceeri.res.in

నిఫ్ట్‌లో

నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ (నిఫ్ట్)లో కింది పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది.

వివరాలు:

నిఫ్ట్ భారత ప్రభుత్వ పరిధిలోని సంస్థ.

- ల్యాబ్ అసిస్టెంట్- 1
- **పేస్కేల్:** రూ. 19,900/-
- అసిస్టెంట్ వార్డెన్- 1
- **జీతం:** రూ. 25,500/-
- లైబ్రేరీ ట్రెయినీ- 1
- **జీతం:** నెలకు రూ. 10,000/-
- **దరఖాస్తు:** నిర్ణీత నమూనాలో
- **చివరితేదీ:** సెప్టెంబర్ 8
- **వెబ్‌సైట్:** www.nift.ac.in

లెర్నింగ్ టెక్నిక్స్‌తో ఈజీగా..

పోటీ వాతావరణం నెలకొన్న నేటి ఆధునిక విద్యార్థి జీవితంలో ఒకస్థాయి అభ్యసన సామర్థ్యాన్ని మాత్రమే కలిగి ఉంటే అంతగా ప్రయోజనం ఉండదు. ప్రస్తుతం మనకు ఉన్న లెర్నింగ్ కెపాసిటీ ఏంటో, దాని స్థాయి ఏంటో స్పష్టంగా గుర్తించాలి. ఆ తర్వాత, ఆ స్థాయిని క్రమంగా అభివృద్ధిపరుచుకుంటూ ఉండాలి. ఒకప్పటి సామర్థ్యం కన్నా, రెట్టింపు సామర్థ్యాన్ని సాధించగలిగినవారే ముందడుగు వేయగలుగుతారు. మన చుట్టూ ఉన్నవారి కన్నా మిక్కిలి ప్రజ్ఞా పాటవాల్ని చూపిస్తూ టాపర్‌గా వెలుగొందుతాం.

విద్యార్థి జీవితంలో చదువు చక్కగా సాగాలంటే తమ లోపాలను గుర్తించినట్లే, తమలో ఉన్న అభ్యసన శక్తులను కూడా గుర్తించగలగాలి. మూడున్నర సంవత్సరాలు దాటిన వెంటనే ప్రారంభమయ్యే విద్యా జీవితంలో క్రమశిక్షణ, శిక్షణాయుత అభ్యసన ప్రక్రియ కచ్చితంగా ప్రతి విద్యార్థికి అలవాటై తీరుతుంది. విద్యార్థి జీవితంలో ఉన్న వ్యక్తులకు, ఇతర వ్యక్తులకు అభ్యసనంలో ఉన్న తేడా ఇదే. ఒక విద్యార్థి అవలీలగా నేర్చుకోగలిగే ఒక అంశాన్ని ఒక ఉద్యోగి నేర్చుకోవడానికి చాలా కాలం పడుతుంది. కొత్తగా కంప్యూటరీకరణ చెందుతున్న కార్యాలయాల్లోని సిబ్బందికి కంప్యూటర్ విజ్ఞానాన్ని అందించేటప్పుడు ఉద్యోగుల్లో అభ్యసన సామర్థ్యం తగినంతగా లేకపోవడాన్ని వారికి బోధిస్తున్న శిక్షణా సిబ్బంది గమనించడం పలు సందర్భాల్లో జరిగింది. కాబట్టి లెర్నింగ్ కెపాసిటీ ప్రతి విద్యార్థికి ఉంటుంది. దాన్ని గుర్తించి సరైన పంథాలో మైండ్ ప్రోగ్రామింగ్ చేసుకుంటే చక్కగా అభివృద్ధి చెందుతుంది. ఈ ప్రోగ్రామింగ్‌కు విద్యార్థుల్లో సంకల్ప బలం ప్రధానంగా ఉండాలి. నేను దేన్నయినా అవలీలగా నేర్చుకోగలను అనే భావన ఏర్పడాలి. అది ఎలా తెచ్చుకోవాలో ఈ లెర్నింగ్ టెక్నిక్ మనకు తెలుపుతుంది.

- **మీరే లెర్నర్:** ఈ ఎక్సర్‌సైజు మీలో ఉన్న లెర్నింగ్ ఎబిలిటీస్‌ను మీరు గుర్తించేలా చేస్తుంది. ప్రతి మనిషికి ఈ ఎబిలిటీ పసితనం నుంచి ఉంటుంది. ఇంకా చెప్పాలంటే ఈ సామర్థ్యం అప్పుడే ఎక్కువగా ఉంటుంది. బ్రెయిన్‌లో న్యూరాన్ వ్యవస్థ నేర్చుకోవడం ప్రక్రియను ఒక నిర్దిష్టమైన శైలిలో గల రూట్‌ను ఎస్టాబ్లిష్ చేస్తుంది. కొలంబస్ అమెరికాను కనుక్కున్న రూట్ లాంటిది. దీన్ని తెలుసుకోవడమే ఈ ఎక్సర్‌సైజ్ ముఖ్య ఉద్దేశం.

1. కాలాన్ని వెనక్కి తిప్పండి

- ఆదిత్య-369 సినిమాలో టైంమిషన్ ఉంటుంది. హీరోహీరోయిన్ దానిలో కూర్చొని ఎంచక్కా శ్రీకృష్ణ దేవరాయల కాలానికి వెళ్లిపోతారు. చాలా థ్రిల్లింగ్‌గా ఉంటుంది. గదిలో కూర్చుని మీరు కూడా అదే చేస్తారు. ప్రశాంతంగా ఉన్న ఒక గదిలో కూర్చోండి. మీరు కూర్చున్న కుర్చీ మామూలూ చెక్క కుర్చీ కాదు సుమా..? అదొక టైంమిషన్. మీరు మీటనొక్కగానే జుయ్‌మంటు వెనక్కి పరుగెడుతుంది. అలా ఊహించుకోండి. మీరు కూర్చున్న టైంమిషన్ వెనక్కి వెళ్తుందని ఊహించండి. మీరు స్కూల్‌లో చదువుకోవటం, 10వ తరగతి క్లాసు ఒకసారి తప్పటం, ఇంకా వెనక్కి వెళ్లండి. ఎనిమిదో క్లాసులో మీరు ఎక్సకర్షన్‌కు వెళ్లటం, 7వ క్లాసు పబ్లిక్ పరీక్షలు రాయటం, ఇంకా వెళ్లండి. మూడో క్లాసులో మీకు పుట్టినరోజును ఘనంగా జరుపుకోవడం, ఇంకా వెనక్కి వెళ్లండి. మిమ్మల్ని ఎల్‌కేజీలో చేర్చుతున్న వయస్సు ఇంకా వెళ్లండి. మిమ్మల్ని ప్రీస్కూల్‌లో పెడితే బాగుంటుందని మీ అమ్మగారు అంటున్నారు. అక్కడ ఆగండి. మీరిప్పుడు అందమైన పసితనంలో ఉన్నారు. ఆహ్లాదకరంగా ఉంది. ఈ చుట్టూ చాలా పెద్ద ఆకారాలు కనిపిస్తున్నాయి. పొడవుగా, లావుగా వారందరిని మీరు తల బాగా పైకెత్తి చూస్తున్నారు. అందరూ మిమ్మల్ని ఒక బంతిలా ఎత్తుకొని ఆడిస్తున్నారు. మీరు కేరింతలు కొడుతూ ఆడుకుంటున్నారు.

2. మీ లెర్నింగ్ కెపాసిటీని గమనించండి.

- మీరెంతో చురుగ్గా ఉంటారు. అన్ని విషయాలను ఆసక్తిగా నేర్చుకుంటారు. మీకు ఆ వయసులోనే బోలెడు విషయాలు తెలిశాయి. ముఖ్యంగా మాటలు రోజుకు 15 నుంచి 50 మాటలు నేర్చేసుకుంటున్నారు. అవేమిటో మీకు తెలియవు. వాటి గురించి మీరు ఆలోచించరు. అయినా నేర్చుసుకుంటున్నారు. వందలకొలదీ వ్యాకరణ సూత్రాలు మీకు బోధపడిపోతున్నాయి. ఇదంతా ఎంతో విస్తృతంగా జరిగిపోతూ ఉంది. క్షణక్షణానికీ మీలో నేర్చుకోవడం ఎక్కువైపోతూ ఉంది.

3. మీ బ్రెయిన్‌లో ఎంత సరుకు ఉందనుకున్నారు?

- మీకు 15 బిలియన్ల కణాలు ఉన్నాయ్. వేలాది పట్టణాలను కలిపే ఎన్నో వేల కి.మీ. పొడవున అవి ఒకదానికొకటి అనుసంధించబడి ఉన్నాయ్. మీరు 1,600 రకాల శబ్దాలు ఫ్రీక్వెన్సిని వినగలరు. ఒక సెకనుకు 20 నుంచి 20,000 తరంగ దైర్ఘ్యాలు.. విస్తృతిలో మీ వినికిడి శక్తి పనిచేస్తుంది. కాంతిరేఖలో అతి చిన్నదైన ఫొటోన్‌ను మీ కన్ను చూడగలదు. మీ కళ్లు ఎంత గొప్పవో మీకు తెలుసా? మీ కంట్లో ఉండే ఆప్టిక్ నాడుల్లో ఒక్కొక్క దాంట్లో 8,00,000 కనెక్షన్లు ఉంటాయి. 132 మిలియన్ల రాడ్స్ కోన్స్ (వర్ణాలను తెలిపే పదార్థాలు) నుంచి వచ్చే సమాచారాన్ని దృష్టి నాడులు (5,00,000) బ్రెయిన్‌కు తీసుకువెళ్తాయి. మీ ఊపిరితిత్తుల్లో 300 మిలియన్లకు పైగా గాలితిత్తులు ఉంటాయి. అవి మీ శరీరం అంతటా ఉండే 100 ట్రిలియన్ల కణాలకు ఆక్సిజన్‌ను అందిస్తాయి. 206 ప్రధాన ఎముకలు, 656 రకాల కండరాలు మీకు ఉన్నాయ్. ఇంత డెవలప్‌మెంట్ ఈ ప్రపంచంలోని ఏ జీవికి లేదు. దీనికి ఎన్నో రెట్లు ఎక్కువ కెపబిలిటీస్ మీలో ఉన్నాయి. వాటిని మీరు లెక్కపెట్టలేరు. అవి అనంతమైనవి.



- డా. హిప్నో కమలాకర్
కౌన్సెలింగ్ సైకాలజిస్ట్, హెచ్ఆర్‌డీ ట్రైనర్, 9390044031
drhypnokamalakar@gmail.com



మహేష్‌బాబు, రకుల్‌ప్రీత్‌సింగ్

కనిపించని శత్రువు కోసం

'భూకంపాలు, సునామీలే కాకుండా భూప్రపంచంపై విధ్వంసాల్ని సృష్టించే కొన్ని మానవ శక్తులు ఉంటాయి. అలాంటి వారిని అంతమొందించడమే లక్ష్యంగా పోరాడుతుంటాడు స్పైడర్. అతడి సంకల్పం నెరవేరిందా? లేదా? కంటికి కనిపించని శత్రువులను అతడు ఎలా ఎదుర్కొన్నాడు? అనేది తెలియాలంటే మా సినిమా చూడాల్సిందే' అంటున్నారు ఎన్వీ ప్రసాద్. ఎన్.వి.ఆర్ సినిమా, రిలయన్స్ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకాలపై ఆయన నిర్మిస్తున్న చిత్రం 'స్పైడర్'. మహేష్‌బాబు కథానాయకుడిగా నటిస్తున్నారు. ఏ.ఆర్. మురుగదాస్ దర్శకుడు. రకుల్‌ప్రీత్‌సింగ్ కథానాయిక. చిత్రీకరణ తుదిదశకు చేరుకున్నది. నిర్మాత మాట్లాడుతూ 'స్పై థ్రిల్లర్ యాక్షన్ ఎంటర్‌టైనర్ ఇది. గూఢచార వ్యవస్థ పనితీరు నేపథ్యంలో ఆద్యంతం ఆసక్తికరంగా సాగుతుంది. ఒక పాట మినహా సినిమా చిత్రీకరణ పూర్తయింది. బ్యాలెన్స్‌గా మిగిలిన గీతాన్ని ఈ నెల 25 నుంచి రొమేనియాలో చిత్రీకరిస్తున్నాం. 31తో ఈ పాట చిత్రీకరణ పూర్తవుతుంది. అత్యున్నత సాంకేతిక ప్రమాణాలతో తెలుగు, తమిళ భాషల్లో ఏకకాలంలో రూపొందిస్తున్న ఈ చిత్రాన్ని సెప్టెంబర్ 27న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాం' అని తెలిపారు. ఎస్.జె. సూర్య ప్రతినాయకుడిగా నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: హేరీస్ జయరాజ్, సినిమాటోగ్రఫీ: సంతోష్ శివన్, ఎడిటింగ్: శ్రీకర్‌ప్రసాద్, సమర్పణ: ఠాగూర్ మధు.

తమిళ రీమేక్‌లో...

గతంలో రవితేజ నుంచి ఏడాదికి నాలుగైదు సినిమాలు గ్యారెంటీగా వచ్చేవి. ప్రస్తుతం తన పంథాను మార్చుకున్నారాయన. సంఖ్య కంటే కొత్తదనంతో కూడిన కథాంశాలకు ప్రాధాన్యతనిస్తున్నారు. తాజాగా రవితేజ ఓ తమిళ రీమేక్‌లో నటించనున్నట్లు తెలిసింది. జయం రవి కథానాయకుడిగా తమిళంలో రూపొందిన 'బోగన్' చిత్రం కమర్షియల్‌గా మంచి వసూళ్లను సాధించింది. ప్రభుదేవా నిర్మాణంలో సూపర్ నాచురల్ థ్రిల్లర్‌గా తెరకెక్కిన ఈ చిత్రాన్ని తెలుగులో రీమేక్ చేసేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఈ రీమేక్‌లో రవితేజ కథానాయకుడిగా నటించనున్నట్లు సమాచారం. మాతృకను తెరకెక్కించిన లక్ష్మణన్ తెలుగు రీమేక్‌కు దర్శకత్వం వహించనున్నట్లు తెలిసింది. ఇందులో రవితేజకు జోడీగా కేథరిన్ నటించనున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. విజయదశమికి ఈ చిత్రాన్ని సెట్స్‌పైకి తీసుకురానున్నట్లు సమాచారం. ప్రస్తుతం అనిల్‌రావిపూడి దర్శకత్వంలో 'రాజా ది గ్రేట్' చిత్రంలో నటిస్తున్నారు రవితేజ. ఇందులో అంధుడిగా ఆయన పాత్ర వైవిధ్యంగా సాగనుంది. దీనితో పాటు 'టచ్ చేసి చూడు' చిత్రంలో కథానాయకుడిగా నటిస్తున్నారాయన.


రవితేజ


నరసింహారావు, ఆకాష్, చిరంజీవి, జయప్రద, సురేష్ కపాడియా, మిస్తీ చక్రవర్తి

'జగదేకవీరుడు అతిలోక సుందరి'ని తలపిస్తుంది!

ఆకాష్‌కుమార్, మిస్తీ చక్రవర్తి జంటగా నటిస్తున్న తాజా చిత్రం 'శరభ'. 'ది గాడ్' అని ఉపశీర్షిక. యన్.నరసింహారావు దర్శకత్వం వహిస్తున్నారు. అశ్వనికుమార్ సహదేవ్ నిర్మిస్తున్నారు. ఈ చిత్ర ఫస్ట్‌లుక్, మోషన్ పోస్టర్‌ను హీరో చిరంజీవి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'కొన్ని క్లిప్పింగ్స్ చూశాను. జయప్రద, ఆకాష్‌ల నటన అద్భుతంగా వుంది. దర్శకుడు నరసింహారావు ఆషామాషీగా సినిమాను తెరకెక్కించలేదని అర్థమైంది. ఇదొక సోషియో ఫాంటసీ. దేవుడు, దయ్యం, మనిషి మధ్య జరిగే కథ. నేను చేసిన సినిమాలతో పోల్చాలంటే 'జగదేకవీరుడు అతిలోక సుందరి'లా వుంటుంది. సినిమాలో జయప్రద నటన చూసి ఆశ్చర్యమేసింది. తను గర్భం ధరించి పిల్లాడిని కనే సమయంలో దయ్యం బిడ్డను చంపాలనుకునే సందర్భంతోపాటు పిల్లాడు పుట్టిన తరువాత దయ్యం జయప్రదను ఆవహించి బిడ్డను చంపేయాలని ప్రయత్నించేటప్పుడు... జయప్రద పాత్ర పడే తపన చూసి ఒళ్లు గగుర్పాటుకు గురయ్యింది. ఆ సన్నివేశంలో జయప్రద నటన చూసి వావ్ అనకుండా వుండలేం. క్లైమాక్స్‌లో ఆకాష్ నరసింహస్వామిగా మారే సమయంలో అతనిలో కలిగే మార్పులు, అతని నటనను అభినందించకుండా వుండలేకపోయాను. సినిమా టేకింగ్ చూసిన తరువాత దర్శకుడు నరసింహా మాటల మనిషి కాదు చేతల మనిషి అని అర్థమైంది. ఛాయాగ్రహణం, గ్రాఫిక్స్ అత్యద్భుతంగా వున్నాయి. సినిమా సెన్సేషనల్ హిట్ అవుతుంది' అన్నారు. జయప్రద మాట్లాడుతూ 'చాలా సినిమాల్లో నటించమని నన్ను కోరినా నటనకు ఆస్కారమున్న పాత్రనే చేయాలని ఎదురు చూశాను. ఆ సమయంలో నన్ను వెతుక్కుంటూ వచ్చిన చిత్రమిది. అత్యున్నత సాంకేతిక విలువలతో రూపొందుతున్న సోషియో ఫాంటసీ చిత్రమిది. ఆకాష్‌కు పెద్ద బ్రేక్‌నిస్తుంది' అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ 'మంచి చెడుల మధ్య సాగే పోరే ఈ చిత్రం. పగ, ప్రతీకారం నేపథ్యంలో సాగుతుంది. తండ్రి సెంటిమెంట్‌తో పాటు నరసింహస్వామి మహత్యాన్ని కూడా ఈ చిత్రంలో చూపిస్తున్నాం' అన్నారు. గొప్ప సినిమా అవుతుందనే నమ్మకముందని హీరో ఆకాష్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సురేష్ కపాడియా, మిస్తీచక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.



కాజల్

మూస ధోరణికి భిన్నంగా చేసిన సినిమా!


బొప్పన చంద్రశేఖర్, నరేష్, ఆది

'కొత్తగా ఏం చేయాలి? ఎలా చేయాలి? ఆలోచించి కొత్తగా నేను చేసిన ప్రయత్నమే 'మేడమీద అబ్బాయి'' అన్నారు అల్లరి నరేష్. ఆయన కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'మేడమీద అబ్బాయి'. ప్రజిత్ దర్శకత్వం వహించారు. నిఖిలా విమల్ కథానాయిక. జాహ్నవి ఫిల్మ్స్ పతాకంపై బొప్పన చంద్రశేఖర్ నిర్మిస్తున్న ఈ చిత్ర ట్రైలర్‌ను ఇటీవల హైదరాబాద్‌లో హీరో అల్లరి నరేష్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ''గమ్యం'లో గాలి శీను నవ్విస్తూనే ఏడిపిస్తాడు. అలాంటి కథ కోసం చాలా కాలంగా వెతికాను. అలాంటి కథ 'ఒరు వడక్కన్ సెల్ఫీ'. నిర్మాత ఈ సినిమా గురించి తెలిసి నన్ను చూడమన్నారు. కామెడీకి థ్రిల్లర్ అంశాల్ని మేళవించి చేశారు. అది నాకు బాగా నచ్చడంతో రీమేక్ చేశాం. మలయాళంలో ఈ చిత్రాన్ని నివీన్‌పాల్ చేశాడు. అతని బాడీలాంగ్వేజ్‌ని అనుసరించకుండా నా పంథాలో చేసిన చిత్రమిది. ఫీల్ మిస్సవకూడదనే ఉద్దేశ్యంతో మాతృకను తెరకెక్కించిన దర్శకుడినే ఈ చిత్రానికి తీసుకున్నాం. మంచి సినిమా చేశానని మనస్ఫూర్తిగా చెబుతున్నాను. సెప్టెంబర్ 8న విడుదల కానుంది. సినిమాపై చాలా నమ్మకంతో వున్నాను. ' అన్నారు. నిర్మాత బొప్పన చంద్రశేఖర్ మాట్లాడుతూ 'అల్లరి నరేష్ నటించిన అల్లరి, ప్రాణం, గమ్యం, శంభో శివ శంభో..ఈ నాలుగు చిత్రాలు కలిస్తే ఎలా వుంటుందో మా 'మేడమీద అబ్బాయి' చిత్రం ఆ స్థాయిలో వుంటుంది' అన్నారు. హైపర్ ఆది మాట్లాడుతూ 'ఎక్కడ కామెడీ కావాలో అక్కడ కామెడీ వుంటుంది. ఎక్కడ థ్రిల్లింగ్ ఎలిమెంట్ కావాలో అక్కడ థ్రిల్లింగ్ ఎలిమెంట్స్ వున్న సినిమా ఇది. అల్లరి నరేష్ కెరీర్‌లోనే బెస్ట్ సినిమాగా నిలుస్తుంది' అన్నారు. ఈ కార్యక్రమంలో గేయ రచయిత విజయ్‌కుమార్, ఎగ్జిక్యూటివ్ నిర్మాత ఎం.ఎస్.కుమార్, సీతారామరాజు పాల్గొన్నారు.


శర్వానంద్, మెహరీన్

ఆనంద్..అతిశుభ్రం

'అతని పేరు ఆనంద్. అతనికి ఓసీడీ వుంది. ఓసీడీ అంటే అదేదో బీటెక్, ఎంటెక్ లాంటి డిగ్రీకాదు. డిజాస్టర్. దీని లక్షణాలు అతి శుభ్రం. విపరీతమైన నీట్‌నెస్. ఇలాంటి లక్షణాలున్న ఓ యువకుడు చేసే హంగామా ఏంటో తెలియాలంటే 'మహానుభావుడు' చూడాల్సిందే' అంటున్నారు మారుతి. ఆయన తెరకెక్కిస్తున్న తాజా చిత్రం 'మహానుభావుడు'. శర్వానంద్ కథానాయకుడు. మెహరీన్ కథానాయికగా నటించిన ఈ చిత్రాన్ని యు.వి. క్రియేషన్స్ పతాకంపై వంశీ, ప్రమోద్ నిర్మిస్తున్నారు. ఈ చిత్ర ఫస్ట్‌లుక్, టీజర్‌ను చిత్ర బృందం ఇటీవల విడుదల చేసింది. ఈ సందర్భంగా దర్శకుడు మారుతి మాట్లాడుతూ ''భలే భలే మగాడివోయ్' తరువాత నాకు నచ్చిన క్యారెక్టరైజేషన్‌తో చేస్తున్న సినిమా ఇది. రిలీజ్ చేసిన టీజర్‌కు మంచి స్పందన లభిస్తున్నది. టీజర్ చూసినవాళ్లంతా మళ్లీ నీ పంథాలో సాగే కామెడీ ఎంటర్‌టైనర్‌లా వుందని చెబుతున్నారు. హీరో శర్వానంద్ కెరీర్‌లోనే బెస్ట్ సినిమాగా నిలుస్తుందనే నమ్మకముంది' అన్నారు. నిర్మాతలు మాట్లాడుతూ 'క్యారెక్టరైజేషన్‌తో కామెడీని పండించగల దర్శకుల్లో మారుతి ఒకరు. టీజర్ చూస్తేనే సినిమాలో ఏ స్థాయిలో కామెడీ వుండనుందో అర్థమవుతున్నది. త్వరలో ట్రైలర్‌ను విడుదల చేస్తాం. ఒక పాట మినహా చిత్రీకరణ మొత్తం పూర్తయింది. డబ్బింగ్ కార్యక్రమాలు జరుగుతున్నాయి. విజయదశమికి విడుదల చేయాలని సన్నాహాలు చేస్తున్నాం' అన్నారు. వెన్నెల కిషోర్, నాజర్, భద్రం, కల్యాణి నటరాజ్, పిజ్జాబాయ్, భాను, హిమజ, వేణు, సుదర్శన్, సాయి, వెంకి, శంకర్‌రావు, రామాదేవి, మధుమణి, రాగిణి, రజిత, అబ్బులు చౌదరి, సుభాష్, ఆర్.కె తదితరులు నటిస్తున్నారు.

'క్వీన్' రీమేక్‌లో కాజల్..

కంగనారనౌత్ కథానాయికగా నటించిన హిందీ చిత్రం 'క్వీన్' (2014) దక్షిణాది భాషల్లో రీమేక్ కాబోతున్న విషయం తెలిసిందే. ప్రముఖ నటుడు, దర్శకనిర్మాత త్యాగరాజన్ ఈ చిత్ర పునర్నిర్మాణ హక్కుల్ని సొంతం చేసుకున్నారు. దక్షిణాది రీమేక్‌లో ఎవరు నటిస్తారనే విషయంలో కొంతకాలంగా సందిగ్ధత నెలకొంది. ప్రముఖ హీరోయిన్ల పేర్లు తెరపైకి వచ్చాయి. తాజాగా 'క్వీన్' తమిళ రీమేక్‌లో కాజల్‌అగర్వాల్‌ను ఖరారు చేశారు. ఈ విషయాన్ని కాజల్ స్వయంగా వెల్లడించింది. ''క్వీన్' చిత్రం నాకు బాగా నచ్చింది. అయితే దక్షిణాది ప్రేక్షకుల అభిరుచులకు అనుగుణంగా స్క్రిప్ట్‌లో మార్పులు చేస్తున్నారు. హిందీలో కంగనా రనౌత్ అత్యద్భుతమైన నటనను కనబరచింది. నాదైన శైలిలో సినిమాలోని పాత్రను రక్తి కట్టిస్తాననే నమ్మకముంది' అని చెప్పింది కాజల్ అగర్వాల్. ఆమె తెలుగులో నటించిన 'నేనే రాజు నేనే మంత్రి' చిత్రం ఇటీవలే విడుదలై చక్కటి విజయాన్ని సొంతం చేసుకుంది. ప్రస్తుతం కాజల్ అగర్వాల్ తెలుగులో 'ఎమ్మెల్యే' చిత్రంలో నటిస్తున్నది.


'ప్రేమిక' గీతావిష్కరణ దృశ్యం

ప్రేమిక గీతాలు

తనీష్, శృతియుగళ్ జంటగా నటిస్తున్న చిత్రం 'ప్రేమిక'. దేశాయ్ ఆర్ట్స్ పతాకంపై దేశాల లక్ష్మయ్య నిర్మిస్తున్నారు. మహేంద్ర దర్శకుడు. దిలీప్ బండారి స్వరాలను సమకూర్చిన ఈ చిత్ర గీతాలు ఇటీవల హైదరాబాద్‌లో విడుదలయ్యాయి. ఆడియో సీడీలను దర్శకుడు త్రినాథరావు నక్కిన ఆవిష్కరించారు. తనీష్ మాట్లాడుతూ 'పల్లెటూరి ప్రేమకథా చిత్రమిది. రాక్షసుడిలాంటి యువకుడిలో ఓ అమ్మాయి ప్రేమ ఎలాంటి మార్పుల్ని తీసుకొచ్చిందనేది ఈ చిత్ర ఇతివృత్తం. 'మేం వయసుకు వచ్చాం' తర్వాత నేను బాగా ఇష్టపడి, కష్టపడి చేసిన సినిమా ఇది' అని తెలిపారు. ప్రేమతో పాటు జీవితంలో విజయం సాధించే క్రమంలో ఓ ప్రేమికుడికి ఎదురైన సంఘటనల సమాహారమే ఈ చిత్రమని, దర్శకుడిగా తన తొలి చిత్రం ప్రేక్షకుల్ని అలరిస్తుందనే నమ్మకముందని మహేంద్ర చెప్పారు. సెప్టెంబర్ 8న చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నామని నిర్మాత తెలిపారు. ఈ కార్యక్రమంలో మానకొండూర్ శాసనసభ్యుడు రసమయి బాలకిషన్, ఆసిఫాబాద్ శాసనసభ్యురాలు కోవలక్ష్మి, బొంతు శ్రీదేవి, టీఆర్ఎస్ నాయకులు మన్నె గోవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆత్మ ప్రతీకారం

సందీప్‌కిషన్, లావణ్య త్రిపాఠి జంటగా నటిస్తున్న చిత్రం 'ప్రాజెక్ట్ జెడ్'. సి.వి.కుమార్ దర్శకుడు. ఎస్.బి.కె.ఫిల్మ్స్ పతాకంపై ఎస్.కె.బషీద్, ఎస్.కె.కరీమున్నీసా నిర్మిస్తున్నారు. సెప్టెంబర్‌లో ప్రేక్షకులముందుకు రానుంది. ఈ సందర్భంగా ఇటీవల ఏర్పాటు చేసిన సమావేశంలో నిర్మాతలు మాట్లాడుతూ 'పరిశోధన నేపథ్యంలో సాగే కథ ఇది. పరిశోధనాధికారిగా సందీప్‌కిషన్ నటించారు.ఆయన పాత్ర చిత్రన వినూత్న పంథాలో వుంటుంది. ప్రత్యర్థులపై ప్రతీకారం తీర్చుకోవడానికి ఓ యువకుడు ఆత్మగా ఎందుకు మారాడన్నది ఆసక్తికరంగా వుంటుంది. మనిషి నలభై ఏళ్ల క్రితం ఎలా వున్నాడు? నలభై ఏళ్ల తర్వాత ఎలా వుంటాడు? అనే అంశాన్ని సినిమాలో ఆవిష్కరిస్తున్నాం. తెలుగు, తమిళ భాషల్లో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాం' అన్నారు. సరికొత్త కథ, కథనాలతో తెలుగు ప్రేక్షకులకు సరికొత్త అనుభూతినిచ్చే చిత్రమిదని దర్శకుడు చెప్పారు.


లావణ్యత్రిపాఠి


సుభాంగి, తనిష్క్

ఆద్యంతం ఉత్కంఠతతో...

తనిష్క్‌రెడ్డి, అలెక్సియస్, సుభాంగి పంత్ నాయకానాయికలుగా నటిస్తున్న 'దర్పణం' చిత్రం ఇటీవల హైదరాబాద్‌లో ప్రారంభమైంది. వి.రామకృష్ణ దర్శకుడు. శ్రీ సిద్ధివినాయక ప్రొడక్షన్స్ పతాకంపై వి.ప్రవీణ్‌కుమార్ యాదవ్ (వెంకట్ యాదవ్) ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. చిన శ్రీశైలం యాదవ్ పూజాకార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం చిత్రీకరించిన ముహూర్తపు సన్నివేశానికి పరుచూరి వెంకటేశ్వరరావు క్లాప్ నివ్వగా, దర్శకుడు ఎన్.శంకర్ కెమెరా స్విచాన్ చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ 'ఆద్యంతం ఉత్కంఠతతో సాగే ప్రేమకథా చిత్రమిది. ప్రతిక్షణం ఏం జరుగుతుందనే ఆసక్తిని రేకెత్తిస్తుంది. నటీనటులు కొత్తవాళ్లైనా పాత్రల్లో చక్కగా ఇమిడిపోయారు' అని తెలిపారు. హీరోగా తనకు ఇది తొలి చిత్రమని, తొలి ప్రయత్నంలోనే కొత్త తరహాలో సాగే పాత్ర దక్కడం ఆనందంగా వుందని తనిష్క్‌రెడ్డి అన్నారు. సింగిల్ షెడ్యూల్‌లో చిత్రాన్ని పూర్తి చేస్తామని, అన్ని కార్యక్రమాలు పూర్తిచేసి చిత్రాన్ని త్వరలోనే ప్రేక్షకుల ముందుకు తీసుకువస్తామని నిర్మాత తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: సిద్దార్థ్ సదాశివుని, ఛాయాగ్రహణం: సతీష్ ముత్యాల.



గుర్మీత్ రాం రహీంతో ఆయన దత్తపుత్రిక హనీప్రీత్ ఇన్సాన్

డేరా బాధ్యతలు ఆమెకే!

చండీగఢ్, ఆగస్టు 27: తనను తాను దైవాంశ సంభూతుడిగా చెప్పుకునే డేరా సచ్చా సౌదా అధినేత గుర్మీత్ రాం రహీం సింగ్ కటకటాల పాలైన నేపథ్యంలో డేరా బాధ్యతలు తరువాత ఎవరు చేపడుతారు? అన్నది ఆసక్తిగా మారింది. వందలాది ఎకరాల్లో విస్తరించిన ఆశ్రమాలు, నాలుగైదు రాష్ట్రాల్లోని డేరా కేంద్రాలు, వేల కోట్ల ఆస్తులు అన్నింటికీ వారసులు ఎవరు? అన్నదానిపై చర్చ జరుగుతున్నది. గుర్మీత్ రాం రహీం సింగ్ అనంతరం డేరా బాధ్యతలను ఆయన దత్త కుమార్తె హనీప్రీత్ ఇన్సాన్ స్వీకరించనున్నట్లు సమాచారం. ఫేస్‌బుక్ పేజీలో తనను తాను 'పాపాస్ యాంజెల్'గా పేర్కొన్న హనీప్రీత్ ఇన్సాన్ పేరుపై ఓ వెబ్‌సైట్ కూడా ఉంది. దాంట్లోనూ 'అద్భుతమైన తండ్రికి గొప్ప కూతురు'గా తనగురించి తాను రాసుకుంది. 30ఏండ్ల పైబడి వయసున్న ఆమె స్వస్థలం హర్యానాలోని ఫతేపూర్. దర్శకురాలు, ఎడిటర్, నటి అయిన హనీప్రీత్ 1999లో హనీప్రీత్ డేరా అనుచరుడు విశ్వాస్‌గుప్తాను వివాహం చేసుకుంది. అయితే తనని అత్తింటివారు హింసిస్తున్నారంటూ బాబా గుర్మీత్ సాయం కోరడంతో హనీని కూతురిగా దత్తత తీసుకుంటున్నట్లు 2009లో ఆయన ప్రకటించారు. గుర్మీత్ తాను నటించిన మెసెంజర్ ఆఫ్ గాడ్, ఎంఎస్‌జీ-2 చిత్రాల్లోనూ హనీకి అవకాశాలిచ్చేవారు. ఇప్పుడు గుర్మీత్‌కి శిక్ష పడటంతో డేరాకు సంబంధించిన ఆస్తులన్నింటికీ హనీపీత్ర్ యజమానిగా వ్యవహరించే అవకాశమున్నట్లు డేరా ప్రతినిధులు చెప్తున్నారు. గుర్మీత్ రాం రహీం సింగ్ హర్‌జీత్‌కౌర్‌ను వివాహమాడారు. వారికి ఇద్దరు కుమార్తెలు చరన్‌ప్రీత్, అమన్‌ప్రీత్, ఒక కుమారుడు జస్మీత్.

'డేరా ఆశ్రమంలో నా భార్య అదృశ్యమైంది'

జైపూర్: డేరా సచ్చా సౌదా అధినేత గుర్మీత్ లైంగిక దాడి కేసులో దోషిగా తేలడంతో అతడి బాధితులు ఒక్కొక్కరుగా తెరపైకి వస్తున్నారు. తమకు జరిగిన అన్యాయాన్ని వివరిస్తూ న్యాయం కోరుతున్నారు. రెండేండ్ల క్రితం సిర్సాలోని డేరా ప్రధాన ఆశ్రమాన్ని సందర్శించేందుకు వెళ్లినప్పుడు జైపూర్ కార్మికుడు కమలేశ్ కుమార్ (27) భార్య కనబడకుండా పోయింది. కమలేశ్ న్యాయవాది బాబూలాల్ బైరవ తెలిపిన వివరాల ప్రకారం.. 2015 మార్చి 24న కమలేశ్ కుమార్ తన భార్యాపిల్లలతో కలిసి ఆశ్రమంలో ఉన్నప్పుడు ఒక వలంటీర్ వచ్చి 'బాబా మిమ్మల్ని వ్యక్తిగతంగా కలవాలనుకుంటున్నారు. రండి' అని కమలేశ్ భార్య గుడ్డి (20)ని తీసుకెళ్లారు. భార్యను ఆయన చూడటం అదే చివరిసారి. ఇప్పటికీ ఆమె జాడ తెలియరాలేదు. కమలేశ్, ఆయన పిల్లలు ఆమె కోసం ఎంతో గాలించారు. అక్కడి వలంటీర్లను అడిగితే, రెండు రోజులు ఇక్కడే ఉండి వెతకండని సలహా ఇచ్చారు. అప్పటికీ ఆమె కనిపించకపోవడంతో సిర్సా పోలీసులను ఆశ్రయించారు. అక్కడి పోలీసులనుంచి కమలేశ్‌కు ఎలాంటి సహాయమూ అందలేదు. ఏ సమాధానమూ వారి నుంచి రాలేదు. దీంతో ఆయన కోర్టును ఆశ్రయించారు. 2015 మే 5న జైపూర్ కోర్టు ఆదేశాల మేరకు స్థానిక పోలీసులు కేసు నమోదుచేశారు. అపహరణ, నేరపూరిత కుట్ర అభియోగాలతో ఎఫ్‌ఐఆర్ దాఖలైంది. ఈ కేసు విషయంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న డేరా చీఫ్ వాంగ్మూలాన్ని రికార్డు చేయడంలో విఫలమయ్యానని సాక్షాత్తు దర్యాప్తు అధికారే కోర్టుకు నివేదించారు. దీనిపై ప్రొటెస్ట్ పిటిషన్ దాఖలు చేయగా, తిరిగి దర్యాప్తునకు కోర్టు ఆదేశించింది. ఇప్పటికీ కోర్టుకు, పోలీస్‌స్టేషన్‌కూ తిరగడమే తప్ప, ఇంతవరకు ఈ కేసులో ఎలాంటి పురోగతి లేదని న్యాయవాది బాబూలాల్ బైరవ తెలిపారు. తాజాగా లైంగిక దాడి కేసులో డేరాబాబా దోషిగా తేలిన నేపథ్యంలో, తనకు న్యాయం చేయాలని కమలేశ్ కుమార్ న్యాయస్థానాన్ని కోరుతున్నారు.

ఇస్రో క్షిపణులు రామబాణాల్లాంటివి!

- గుజరాత్ సీఎం విజయ్‌రూపానీ అసాధారణ పోలిక

న్యూఢిల్లీ, ఆగస్టు 27: ఇస్రో క్షిపణులు రామ బాణాల్లాంటివని గుజరాత్ సీఎం విజయ్‌రూపానీ పేర్కొన్నారు. ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ టెక్నాలజీ రీసెర్చ్ అండ్ మేనేజ్‌మెంట్ (ఐఐటీఆర్ఏఎం) స్నాతకోత్సవంలో పాల్గొన్న ఆయన అసాధారణంగా రామాయణాన్ని ప్రస్తుత సాంకేతిక పరిజ్ఞానంతో పోలుస్తూ మాట్లాడారు. 2017లో ఇస్రో చేస్తున్న ప్రయోగాలను రాముడు ఎప్పుడో చేశాడన్నారు. రాముడు వదిలిన ప్రతి బాణము ఒక క్షిపణి అని, ఇప్పుడు అలాంటివే ఇస్రో తయారు చేస్తున్నది అని రూపానీ వివరించారు. ఇస్రో స్పేస్ అప్లికేషన్ సెంటర్ డైరెక్టర్ తపన్‌మిశ్రా ముందే గుజరాత్ సీఎం ఇలాంటి వ్యాఖ్యలు చేయడం విశేషం.

బాంబుతో పరుగెత్తిన బాహుబలి

- ప్రాణాన్ని ఫణంగా పెట్టి 400 మంది విద్యార్థుల ప్రాణాలు కాపాడిన మధ్యప్రదేశ్ హెడ్‌కానిస్టేబుల్



న్యూఢిల్లీ: బాహుబలి సినిమా లో హీరో ప్రభాస్ శివలింగాన్ని భుజానికెత్తుకొని కొద్దిదూరం నడిచిన సన్నివేశాన్ని మరిపించాడు మధ్యప్రదేశ్‌కు చెందిన హెడ్‌కానిస్టేబుల్ అభిషేక్ పటేల్. అంతేకాదు.. ఆయన దాదాపు 400 మంది విద్యార్థుల ప్రాణాలను కాపాడారు. 10కిలోల బరువు గల బాంబును భుజానికి ఎత్తుకొని దాదాపు కిలోమీటరుకు పైగా పరుగెత్తి అందరి ప్రశంసలను పొందారు. మధ్యప్రదేశ్‌లోని సాగర్ జిల్లాలో అభిషేక్ పటేల్ హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నారు. చిటోరా గ్రామంలోని పాఠశాలలో బాంబు ఉన్నట్లు సమాచారం రాగానే అక్కడికి వెళ్లారు. ఆ సమయంలో పాఠశాలలో 400 మంది విద్యార్థులు ఉన్నారు. బాంబు కోసం పోలీసులు విస్తృత తనిఖీలు చేస్తుండగా అభిషేక్ పటేల్ దానిని గుర్తించారు. కానీ అప్పటికీ బాంబు నిర్వీర్య బృందం అక్కడికి చేరుకోలేదు. దీంతో వెంటనే అభిషేక్ పటేల్ ఆ బాంబును భుజానికెత్తుకొని పరుగెత్తి కి.మీ దూరంలో నిర్జన ప్రదేశంలో దానిని పడేశారు. తన ప్రాణాన్ని ఫణంగా పెట్టి 400 మంది విద్యార్థుల ప్రాణాలను కాపాడిన అభిషేక్ పటేల్‌ను అందరూ ప్రశంసించారు. బాంబుతో పరుగెత్తిన దృశ్యం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.



న్యూఢిల్లీలో ఆదివారం వివిధ శాఖల సంయుక్త కార్యదర్శులు, అదనపు కార్యదర్శుల సమావేశంలో మాట్లాడుతున్న ప్రధాని నరేంద్రమోదీ

నవభారత నిర్మాణానికి శ్రమించండి

- వాస్తవిక దృష్టితో పనిచేయండి: ఉన్నతాధికారులతో ప్రధాని మోదీ

న్యూఢిల్లీ: వచ్చే ఐదేండ్లలో నవభారతాన్ని సృష్టించే దిశగా శ్రమించాలని అధికారులకు మోదీ పిలుపునిచ్చారు. లక్ష్యాల సాధనకు వాస్తవిక దృష్టితో ప్రయత్నించాలని సూచించారు. కేంద్రంలోని వివిధ శాఖల సంయుక్త కార్యదర్శులు, అదనపు కార్యదర్శులతో మోదీ ఆదివారం సమావేశమయ్యారు. ప్రధాని మోదీ మాట్లాడుతూ ఎలక్ట్రానిక్స్ తయారీరంగంలో పాటిస్తున్న పర్యావరణ అనుకూల విధానాలను, వైద్యపరికరాల తయారీలోనూ పాటించేలా దృష్టిసారించవచ్చున్నారు. సేంద్రియ పద్ధతులతో కూడిన ప్రభుత్వ విధానాల కోసం వివిధ శాఖల్లో సానుకూల పనివాతావరణం అవసరమని చెప్పారు. 'చాలా అంశాల్లో కొత్త చట్టాలు చేయాల్సిన అవసరముంది. పాత చట్టాలను సమీక్షించి మార్చుకోవడమో, తొలగించడమో చేయాలి' అని ప్రధాని తెలిపారు. దేశంలో వెనుకబడిన 100 జిల్లాల అభివృద్ధి మీద దృష్టి పెట్టాలని, వాటిని అభివృద్ధిలో సగటు జిల్లాల స్థాయికి తేవాలని మోదీ అధికారులకు సూచించారు.

ఆవులను తరలిస్తున్న ఇద్దరి హత్య

- పశ్చిమబెంగాల్‌లో ఘటన

జల్పాయిగురి: ఆవుల దొంగలుగా భావిస్తున్న ఇద్దరు యువకులను కోపోద్రిక్తులైన స్థానికులు కొట్టి చంపారు. ఈ ఘటన పశ్చిమబెంగాల్‌లోని జల్పాయిగురి జిల్లా బారోరియా గ్రామంలో ఆదివారం తెల్లవారుజామున 3 గంటల ప్రాంతంలో చోటుచేసుకున్నది. ఆవులను తరలిస్తున్న వ్యాన్‌ను ఆపిన గ్రామస్థులు అందులోని అన్వర్ హుస్సేన్ (19), హఫీజుల్ షేక్ (19)లను బయటకు లాగి చనిపోయేవరకు వారిని కొట్టారు. ఈ దాడిలో వ్యాను కూడా తీవ్రంగా దెబ్బతిన్నదని పోలీసులు తెలిపారు. ఆ వాహన డ్రైవర్ అడ్డుకున్న గ్రామస్థులను చూసి పారిపోయినట్లు సమాచారం. దెబ్బలు తిన్న యువకులను స్థానికంగా ఉన్న ధూప్‌గురి పట్టణ దవాఖానకు తరలించగా, అప్పటికేవారు చనిపోయినట్లు వైద్యులు ధ్రువీకరించారు. వాహనంలోని ఆవులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆ ప్రాంతంలో ఎలాంటి ఘటనలు చోటుచేసుకోకుండా భారీగా బలగాలను మోహరించారు. అన్వర్‌ను పశ్చిమబెంగాల్‌లోని కూచ్‌బెహార్ జిల్లా పాత్లాహవా వ్యక్తిగా గుర్తించగా.. హఫీజుల్ షేక్‌ను అసోంలోని ధుబ్రీ జిల్లా వ్యక్తిగా గుర్తించారు. చనిపోయిన యువకులు దొంగలా? పశువుల వ్యాపారులా? అనేది పోలీసులు ఇంకా గుర్తించలేదు.

జంషెడ్‌పూర్.. మరో గోరఖ్‌పూర్

నెలరోజుల్లో 52మంది శిశువుల మృతి

జంషెడ్‌పూర్: గోరఖ్‌పూర్ దవాఖానలో 70మందికి పైగా చిన్నారులు ప్రాణాలు కోల్పోయిన ఉదంతం మరువకముందే మరో దారుణం వెలుగుచూసింది. జార్ఖండ్‌లోని ఓ ప్రభుత్వ దవాఖానలో నెలరోజుల వ్యవధిలో 52మంది చిన్నారులు మృత్యువాత పడ్డారు. పౌష్టికాహార లోపంతోనే వారంతా మరణించినట్లు దవాఖాన సూపరింటెండెంట్ చెప్తున్నారు. ఘటనపై మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది. జార్ఖండ్ గిరిజన ప్రాంతాల్లో తీవ్ర పౌష్టికాహార లోపం ప్రధాన ఆరోగ్యసమస్యగా మారింది. జార్ఖండ్‌లో 47శాతం పిల్లల్లో తగిన ఎదుగుదల లేదని, 42శాతం పిల్లలు బరువు తక్కువగా ఉన్నారని ప్రపంచ ఆరోగ్యసంస్థ 2013-14 రాపిడ్ సర్వే నివేదిక సైతం వెల్లడించింది.

యూపీ దవాఖానలో మృతదేహాన్ని పీక్కుతిన్న కుక్క

లక్నో: ప్రభుత్వ దవాఖానల్లో నిర్లక్ష్యం ఎలా ఉంటుందో చూపే మరో ఘటన ఉత్తరప్రదేశ్‌లో చోటుచేసుకున్నది. లక్నోలోని రాంమనోహర్ లోహియా దవాఖానలోని మార్చురీ వార్డులో ఉంచిన మహిళ మృతదేహం శరీర భాగాలను ఓ కుక్క పీక్కుతిన్నది. ఈ ఘటనపై తీవ్ర ఆరోపణలు రావడంతో హాస్పిటల్ భద్రతా సూపర్‌వైజర్‌తోపాటు ఓ గార్డును విధుల్లో నుంచి తొలిగించారు. చిన్‌హట్ వాసి పుష్పా తివారీ (40) విషప్రయోగంతో అత్యవసర విభాగంలో చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతిచెందింది. ఇది మెడికో లీగల్ కేసు కావడంతో శవపరీక్ష కోసం మృతదేహాన్ని మార్చురీలో ఉంచారు. ఆదివారం ఉదయం ఆమె మృతదేహాన్ని చూసిన బంధువులు ముఖం, మెడ సహా పలు శరీర భాగాలను కుక్క పీక్కుతిన్నదని అధికారులకు ఫిర్యాదు చేశారు.

బలపరీక్ష నిర్వహించండి: డీఎంకే

చెన్నై/న్యూఢిల్లీ: అన్నాడీఎంకే దినకరన్‌వర్గానికి చెందిన 19 మంది ఎమ్మెల్యేల మద్దతు ఉపసంహరణతో ప్రభుత్వం మైనారిటీలో పడిందని, తక్షణమే బలనిరూపణకు అసెంబ్లీని సమావేశ పరుచాలని తమిళనాడు ఇన్‌చార్జి గవర్నర్ సీహెచ్ విద్యాసాగర్‌రావును డీఎంకే నేతృత్వంలో ప్రతిపక్షాల ప్రతినిధి బృందం కోరింది.ఆదివారం గవర్నర్‌ను కలిసి వినతి పత్రం సమర్పించింది. గడువులోగా గవర్నర్ విశ్వాస పరీక్షకు సీఎంను ఆహ్వానించ కుంటే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని డీఎంకే అనంతరం మీడియాకు తెలిపింది. అవసరమైతే రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌నూ కలుస్తామన్నది. మొత్తం 234 మంది సభ్యులున్న అసెంబ్లీలో స్పీకర్ సహా కేవలం 113 మంది మాత్రమే అన్నాడీఎంకే ప్రభుత్వానికి మద్దతు ఇస్తున్నారని గవర్నర్ విద్యాసాగర్‌రావుకు డీఎంకే కార్యనిర్వాహక అధ్యక్షుడు ఎంకే స్టాలిన్ తెలిపారు. కనుక అసెంబ్లీని సమావేశ పరిచి బలనిరూపణకు ప్రభుత్వాన్ని ఆహ్వానించాలని కోరారు. గవర్నర్ విద్యాసాగర్‌రావు దీనికిపై నిర్ణయం తీసుకోవాల్సి ఉన్నది.

పని చేయని అధికారులను బెత్తంతో పరుగెత్తించాలి

- వారి వల్లే పలు సమస్యలు ఎదురవుతున్నాయి: గడ్కరీ



పుణె: తన శాఖ పరిధిలోని ప్రాజెక్టులను సమయానికి పూర్తి చేయడంలో కొందరు అధికారులు విఫలమవుతున్నారని దీనివల్ల పలు సమస్యలు ఎదురవుతున్నాయని కేంద్ర రవాణాశాఖ మంత్రి గడ్కరీ ఆవేదన వ్యక్తం చేశారు. నిర్లక్ష్యంగా వ్యవహరించే అధికారులను బెత్తంతో పరుగెత్తించాలన్నారు. మహారాష్ట్రలోని పుణె జిల్లాలో నిర్మించతలపెట్టిన మల్టీలేయర్ ఫ్లైఓవర్ పనులకు ఆదివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా గడ్కరీ మాట్లాడుతూ 'ఐదేండ్లలో రూ. 25లక్షల కోట్ల పనులను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. డబ్బుల సమస్య లేనేలేదు. కానీ సమస్య కొందరు అధికారులతోనే' అని పేర్కొన్నారు.

బ్రిటన్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

- ఎనిమిది మంది మృతి.. మృతుల్లో భారతీయులు

లండన్: బ్రిటన్‌లో జరిగిన ఘోర రోడ్డుప్రమాదంలో ఎనిమిది మంది మృతిచెందారు. నలుగురు గాయపడ్డారు. మృతుల్లో భారతీయులు ఉన్నట్లు పోలీసులు చెప్పారు. రెండు ట్రక్కుల మధ్య వీరి మినీ బస్సు ప్రయాణిస్తున్నదని, వెనుక నుంచి ట్రక్కు ఢీకొట్టడంతో ముందు ఉన్న ట్రక్కును గుద్దుకున్నదని తెలిపారు. రెండు ట్రక్కుల డ్రైవర్లు నిర్లక్ష్యంగా నడుపడంతోనే ఈ ప్రమాదం జరిగిందని, ఆ ఇద్దరు డ్రైవర్లను అరెస్టు చేశామని చెప్పారు. ఈ సంఘటన శనివారం దక్షిణ ఇంగ్లాండ్‌లోని ఎం 1 రహదారిపై చోటుచేసుకుందని వివరించారు. మృతుల్లో చెన్నైకి చెందిన టూరిస్టులు తదితరులు ఉన్నారని చెప్పారు.



జమ్ముకశ్మీర్‌లోని పుల్వామాలో శనివారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో అమరుడైన జవాన్ దినేశ్ అంత్యక్రియలు ఆదివారం అహ్మదాబాద్‌లో జరిగాయి. ఈ సందర్భంగా జరిగిన అంతిమయాత్రలో భారీగా ప్రజలు పాల్గొన్నారు.

పరిశ్రమల గెజిటెడ్ అధికారుల కార్యవర్గం ఎన్నిక

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణ పరిశ్రమల శాఖ గెజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్షుడిగా ఎం పవన్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా ఎం వెంకయ్య ఎన్నికయ్యారు. హైదరాబాద్ అబిడ్స్‌లోని పరిశ్రమల శాఖ కార్యాలయంలో ఆదివారం గెజిటెడ్ అధికారుల సంఘం సర్వసభ్య సమావేశంలో గౌరవ అధ్యక్షుడు, పరిశ్రమలశాఖ అడిషనల్ డైరెక్టర్ ఆర్‌బీ దేవానంద్ సమక్షంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా బీ శ్రీనివాసులు, వీ బాబురావు, సంయుక్త కార్యదర్శులుగా ఎంఎ ఖలీల్ , కే నవీన్ రెడ్డి, కోశాధికారిగా ఎం గంగాధర్, కార్యనిర్వాహక కమిటీ సభ్యులుగా జే రాజేశ్వర్‌రెడ్డి, పీ రవీందర్, ఎం శ్రీలక్ష్మి, బీ నవీన్‌కుమార్, జే రాంకిషన్‌నాయక్, కే అజయ్ కుమార్, కే రఘునాథ్, కేవీ నర్సిరెడ్డిలను ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా ఆర్‌బీ దేవానంద్, రాజ్‌కుమార్ ఒడ్కర్‌లను ఎంపికచేశారు. పరిశ్రమలశాఖలో గెజిటెడ్ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వానికి విన్నవించాలని నిర్ణయించారు. రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చిన టీఎస్ఐపాస్ విధానాన్ని మరింత సమర్థంగా అమలయ్యే విధంగా ప్రభుత్వానికి సహకరించడానికి సిద్ధంగా ఉన్నామని గౌరవాధ్యక్షుడు దేవానంద్ తెలిపారు. రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకొచ్చి నిరుద్యోగ సమస్యను తీర్చడానికి ప్రభుత్వం చేస్తున్న కృషిని ఈ సందర్భంగా అభినందించారు.

మక్కాలో హైదరాబాదీ మృతి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: హజ్‌యాత్రకు వెళ్లిన తెలంగాణ యాత్రికుడు ఒకరు మక్కాలో ఆదివారం మృతి చెందారు. హైదరాబాద్‌లోని హుమాయున్‌నగర్‌కు చెందిన మీర్ అబ్దుల్ లతీఫ్(73) అక్కడి నూర్ దవాఖానలో గుండెపోటుతో కన్నుమూశారు. ఆయన ఈ నెల 17న తన భార్య అజీజున్నీసాతో కలిసి రాష్ట్ర హజ్ కమిటీ ద్వారా హజ్ యాత్రకు వెళ్లారు. లతీఫ్ మృతి సమాచారం అందగానే కమిటీ ప్రత్యేక అధికారి ప్రొఫెసర్ ఎస్ఏ షుకూర్ మక్కాలో అంత్యక్రియలకు ఏర్పాట్లుచేయాలని హజ్ వలంటీర్‌ను ఆదేశించారు. లతీఫ్ మృతికి తన సంతాపం తెలియజేశారు. హైదరాబాద్ ఎంబార్కేషన్ పాయింట్ నుంచి వెళ్లిన యాత్రికుల్లో ఇప్పటివరకు ఇద్దరు చనిపోయారు.

దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణి సంస్థ | ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణి సంస్థ

బహిరంగ ప్రకటన

2017-18 ఆర్థిక సంవత్సరానికి రిటైల్ సరఫరా ఛార్జీలు మరియు ఓపెన్ ఆక్సెస్ వినియోగదారులకు క్రాస్ సబ్సిడి సర్‌ఛార్జీలు

ఇందుమూలంగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా,

1. రెండు డిస్ట్రిబ్యూషన్ కంపెనీలు అనగా (1) సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్ (టీఎస్ఎస్‌పిడిసిఎల్) మరియు (2) నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్ (టీఎస్ఎన్‌పిడిసిఎల్) వారు 2017-18 సంవత్సరానికి రిటైల్ సరఫరా ఛార్జీలు మరియు క్రాస్ సబ్సిడి, సర్‌ఛార్జ్ & అదనపు సర్‌ఛార్జీల ప్రతిపాదనలను పురస్కరించుకొని తెలంగాణ రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి వారు యావత్ తెలంగాణ రాష్ట్రంలోని వినియోగదారులందరికి 2017-18 కాలానికి రిటైల్ సరఫరా ఛార్జీలు మరియు క్రాస్ సబ్సిడి సర్‌ఛార్జీలను ఈ క్రింద వివరించబడ్డ అనుబంధం-1 మరియు అనుబంధం- 2 ప్రకారం నిర్ణయించడమైనది.
2. విద్యుత్ చట్టం 2003 సెక్షన్ 65 మరియు 108లో పేర్కొన్న ప్రకారం ప్రభుత్వం వారు కొన్ని కేటగిరి వినియోగదారులకు ఇచ్చిన సబ్సిడీ మొత్తాలను పరిగణలోకి తీసుకున్న మీదట 2017-18 ఆర్థిక సంవత్సరానికి రిటైల్ సరఫరా ఛార్జీలను నిర్ణయించడమైనది.
3. రిటైల్ సరఫరా ఛార్జీలు రాష్ట్రంలోని సిరిసిల్ల గ్రామీణ విద్యుత్ సరఫరా సహకార సంఘం పరిధిలోని వినియోగదారులకు కూడా వర్తిస్తాయి.
4. ఈ రిటైల్ సరఫరా ఛార్జీలు మరియు క్రాస్ సబ్సిడి సర్‌ఛార్జీలు 1-9-2017 నుండి 31-3-2018 వరకు చట్టాన్ని అనుసరించి కమీషన్ వారు సవరించినంత వరకు అమలులో ఉంటాయి.

CMD/TSSPDCL **CMD/TSNPDCL**

అనుబంధం - 1

2017-18 ఆర్థిక సంవత్సరానికి రిటైల్ సరఫరా ఛార్జీల షెడ్యూల్

వినియోగదారుని విభాగం	ఎనర్జీ యూనిట్	ఫిక్స్‌డ్/డిమాండ్ ఛార్జీలు (రూ॥లు/కిడబ్ల్యు/హెచ్‌పి/కెవిఎ/నెల)	ఎనర్జీ ఛార్జీలు (రూ॥లు/యూనిట్)
ఎల్‌టి. I గృహావసరం			
ఎల్‌టి. I(A) నెలకు 100 యూనిట్ల వరకు			
మొదటి 50 యూనిట్లు	కె.డబ్ల్యు.హెచ్	0.00	1.45
51 - 100	కె.డబ్ల్యు.హెచ్	0.00	2.60
ఎల్‌టి. I(B)(i) నెలకు 100 యూనిట్ల పైన మరియు 200 యూనిట్ల వరకు			
మొదటి 100 యూనిట్లు	కె.డబ్ల్యు.హెచ్	0.00	3.30
101 - 200	కె.డబ్ల్యు.హెచ్	0.00	4.30
ఎల్‌టి. I(B)(ii) నెలకు 200 యూనిట్ల పైన			
మొదటి 200 యూనిట్లు	కె.డబ్ల్యు.హెచ్	0.00	5.00
201 - 300	కె.డబ్ల్యు.హెచ్	0.00	7.20
301 - 400	కె.డబ్ల్యు.హెచ్	0.00	8.50
401 - 800	కె.డబ్ల్యు.హెచ్	0.00	9.00
800 పైన	కె.డబ్ల్యు.హెచ్	0.00	9.50
ఎల్‌టి. II గృహేతర అవసరాలు/ వాణిజ్యం			
ఎల్‌టి. II(A) నెలకు 50 యూనిట్ల వరకు	కె.డబ్ల్యు.హెచ్/ కె.వి.ఎ.హెచ్	50.00	6.00
ఎల్‌టి. II(B) నెలకు 50 యూనిట్ల పైన			
0-100	కె.డబ్ల్యు.హెచ్/ కె.వి.ఎ.హెచ్	60.00	7.50
101-300		60.00	8.90
301-500		60.00	9.40
500 పైన		60.00	10.00
ఎల్‌టి. II (C) అడ్వర్టయిజ్‌మెంట్ హోర్డింగులు	కె.డబ్ల్యు.హెచ్/ కె.వి.ఎ.హెచ్	60.00	12.00
ఎల్‌టి. II(D) క్షౌరశాలలు నెలకు 200 యూనిట్ల వరకు			
0-50	కె.డబ్ల్యు.హెచ్/ కె.వి.ఎ.హెచ్	60.00	5.30
51 -100		60.00	6.60
101-200		60.00	7.50
ఎల్‌టి. III పరిశ్రమలు			
పరిశ్రమలు	కె.డబ్ల్యు.హెచ్/ కె.వి.ఎ.హెచ్	60.00	6.70
సీజనల్ లోడుకై (ఆఫ్ సీజనల్)		60.00	7.40
మత్స్య & రొయ్యల పెంపకం		21.00	5.20
చెఱకు క్రషింగ్		21.00	5.20
కోళ్ళ ఫారం		50.00	4.00
పట్టుగొడుగు,కుందేళ్ళ గొర్రెల & మేకల ఫారాలు,		60.00	6.30
పూలతోటల పెంపకం(గ్రీన్‌హౌస్)		60.00	6.30
ఎల్‌టి. IV కుటీర పరిశ్రమలు			
కుటీర పరిశ్రమలు 10 హెచ్.పి వరకు	కె.డబ్ల్యు.హెచ్	20.00	4.00
వ్యవసాయ సంబంధిత పనులు 10 హెచ్.పి వరకు	కె.డబ్ల్యు.హెచ్	20.00	4.00
ఎల్‌టి. V(A) వ్యవసాయం (డిఎస్ఎమ్ తప్పనిసరి)			
కార్పొరేట్ రైతులు	కె.డబ్ల్యు.హెచ్	0.00	2.50
కార్పొరేటేతర రైతులు	కె.డబ్ల్యు.హెచ్	0.00	0.00
ఎల్‌టి. V(B) ఇతరులు			
ఉద్యాన మొక్కల పెంపకం 15హెచ్.పి లోడ్ వరకు	కె.డబ్ల్యు.హెచ్	20.00	4.00
ఎల్‌టి. VI వీధి దీపాలు మరియు పిడబ్ల్యుఎస్ స్కీములు			
ఎల్‌టి. VI(A) వీధి దీపాలు			
పంచాయితీలు	కె.డబ్ల్యు.హెచ్	32.00	6.10
మున్సిపాలిటీలు	కె.డబ్ల్యు.హెచ్	32.00	6.60
మున్సిపల్ కార్పొరేషన్‌లు	కె.డబ్ల్యు.హెచ్	32.00	7.10
ఎల్‌టి. VI(B) పిడబ్ల్యుఎస్ స్కీములు			
పంచాయితీలు	కె.డబ్ల్యు.హెచ్/ కె.వి.ఎ.హెచ్	32.00	5.00
మున్సిపాలిటీలు		32.00	6.10
మున్సిపల్ కార్పొరేషన్‌లు		32.00	6.60
ఎల్‌టి. VII సాధారణ అవసరం			
ఎల్‌టి. VII(A) సాధారణ అవసరం	కె.డబ్ల్యు.హెచ్/ కె.వి.ఎ.హెచ్	21.00	7.30
ఎల్‌టి. VII(B) ప్రార్థనా మందిరాలు			
2 కిలోవాట్ లోడ్ వరకు	కె.డబ్ల్యు.హెచ్	21.00	5.40
2 కిలోవాట్ లోడ్ పైన	కె.డబ్ల్యు.హెచ్	21.00	6.00
ఎల్‌టి. VIII తాత్కాలిక సరఫరా	కె.డబ్ల్యు.హెచ్/ కె.వి.ఎ.హెచ్	21.00	11.00
హెచ్‌టి. I(A) పరిశ్రమలు-సాధారణం			
132 కెవి మరియు ఆపైన	కె.వి.ఎ.హెచ్	390.00	5.65
33 కెవి	కె.వి.ఎ.హెచ్	390.00	6.15
11 కెవి	కె.వి.ఎ.హెచ్	390.00	6.65
లైట్లు మరియు ఫ్యాన్స్			
132 కెవి మరియు ఆపైన	కె.వి.ఎ.హెచ్	-	5.65
33 కెవి	కె.వి.ఎ.హెచ్	-	6.15
11 కెవి	కె.వి.ఎ.హెచ్	-	6.65
పరిశ్రమ కాలనీలు			
132 కెవి మరియు ఆపైన	కె.వి.ఎ.హెచ్	-	6.30
33 కెవి	కె.వి.ఎ.హెచ్	-	6.30
11 కెవి	కె.వి.ఎ.హెచ్	-	6.30
సీజనల్ పరిశ్రమలు			
132 కెవి మరియు ఆపైన	కె.వి.ఎ.హెచ్	390.00	6.70
33 కెవి	కె.వి.ఎ.హెచ్	390.00	6.90
11 కెవి	కె.వి.ఎ.హెచ్	390.00	7.60
కోళ్ళ పరిశ్రమలు			
33 కెవి	కె.వి.ఎ.హెచ్	390.00	4.15
11 కెవి	కె.వి.ఎ.హెచ్	390.00	4.65
హెచ్‌టి. I(A) 150 కెవిఎ లోడ్ వరకు ఐచ్ఛిక విభాగం			
11 కెవి	కె.వి.ఎ.హెచ్	80.00	7.00
టైమ్ ఆఫ్ డే టారిఫ్ (6.00 పి.ఎమ్ నుండి 10.00 పి.ఎమ్ వరకు మరియు 6 ఎ.ఎమ్ నుండి 10.00 ఎ.ఎమ్ వరకు)			
132 కెవి మరియు ఆపైన	కె.వి.ఎ.హెచ్	-	6.65
33 కెవి	కె.వి.ఎ.హెచ్	-	7.15
11 కెవి	కె.వి.ఎ.హెచ్	-	7.65
టైమ్ ఆఫ్ డే టారిఫ్ (10.00 పి.ఎమ్ నుండి 6 ఎ.ఎమ్ వరకు)			
132 కెవి మరియు ఆపైన	కె.వి.ఎ.హెచ్	-	4.65
33 కెవి	కె.వి.ఎ.హెచ్	-	5.15
11 కెవి	కె.వి.ఎ.హెచ్	-	5.65
కోళ్ళ పరిశ్రమలు టైమ్ ఆఫ్ డే టారిఫ్ (6.00 పి.ఎమ్ నుండి 10.00 పి.ఎమ్ వరకు మరియు 6 ఎ.ఎమ్ నుండి 10.00 ఎ.ఎమ్ వరకు)			
33 కెవి	కె.వి.ఎ.హెచ్	-	5.15
11 కెవి	కె.వి.ఎ.హెచ్	-	5.65
కోళ్ళ పరిశ్రమలు టైమ్ ఆఫ్ డే టారిఫ్ (10.00 పి.ఎమ్ నుండి 6 ఎ.ఎమ్ వరకు)			
33 కెవి	కె.వి.ఎ.హెచ్	-	3.15
11 కెవి	కె.వి.ఎ.హెచ్	-	3.65
హెచ్‌టి. I(B) ఫెర్రో అల్లాయిస్			
132 కెవి మరియు ఆపైన	కె.వి.ఎ.హెచ్	-	5.00
33 కెవి	కె.వి.ఎ.హెచ్	-	5.50
11 కెవి	కె.వి.ఎ.హెచ్	-	5.90
హెచ్‌టి. II ఇతరులు			
132 కెవి మరియు ఆపైన	కె.వి.ఎ.హెచ్	390.00	6.80
33 కెవి	కె.వి.ఎ.హెచ్	390.00	7.00
11 కెవి	కె.వి.ఎ.హెచ్	390.00	7.80
టైమ్ ఆఫ్ డే టారిఫ్ (6.00 పి.ఎమ్ నుండి 10.00 పి.ఎమ్ వరకు మరియు 6 ఎ.ఎమ్ నుండి 10.00 ఎ.ఎమ్ వరకు)			
132 కెవి మరియు ఆపైన	కె.వి.ఎ.హెచ్	-	7.80
33 కెవి	కె.వి.ఎ.హెచ్	-	8.00
11 కెవి	కె.వి.ఎ.హెచ్	-	8.80
టైమ్ ఆఫ్ డే టారిఫ్ (10.00 పి.ఎమ్ నుండి 6 ఎ.ఎమ్ వరకు)			
132 కెవి మరియు ఆపైన	కె.వి.ఎ.హెచ్	-	5.80
33 కెవి	కె.వి.ఎ.హెచ్	-	6.00
11 కెవి	కె.వి.ఎ.హెచ్	-	6.80
హెచ్‌టి. III ఏయిర్‌పోర్ట్, బస్‌స్టేషన్స్ మరియు రైల్వే స్టేషన్స్			
132 కెవి మరియు ఆపైన	కె.వి.ఎ.హెచ్	390.00	6.45
33 కెవి	కె.వి.ఎ.హెచ్	390.00	6.85
11 కెవి	కె.వి.ఎ.హెచ్	390.00	7.50
టైమ్ ఆఫ్ డే టారిఫ్ (6.00 పి.ఎమ్ నుండి 10.00 పి.ఎమ్ వరకు మరియు 6 ఎ.ఎమ్ నుండి 10.00 ఎ.ఎమ్ వరకు)			
132 కెవి మరియు ఆపైన	కె.వి.ఎ.హెచ్	-	7.45
33 కెవి	కె.వి.ఎ.హెచ్	-	7.85
11 కెవి	కె.వి.ఎ.హెచ్	-	8.50
టైమ్ ఆఫ్ డే టారిఫ్ (10.00 పి.ఎమ్ నుండి 6 ఎ.ఎమ్ వరకు)			
132 కెవి మరియు ఆపైన	కె.వి.ఎ.హెచ్	-	5.45
33 కెవి	కె.వి.ఎ.హెచ్	-	5.85
11 కెవి	కె.వి.ఎ.హెచ్	-	6.50
హెచ్‌టి. IV లిఫ్ట్ ఇరిగేషన్ మరియు సి.పి.డబ్ల్యు.యస్			
హెచ్‌టి. IV(A) లిఫ్ట్ ఇరిగేషన్, వ్యవసాయం (11కె.వి., 33కె.వి. & 132 కె.వి. మరియు ఆపైన)	కె.వి.ఎ.హెచ్	0.00	6.40
హెచ్‌టి. IV(B) కాంపోజిట్ ప్రొటెక్టెడ్ వాటర్ సప్లై స్కీములు (11కె.వి.,33కె.వి.&132 కె.వి. మరియు ఆపైన)	కె.వి.ఎ.హెచ్	0.00	5.10
హెచ్‌టి. V(A) రైల్వే ట్రాక్షన్	కె.వి.ఎ.హెచ్	390.00	4.05
హెచ్‌టి. V(B) హెచ్ఎమ్ఆర్ (మెట్రో)	కె.వి.ఎ.హెచ్	390.00	3.95
హెచ్‌టి. VI టౌన్‌షిప్స్ మరియు కాలనీలు (11కె.వి., 33కె.వి. మరియు 132 కె.వి. మరియు ఆపైన)	కె.వి.ఎ.హెచ్	60.00	6.30
హెచ్‌టి. VII తాత్కాలిక సరఫరా			
132 కెవి మరియు ఆపైన	కె.వి.ఎ.హెచ్	500.00	9.80
33 కెవి	కె.వి.ఎ.హెచ్	500.00	10.00
11 కెవి	కె.వి.ఎ.హెచ్	500.00	10.80
హెచ్‌టి: రూరల్ ఎలక్ట్రిక్ సప్లై కో- ఆపరేటివ్ సొసైటీలు (రెస్కోలు)			
సిరిసిల్ల రెస్కో 11 కెవి	కె.డబ్ల్యు.హెచ్	0.00	1.00

నియమ నిబంధనలు:

1. ఇంధన సర్‌ఛార్జ్ సర్దుబాటు ఛార్జీలు విద్యుత్ చట్టం 2003 నిబంధనలను అనుసరించి వర్తించును.
2. ఆంధ్రప్రదేశ్ విద్యుత్ సుంకం చట్టం నిబంధనల ప్రకారం విద్యుత్ సుంకం ఈ ధరలలో కలిసి లేదు.
3. **వోల్టేజ్ సర్‌ఛార్జ్:** వోల్టేజ్ సర్‌ఛార్జ్ ఉపసంహరణ 2017-18 సంవత్సరానికి కూడా కొనసాగించడమైనది.
4. **డిమాండ్‌ను దాటిన వారికి అదనపు ఛార్జీలు**

ఏదైనా ఒక నెలలో నమోదైన డిమాండ్ (ఆర్ఎమ్‌డి) వినియోగదారుడు లైసెన్సీతో కుదుర్చుకున్న ఒప్పందపు డిమాండ్ (సిఎమ్‌డి) కన్నా ఎక్కువగా ఉంటే అట్టి వినియోగదారుడు ఈ క్రింది ఛార్జీలను చెల్లించవలెను.

సిఎమ్‌డిలో ఆర్ఎమ్‌డి %	ఎక్కువ డిమాండ్‌పై డిమాండ్ ఛార్జీలు	మొత్తం ఎనర్జీపై ఎనర్జీ ఛార్జీలు
100% నుండి 120%	సాధారణ ఛార్జీలకు రెండు రెట్లు	సాధారణ ఛార్జీలు
120% కంటే ఎక్కువ 200% వరకు	సాధారణ ఛార్జీలకు రెండు రెట్లు	సాధారణ ఛార్జీలకు 1.15 రెట్లు
200% కంటె ఎక్కువ	సాధారణ ఛార్జీలు రెండు రెట్లు	సాధారణ ఛార్జీలకు 1.20 రెట్లు

హెచ్.టి. కేటగిరి - 5ఎ & 5బి రైల్వే ట్రాక్షన్ మరియు హెచ్ఎమ్ఆర్‌కు సంబంధించి నమోదైన డిమాండ్ ఒప్పందపు డిమాండ్‌కు 120% దాటినచో మొత్తం వినియోగించిన ఎనర్జీపై సాధారణ ఛార్జీలకు 1.05 రెట్లు లెక్కించబడును.

5. కనీస ఛార్జీలు:		
కేటగిరి ఎల్‌టి విభాగాలు		2017-18 సం॥నకు రేట్లు
ఎల్‌టి-I(A)	గృహ వినియోగం	కన్క్టెడ్ లోడ్ 1000 వాట్స్ వరకు
ఎల్‌టి-I(B)(i)		సింగిల్ ఫేస్ రూ. 25/- నెలకు
ఎల్‌టి-I(B)(ii)		కన్క్టెడ్ లోడ్ 1000 వాట్స్ పైన
		సింగిల్ ఫేస్ రూ. 50/- నెలకు
		త్రీ ఫేస్ రూ. 150/- నెలకు
ఎల్‌టి-II(A&B)	గృహేతర / వాణిజ్యం	సింగిల్ ఫేజ్ రూ. 65/- నెలకు
		త్రీ ఫేజ్ రూ.200/- నెలకు
ఎల్‌టి-II(C)	అడ్వర్‌టైజ్‌మెంట్ హోర్డింగ్	రూ.300/- నెలకు
ఎల్‌టి-II(D)		సింగిల్ ఫేజ్ రూ. 65/- నెలకు
		త్రీ ఫేజ్ రూ.200/- నెలకు
ఎల్‌టి-VI(A)	వీధి దీపాలు పంచాయితీలు	రూ.2/పాయింట్ /నెలకు
	వీధి దీపాలు మున్సిపాలిటీలు &కార్పొరేషన్లు	రూ.6/పాయింట్ /నెలకు
ఎల్‌టి-VII(A)	సాధారణ అవసరం	సింగిల్ ఫేజ్ రూ.50/నెలకు
		త్రీ ఫేజ్ రూ.150/నెలకు
ఎల్‌టి-VIII	తాత్కాలిక సరఫరా	మొదటి 30రోజులు లేక అందులో పాక్షికానికి ప్రతి ఒప్పందపు లోడ్ కిలోవాట్ కి రూ.125/-చొప్పున తదుపరి ప్రతి 15 రోజులు లేక అందులో పాక్షిక కాలానికి ఒప్పందపు లోడు కిలో వాట్‌కి రూ.75/- చొప్పున
హెచ్‌టి విభాగాలు		
కనీస బిల్లింగ్ డిమాండ్:		హెచ్‌టి 6 (అనగా టౌన్‌షిప్ కాలనీ కేటగిరిలో వాస్తవ నమోదిత డిమాండ్ బిల్లింగ్ డిమాండ్ అవుతుంది) మినహాయించి మిగిలిన అన్ని కేటగిరిలకు నెలలో నమోదయిన డిమాండ్ లేదా ఒప్పందపు డిమాండ్‌లో 80% గాని ఏది గరిష్టమో అది.
కనీసం ఎనర్జీ ఛార్జీలు:		
హెచ్.టి I(A)	పారిశ్రామిక	50 యూనిట్లు(కెవిఎహెచ్)/ బిల్లింగ్ డిమాండ్ కెవిఎ నెలకు
హెచ్.టి-I(B)	ఫెర్రో అల్లాయిస్	గ్యారెంటీ ఆఫ్‌టేక్ ఎనర్జీ 6701యూనిట్లు (కెవిఎహెచ్/కెవిఎ/ సంవత్సరానికి). దీనిని నెలవారిగా కాకుండా సంవత్సరం మొత్తానికి లెక్కించాలి మరియు మినిమమ్ ఆఫ్‌టేక్ లెక్కించడానికి సరఫరా నిలిపివేసిన కాలాన్ని మినహాయించవలెను.
హెచ్.టి-II	ఇతరాలు	25 యూనిట్లు(కెవిఎహెచ్)/ బిల్లింగ్ డిమాండ్ కెవిఎ నెలకు
హెచ్.టి-III	ఎయిర్‌పోర్ట్సు, బస్‌స్టేషన్ మరియు రైల్వే స్టేషన్	50 యూనిట్లు(కెవిఎహెచ్)/ బిల్లింగ్ డిమాండ్ కెవిఎ నెలకు
హెచ్.టి-V(A&B)	రైల్వే ట్రాక్షన్ & హెచ్ఎమ్ఆర్	32 యూనిట్లు (కెవిఎహెచ్)/ ఒప్పందపు డిమాండ్ కెవిఎ నెలకు
హెచ్.టి-VI	టౌన్‌షిప్స్ కాలనీలు	నమోదైన డిమాండ్‌ను బిల్లింగ్ డిమాండ్‌గా పరిగణించవలెను. 25యూనిట్లు (కెవిఎహెచ్) /ఒప్పందపు డిమాండ్ కెవిఎ నెలకు

6. వినియోగ దారుల ఛార్జీలు:

వినియోగ దారుల విభాగం	రూ. నెలకు
ఎల్‌టి విభాగం:	
ఎల్‌టి-1 గృహవినియోగం (యూనిట్లు/నెలకు)	
0-50	25/-
51-100	30/-
101-200	50/-
201-300	60/-
300 పైన	80/-
ఎల్‌టి-2 గృహేతర /వాణిజ్యం (యూనిట్లు/నెలకు)	
0-50	45/-
51-100	55/-
100 పైన	65/-
ఎల్‌టి-2సి అడ్వర్‌టైజ్‌మెంట్ హోర్డింగ్స్	70/-
ఎల్‌టి-2డి హెయిర్ కటింగ్, సెలూన్ నెలకు 200 యూనిట్ల వరకు	
0-50	45/-
51-100	55/-
101-200	65/-
ఎల్‌టి-3 పరిశ్రమలు 20హెచ్‌పి వరకు	75/-
ఎల్‌టి-3 పరిశ్రమలు 21-50హెచ్‌పి	300/-
ఎల్‌టి-3 పరిశ్రమలు 51-100హెచ్‌పి	1125/-
ఎల్‌టి-4 కుటీరపరిశ్రమలు	45/-
ఎల్‌టి-5 వ్యవసాయం	30/-
ఎల్‌టి-6 వీధిదీపాలు & పిడబ్ల్యుఎస్	50/-
ఎల్‌టి-7 సాధారణ అవసరం	60/-
ఎల్‌టి-8 తాత్కాలిక సరఫరా	65/-
హెచ్‌టి విభాగాలు	
హెచ్‌టి వినియోగదారులు 11కెవి వద్ద	1685/-
హెచ్‌టి వినియోగదారులు 33కెవి వద్ద	1685/-
హెచ్‌టి వినియోగదారులు 132కెవి మరియు ఆపైన	3370/-

7. అపరాధ రుసుము:

ఎల్‌టి విభాగాలు

ఎ. ఎల్‌టి -1ఎ, ఎల్‌టి-1బి, ఎల్‌టి-2ఎ, ఎల్‌టి-2డి, ఎల్‌టి-4 మరియు ఎల్‌టి-5బి కేటగిరీలలోని వినియోగదారుడు గడువు తేది తదుపరి బిల్లు చెల్లించినచో ఈ క్రింది తెలిపిన ధరల ప్రకారం బిల్లుపై నెలకు అపరాద రుసుము చెల్లించాలి.

ఎల్.టి -1ఎ	రూ. 10/- నెలకు
ఎల్‌టి -1బి, 2ఎ, 2డి, 4 మరియు 5బి	రూ. 25/- నెలకు

బి. ఎల్‌టి - 2బి, 2సి, 3, 6 మరియు 7 క్యాటగిరీలలో వినియోగదారులు గడువు తేదీలోపు విద్యుత్ ఛార్జీలు చెల్లించనప్పుడు బిల్లుపై ఉన్న గడువు తేదీ నుండి బిల్లు చెల్లింపు తేదీ వరకు ప్రతీ 100రూ॥లకు 5 పైసలు చొప్పున లేదా 150రూ॥లు ఈ రెండింటిలో ఏది ఎక్కువ అయితే అది లైసెన్సీ వారిచే అపరాధ రుసుము విధించబడును. వాయిదాలు మంజూరు చేసిన సందర్భంలో బకాయి ఉన్న మొత్తం పై సాలీన 18% చక్రవడ్డీ చొప్పున లెసెన్సీ వారిచే వడ్డీ విధించబడును. మరియు ఈ రెండు (అపరాధ రుసుము మరియు వడ్డీ) ఒకేసారి విధించబడదు.

హెచ్‌టి విభాగాలు:
వినియోగదారులు గడువు తేదీలోపు విద్యుత్ ఛార్జీలు చెల్లించనప్పుడు బిల్లుపై ఉన్న గడువు తేదీ నుండి బిల్లు చెల్లింపు తేదీ వరకు ప్రతీ 100రూ॥లకు 5 పైసలు చొప్పున లేదా 550రూ॥లు ఈ రెండింటిలో ఏది ఎక్కువ అయితే అది లైసెన్సీ వారిచే అపరాధ రుసుము విధించబడును. వాయిదాలు మంజూరు చేసిన సందర్భంలో బకాయి ఉన్న మొత్తం పై సాలీన 18% చక్రవడ్డీ చొప్పున లెసెన్సీ వారిచే వడ్డీ విధించబడును. మరియు ఈ రెండు (అపరాధ రుసుము మరియు వడ్డీ) ఒకేసారి విధించబడదు.

8. రీకనెక్షన్ ఛార్జీలు	
ఎ. ఎల్‌టి సర్వీసులు	
ఎల్‌టి -1ఎ	రూ. 25/-
ఎల్‌టి-1ఎ మినహా మిగతా అన్ని ఎల్‌టి ఓవర్‌హెడ్ సర్వీసులకు	రూ. 75/-
భూగర్భ సర్వీసులు	రూ. 200/-
బి. హెచ్.టి సర్వీసులు	
11 కెవి	రూ. 1000/-
33 కెవి	రూ. 2000/-
132 కెవి మరియు ఆపైన	రూ. 3000/-

9. టెస్టింగ్ ఛార్జీలు	ఎల్‌టి	హెచ్‌టి
ఇన్‌స్టాలేషన్ నూతన ఇన్‌స్టాలేషన్ లేదా ఇంతకు ముందు ఉన్న ఇన్‌స్టాలేషన్ విస్తరణకు మొదటిసారి పరీక్ష మరియు తనిఖీ	లేదు	లేదు
తదుపరి పరీక్ష మరియు లేదా తనిఖీ సంబంధిత విభాగంచే ఇన్‌స్టాలేషన్‌లో లోపం గుర్తించినప్పుడు లేదా సరఫరా నిబంధన పాటించనప్పుడు ముందస్తుగా వినియోగదారుడు చెల్లించవలసిన ఛార్జీలు	20/-	200/-
మీటర్లు		
ఎసి సింగిల్ ఫేజ్ ఎనర్జీ మీటర్	100/-	
ఎసి త్రీ ఫేజ్ ఎనర్జీ మీటర్	300/-	
ఎల్‌టి ట్రై వెక్టర్ మీటర్	2000/-	
11కెవి		3000/-
33కెవి		3000/-
132 కెవి మరియు ఆపైన		3000/-
ట్రాన్స్‌ఫార్మర్ ఆయిల్		
ప్రతీ తైలం నమూనాకు	రూ. 150/- ప్రతీ నమూనాకు	

10. పర్యవేక్షణ / తనిఖీ మరియు చెకింగ్ ఛార్జీలు	
అన్ని ఎల్‌టి విభాగాలకు	రూ.100/-
అన్ని హెచ్‌టి విభాగాలకు	రూ.600/-

11. తక్కువ పవర్‌ఫ్యాక్టర్ ఛార్జీలు
కెవిఎహెచ్ బిల్లింగ్ వర్తించే అన్ని వినియోగదారులకు పవర్‌ఫ్యాక్టర్ సర్‌ఛార్జ్ విధించబడదు

12. కెపాసిటర్ సర్‌ఛార్జీలు
ఈ క్రింద తెలిపిన కన్క్టెడ్ లోడ్ కలిగిన కెడబ్ల్యుహెచ్ ఆధారిత బిల్లింగ్ ఎల్‌టి వినియోగదారులకు (ఎల్‌టి గృహ అవసరాలు మినహాయించి) కెపాసిటర్లు పనిచేయనట్లుగా గుర్తించినచో అమలులో ఉన్న నిబంధనల ప్రకారం బిల్లు మొత్తంపై 25% చొప్పున కెపాసిటర్ సర్‌ఛార్జ్ విధించబడును.

క్యాటగిరి	ఒప్పందపు లోడ్
ఎల్‌టి 2 మరియు ఎల్‌టి 7ఎ	10 కిలో వాట్ల లోపు
ఎల్‌టి 3 మరియు ఎల్‌టి 6బి	20హెచ్‌పి లోపు

13. స్థిర ఛార్జీలు - సీజనల్ పరిశ్రమలు
ఎల్‌టి 3 : ఒప్పందపు లోడ్‌లో రూ. 50/ హెచ్‌పి/నెలకు
హెచ్‌టి డిమాండ్ ఛార్జీలు : ఒప్పందపు డిమాండ్‌లో 30% లేదా నమోదిత డిమాండ్ రెండింటిలో ఏది ఎక్కువ అయితే అది.

14. ఎల్.టి మరియు హెచ్‌టి వినియోగదారులకు తాత్కాలిక సరఫరా
వినియోగదారుని అభ్యర్థన మేరకు తాత్కాలిక విభాగం ధరలలో మొదటి 12 నెలల వరకు తాత్కాలిక సరఫరా ఇవ్వవచ్చు. 12 నెలల అనంతరం వినియోగదారునికి తాత్కాలిక విభాగం క్రింద కొనసాగించే స్వేచ్ఛ కలదు.

అనుబంధం - 2

ఆర్థిక సం॥ 2017-18 కు ఓపెన్ యాక్సిస్ వినియోగదారులకు కమీషన్ వారు నిర్ణయించిన క్రాస్ సబ్సిడీ సర్‌చార్జీలు (రూ./కి.డబ్ల్యు.హెచ్)

వినియోగదారుని విభాగం	ఎస్‌పిడిసిఎల్	ఎన్‌పిడిసిఎల్
11కెవి హెచ్‌టి		
హెచ్‌టి I పరిశ్రమలు	1.65	1.66
హెచ్‌టి II ఇతరాలు	2.03	1.97
హెచ్‌టి III ఎయిర్‌పోర్టులు, బస్‌స్టేషన్స్ మరియు రైల్వే స్టేషన్	1.80	1.77
హెచ్‌టి IV ఎత్తిపోతలు మరియు వ్యవసాయం & సిపిడబ్ల్యుయస్	0.36	0.21
హెచ్‌టి VI టౌన్‌షిప్స్ మరియు కాలనీలు	1.31	1.01
హెచ్‌టి తాత్కాలిక సరఫరా	2.76	
33కెవి హెచ్‌టి		
హెచ్‌టి I పరిశ్రమలు	1.46	1.44
హెచ్‌టి II ఇతరాలు	1.76	1.78
హెచ్‌టి IV ఎత్తిపోతలు మరియు వ్యవసాయం & సిపిడబ్ల్యుయస్	1.26	0.86
హెచ్‌టి VI టౌన్‌షిప్స్ మరియు కాలనీలు	1.32	1.29
132 కెవి హెచ్‌టి మరియు ఆపైన		
హెచ్‌టి I పరిశ్రమలు	1.30	1.31
హెచ్‌టి II ఇతరాలు	1.69	3.55
హెచ్‌టి III ఎయిర్‌పోర్టులు, బస్‌స్టేషన్స్ మరియు రైల్వే స్టేషన్	1.51	-
హెచ్‌టి IV ఎత్తిపోతలు మరియు వ్యవసాయం & సిపిడబ్ల్యుయస్	1.24	1.28
హెచ్‌టి V ట్రాక్షన్ & హెచ్.ఎమ్.ఆర్	1.28	1.05
హెచ్‌టి VI టౌన్‌షిప్స్ మరియు కాలనీలు	-	1.28

విద్యుత్ అమూల్యమైనది. దానిని బాధ్యతాయుతంగా వాడండి

2020కల్లా 50వేల కోట్ల టర్నోవర్!



రెండు నెలల్లో కూకట్‌పల్లిలో షోరూం ప్రారంభం

లలితా జ్యువెల్లరీ చైర్మన్ ఎం కిరణ్ కుమార్ వెల్లడి

హైదరాబాద్, ఆగస్టు 27: బంగారు, వజ్రాభరణాల విక్రయ వ్యాపారంలో ప్రముఖ సంస్థ లలితా జ్యువెల్లరీ.. హైదరాబాద్‌లో అతిపెద్ద నగల షోరూంను ఏర్పాటు చేసింది. రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, గనులు, పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి కేటీఆర్ సతీసమేతంగా విచ్చేసి ఈ షోరూంను ప్రారంభించారు. కేంద్ర కార్మిక, ఉపాధి కల్పన శాఖ మంత్రి బండారు దత్తాత్రేయ జ్యోతి ప్రజ్వలన చేశారు. సోమాజిగూడ ప్రాంతంలో 1.30 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో రూ.750 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేసిన ఈ నగల విక్రయ కేంద్రం.. ప్రపంచంలోని అతిపెద్ద షోరూంలలో ఒకటని లలితా జ్యువెల్లరీ మార్ట్ ప్రైవేట్ లిమిటెడ్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ (సీఎండీ) డాక్టర్ ఎం కిరణ్ కుమార్ తెలిపారు. ఈ షోరూంలో రూ.మూడు వేలు మొదలుకొని రూ.3 కోట్ల వరకు విలువ చేసే ఆభరణాలు అందుబాటులో ఉంటాయన్నారు. మరో రెండు నెలల్లో హైదరాబాద్‌లోనే కూకట్‌పల్లిలో మరో షోరూంను ప్రారంభించబోతున్నట్లు ఆయన వెల్లడించారు. ఆర్థిక సంవత్సరం చివరికల్లా ఏపీలోని విజయవాడ, రాజమండ్రిలో సైతం షోరూంలు ఏర్పాటు చేయనున్నట్లు కిరణ్ కుమార్ తెలిపారు. ప్రస్తుతం 14 షోరూంల ద్వారా వార్షిక టర్నోవర్ రూ.11 వేల కోట్ల స్థాయిలో ఉందని, ఈ ఏడాదిలో రూ.15 వేల కోట్లకు చేరుకోవచ్చన్నారు. 2020కల్లా టర్నోవర్‌ను రూ.50 వేల కోట్లకు పెంచుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆయన చెప్పారు. షోరూం ప్రారంభోత్సవం సందర్భంగా పరిమిత కాలానికి ప్రత్యేక సదుపాయాలు అందిస్తున్నట్లు లలితా జ్యువెల్లరీ ప్రకటించింది. అన్ని బంగారు నగలుపై తరుగులో ఒక శాతం రాయితీ లభించనుంది. అన్ని వజ్రాభరణాలపై క్యారెట్‌కు రూ.2వేల తగ్గింపు సదుపాయం కల్పిస్తున్నట్లు సంస్థ తెలిపింది. ఆదివారం జరిగిన షోరూం ప్రారంభోత్సవంలో రాష్ట్ర హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డి, శాసనమండలి చైర్మన్ స్వామి గౌడ్, ఖైరతాబాద్ శాసనసభ సభ్యులు చింతల రామచంద్రారెడ్డి, పార్లమెంట్ సభ్యులు టీ సుబ్బిరామిరెడ్డి, అసదుద్దీన్ ఓవైసీ పాల్గొన్నారు.



లలితా జ్యువెల్లరీ షోరూం ప్రారంభోత్సవ కార్యక్రమంలో రాష్ట్ర ఐటీ మంత్రి కేటీఆర్, ఆయన సతీమణి శైలిమ, కేంద్ర కార్మిక మంత్రి బండారు దత్తాత్రేయ, ఖైరతాబాద్ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, పార్లమెంట్ సభ్యులు టీ సుబ్బిరామిరెడ్డి . చిత్రంలో లలితా జ్యువెల్లరీ చైర్మన్ డాక్టర్ ఎం కిరణ్ కుమార్ కూడా ఉన్నారు.

పిసరంత కొన్నా పాన్ తప్పనిసరి!?



న్యూఢిల్లీ, ఆగస్టు 27: భవిష్యత్‌లో బంగారం కొనుగోలు లావాదేవీలన్నింటికీ పాన్ కార్డు సమర్పించడం తప్పనిసరి అయ్యేట్టుంది. అంటే, గ్రాము పుత్తడి కొన్నా పాన్ కార్డు వివరాలు ఇవ్వాల్సిందేనన్నమాట. అనధికారిక సొమ్మును బంగారం రూపంలో దాచుకునే ప్రయత్నాలకు అడ్డుకట్ట వేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ దిశగా నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. దేశంలో పొదుపును పెంపొందించే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన కమిటీ ఈ ప్రతిపాదన చేసింది. అంతేకాదు, బంగారం విక్రయ లావాదేవీలు మరుగునపడిపోకుండా వాటిని ఎలక్ట్రానిక్ రిజిస్ట్రీలో నిక్షిప్తం చేయాలని కమిటీ సూచించింది. ప్రస్తుతం రూ.2 లక్షలకు పైగా విలువ చేసే బంగారం కొనుగోలుకు పాన్ వివరాలు సమర్పించడం తప్పనిసరి. దేశంలోని కుటుంబాలు, దేవాలయాలు, చారిటీ సంస్థల వద్ద 22-23 వేల టన్నుల బంగారం నిరుపయోగంగా పడి ఉందని వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ అంచనా. ప్రతి యేటా భారత్‌లోకి 850-1,000 టన్నుల మేర బంగారం దిగుమతి అవుతున్నది. ప్రపంచంలోని ఇతర దేశాలతో పోలిస్తే భారతీయుల వద్ద బంగారం నిల్వలు చాలా అధిక స్థాయిలో ఉన్నాయని కమిటీ పేర్కొంది. పన్ను ఎగవేసిన సొమ్ముతో బంగారం కొనుగోళ్లు జరుపడమే ఇందుకు కారణమై ఉంటుందని పేర్కొంది. పసిడి బాండ్ల నిబంధనల్లోనూ మార్పులు చేయాలని కేంద్ర ప్రభుత్వానికి కమిటీ సూచించింది. పసిడి బాండ్ల కాలపరిమితి తీరాక పెట్టుబడిని నగదు రూపంలోనే కాకుండా లోహ రూపంలో పొందే అవకాశాన్ని కల్పించాలని కోరింది.

జూలై జీఎస్టీ వసూళ్లు 60వేల కోట్లు



న్యూఢిల్లీ, ఆగస్టు 27: వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) అమలులోకి వచ్చిన తొలినెలకు రూ.60 వేల కోట్ల పన్ను వసూలైంది. స్టేట్ జీఎస్టీ, సెంట్రల్ జీఎస్టీ, ఇంటిగ్రేటెడ్ జీఎస్టీతోపాటు పొగాకు ఉత్పత్తులు, కార్లు వంటి ఆయోగ్యకరమైన, విలాస వస్తువులపై సెస్సు వసూలు ద్వారా ఈ ఆదాయం సమకూరిందని ప్రభుత్వ అధికారి ఒకరు బ్లూంబర్గ్ క్వింట్‌కు తెలిపారు. జీఎస్టీఎన్ పోర్టల్‌లో ఇప్పటివరకు 50 లక్షల మంది పన్ను చెల్లింపుదారులు రిజిస్టర్ చేసుకున్నారు. గతనెలకు జీఎస్టీ రిటర్నుల దాఖలు చేసేందుకు గడువు ఈనెల 25తో ముగిసింది. చివరితేదీనాటికి 32 లక్షల మంది రిటర్నులు ఫైల్ చేశారు. మిగతా వారు సోమవారానికల్లా రిటర్నులు దాఖలు చేయవచ్చని అధికారి ఆశాభావం వ్యక్తం చేశారు. ఎందుకంటే, ఇన్‌పుట్ ట్యాక్స్ క్లెయిమ్ చేసుకోవాలనుకునేవారికి రిటర్నులు ఫైల్ చేసేందుకు కేంద్రం ఈనెల 28వరకు సమయం ఇచ్చింది. గత ఏడాది జూలైలో కస్టమ్స్ సుంకంతో కలిపి రూ.68,341 కోట్ల పరోక్ష పన్నులు వసూలయ్యాయి.


జీఎస్టీ నిఘా విభాగానిదే ఆ బాధ్యత

జెమ్స్ అండ్ జ్యువెల్లరీ రంగంలో మనీలాండరింగ్ వ్యవహారాల నియంత్రణ బాధ్యతను జీఎస్టీ నిఘా విభాగానికి కట్టబెట్టింది ప్రభుత్వం. ఇందుకోసం మనీలాండరింగ్ నిరోధక చట్టం (రికార్డుల నిర్వహణ) నిబంధనల్లో తగిన సవరణలు చేస్తూ గతవారంలో కేంద్ర ఆర్థిక శాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. మనీలాండరింగ్ నిరోధక చట్టం ప్రకారంగా.. రిపోర్టింగ్ ఏజెన్సీనే రూ.10 లక్షలకు మించిన లావాదేవీల రికార్డులను నిర్వహించాల్సి ఉంటుంది. అంతేకాదు, రూ.5 లక్షలకు మించిన క్రాస్ బోర్డర్ ట్రాన్సాక్షన్లను, రూ.50 లక్షల కంటే విలువ చేసే స్థిరాస్తి క్రయ, విక్రయ లావాదేవీలను సైతం నియంత్రణ మండలే నిక్షిప్తం చేయాల్సి ఉంటుంది.

కార్లపై సెస్సు పెంపు.. ఈవారంలోనే నిర్ణయం

మిడ్‌సైజ్, లగ్జరీ కార్లతోపాటు స్పోర్ట్స్ యుటిలిటీ వెహికిల్స్‌పై (ఎస్‌యూవీ) సెస్సును 15 శాతం నుంచి 25 శాతానికి పెంచుతున్నట్లు కేంద్ర ప్రభుత్వం ఈ వారంలోనే ప్రకటించే అవకాశం ఉంది. కార్లపై సెస్సును మరింత పెంచే ప్రతిపాదనకు జీఎస్టీ మండలి ఈనెల 5న ఆమోదం తెలిపింది. అయితే, సెస్సు పెంచేందుకు జీఎస్టీ (రాష్ట్రాలకు పరిహారం చెల్లింపు) చట్టంలోని సెక్షన్ 8లో సవరణలు చేయాల్సి ఉంటుంది. ఆర్డినెన్స్ ద్వారా చట్టంలో సవరణ చేస్తూ కేంద్రం ఈవారంలో నోటిఫికేషన్ జారీ చేసే అవకాశం ఉంది. జీఎస్టీ అమలలోకి వచ్చే ముందు భారీగా తగ్గిన లగ్జరీ కార్లు, ఎస్‌యూవీల ధరలను మళ్లీ గణనీయంగా పెంచాల్సి వస్తుందని వాహన సంస్థలు ఇప్పటికే సంకేతాలిచ్చాయి.

సహారా హోటళ్లపై మిడిల్ ఈస్ట్ సంస్థ ఆసక్తి



న్యూయార్క్/న్యూఢిల్లీ, ఆగస్టు 27: కష్టాల్లో కొట్టుమిట్టాడుతున్న సహారా గ్రూపునకు చెందిన అమెరికా హోటళ్లను కొనుగోలు చేసేందుకు మిడిల్ ఈస్ట్‌కు చెందిన ఓ సంస్థ ఆసక్తిగా ఉన్నట్లు తెలుస్తున్నది. అయితే, ఆ సంస్థ పేరు మాత్రం బయటికిరాలేదు. ఇరు వర్గాల మధ్య కొనసాగుతున్న చర్చలు త్వరలోనే కొలిక్కి రావచ్చని తెలుస్తున్నది. సహారా గ్రూపునకు యూఎస్‌లో రెండు హోటళ్లున్నాయి. అందులో ఒకటి 'ది ప్లాజా' కాగా.. మరొకటి డ్రీమ్ డౌన్‌టౌన్. గతంలో ప్లాజా హోటల్.. ప్రస్తుత అమెరికా అధ్యక్షుడు, రియల్ ఎస్టేట్ దిగ్గజం డొనాల్డ్ ట్రంప్‌లో ఆధీనంలో ఉండేది. ఈ రెండు హోటళ్లు వంద కోట్ల డాలర్ల వరకు పలికే అవకాశం ఉంది. సహారాకు డ్రీమ్ డౌన్ టౌన్‌లో 85 శాతం, ప్లాజా హోటల్‌లో 70 శాతం వాటా ఉంది. ఖతార్‌కు చెందిన ప్రభుత్వ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్‌తోపాటు చైనా, అమెరికాకు చెందిన ఇన్వెస్టర్లు కూడా గతంలో ఈ హోటళ్లను కొనుగోలు చేసేందుకు ఆసక్తి ప్రదర్శించాయి. డిపాజిటర్ల సొమ్ము తిరిగి చెల్లించే కేసులో క్యాపిటల్ మార్కెట్ నియంత్రణ మండలి సెబీతో చాలాకాలంగా పోరాటం చేస్తున్న సహారా గ్రూపు.. చైర్మన్ సుబ్రతారాయ్ బెయిల్ కోసం అవసరమైన నిధులు సేకరించేందుకు భారత్‌లో, విదేశాల్లో ఉన్న ఆస్తులను విక్రయించే పనిలో ఉంది.

కనీసం 2-3 ఏండ్లు

నీలేకనే చైర్మన్‌గా కొనసాగాలి

- రవి వెంకటేశన్ బోర్డు నుంచీ తప్పుకోవాలి
- ఇన్ఫోసిస్ మాజీ సీఎఫ్‌వో వీ బాలకృష్ణన్



నందన్ నీలేకని

న్యూఢిల్లీ, ఆగస్టు 27: ఇన్ఫోసిస్‌కు చైర్మన్‌గా నియమితులైన నందన్ నీలేకని.. కనీసం 2-3 ఏండ్లపాటైనా ఈ పదవిలో కొనసాగాలని సంస్థ మాజీ సీఎఫ్‌వో వీ బాలకృష్ణన్ (బాల) అభిప్రాయపడ్డారు. ప్రమోటర్ల ప్రమేయం లేకుండా బయటి వ్యక్తుల సారథ్యంలో సంస్థను అభివృద్ధి పథంలో నడిపించాలన్న ప్రయత్నాలు మరోసారి విఫలం కాకుండా నీలేకని చాలా జాగురూకతతో తన వారసుడిని ఎంపిక చేసుకోవాలన్నారు. సంస్థలో కార్పొరేట్ గవర్నెన్స్ ప్రమాణాలు దిగజారాయని సహ వ్యవస్థాపకుడు నారాయణమూర్తితోపాటు బహిరంగంగా విమర్శలు చేసినవారిలో బాలకృష్ణన్ ఒకరు. తాజాగా ఆయన మరో డిమాండ్‌ను తెరపైకి తీసుకొచ్చారు. నీలేకని రీఎంట్రీ నేపథ్యంలో సంస్థ సహ చైర్మన్ పదవికి రాజీనామా చేసిన రవి వెంకటేశన్ బోర్డులో స్వతంత్ర డైరెక్టర్ పదవి నుంచి సైతం తప్పుకోవాలని డిమాండ్ చేశారు. 'ఇన్ఫోసిస్ బోర్డును ప్రొఫెషనల్‌గా నడుపాలని 2014లో చాలా పెద్ద ప్రయోగం చేశారు. తొలిసారిగా కంపెనీ వ్యవస్థాకుల స్థానంలో విశాల్ సిక్కాకు సారథ్య బాధ్యతలు కట్టబెట్టారు. కానీ బోర్డు సరిగ్గా సరిగ్గా పని చేయకపోవడం వల్ల ఆ ప్రయోగం విఫలమైంది' అని బాల అన్నారు.

పనయా డీల్‌పై దర్యాప్తు రిపోర్టును బహిర్గతం చేయాలి..

భవిష్యత్‌లో నీలేకని సంస్థను వీడాలనుకున్నప్పుడు ఆయన లేని లోటును భర్తీ చేయగలిగే మంచి వ్యక్తిని వెతుకడంపై దృష్టిపెట్టాలన్నారు. కంపెనీ భవిష్యత్ చైర్మన్.. బోర్డు సమర్థ వ్యక్తి చేతుల్లో ఉందన్న నమ్మకం కల్పించగలగాలని అన్నారు. ఇన్ఫోసిస్ చైర్మన్‌గా నీలేకని ముందు చక్కదిద్దాల్సిన పనులు ఎన్నో ఉన్నాయని బాల అన్నారు. బోర్డును పునర్వ్యవస్థీకరించాల్సి ఉందని, కొత్త సీఈవోను వెతుకాల్సి ఉందన్నారు. పరిస్థితులు చక్కదిద్దుకున్నాక భవిష్యత్ చైర్మన్ నియామకం కోసం ప్రణాళికను ఏర్పాటు చేసుకోవాలన్నారు. పనయా డీల్‌పై జరిపిన ఫోరెన్సిక్ ఆడిటింగ్ దర్యాప్తు నివేదికను బహిర్గతం చేయాలని బాల అభిప్రాయపడ్డారు. అయితే, ఇప్పుడే నీలేకని చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టారు కాబట్టి ఈ విషయాలన్నింటిని పరిశీలించేందుకు తగిన సమయం అవసరం అన్నారు. నాన్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్‌గా ఇన్ఫోసిస్‌లోకి పునరాగమనం చేసిన నీలేకని.. సంస్థలో కార్పొరేట్ గవర్నెన్స్ (పాలనా ప్రమాణాలు) పటిష్ఠపర్చడంతోపాటు స్థిరత్వం కోసం కృషి చేయనున్నట్లు తెలిపారు. అంతేకాదు, బోర్డుకు, నారాయణమూర్తికు మధ్య సత్సంబంధాలు కొనసాగేలా చూస్తానని ఆయన హామీ ఇచ్చారు. విశాల్ సిక్కా స్థానంలో సంస్థకు కొత్త సీఈవోను వెతుకడం తన ప్రధాన ఎజెండాల్లో ఒకటని శుక్రవారం బెంగళూరులోని ఇన్ఫోసిస్ ప్రధాన కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో అన్నారు. బోర్డు పాలనా ప్రమాణాలను పటిష్ఠపర్చేందుకు దీర్ఘకాలిక వ్యవస్థను ఏర్పాటు చేయనున్నట్లు నీలేకని తెలిపారు. ఇందుకోసం తగిన ప్రతిపాదనలతో అక్టోబర్‌కల్లా నివేదికను సిద్ధం చేయాలని నామినేషన్స్ కమిటీని ఆయన కోరారు. అంతేకాదు, సంస్థ వ్యాపార వ్యూహాన్ని సైతం పునఃసమీక్షించి అక్టోబర్‌లో భవిష్యత్ వ్యూహాన్ని ప్రకటిస్తామన్నారు. అంతర్జాతీయ మార్కెట్లో పరిణామాలకు అనుగుణంగా కొత్త వ్యూహాన్ని నిర్దేశించుకోనున్నట్లు ఆయన సంకేతాలిచ్చారు. కంపెనీలో పాలనా ప్రమాణాలు దిగజారాయన్న మూర్తి ఆరోపణలపై ఆయన స్పందిస్తూ.. ఇందుకు సంబంధించిన దర్యాప్తు నివేదికలన్నింటినీ తానే స్వయంగా పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

సీఈవో పదవిపై ఆసక్తి లేదు: బాల



కొత్త సీఈవో కోసం వెతుకుతున్న ఇన్ఫోసిస్.. గతంలో సంస్థలో కీలక పదవులు పోషించిన వారిపైనా దృష్టిసారించింది. సంస్థతోపాటు, గతంలో ఇన్ఫోసిస్‌లో పని చేసిన వారిలోనూ సీఈవో పదవి కోసం సమర్థుడైన వ్యక్తిని అన్వేషించనున్నట్లు నీలేకని ఇన్వెస్టర్లకు తెలిపారు. ఈ నేపథ్యంలో సీఈవో లేదా బోర్డు సభ్యుడిగా మళ్లీ ఇన్ఫోసిస్‌లో చేరే ఉద్దేశమేమైనా ఉందా అన్న ప్రశ్నకు బాలకృష్ణన్.. లేదు అని సమాధానం ఇచ్చారు. 'లేదు. మూడేండ్ల క్రితమే నేనే కంపెనీ నుంచి బయటికొచ్చాను. ప్రస్తుతం ఓ వెంచర్ ఫండ్‌ను నడుపుతున్నాను. నాకు ఆసక్తి లేదు. పూర్వ ఉద్యోగుల్లో అశోక్ వేమూరి, బీజీ శ్రీనివాస్, మోహన్ ఇలా చాలా మంది సమర్థులున్నారు' అని ఆయన పేర్కొన్నారు.



హైదరాబాద్/న్యూఢిల్లీ, ఆగస్టు 27: పెట్రో ధరల్లో రోజువారీ మార్పు విధానం ప్రవేశపెట్టిన తొలినాళ్లలో వాహనదారులకు కొంత ఊరట లభించినప్పటికీ .. గతనెల నుంచి మళ్లీ బాదుడు మొదలైంది. హైదరాబాద్ మార్కెట్లో జూలై 1న రూ.67.02గా ఉన్న లీటరు పెట్రోల్ రేటు ఈనెల 27న (ఆదివారం) రూ.73.12గా నమోదైంది. అంటే గతనెల ఒకటి నుంచి ఇప్పటివరకు లీటరు పెట్రోల్‌పై రూ.6.10 పెరిగిందన్నమాట. అలాగే లీటర్ డీజిల్ ధర జూలై 1న రూ.58.08గా నమోదుకాగా.. ఆదివారం నాటికి రూ.61.96కు చేరుకుంది. అనగా, గడిచిన 58 రోజుల్లో రేటు రూ.3.88 పెరిగింది. ఢిల్లీ మార్కెట్లోనైతే పెట్రోల్ రేటు మూడేండ్ల గరిష్ఠం 69.04 స్థాయికి చేరుకుంది. జూలై 1 నుంచి రూ.6 మేర పుంజుకుంది. డీజిల్ ధర రూ.3.67 పెరిగి ప్రస్తుతం రూ.57.03 స్థాయికి ఎగబాకింది. నాలుగు నెలల్లో ఇదే గరిష్ఠ స్థాయి. జూన్ 16 నుంచి ప్రభుత్వ రంగ ఇంధన విక్రయ సంస్థలు పెట్రో ధరలను రోజువారీగా మార్చే విధానానికి శ్రీకారం చుట్టాయి. ప్రతిరోజు ఉదయం 6 గంటలకు ధరలను సవరిస్తారు. జూన్ రెండో అర్ధభాగంలో ధరలు స్వల్పంగా తగ్గాయి. కానీ గతనెల 3 నుంచి క్రమంగా పెరుగుతూనే ఉన్నాయి.

ఈటీఎఫ్ పెట్టుబడుల వాటా పీఎఫ్ ఖాతాలో జమ!

న్యూఢిల్లీ, ఆగస్టు 27: ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ (ఈపీఎఫ్‌వో) సరికొత్త పద్ధతికి శ్రీకారం చుట్టబోతున్నది. ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్లలో (ఈటీఎఫ్) పెట్టే మొత్తం పెట్టుబడుల్లో ఈపీఎఫ్ చందాదారు వాటాకు చెందిన యూనిట్లను అతడి/ఆమె పీఎఫ్ ఖాతాలో జమ చేయాలని యోచిస్తున్నది. పీఎఫ్ ఖాతా నుంచి అడ్వాన్సు పొందే సమయంలో వాటిని విడిపించుకునేందుకు సైతం వీలుకల్పించనుంది. ఈ విషయంలో కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ ఆఫ్ ఇండియా (కాగ్) అభిప్రాయం కోరింది. త్వరలోనే కాగ్ తన అభిప్రాయాన్ని తెలుపనుందని సెంట్రల్ ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్ వీపీ జోయ్ తెలిపారు. ప్రభుత్వ ఆడిటర్ సానుకూలంగా స్పందిస్తే గనుక ప్రతిపాదనను ఈపీఎఫ్‌వో ధర్మకర్తల కేంద్ర మండలి ముందు ఉంచుతారు. కేంద్ర కార్మిక మంత్రి బండారు దత్తాత్రేయ అధ్యక్షతన సమావేశమయ్యే ధర్మకర్త మండలి ఈ విషయంపై తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం చివరినాటికి (మార్చి 31, 2018) ఈటీఎఫ్‌లలో ఈపీఎఫ్‌వో పెట్టుబడులు రూ.45 వేల కోట్లకు చేరుకోవచ్చని అంచనా. ఈపీఎఫ్‌వోకు దేశవ్యాప్తంగా 5 కోట్ల మంది చందాదారులున్నారు. సంస్థ ప్రస్తుతం రూ.10 లక్షల కోట్లకు పైగా కార్పస్ నిధులను నిర్వహిస్తున్నది.

మళ్లీ ఇన్ఫీ షేర్లు జూమ్!



ఈ వారం స్టాక్ సూచీల్లో తీవ్ర ఊగిసలాటలు

ఇన్ఫోసిస్ చైర్మన్‌గా నందన్ నీలేకని నియమితులైన నేపథ్యంలో సోమవారం నాటి ట్రేడింగ్‌లో సంస్థ షేర్లు భారీగా పుంజుకునే అవకాశం ఉంది. ఇన్ఫీ కొత్త సీఈవో ఎవరు అన్న విషయంపైనా మార్కెట్ వర్గాలు దృష్టిసారించనున్నాయి. విశాల్ సిక్కా రాజీనామా ఫలితంగా వరుసగా రెండు రోజుల్లో 15 శాతం క్షీణించిన ఇన్ఫోసిస్ స్టాకుల ధర గత మూడు సెషన్లలో మళ్లీ 4.5 శాతం మేర పుంజుకుంది. నీలేకని రీఎంట్రీతో ఈవారం సంస్థ షేర్లు మరో 8-10 శాతం మేర పుంజుకోవచ్చని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఇన్ఫోసిస్ షేర్ల దూకుడుతో ఈ వారం తొలి అర్ధభాగంలో మార్కెట్లు పాజిటివ్ ట్రెండ్‌లో కొనసాగినప్పటికీ ఆ తర్వాత రోజుల్లో తీవ్ర ఊగిసలాటలకు లోనుకావచ్చని నిపుణులు అంటున్నారు. ఈ వారంలో విడుదల కాబోయే స్థూల ఆర్థిక గణాంకాలు, ఆగస్టు నెల డెరివేటివ్ కాంట్రాక్టుల ముగింపు సూచీల్లో ఒడిదుడుకులు పెంచనున్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికపు స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) గణాంకాలు ఈనెల 31న (గురువారం) విడుదల కానున్నాయి. గతనెలలో దేశంలోని 8 కీలక రంగాల పనితీరు డాటాను కూడా అదే రోజు ప్రకటించనున్నారు. శుక్రవారం నాడు ఉత్పత్తి రంగ పనితీరును తెలిపే పర్చేజింగ్ మేనేజర్స్ ఇండెక్స్ (పీఎంఐ), బ్యాంకింగ్ రంగంలో రుణ, డిపాజిట్ల వృద్ధి డాటాతోపాటు విదేశీ మారక నిల్వల వివరాలు సైతం విడుదల కానున్నాయి. అదే రోజు చాలావరకు వాహన సంస్థలు ఆగస్టు నెల విక్రయ గణాంకాలను ప్రకటించనున్నాయి. కాబట్టి వారాంతంలో ఆటో స్టాకుల్లో కదలికలు పెరుగనున్నాయి.

అంతర్జాతీయ సంకేతాల విషయానికొస్తే.. గత శుక్రవారం జరిగిన సెంట్రల్ బ్యాంకర్ల 'జాక్సన్ హోల్ ఎకనామిక్ పాలసీ మీటింగ్' నిర్ణయాలు సైతం మార్కెట్లను ప్రభావితం చేయనున్నాయి. బుధవారం నాడు అమెరికా రెండో త్రైమాసిక జీడీపీ గణాంకాలు విడుదల కానుండగా.. వచ్చేనెల 1న గృహ విక్రయాలు, ఉద్యోగాల కల్పన, నిరుద్యోగ రేటు డాటాను సైతం ప్రకటించనున్నారు. మంగళవారం నాడు ఫ్రాన్స్ ప్రభుత్వం జీడీపీ, వినిమయ గణాంకాలను రిలీజ్ చేయనుంది. జర్మనీ సర్కారు ఈనెల 30న ద్రవ్యోల్బణ డాటాను, శుక్రవారం నాడు యూరో మాన్యుఫాక్చరింగ్ పీఎంఐని ప్రకటించనుంది.

నిఫ్టీకి 9,740 స్థాయిలో మద్దతు.. 9,950 వద్ద నిరోధం

గతవారం సెన్సెక్స్ 71.38 పాయింట్లు పెరుగగా.. నిఫ్టీ 19.65 పాయింట్లు బలపడింది. వారంతంలో ట్రేడింగ్ ముగిసేసరికి సెన్సెక్స్ 31,596 వద్ద, నిఫ్టీ 9,857 వద్ద స్థిరపడ్డాయి. సెన్సెక్స్‌లోని టాప్ టెన్ కంపెనీల్లో ఆరింటి మార్కెట్ విలువ రూ.13,799 కోట్లు తగ్గింది. మార్కెట్ టెక్నికల్స్ విషయానికొస్తే.. ఈ వారం సూచీలు ఎగువ దిశగా పయనించినట్లయితే నిఫ్టీకి 9,950 స్థాయిలో నిరోధం ఎదురుకావచ్చు. ఒకవేళ ఈ స్థాయిని అధిగమించగలిగితే మార్కెట్లో కొనుగోళ్లు ఊపందుకొనే అవకాశం ఉంది. మార్కెట్లు ఒత్తిడికి లోనైన పక్షంలో సూచీకి 9,740 వద్ద మద్దతు లభించవచ్చు. ఈ స్థాయిని కూడా నిలబెట్టుకోలేకపోతే అమ్మకాల తీవ్రత పెరిగి నిఫ్టీ 9,500 దిశగా పయనించవచ్చని టెక్నికల్ నిపుణులు అంటున్నారు.

12,626 కోట్ల విదేశీ పెట్టుబడుల ఉపసంహరణ

విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు (ఎఫ్‌పీఐ) షేర్లలో పెట్టుబడులను భారీగా వెనుకకు తీసుకుంటున్నారు. ఈనెలలో ఇప్పటివరకు ఎఫ్‌పీఐలు ఈక్విటీల నుంచి నికరంగా రూ.12,626 కోట్లు ఉపసంహరించుకున్నారు. దేశంలో తయారీ, సేవా రంగాల పనితీరు మందగించడంతోపాటు కార్పొరేట్ సంస్థల మొదటి త్రైమాసిక ఆదాయం అంత ఆశాజనకంగా లేకపోవడం ఇందుకు ప్రధాన కారణం. అయితే, ఇదే కాలానికి ఎఫ్‌పీఐలు బాండ్ మార్కెట్లో మరో రూ.13 వేల కోట్లు పెట్టుబడులు పెట్టారు.

రూపాయికి ఎఫ్‌డీఐల దన్ను: యూబీఎస్

వచ్చే కొన్నేండ్లలో భారత్‌లోకి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల (ఎఫ్‌డీఐ) ప్రవాహం గణనీయంగా పెరుగనుందని అంతర్జాతీయ ఆర్థిక సేవల దిగ్గజం యూబీఎస్ తాజా అధ్యయన నివేదికలో పేర్కొంది. రూపాయి మారకం విలువకు ఎఫ్‌డీఐలు దన్నుగా నిలువనున్నాయని రిపోర్టులో వెల్లడించింది. వర్ధమాన దేశాలకు చెందిన కరెన్సీల్లోకెల్లా రూపాయే అత్యుత్తమ పనితీరు కనబరుస్తున్నదని, ఈ ఏడాదిలో ఇప్పటివరకు డాలర్‌తో రూపాయి మారకం విలువ 6 శాతం బలపడిందని రిపోర్టులో తెలిపింది. మరికొద్ది నెలలపాటు డాలర్-రూపాయి ఎక్స్ఛేంజ్ రేటు 62-66 స్థాయిలో ట్రేడ్ కావచ్చని, 2017-18 ఆర్థిక సంవత్సరంలో సగటు మారకం రేటు 64.3గా నమోదుకావచ్చని యూబీఎస్ అంచనా వేస్తున్నది. వచ్చే ఆర్థిక సంవత్సరంలో సగటు రేటు 65.4గా ఉండవచ్చని పేర్కొంది. గడిచిన దశాబ్దకాలంలో దేశంలోకి ప్రవహించిన ఎఫ్‌డీఐలు దాదాపు రెట్టింపై 2016-17 ఆర్థిక సంవత్సరంలో 4,200 కోట్ల డాలర్లుగా నమోదయ్యాయి. ఈ విలువ జీడీపీలో 1.9 శాతానికి సమానం. వచ్చే ఐదేండ్లలో ఎఫ్‌డీఐలు జీడీపీలో 2.5 శాతానికి పెరుగవచ్చని యూబీఎస్ అంచనా వేస్తున్నది.

మూలధన సాయానికి సిద్ధం

ప్రభుత్వ బ్యాంకుల విలీనంపై కేంద్ర ఆర్థిక శాఖ



న్యూఢిల్లీ, ఆగస్టు 27: ప్రభుత్వ రంగ బ్యాంకుల (పీఎస్‌బీ) విలీనాలను సుగమం చేసేందుకు అవసరమైతే మూలధన నిధుల రూపంలో సాయానికి సిద్ధమని కేంద్ర ఆర్థిక శాఖ తెలిపింది. మొండిబకాయిల సమస్య ఆందోళనకర స్థాయికి చేరుకోవడంతో ప్రభుత్వ రంగ బ్యాంకులు తీవ్ర ఒత్తిడిలో ఉన్నాయి. పీఎస్‌బీల స్థూల నిరర్థక ఆస్తులు రూ.6 లక్షల కోట్ల స్థాయికి చేరుకున్నాయి. ఈ నేపథ్యంలో చిన్న బ్యాంకులను పెద్దవాటిలో విలీనం చేయాలని ప్రభుత్వం భావిస్తున్నది. పీఎస్‌బీల విలీనాలపై నిర్ణయం తీసుకునేందుకు ప్రత్యామ్నాయ వ్యవస్థ లేదా మంత్రి వర్గ కమిటీని ఏర్పాటు చేసేందుకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం కూడా తెలిపింది. ఒత్తిడిలో ఉన్న బ్యాంకుల నుంచి ప్రతిపాదనలు వచ్చాక, విలీనం ద్వారా బలమైన బ్యాంకు ఏర్పాటవుతుందని భావిస్తే మంత్రి వర్గ కమిటీ తగిన నిర్ణయం తీసుకుంటుందని..విలీనం చేసుకోబోయే బ్యాంకుకు అవసరమైతే మూలధన సహాయం కూడా అందిస్తుందని ఆర్థిక శాఖకు చెందిన ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. వచ్చే మార్చిచివరికల్లా ఒక్క విలీనమైనా ఖరారు కావాలని ప్రభుత్వం ఆశిస్తున్నదన్నారు. ప్రస్తుతం దేశీయ బ్యాంకింగ్ రంగంలో ఎస్‌బీఐతోపాటు మరో 20 ప్రభుత్వ బ్యాంకులు సేవలందిస్తున్నాయి. వీటికి బ్యాంకింగ్ మార్కెట్లో 75 శాతం వాటా ఉంది. ఏప్రిల్ 1న ఎస్‌బీఐ.. 5 అనుబంధ బ్యాంకులతోపాటు భారతీయ మహిళా బ్యాంక్‌ను తనలో విలీనం చేసుకుంది.

5,954 డిఫాల్టర్లపై రికవరీ చర్యలు

ఈ ఏడాది మార్చి 31కల్లా ప్రభుత్వ రంగ బ్యాంకులు 5,954 మంది ఉద్దేశపూరిత రుణ ఎగవేతదారులపై (విల్‌ఫుల్ డిఫాల్టర్లు) సర్ఫాయిసీ చట్ట ప్రకారంగా బకాయిల రికవరీ చర్యలు చేపట్టాయి. వీరు బ్యాంకులకు రూ.70 వేల కోట్లు ఎగ్గొట్టారు.

జైట్లీ వందకోట్ల జామ్ మంత్ర

జన్‌ధన్-ఆధార్-మొబైల్ అనుసంధానంతో అందరికీ ప్రయోజనమేనన్న ఆర్థిక మంత్రి



న్యూఢిల్లీ, ఆగస్టు 27: జన్‌ధన్ ఖాతాలు-ఆధార్-మొబైల్ (జేఏఎం-జామ్) అనుసంధానం సామాజిక విప్లవానికంటే తక్కువేం కాదన్న కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ.. తద్వారా ప్రభుత్వానికి, ఆర్థిక వ్యవస్థకు, ముఖ్యంగా పేదవారికి అధిక ప్రయోజనం చేకూరుతుందని అన్నారు. జీఎస్టీ అమలుతో దేశమంతా ఏకరీతి మార్కెట్‌గా మారినట్టే జామ్ ద్వారా భారతీయులందరూ ఉమ్మడి ఆర్థిక, డిజిటల్ వేదికపైకి చేరుతారన్నారు. ప్రధాన మంత్రి జన్‌ధన్ యోజన (పీఎంజేడీవై) ప్రవేశపెట్టి మూడేండ్లయిన సందర్భంగా ఈ విషయాన్ని జైట్లీ ఫేస్‌బుక్‌లో పోస్ట్ చేశారు. వంద కోట్ల వినూత్న ఆధార్ నంబర్లను వంద కోట్ల బ్యాంక్ ఖాతాలతో, వందకోట్ల మొబైల్ నంబర్లతో అనుసంధానం చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆయన తెలిపారు. తద్వారా దేశ ప్రజలంతా ఆర్థిక, డిజిటల్ ప్రధాన స్రవంతిలో భాగమవుతారని మంత్రి పేర్కొన్నారు. ఈ త్రయ అనుసంధాన ప్రక్రియ ప్రయోజనాలను వివరిస్తూ.. పేదలకు ఆర్థిక సేవల పరిధి పెరుగుతుందని, సబ్సిడీ లీకేజీలకు అడ్డుకట్ట పడి ప్రభుత్వానికి ఖర్చులు తగ్గుతాయన్నారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలకు చెందిన 35 కోట్ల మంది లబ్ధిదారుల ఖాతాల్లోకి నేరుగా రూ.74 వేల కోట్లు బదిలీ చేస్తున్నదని జైట్లీ వెల్లడించారు. ఇప్పటివరకు 52.4 కోట్ల వినూత్న ఆధార్ నంబర్లు 73.62 కోట్ల బ్యాంక్ ఖాతాలతో అనుసంధానమయ్యాయని ఆయన తెలిపారు. ఆగస్టు నాటికి జన్‌ధన్ పథకంలో భాగంగా తెరిచిన ఖాతాల సంఖ్య 29.52 కోట్లకు చేరుకుంది.

ప్రాజెక్టులకు వరద

మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పలు ప్రాజెక్టులు జలకళ సంతరించుకున్నాయి. ఆదివారం ఎగువ నుంచి ఎస్సారెస్పీకి వరద భారీగా పెరిగింది. తాలిపేరు ప్రాజెక్టు పది గేట్లు ఎత్తి దిగువకు నీటిని వదులుతున్నారు. కడెం జలాశయం నీటితో కళకళలాడుతున్నది.



శ్రీరాంసాగర్‌కు భారీ ఇన్‌ఫ్లో

మెండోరా: గోదావరి పరీవాహక ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలకు నిజామాబాద్ జిల్లాలోని శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి భారీగా ఇన్‌ఫ్లో వచ్చి చేరుతున్నది. ఆదివారం ఉదయం 2,333 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, సాయంత్రం ఒక్కసారిగా 26,375 క్యూసెక్కులకు పెరిగింది. ఈ సీజన్‌లో ఇప్పటివరకు 19.782 టీఎంసీల వరద వచ్చి చేరింది.

నిజాంసాగర్‌లోకి..

కామారెడ్డి, నమస్తే తెలంగాణ: నిజాంసాగర్ ప్రాజెక్టులోకి 1247 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తున్నది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1405 అడుగులు (17.802 టీఎంసీలు) కాగా ప్రస్తుతం 1385.00 అడుగులకు చేరింది. పోచారం ప్రాజెక్టులో నీటి నిల్వ సామర్థ్యం 1.820 టీఎంసీలు కాగా... ఆదివారం సాయంత్రానికి 1.778 టీఎంసీలకు చేరుకున్నది. ఎగువనుంచి 1396 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తున్నది. కల్యాణి ప్రాజెక్టుకు 771 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతున్నది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 409.50 మీటర్లు కాగా ప్రస్తుతం 409.40 మీటర్లకు చేరుకున్నది.





నిండుకుండలా కడెం జలాశయం

కడెం/సారంగపూర్: నిర్మల్ జిల్లా కడెం ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టానికి చేరి జలకళను సంతరించుకుంది. ఇటీవల కురిసిన భారీ వర్షాలతో వరద వచ్చి చేరడంతో జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరుకున్నది. అదనంగా వచ్చే నీటిని దిగువ గోదావరిలోకి 6,122 క్యూసెక్కులు వదిలారు.

తాలిపేరు గేట్లు ఎత్తివేత

చర్ల రూరల్: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా తాలిపేరు ప్రాజెక్టుకు వరద పోటు తగిలింది. ఉదయం తక్కువగా ఉన్న వరద సాయంత్రానికి భారీగా పెరిగింది. డ్యాంలోకి ఎగువప్రాంతం నుంచి వరద వస్తుండటంతో ఆదివారం సాయంత్రం 10 గేట్లు ఎత్తి 35 వేల క్యూసెక్కుల నీటిని వదిలారు.



సింగూర్‌కు ఇన్‌ఫ్లో

పుల్కల్: సంగారెడ్డి జిల్లా పుల్కల్ మండలం సింగూర్ ప్రాజెక్టులోకి వరద ప్రవాహం కొనసాగుతున్నది. ఆదివారం ప్రాజెక్టులోకి 6,386 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరింది. డ్యాంలోకి వారం రోజులుగా రెండున్నర టీఎంసీల నీరు చేరిందని ప్రాజెక్టు అధికారులు తెలిపారు. 30 టీఎంసీల నీటి సామర్థ్యం గల డ్యాంలో ప్రస్తుతం 19.779 టీఎంసీల నీరుంది.





జోగుళాంబ గద్వాల జిల్లాలోని మానవపాడు వద్ద పారుతున్న వాగు


వానలే వానలు..

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్: వాయవ్య బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం ఉత్తర ఒడిశా, బెంగాల్‌కు ఆనుకొని స్థిరంగా కదులుతుండటంతో రాష్ట్రంలో మూడు రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. ఆదివారం హైదరాబాద్ నగరంతో సహా పలు జిల్లాలో వర్షాలు కురిశాయి. నగరంలోని సికింద్రాబాద్ సర్కిల్ తోపాటు పాతబస్తీ, శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్, అల్వాల్, కంటోన్మెంట్, కాప్రా, మల్కాజిగిరి, ఉప్పల్, ఓయూ, రాజేంద్రనగర్, శంషాబాద్, శివరాంపల్లి తదితర ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. మెహిదీపట్నం, నాంపల్లి, అమీర్‌పేట, ఖైరతాబాద్, బేగంపేట, అత్తాపూర్ తదితర ప్రాంతాల్లో మోస్తరు వర్షం కురిసింది. అల్పపీడనం మరింత బలపడటంతో వచ్చే మూడు రోజులు మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశమున్నట్టు వాతావరణశాఖ డైరెక్టర్ నాగరత్న తెలిపారు. శనివారం సాయంత్రం నుంచి ఆదివారం ఉదయం 8.30 వరకు రంగారెడ్డి జిల్లాలో దోమ ప్రాంతంలో అత్యధికంగా 4.8సెం.మీ. వర్షపాతం నమోదైంది. జోగుళాంబ గద్వాల జిల్లా ఇటిక్యాల, మానవపాడు, ఉండవెల్లి మండలాల్లో వాగులు, వంకలు పొంగిపొర్లాయి. ఇటిక్యాలలోని ఊరచెరువు అలుగునిండి జలకళ సంతరించుకున్నది. మానవపాడు -అమరవాయి గ్రామాల మధ్య వాగు పొంగి పొర్లుతున్నది. ఉండవెల్లి మండలం చిన్న ఆముదాలపాడులో మట్టిమిద్దె కూలింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చంద్రుగొండ, కరకగూడెం మండలాల్లో ఆదివారం ఉదయం నుంచి జోరువాన కురిసింది. వాన రాకతో రైతుల్లో ఆనందం వెల్లివిరిసింది. వరి పొలాల నాట్లు ఇప్పటికే ఆఖరి దశకు చేరుకున్నాయి. మిగిలిన పొలాల్లో నాట్లు వేసేందుకు ఈ వాన ఉపయోగపడనుంది. ఈ వర్షాల వల్ల వాగుల్లోకి భారీగా వర్షపు నీరు చేరుతున్నది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా వాజేడు మండలం కొప్పుసూరు అటవీప్రాంతంలో గల గుండ్ల వాగు ప్రాజెక్టు మత్తడిపోసింది.

ప్రాజెక్టుల ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లో, నీటి నిల్వ వివరాలు

కృష్ణా బేసిన్

ప్రాజెక్టు	ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	ఔట్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	పూర్తినీటిమట్టం (అడుగుల్లో)	ప్రస్తుతనీటిమట్టం (అడుగుల్లో)	పూర్తిసామర్థ్యం (టీఎంసీల్లో)	ప్రస్తుతం (టీఎంసీల్లో)
ఆల్మట్టి	17886	8106	1705	1703.74	128.72	122.80
నారాయణపూర్	6144	10895	1615	1612.01	37.646	33.55
జూరాల	2199	2025	1045	1038.48	9.66	5.99
తుంగభద్ర	10795	1226	1633	1620.58	100.86	59.81
శ్రీశైలం	2321	46	885	783.30	215.807	21.65
నాగార్జునసాగర్	749	749	590	500.10	312.045	115.47
పులిచింతల	3362	0	175	124.15	45.77	4.86
ప్రకాశం బ్యారేజీ	9984	9884	56.75	56.35	3.070	2.91



(జూన్1 నుంచి ఇప్పటివరకు 524.783 టీఎంసీల గోదావరి జలాలు సముద్రంలో కలిశాయి)

గోదావరి బేసిన్

ప్రాజెక్టు	ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	ఔట్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	పూర్తినీటిమట్టం (అడుగుల్లో)	ప్రస్తుతనీటిమట్టం (అడుగుల్లో)	పూర్తిసామర్థ్యం (టీఎంసీల్లో)	ప్రస్తుతం (టీఎంసీల్లో)
జైక్వాడ్	4126	241	1522	1515.03	102.732	75.92
కడెం	1703	6122	700	698.300	7.603	7.164
ఎస్సారెస్పీ	26375	377	1091	1069.40	90.313	27.738
సింగూరు	6386	300	1717.93	1710.79	29.91	19.779
నిజాంసాగర్	1247	69	1405	1385.00	17.802	2.32
ఎల్లంపల్లి	6860	660	485	477.00	20.175	13.8009
లోయర్‌మానేరు	0	129	920	893.45	24.07	7.313
ధవళేశ్వరం	160237	160700	45	45	2.93	2.93



మర్పల్లిలో మీడియాతో మాట్లాడుతున్న మంత్రి ఈటల రాజేందర్

గడువులోగా 'భగీరథ' పనులు

బంట్వారం/ మర్పల్లి: మిషన్ భగీరథ పనులు గడువులోపు పూర్తి చేయాలని ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్ కాంట్రాక్టర్లను ఆదేశించారు. ఆదివారం ఆయన వికారాబాద్ జిల్లా మర్పల్లి, బంట్వారం మండలాల్లో మిషన్ భగీరథ పనులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సమైక్య పాలనలో చెరువులకు మరమ్మతులు చేపట్టలేదని విమర్శించారు. మంత్రి వెంట ఎమ్మెల్సీ నరేందర్ రెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కొండల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



ఆదిలాబాద్‌లోని టీఎన్జీవో భవన్‌లో మాట్లాడుతున్న మంత్రి జోగు రామన్న

మహనీయుల ఆశయాలను కొనసాగిస్తాం

ఆదిలాబాద్ అర్బన్, నమస్తే తెలంగాణ: మహనీయుల ఆశయాలను కొనసాగిస్తామని రాష్ట్ర అటవీ శాఖ మంత్రి జోగు రామన్న అన్నారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని టీఎన్జీవో భవన్‌లో ఆదివారం అన్నాబావుసాతే జయంతిని నిర్వహించారు. ముందుగా అంబేద్కర్, అన్న బావుసాతేల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మంత్రి జోగు రామన్న మాట్లాడుతూ మహిళా రైతు కూలీలను రైతులుగా తీర్చిదిద్దడానికి అర్హులందరికీ మూడెకరాల భూమిని ఇస్తున్నామన్నారు. అన్నాబావుసాతే విగ్రహాన్ని ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేసే విషయమై సీఎం దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. మాంగ్ కులస్తుల కోసం జిల్లా కేంద్రంలో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి నిధులు కేటాయిస్తామన్నారు.




కోనరావుపేటలో ఆలయ పరిసరాలను మ్యాప్ ద్వారా పరిశీలిస్తున్న వేములవాడ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్‌బాబు, కలెక్టర్ కృష్ణభాస్కర్ తదితరులు

2న స్వగ్రామానికి గవర్నర్ విద్యాసాగర్‌రావు

నాగారంలో కోదండ రామాలయ పునర్నిర్మాణానికి శంకుస్థాపన

కోనరావుపేట: మహారాష్ట్ర గవర్నర్ చెన్నమనేని విద్యాసాగర్‌రావు వచ్చే నెల 2న రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలంలోని తన స్వగ్రామమైన నాగారానికి రానున్నారు. ఇక్కడ నిర్వహించే కోదండ రామస్వామి ఆలయ పునర్నిర్మాణ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రులు కేటీఆర్, ఇంద్రకరణ్‌రెడ్డితో కలిసి శంకుస్థాపన చేయనున్నారు. ఈ మేరకు ఆదివారం వేములవాడ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్‌బాబు కలెక్టర్ కృష్ణభాస్కర్‌తో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. విద్యాసాగర్‌రావు గవర్నర్‌గా నియమితులైన తర్వాత మొదటిసారి స్వగ్రామం రానుండటంతో అధికారులు ప్రత్యేక ఏర్పాట్లను చేపట్టారు. 1978లో నాగారంలో చెన్నమనేని వంశీయులు నిర్మించిన కోదండ రామస్వామి వారి ఆలయాన్ని పునరుద్ధరించాలని విద్యాసాగర్‌రావు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరగా, మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి సానుకూలంగా స్పందించి రూ.36 లక్షలు మంజూరు చేశారు.



సురేందర్‌రెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మిషన్ భగీరథ వైస్ చైర్మన్ ప్రశాంత్‌రెడ్డి

వేముల సురేందర్‌రెడ్డి విగ్రహావిష్కరణ

వేల్పూర్: నిజామాబాద్ జిల్లా వేల్పూర్ ఎక్స్ రోడ్డు వద్ద టీఆర్‌ఎస్ రైతు విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, తెలంగాణ ఉద్యమనేత, ఎన్‌ఎస్‌ఎఫ్ మాజీ చైర్మన్ దివంగత వేముల సురేందర్‌రెడ్డి కాంస్య విగ్రహాన్ని ఆదివారం అభిమానులు, కార్యకర్తలు ఆవిష్కరించారు. తర్వాత పూలమాల వేసి నివాళులర్పించారు. సురేందర్‌రెడ్డి కుమారుడు, బాల్కొండ ఎమ్మెల్యే, మిషన్ భగీరథ వైస్‌చైర్మన్ వేముల ప్రశాంత్‌రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

జానపద కళలకు పుట్టినిల్లు తెలంగాణ

అంతరించిపోతున్న కళలకు జీవం పోసింది సీఎం కేసీఆర్

రాష్ట్ర సాధనలో కళాకారుల పాత్ర కీలకం ● జానపద జాతరలో మంత్రి జగదీశ్‌రెడ్డి

కుడకుడరోడ్డు: జానపద కళలకు తెలంగాణ రాష్ట్రం పుట్టినిల్లు అని రాష్ట్ర విద్యుత్, ఎస్సీ అభివృద్ధిశాఖల మంత్రి జీ జగదీశ్‌రెడ్డి అన్నారు. సమైక్య పాలనలో అంతరించిపోయిన జానపద కళలకు జీవం పోసి పూర్వ వైభవాన్ని తీసుకొచ్చి, కళాకారులకు ప్రత్యేక గుర్తింపునిస్తూ ఉపాధి కల్పించిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌కు దక్కుతుందని ఆయన అన్నారు. ప్రపంచ జానపద దినోత్సవాన్ని పురస్కరించుకొని సూర్యాపేట జిల్లా కేంద్రంలోని పబ్లిక్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన జానపద జాతర-2017కు హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. ప్రపంచ జానపద జాతరను పురస్కరించుకొని తెలంగాణలో పది రోజులపాటు అన్ని జిల్లాల్లో జానపద జాతరను కన్నుల పండుగలా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉద్యమ కాలంలో కళాకారులు కీలకపాత్ర పోషించి ఆటపాటలతో అందరిని ఉత్తేజపరిచారని, అలాగే ప్రభుత్వం ప్రవేశపెడుతున్న అభివృద్ధి పథకాలపై ప్రజల్లో అవగాహన కల్పించడంలో కళాకారుల ప్రదర్శనలు అభినందనీయమన్నారు. ఇచ్చిన హామీలే కాకుండా ప్రజల అవసరాల మేరకు ఇవ్వని హామీలు సైతం అమలు చేసిన ఘనత టీఆర్‌ఎస్ పార్టీకే దక్కిందన్నారు. కార్యక్రమానికి ముందు స్థానిక తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలలు వేసి, తెలుగు భాషా సంస్కృతి ఆధ్వర్యంలో కళాకారులు నిర్వహించిన భారీ ర్యాలీని మంత్రి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ మందుల సామేల్, మున్సిపల్ చైర్‌పర్సన్ గండూరి ప్రవళ్లికా ప్రకాశ్, జానపద కళాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వంగ శ్రీనివాస్, చెంచు లింగయ్య, గండూరి ప్రకాశ్, పెద్దపంగు స్వరూపారాణి, పూర్ణ శశికాంత్, శ్రావణ్‌కుమార్, ఆంజనేయులు, పెద్దిరెడ్డి గణేశ్, వై వెంకటేశ్వర్లు, వెన్నెల నాగరాజు పాల్గొన్నారు.



సూర్యాపేటలో కళాకారుల ర్యాలీని జెండా ఊపి ప్రారంభిస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి

గోదావరిఖనిలో విలేకరి హత్య



బుగ్గల శ్రీను(ఫైల్)

ఫెర్టిలైజర్‌సిటీ: పెద్దపల్లి జిల్లా గోదావరిఖని శివారు ఉదయ్‌నగర్‌లో సింగరేణి క్వార్టర్‌లో ఆదివారం ఓ దిన పత్రిక విలేకరి అరుకోళ్ల శ్రీనివాస్ అలియాస్ బుగ్గల శ్రీను (40) దారుణ హత్యకు గురయ్యాడు. పోలీసులు, స్థానికులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. బుగ్గల శ్రీను రోజు మాదిరిగానే ఆదివారం వాకింగ్‌కు వెళ్లి వచ్చి తన నివాసానికి (సింగరేణి క్వార్టర్ టీ2-265) ఆనుకొని ఉండే తన ఆఫీస్ గదికి చేరుకున్నాడు. తన భార్య అంజలితో మాట్లాడుతుండగా ఐబీ కాలనీకి చెందిన పెద్ది రవిశంకర్‌తోపాటు మరో నలుగురు వచ్చి శ్రీనుపై కత్తులు, తల్వార్లతో దాడిచేసి హతమార్చారు. అడ్డువచ్చిన అతని భార్య అంజలిని పక్కకు నెట్టేయగా గాయపడింది. చనిపోయాడని నిర్ధారించుకొని, అక్కడి నుంచి వెళ్లిపోయారు. తేరుకున్న అంజలి అరవడంతో స్థానికులు గుమిగూడారు. రామగుండం సీపీ విక్రమ్‌జిత్ దుగ్గల్, పెద్దపల్లి డీసీపీ విజయేందర్‌రెడ్డి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. భూ వివాదమే ఈ హత్యకు కారణమని తెలుస్తున్నది.

పెన్‌గంగలో దూకి తల్లీబిడ్డ ఆత్మహత్య

జైనథ్: నాలుగేండ్ల చిన్నారిని పెన్‌గంగా నదిలోకి విసిరేసిన తల్లి ఆ వెంటనే తానూ దూకి ఆత్మహత్య చేసుకుంది. ఆదిలాబాద్ జిల్లా జైనథ్ ఎస్సై పుల్లయ్య, స్థానికుల కథనం ప్రకారం... ఆదిలాబాద్ ధోబిఘాట్ కాలనీకి చెందిన గొంటిముక్కుల స్వప్న(45), తన కూతురు అతిథి(4)తో కలిసి ఆదివారం ఉదయం 11 గంటల ప్రాంతంలో ఆటోలో జైనథ్ మండలం జాతీయ రహదారి 44 డొల్లార సమీపంలో పెన్‌గంగా నదివైపు వచ్చింది. బ్రిడ్జి వద్ద ఆటోలో నుంచి దిగి గాబరాగా వచ్చి ముందుగా చిన్నారిని నదిలోకి విసిరేసి ఆ వెంటనే తల్లీ దూకినట్టు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. గజ ఈతగాళ్లు వెతుకగా స్వప్న మృతదేహం లభించింది. నీటి ప్రవాహం అధికంగా ఉన్నందున పాప ఆచూకీ లభించలేదు.



గొంటిముక్కుల స్వప్న, అతిథి

తమ్ముడిని తీసుకొస్తూ అనంతలోకాలకు..

- లారీని ఢీకొట్టిన కారు.. ఇద్దరి దుర్మరణం
- మరో ఇద్దరికి తీవ్రగాయాలు, ఒకరి పరిస్థితి విషమం

కొండపాక: దుబాయ్ నుంచి వస్తున్న తమ్ముడిని తీసుకొద్దామని వెళ్లిన అన్న రోడ్డు ప్రమాదానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు. కుకునూర్‌పల్లి ఎస్సై సంతోష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్ జిల్లా గన్నేరువరం గ్రామానికి చెందిన బత్తిని శేఖర్ కొన్నేండ్ల క్రితం దుబాయ్ వెళ్లాడు. శనివారం రాత్రి తిరిగి స్వదేశానికి వస్తున్నట్లు అన్న బత్తిని రమేశ్ (26)తోపాటు తన మిత్రుడు చొక్కారావుపల్లికి చెందిన అనిల్ (28)కి సమాచారం ఇచ్చాడు. అన్న రమేశ్, స్నేహితుడు అనిల్ శనివారం రాత్రి కారులో శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరుకున్నారు. ఉదయం 4 గంటలకు దుబాయ్ నుంచి వచ్చిన శేఖర్‌తో స్వగ్రామం గన్నేరువరానికి కారులో బయలుదేరారు. ఉదయం 6 గంటల సమయంలో కొండపాక శివారులోని మెదక్ ఇంజనీరింగ్ కళాశాల సమీపంలో రాజీవ్ రహదారిపై ఇనుప సలాకల లోడుతో ఆగి ఉన్న లారీని కారు వేగంగా ఢీకొట్టింది. లారీలో ఉన్న ఇనుప సలాకలు కారులోకి దూసుకుపోవడంతో డ్రైవరు పక్కన ముందుసీట్లో కూర్చున్న అనిల్ అతని వెనుక సీట్లో కూర్చున్న బత్తిని రమేశ్‌కు ఇనుప సలాకలు శరీరంలోకి గుచ్చుకుపోయి అక్కడికక్కడే మృతిచెందారు. డ్రైవర్ సంతోష్, శేఖర్ ఇద్దరూ తీవ్ర గాయాలపాలయ్యారు. 108 అంబులెన్స్ సిబ్బంది శేఖర్, సంతోష్‌లను బయటకు తీసి జిల్లా దవాఖానకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు దవాఖానకు తరలించారు. ప్రమాదానికి కారణం లారీడ్రైవరేనని, లారీకి వెనుకభాగంలో ఎలాంటి సిగ్నల్స్ లేకుండా రోడ్డుపై ఆపడం వల్లే ప్రమాదం జరిగిందని మృతుని తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కాగా సీరియస్‌గా ఉన్న వ్యక్తి మరణించినట్టు సమాచారం.



ఆదివారం కొండపాక శివారులో లారీని ఢీకొన్న కారు

రైలు కిందపడి యువకుల బలవన్మరణం

మిర్యాలగూడ టౌన్: ప్రాణస్నేహితులైన ఇద్దరు యువకులు రైలుకింద పడి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఆదివారం నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో జరిగింది. త్రిపురారం మండలం బాబుసాయిపేటకు చెందిన చరణ్ (19), నాగరాజు (19) ప్రాణస్నేహితులు. చరణ్ మిర్యాలగూడలోని బైక్ మెకానిక్‌షాపులో పనిచేస్తుండగా నాగరాజు త్రిపురారంలోని మొబైల్ షాపులో పనిచేస్తున్నాడు. శనివారం ఇరువురు టీక్యాతండా వద్ద ఉన్న రైల్వేపట్టాపై పడుకోగా రైలు వెళ్లడంతో అక్కడికక్కడే మృతిచెందారు. వీరు క్రికెట్, కబడ్డీపై బెట్టింగ్‌కు పాల్పడేవారని, ఆర్థికంగా నష్టపోవడంతో ఆత్మహత్యకు పాల్పడి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు.



చరణ్, నాగరాజు(ఫైల్)



గణపతి నవరాత్రోత్సవాల సందర్భంగా ఆదివారం వేములవాడ రాజరాజేశ్వర స్వామివారి ఆలయం భక్తులతో కిక్కిరిసిపోయింది. వేకువజాము నుంచే భక్తులు ధర్మగుండంలో పవిత్ర స్నానాలు ఆచరించి, మొక్కులు చెల్లించుకున్నారు. నాగిరెడ్డి మండపంలోని సోమేశ్వరస్వామి విగ్రహం వద్ద భక్తులు అభిషేకపూజలు, బాలత్రిపురాసుందరి అమ్మవారి వద్ద కుంకుమ పూజలు చేశారు. ఆరువేల మంది భక్తులు రాజన్నను దర్శించుకొన్నారు. ఆర్జిత సేవల ద్వారా రూ.3 లక్షల ఆదాయం సమకూరినట్టు అధికారులు వెల్లడించారు. **- వేములవాడ కల్చరల్**



యాదాద్రి లక్ష్మినరసింహుడి క్షేత్రం ఆదివారం భక్తులతో పోటెత్తింది. సెలవు రోజు కావడంతో తెలుగురాష్ట్రాలతోపాటు ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన భక్తులతో క్యూలైన్లు నిండిపోయాయి. శ్రీవారి జన్మ నక్షత్రం కావడంతో స్వామివారికి అష్టోత్తర శతఘటాభిషేకం నిర్వహించారు. 108 కలశాలలోని పవిత్రజలంతో శ్రీవారికి అభిషేకం చేశారు. శ్రీవారి ఖజానాకు రూ.16,85,688 ఆదాయం సమకూరింది.

- యాదాద్రి భువనగిరి ప్రతినిధి, నమస్తే తెలంగాణ



జయశంకర్ భూపాలపల్లి జిల్లా వాజేడు మండలంలోని బొగత జలపాతానికి ఆదివారం పర్యాటకుల తాకిడి పెరిగింది. ఛత్తీస్‌గఢ్‌లో కురుస్తున్న భారీ వర్షాలకుతోడు వాజేడులో మూడురోజులుగా వర్షం కురుస్తుండటంతో జలపాతం ఉధృతంగా ప్రవహిస్తుంది. హైదరాబాద్, ఖమ్మం, కరీంనగర్, కొత్తగూడెం, వరంగల్, నల్లగొండ జిల్లాలతోపాటు, ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర నుంచి 10వేల మందికిపైగా పర్యాటకులు బొగత అందాలను చూసి తరించారు. **- వాజేడు**



రజత సింధూరం



ఫైనల్లో పోరాడి ఓడిన తెలుగమ్మాయి
బ్యాడ్మింటన్ వరల్డ్ చాంపియన్‌షిప్‌లో రన్నరప్
భారత్‌కు రెండు పతకాలు

నీ ఆట అజరామరం..
నీ పోరాటం ఆసేతు హిమాచలం..
నీ సాహసం భారతావనికి
స్ఫూర్తిదాయకం..
స్వర్ణం మా ఆశే కావొచ్చు..
దాని కోసం నీ శ్వాసను
ఫణంగా పెట్టావు..
విజయం మా ధ్యాసే అవొచ్చు..
దాని కోసం ఏకంగా
యుద్ధమే చేశావు..
ప్రత్యర్థి పైచేయి సాధిస్తుంటే..
చిరుతలా కదిలావు..
శివంగిలా విరుచుకుపడ్డావు..
కానీ..
కాలం అవకాశం ఇచ్చినా..
అదృష్టం అద్భుతాన్ని ఇవ్వలేదు.
అయినా సరే నీవు ఓడినా..
గెలుపు మాత్రం మనదే..!
40 ఏండ్ల చరిత్రలో..
లెక్కకు మించిన ఘనతలు
లేకపోయినా.. అంతర్జాతీయ
యవనికపై నీవు ఆడిన తీరుకు
త్రివర్ణం పులకించిపోయింది.
గెలువాలన్న నీ ఆరాటానికి
యావత్ దేశం జయహోలు
పలికింది. ఇన్నాళ్లు కంచు మోతకే
పరిమితమైన నీవు... ఇప్పుడు
'రజత సింధూ'రంగా దేశ ప్రతిష్ఠను
ఇనుమడింపచేశావు.
అందుకే సింధు..
దేశం మొత్తం నీకు సలామ్..!



సైనా

గ్లాస్గో: భారత స్టార్ షట్లర్ పూసర్ల వెంకట సింధు... దేశ బ్యాడ్మింటన్ చరిత్రలో సరికొత్త అధ్యాయాన్ని లిఖించింది. ఆదివారం ముగిసిన ప్రపంచ చాంపియన్‌షిప్‌లో 'రజత' పతకంతో సంచలనం సృష్టించింది. హోరాహోరీగా సాగిన మహిళల సింగిల్స్ ఫైనల్లో నాలుగోసీడ్ సింధు 19-21, 22-20, 20-22తో ఏడోసీడ్ నొజొమి ఒకుహర (జపాన్) చేతిలో ఓడి రెండోస్థానంతో సరిపెట్టుకుంది. భారత్ తరఫున ఫైనల్ చేరిన రెండో క్రీడాకారిణిగా రికార్డులకెక్కిన సింధు గతంలో రెండుసార్లు ఇదే చాంపియన్‌షిప్‌లో కాంస్య పతకాలను సాధించింది. ఓవరాల్‌గా సైనా కాంస్యంతో కలిపి ఈసారి చాంపియన్‌షిప్‌లో భారత్ ఎప్పుడు లేని విధంగా రెండు పతకాలు గెలిచి మరో రికార్డును సొంతం చేసుకుంది. గతంలో భారత్‌కు రజతంతో పాటు నాలుగు కాంస్యాలు లభించాయి. 1983లో ప్రకాశ్ పదుకొనే భారత్‌కు తొలి కాంస్యాన్ని అందించాడు. 2011లో డబుల్స్‌లో అశ్విని-జ్వాల జోడి మళ్లీ కాంస్యంతో మెరిసింది.

తొలి గేమ్ చేజారినా..

గంటా 50 నిమిషాల పాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సింధు ఆద్యంతం ఆకట్టుకుంది. ఆరంభంలో కాస్త నెమ్మదిగా ఆడిన సింధు 3-5తో వెనుకబడ్డా.. వరుసగా 8 పాయింట్లు నెగ్గి 11-5 ఆధిక్యంలోకి వెళ్లింది. తన ఎత్తును ఆసరాగా చేసుకున్న తెలుగమ్మాయి కోర్టులో చురుకుగా కదులుతూ షటిల్ ఎక్కడ పడిన సులువుగా తీసుకుంది. ఫలితంగా క్రాస్ కోర్టు రిటర్న్స్‌తో ఒకుహరను కట్టడి చేస్తూ 13-8 ఆధిక్యాన్ని సాధించింది. అయితే ఐదడుగుల జపాన్ అమ్మాయి సుదీర్ఘ ర్యాలీల వైపు మొగ్గడంతో రిటర్న్ సర్వీస్‌లను తీయడంలో సింధు తడబడింది. దీంతో ఒకుహర 13 పాయింట్లలో 10 గెలిచి 18-14 ఆధిక్యంలోకి వెళ్లింది. ఈ దశలో ఒకుహర అనవసర తప్పిదాలు చేయడంతో పుంజుకున్న సైనా 19-19తో గేమ్‌లోకి వచ్చింది. కానీ తన సర్వీస్‌లో షటిల్‌ను నెట్‌కు కొట్టడంతో మూల్యం చెల్లించుకుంది.

73 ర్యాలీలు..

రెండో గేమ్‌లో తను కొట్టిన ఫోర్‌హ్యాండ్ రిటర్న్స్ తీయడంలో ఒకుహర ఇబ్బందిపడటంతో సింధు 5-1, 9-3 ఆధిక్యంలోకి వెళ్లింది. ఇదే జోరును కొనసాగిస్తూ ఒకుహరను నెట్ వద్ద కట్టడి చేసింది. దీంతో 11-8 ఆధిక్యం దక్కింది. ఇక స్కోరు 15-13 ఉన్న దశలో సుదీర్ఘమైన ర్యాలీ సింధు సొంతమైంది. కానీ జపాన్ అమ్మాయి కచ్చితమైన యాంగిల్స్‌లో మరింత బలంగా షాట్లను సంధించింది. దీంతో సింధు ఆధిక్యం 18-16కు తగ్గించింది. ఈ దశలో నెట్ వద్ద రెండు సూపర్ డ్రాప్ చేయడంతో సింధుకు రెండు పాయింట్లు వచ్చాయి. దీంతో స్కోరు 20-17 అయ్యింది. కానీ పట్టువిడవకుండా పోరాడిన ఒకుహర వరుసగా మూడు పాయింట్లు సాధించి 20-20తో స్కోరును సమం చేసింది. చివరకు గేమ్ పాయింట్ కోసం 73 ర్యాలీలు ఆడిన సింధు మొత్తానికి పైచేయి సాధించి మ్యాచ్‌లో నిలిచింది.

చివర్లో నిరాశ..

5-1 ఆధిక్యంతో మూడో గేమ్‌ను ఆరంభించిన ఒకుహర... సింధును ఒత్తిడిలో పడేసింది. కానీ నెట్ వద్ద ఊహించని స్థాయిలో రిటర్న్స్ తీసిన తెలుగమ్మాయి 5-5తో స్కోరు సమం చేసింది. ఇక్కడి నుంచి ర్యాలీల్లో ఆధిపత్యం చూపెట్టిన సింధు 11-9తో ముందుకెళ్లింది. సైడ్‌లు మారిన తర్వాత బ్యాక్‌హ్యాండ్ బాడీ స్మాష్‌లతో చెలరేగిన ఒకుహర 13-12 ఆధిక్యంలోకి వెళ్లింది. ఈ దశలో ఒక్కో పాయింట్ కోసం ఇద్దరు పోరాటం చేయడంతో స్కోరు 17-17 వద్ద సమమైనా సింధు మరింత జోరు చూపుతూ 19-17తో ముందంజ వేసింది. కానీ ఒకుహర కచ్చితమైన క్రాస్ కోర్టు షాట్స్‌తో మరోసారి స్కోరును సమం చేసింది. ఈ దశలో సింధు నెట్ వద్ద తప్పిదం చేయడంతో ఒకుహరకు మ్యాచ్ పాయింట్ దక్కింది. కానీ ఓపికగా పోరాడిన సింధు సుదీర్ఘమైన ర్యాలీతో ప్రత్యర్థిని బేస్‌లైన్ వద్ద కట్టడి చేసి 20-20 స్కోరు చేసింది. అయితే జపాన్ అమ్మాయి కొట్టిన షాట్‌ను తీసే క్రమంలో సింధు మరోసారి నెట్‌కు కొట్టడం, తర్వాతి షాట్‌ను ఒకుహర కచ్చితమైన బ్యాక్‌హ్యాండ్ షాట్ సంధించడంతో సింధుకు నిరాశ మిగిలింది.

> ఆఖరి నిమిషంలో మొత్తం మారిపోయింది. నిర్ణయాత్మక మూడో గేమ్‌లో గెలిచేందుకు ఇద్దరికి సమాన అవకాశాలు ఉండే. ఈ స్థితిలో ఎవరైనా స్వర్ణం గెలువాలన్న లక్ష్యంతో ఉంటారు. కానీ ఒకుహర దీటైన పోటీనివ్వడంతో ఫలితం తారుమారైంది. ఆమె అంత సులవైన ప్రత్యర్థి ఏం కాదు. మేమిద్దరం ఎప్పుడు తలపడ్డా హోరాహోరీ పోరు తప్పదు. సుదీర్ఘ మ్యాచ్ కోసం సిద్ధమైనా..ఈ రోజు నాది కాదని ఓ దశలో అంచనాకు వచ్చాను. **-సింధు**

ఒకుహర



రోహిత్
(124★)

శతక్కొట్టిన రోహిత్

మూడో వన్డేలో భారత్ గెలుపు
3-0తో సిరీస్ కైవసం

పల్లెకెలె: లంక గడ్డపై భారత్ జట్టు జైత్రయాత్ర కొనసాగుతూనే ఉంది. ఓపెనర్ రోహిత్ శర్మ (145 బంతుల్లో 124 నాటౌట్; 16 ఫోర్లు, 2 సిక్సర్లు) అజేయ సెంచరీతో దుమ్మురేపడంతో ఆదివారం జరిగిన మూడో వన్డేలో టీమ్‌ఇండియా 6 వికెట్ల తేడాతో శ్రీలంకపై గెలిచింది. దీంతో ఐదు మ్యాచ్‌ల సిరీస్‌ను మరో రెండు మ్యాచ్‌లు మిగిలి ఉండగానే 3-0తో కైవసం చేసుకుంది. లంకపై భారత్‌కు ఇది ఏడో ద్వైపాక్షిక సిరీస్ విజయం కాగా, 1997 తర్వాత నాలుగోది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన లంక 50 ఓవర్లలో 9 వికెట్లకు 217 పరుగులు చేసింది. లాహిర్ తిరిమానె(105 బంతుల్లో 80; 5 ఫోర్లు, 1 సిక్స్) మినహా మిగతా వారు విఫలమయ్యారు. భారత బౌలింగ్ ధాటిని ఎదుర్కొలేక లంకేయులు వరుస విరామాల్లో వికెట్లు కోల్పోయారు. ముఖ్యంగా ఆరంభం, డెత్ ఓవర్లలో అద్భుతమైన బౌలింగ్ చేసిన బుమ్రా (5/27) మరోసారి ఐదు వికెట్లు తీసి లంక పతనాన్ని శాసించాడు. 28 పరుగులకే 2 వికెట్లు కోల్పోయిన ఆతిథ్య జట్టును చండిమల్ (36)తో నాలుగో వికెట్‌కు 72 పరుగులు జోడించి తిరిమన్నె ఆదుకున్నాడు. డిక్వెల్లా (13) డీఆర్‌ఎస్‌లో బయటపడటం, మెండిస్ (1) ఎక్కువసేపు క్రీజులో నిలువలేకపోవడంతో లంకకు శుభారంభం దక్కలేదు. మ్యాచ్ మధ్యలో హార్దిక్, స్పిన్నర్లు లంకను పరుగులు చేయకుండా నిరోధించారు. మరోసారి నిరాశపర్చిన మాథ్యూస్ (11), తిరిమన్నేతో కలిసి నాలుగో వికెట్‌కు 38 పరుగులు జోడించాడు. 44వ ఓవర్ ముగిసేసరికి 181 పరుగులే చేసిన లంక చివరి ఓవర్లలో పరుగులు రాబట్టడంలో విఫలమైంది.

ఆకట్టుకున్న ధోనీ

లక్ష్య ఛేదనలో భారత్ 45.1 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 218 పరుగులు చేసి గెలిచింది. టాప్ ఆర్డర్‌లో ధవన్ (5), కోహ్లీ (3), రాహుల్ (17), జాదవ్ (0) విఫలంకావడంతో టీమ్‌ఇండియా 61 పరుగులకే 4 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. అయితే రోహిత్ తన నైపుణ్యాన్ని చూపెడుతూ కీలక ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్నాడు. ధోనీ (67 నాటౌట్) సమయోచితంగా స్పందించడంతో భారత్ ఇన్నింగ్స్ సాఫీగా సాగింది. వీరిద్దర్ని విడగొట్టేందుకు లంక చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. అవసరమైనప్పుడల్లా ఈ ఇద్దరు భారీ షాట్లు బాదడంతో స్కోరు బోర్డు పరుగెత్తింది. ఓవరాల్‌గా ఈ జోడీ ఐదో వికెట్‌కు అజేయంగా 157 పరుగులు జత చేసింది. ఈ క్రమంలో రోహిత్ కెరీర్‌లో 12వ శతకాన్ని నమోదు చేస్తే, మహీ 65వ అర్ధసెంచరీ మార్క్‌ను అందుకున్నాడు. స్పిన్నర్ ధనంజయ (2/38) మరోసారి స్పిన్ మ్యాజిక్ చేయలేకపోయాడు. 44వ ఓవర్‌లో ప్రేక్షకులు స్టేడియంలోకి వాటర్ బాటిల్స్ విసురడంతో మ్యాచ్‌కు 35 నిమిషాలు అంతరాయం కలిగింది. తర్వాత పోలీసు పహారాలో మ్యాచ్‌ను కొనసాగించారు. బుమ్రాకు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు లభించింది.



బుమ్రా
(5/27)

స్కోరుబోర్డు

శ్రీలంక: డిక్వెల్లా (ఎల్బీ)బుమ్రా 13, చండిమల్ (సి)బుమ్రా (బి)హార్దిక్ 36, మెండిస్(సి)రోహిత్‌శర్మ(బి)బుమ్రా 1, తిరిమానె (సి)జాదవ్(బి)బుమ్రా 80, మాథ్యూస్(ఎల్బీ)జాదవ్ 11, కపుగెడెర(బి)అక్షర్ 14, సిరివర్ధనె (బి)బుమ్రా 29, ధనంజయ(బి)బుమ్రా 2, చమీర(రనౌట్) 6, ఫెర్నాండో 5 నాటౌట్, మలింగ 1 నాటౌట్; **ఎక్స్‌ట్రాలు: 19; మొత్తం: 50 ఓవర్లలో 217/9; వికెట్ల పతనం: 1-18, 2-28, 3-100, 4-138, 5-159, 6-181, 7-191, 8-201, 9-210; బౌలింగ్:** భువనేశ్వర్ 9-2-41-0, బుమ్రా 10-2-27-5, చాహల్ 10-0-49-0, హార్దిక్ 8-0-42-1, అక్షర్ 10-1-35-1, జాదవ్ 3-0-12-1.

భారత్: రోహిత్‌శర్మ 124 నాటౌట్, ధవన్ (బి)మలింగ 5, కోహ్లీ (సి)చమీర(బి) ఫెర్నాండో 3, రాహుల్(సి)తిరిమానె (బి)ధనంజయ 17, జాదవ్(ఎల్బీ) ధనంజయ 0, ధోనీ 67 నాటౌట్; **ఎక్స్‌ట్రాలు: 2; మొత్తం: 45.1 ఓవర్లలో 218/4; వికెట్ల పతనం: 1-9, 2-19, 3-61, 4-61; బౌలింగ్:** మలింగ 5-0-25-1, ఫెర్నాండో 8.1-2-35-1, చమీర 10-1-59-0, మాథ్యూస్ 3-0-17-0, ధనంజయ 10-0-38-2, సిరివర్ధనె 9-0-43-0.

> వెల్‌డన్ సింధు, సైనా. భారత్ మిమ్మల్ని చూసి గర్విస్తున్నది. అద్భుత విజయం సాధించిన ఒకుహరకు అభినందనలు .
> **- ట్విట్టర్‌లో రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్**

> చాలా బాగా ఆడావు సింధు. ప్రపంచ చాంపియన్‌షిప్‌లో నీ ఆటతీరు పట్ల మేము ఎంతో గర్వపడుతున్నాం. ప్రతిష్ఠాత్మక టోర్నీలో రజత పతకం గెలిచిన నీకు ప్రత్యేక అభినందనలు.
> **- ట్విట్టర్‌లో ప్రధాని నరేంద్ర మోదీ**

సింధు, సైనాకు బాయ్ నజరానా


న్యూఢిల్లీ: ప్రపంచ చాంపియన్‌షిప్‌లో రజతంతో మెరిసిన సింధుకు రూ.10 లక్షలు, కాంస్యంతో ఆకట్టుకున్న సైనాకు రూ.5 లక్షలు నగదు బహుమతిగా ఇస్తున్నట్లు బాయ్ పేర్కొంది. మెగా టోర్నీలో పతకాలతో అద్భుత ప్రదర్శన కనబర్చిన సైనా, సింధుకు బాయ్ చీఫ్ హిమంతబిస్వా శర్మ ఒక ప్రకటనలో అభినందనలు తెలిపారు.

యువతా.. చెమటోడ్చండి!
'మన్ కీ బాత్'లో ప్రధాని మోదీ



న్యూఢిల్లీ: కంప్యూటర్ గేమ్స్‌తో కాలక్షేపం చేయడం కంటే.. మైదానంలో చెమటోడ్చాలని భారత యువతకు ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. ప్లే స్టేషన్‌లో కంటే మైదానాల్లో ఆడటం చాలా ప్రధానమన్నారు. జాతీయ క్రీడా దినోత్సవానికి (ఈనెల 29) రెండు రోజుల ముందే.. ఆదివారం 'మన్ కీ బాత్' కార్యక్రమంలో మాట్లాడిన మోదీ.. ప్రత్యేకంగా క్రీడల గురించి ప్రస్తావించారు. భారత్ ఎక్కువ మంది యువకులతో కూడిన దేశం. ఇది క్రీడా మైదానాల్లో ప్రతిబింబించాలని కోరారు. 'ఇది కంప్యూటర్ల యుగం. అందుకే యువత ప్లే స్టేషన్‌లో కంటే మైదానంలో ఎక్కువగా గడుపాలి. ఈ విషయంలో మిమ్మల్ని అప్రమత్తం చేస్తున్నా. భారత యువతరం ప్రపంచ క్రీడల్లో దర్శనమివ్వాలి. మన జీవితంలో క్రీడలను భాగం చేసుకోవాలి. దీని వల్ల శారీరక ఫిట్‌నెస్, మానసిక ఉల్లాసం, వ్యక్తిత్వం మెరుగుపడుతుంది. ప్రజలందర్ని ఏకతాటిపైకి తెచ్చే ఏకైక మార్గం క్రీడలు. కాబట్టి ఇందులో అందరూ పాల్గొనాలి' అని మోదీ పేర్కొన్నారు.

ఢిల్లీ ఉత్కంఠ విజయం



ముంబై: ప్రో కబడ్డీ లీగ్(పీకేఎల్)లో హోరాహోరీ మ్యాచ్‌ల పరంపర కొనసాగుతున్నది. ఆదివారం ఆద్యంతం ఉత్కంఠ భరితంగా సాగిన మ్యాచ్‌లో దబాంగ్ ఢిల్లీ 33-32 తేడాతో యు ముంబాపై విజయం సాధించింది. ఢిల్లీ జట్టులో కెప్టెన్ మిరాజ్‌షేక్ రైడింగ్‌లో 11 పాయింట్లతో విజృంభించగా, డిఫెన్స్‌లో బాజీరావ్ 4 పాయింట్లతో ఆకట్టుకున్నాడు. యు ముంబా రైడింగ్‌లో పాయింట్లు కొల్లగొట్టినా డిఫెన్స్‌లో తేలిపోవడంతో ఓటమివైపు నిలువాల్సి వచ్చింది. ముంబై టీమ్‌లో కెప్టెన్ అనూప్‌కుమార్ 11 రైడింగ్ పాయింట్లతో మెరిసాడు. అంతకుముందు జరిగిన మరో మ్యాచ్‌లో బెంగాల్ వారియర్స్ 32-26 తేడాతో బెంగళూరు బుల్స్‌పై గెలిచింది. ఎనిమిది మ్యాచ్‌ల్లో బెంగాల్‌కు ఇది నాలుగో విజయం కాగా, బెంగళూరు పదింట్లో ఆరు ఓడిపోయింది. బెంగాల్ జట్టులో జాంగ్‌కున్‌లీ(6), సుర్జీత్‌సింగ్(8) రాణించారు.

ప్రపంచ బాక్సింగ్ క్వార్టర్స్‌లో అమిత్



హంబర్గ్: ప్రపంచ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో భారత బాక్సర్ల జోరు కొనసాగుతున్నది. ఆదివారం జరిగిన 49 కిలోల రెండో రౌండ్ బౌట్‌లో కార్లోస్ క్వీపో(ఈక్వెడార్)పై విజయంతో అమిత్ పంగాల్ క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లాడు. తన కంటే మెరుగైన సీడింగ్‌లో ప్రత్యర్థి ఉన్నప్పటికీ ఏ మాత్రం వెనుకకు తగ్గకుండా అమిత్ పదునైన పంచ్‌లతో చెలరేగాడు. దీంతో మ్యాచ్ రిఫరీలు భారత బాక్సర్‌వైపే మొగ్గుచూపారు. అంతకుముందు జరిగిన వేర్వేరు బౌట్లలో మనోజ్‌కుమార్(69కి) 3-2 తేడాతో వాసిల్లీ బెలోస్(మాల్డోవా)పై గెలువగా, 52కిలోల బౌట్‌లో కవీందర్ 3-2 ర్యుసెయి బాబ(జపాన్)పై విజయంతో రెండో రౌండ్‌లోకి ప్రవేశించారు. సతీశ్‌కుమార్(+91కి) 0-5తో మాజిదోవ్(అజర్‌బైజాన్) చేతిలో ఓడి టోర్నీ నుంచి నిష్క్రమించాడు.

మేవెదర్ 50-0

రూ. 1700 కోట్ల మెగా ఫైట్‌లో అద్భుత విజయం
కెరీర్‌లో వరుసగా 50వ గెలుపు



లాస్‌వేగాస్: అద్భుతం లేదు.. అంతకుమించిన సంచలనమూ లేదు.. అవే పంచ్‌లు.. అవే హుక్స్.. అంతే తీవ్రత.. పంచ్ విసిరితే ప్రత్యర్థికి కండ్లు బైర్లు కమ్మాయి.. హుక్స్ కొడితే ముఖం చిట్లి వాచిపోయింది. రెండేండ్ల రిటైర్మెంట్‌ను పక్కనబెట్టి మళ్లీ బాక్సింగ్ రింగ్‌లోకి దిగిన అమెరికా మాజీ వాల్టర్ వెయిట్ చాంపియన్ ఫ్లాయిడ్ మేవెదర్... కాసుల వర్షం కురిపించిన 'సూపర్ ఫైట్'లోనూ అదరగొట్టాడు. 'అల్టిమేట్ ఫైటింగ్ చాంపియన్', మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్ స్టార్ అయిన కానర్ మెక్‌గ్రెగర్ (ఐర్లాండ్)తో ఆదివారం ఉదయం జరిగిన ఈ బౌట్‌లో మేవెదర్ 'టెక్నికల్ నాకౌట్' ద్వారా గెలిచాడు. అమెరికన్ కొట్టిన పంచ్‌లకు ప్రత్యర్థి బెంబేలెత్తడంతో రిఫరీ రాబర్ట్ బైర్డ్ పదో రౌండ్‌లోనే బౌట్‌ను నిలిపేశాడు. కెరీర్‌లో ఇంతవరకు పరాజయం ఎరుగని 40 ఏండ్ల మేవెదర్‌కు ఇది వరుసగా 50వ విజయం. దీంతో అమెరికా బాక్సర్ తన గెలుపోటముల రికార్డును 50-0కు పెంచుకున్నాడు. రూ. 1700ల కోట్ల ప్రైజ్‌మనీ గల ఈ బౌట్‌లో మేవెదర్‌కు దాదాపు రూ. 1280 కోట్లు లభించగా, 29 ఏండ్ల మెక్‌గ్రెగర్‌కు దాదాపు రూ. 400 కోట్లు దక్కాయి. 'ఫర్‌ఫెక్ట్-50' సాధించిన మేవెదర్ ఇక బాక్సింగ్ కెరీర్‌కు శాశ్వతంగా వీడ్కోలు పలుకనున్నాడు. ఇదే తన ఆఖరి బౌట్ అని ఫైట్‌కు ముందు అతను ప్రకటించాడు.



'మిర్గం' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న టీఎస్‌పీఎస్సీ చైర్మన్ ఘంటా చక్రపాణి. చిత్రంలో బీ నర్సింగరావు, ఏనుగు నరసింహారెడ్డి, రాజేందర్, నాళేశ్వరం శంకరం, యాకూబ్, అమ్మంగి వేణుగోపాల్ తదితరులు

తెలంగాణ వస్తే ఏం వస్తుందన్న వాళ్లకు..

నోటిఫికేషన్లతోనే సమాధానం చెప్తున్నాం

'మిర్గం' పుస్తకావిష్కరణలో టీఎస్‌పీఎస్సీ చైర్మన్ ఘంటా చక్రపాణి

రాంనగర్: తెలంగాణ వస్తే ఏం వస్తుందని ప్రశ్నించిన వాళ్లకు ఉద్యోగాల నోటిఫికేషన్లు సమాధానం చెప్తున్నాయని టీఎస్‌పీఎస్సీ చైర్మన్ ఘంటా చక్రపాణి చెప్పారు. హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ సాహిత్య కళావేదిక ఆధ్వర్యంలో 'మిర్గం (తెలంగాణ కవిత్వం)' పుస్తకావిష్కరణ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. కార్యక్రమానికి ఘంటా చక్రపాణితోపాటు ప్రముఖ సినీ దర్శకుడు బీ నర్సింగరావు, ప్రముఖ రచయిత అమ్మంగి వేణుగోపాల్, కళావేదిక సంయుక్త కార్యదర్శి డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి, టీఎస్‌పీఎస్సీ సభ్యులు 'జింబో' రాజేందర్, తెలంగాణ రచయితల సంఘం అధ్యక్షుడు డాక్టర్ నాళేశ్వరం శంకరం, కవిసంగమం సంచాలకుడు డాక్టర్ యాకూబ్ హాజరై పుస్తకాన్ని ఆవిష్కరించారు. కళావేదిక వార్షిక పురస్కారాన్ని ప్రముఖ కవి వనపట్ల సుబ్బయ్యకు అందజేశారు. ఈ సందర్భంగా ఘంటా చక్రపాణి మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో కవులు, రచయితల పాత్ర మరువలేనిదని కొనియాడారు. వారి రచనలు ఎంతోమందిని చైతన్యపరిచాయని గుర్తుచేశారు. ఉద్యమ సమయంలో తెలంగాణ వస్తే ఏం వస్తుందంటూ ప్రశ్నించిన వాళ్లకు సమాధానంగా గడిచిన కొద్దిరోజుల్లో వేలాది ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లు విడుదల చేశామని ఆయన చెప్పారు. రాష్ట్రంలో అనేకమంది కవులు, కళాకారులు ఉన్నారని, వారిని గుర్తించాల్సిన అవసరం ఉందన్నారు.

జర్నలిస్టుల సంక్షేమానికి కృషి

సీనియర్ జర్నలిస్టులు తమ అనుభవాల్ని పుస్తకరూపంలో తేవాలి

'ట్రూ స్టోరీస్' పుస్తకావిష్కరణలో మంత్రి హరీశ్‌రావు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

జర్నలిస్టుల సంక్షేమానికి ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్నారని, రూ.100 కోట్లతో సంక్షేమనిధిని కూడా ఏర్పాటుచేశారని భారీ నీటిపారుదలశాఖ మంత్రి టీ హరీశ్‌రావు చెప్పారు. జర్నలిస్టులకు కనీసం గూడు అయినా ఉండాలనే ఉద్దేశంతో ఇండ్ల స్థలాలు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. సీనియర్ జర్నలిస్టు, మంత్రి హరీశ్‌రావు పీఆర్వో ఎస్కే జకీర్ తన జర్నలిజం వృత్తి అనుభవాలతో మర్లబడ్డ మొగిలిచర్ల పేరిట రూపొందించిన 'ట్రూ స్టోరీస్' పుస్తకాన్ని ఆదివారం హైదరాబాద్‌లోని హోటల్ హరితప్లాజాలో హరీశ్‌రావు ఆవిష్కరించారు. సమాజం కోసం, ప్రభుత్వం-ప్రజల మధ్య వారధిగా పనిచేసే జర్నలిస్టులు కొందరు చివరకు వైద్య ఖర్చులకు కూడా డబ్బులు లేక ఇబ్బంది పడిన పరిస్థితులున్నాయని మంత్రి హరీశ్‌రావు ఆవేదన వ్యక్తంచేశారు. అందుకే దేశంలో ఎక్కడా లేనివిధంగా జర్నలిస్టు కుటుంబాలకు వారి తల్లిదండ్రులతో సహా వందశాతం కార్పొరేట్ వైద్యం అందించేలా సీఎం కేసీఆర్ హెల్త్‌కార్డులు అందించారని చెప్పారు. రానున్న రోజుల్లో మరిన్ని సంక్షేమ కార్యక్రమాల అమలుకు ప్రభుత్వం కృషిచేస్తున్నదన్నారు. 'జకీర్ 30 ఏండ్ల ప్రస్థానం వామపక్ష ఉద్యమాల నుంచి తెలంగాణ మలిదశ ఉద్యమం వరకు పెనవేసుకొని ఉంది. 2001లో కరీంనగర్‌లో టీఆర్‌ఎస్ తొలి బహిరంగ సభ నుంచి పార్లమెంటులో తెలంగాణ బిల్లు పాసయ్యే వరకు ఆయన ప్రత్యక్ష సాక్షి. నిత్యం ప్రజా సంబంధ సమాచారాన్ని సేకరించే జర్నలిస్టుల సాధక బాధకాలు నాకు తెలుసు. ప్రత్యేక తరహాలో సమాచారాన్ని ప్రజలకు అందించాలనే తపనతో రోజూ ఓ సవాలుగా గడుపుతారు. అడవుల్లోకి వెళ్లి నక్సలైట్లను ఇంటర్వ్యూలు చేయడమంటే అదో సవాలు. తెలంగాణ మలి దశ ఉద్యమంలో భాగంగా కేసీఆర్ ఆర్టీఎస్ పాదయాత్ర చేసినపుడు నేను, జకీర్ కలిసి పని చేసినం. జకీర్ తన 30 ఏండ్ల ప్రస్థానాన్ని సంక్షిప్తంగా పుస్తక రూపంలో తీసుకురావడం సంతోషకరం. ప్రతి సీనియర్ జర్నలిస్టు కూడా ఇలాంటి పుస్తకాలను తీసుకురావడం వల్ల భావి జర్నలిస్టులకు మార్గదర్శకంగా ఉంటుంది. కొత్తతరానికి ఆ విలువైన అనుభవాలను అందించడం చాలా ప్రధానం' అని మంత్రి హరీశ్‌రావు అభిప్రాయపడ్డారు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ ఘంటా చక్రపాణి మాట్లాడుతూ గతంలో తెలంగాణ సంక్షోభ, సంక్లిష్ట పరిస్థితులకు జకీర్ రాసిన పుస్తకం అద్దం పడుతుందన్నారు. తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ మాట్లాడుతూ కథనాల వెనుక ఉన్న కథను వెల్లడించేందుకు మరో కథనాన్ని రాస్తూ ఇలా పుస్తకం తీసుకురావడమనేది గొప్ప ప్రయత్నమని, అది చరిత్రకు దోహదపడుతుందని చెప్పారు. పాత తెలంగాణలోని అల్లకల్లోల పరిస్థితులు ఎలా ఉన్నాయనేది ఈ పుస్తకాన్ని చూస్తే గుర్తొస్తాయన్నారు. ఈ సందర్భంగా జకీర్‌తో ఆయనతో అనుబంధాన్ని అల్లం నారాయణ వివరించారు. పుస్తకంలోని కథనాలను చదువుతుంటే ఆసక్తిగా ఉన్నాయని సీనియర్ జర్నలిస్టు పొత్తూరి వెంకటేశ్వరరావు అన్నారు. పుస్తకాన్ని తీసుకురావడానికి గల కారణాలను రచయిత జకీర్ వెల్లడించారు. సీనియర్ జర్నలిస్టు దేవులపల్లి అమర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో బుద్ధపూర్ణిమ ప్రాజెక్టు అథారిటీ చైర్మన్, సీనియర్ జర్నలిస్టు మల్లెపల్లి లక్ష్మయ్య, సాక్షి ఎడిటోరియల్ డైరెక్టర్ కే రామచంద్రమూర్తి, కవి గోరెటి వెంకన్న దేవులపల్లి అజయ్, పలువురు జర్నలిస్టులు తదితరులు పాల్గొన్నారు.



ఆదివారం హైదరాబాద్‌లో 'ట్రూ స్టోరీస్' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి హరీశ్‌రావు. చిత్రంలో తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ, బుద్ధపూర్ణిమ ప్రాజెక్టు అథారిటీ చైర్మన్ మల్లెపల్లి లక్ష్మయ్య, సాక్షి ఈడీ కే రామచంద్రమూర్తి, సీనియర్ జర్నలిస్టులు పొత్తూరి వెంకటేశ్వరరావు, దేవులపల్లి అమర్, కవి గోరెటి వెంకన్న, పుస్తక రచయిత ఎస్కే జకీర్ తదితరులు కూడా ఉన్నారు.

నంద్యాల ఉపఎన్నిక

ఫలితాలు నేడే

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఉత్కంఠభరితంగా సాగిన నంద్యాల ఉపఎన్నిక ఓట్ల లెక్కింపునకు పట్టణంలోని పాలిటెక్నిక్ కళాశాలలో అన్ని ఏర్పాట్లు చేశారు. నియోజకవర్గంలోని 255 పోలింగ్ కేంద్రాలకు సంబంధించి 1,73,335 ఓట్లను లెక్కించనున్నారు. మొత్తం 19 రౌండ్లలో లెక్కింపు పూర్తి అవుతుంది. ప్రతీ రౌండ్‌కు 9 వేల ఓట్లను లెక్కించనున్నారు. మధ్యాహ్నం ఫలితంపై అధికారిక ప్రకటన వెలువడే అవకాశాలు ఉన్నాయి. టీడీపీ తరపున భూమా నాగిరెడ్డి కుటుంబానికి చెందిన బ్రహ్మానందరెడ్డి బరిలో ఉండగా.. టీడీపీ నుంచి వచ్చిన శిల్పా మోహన్‌రెడ్డి వైసీపీ తరపున పోటీ చేశారు. ఇదిలా ఉండగా ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన వారం రోజుల్లో రాజకీయ పార్టీల తరపున ప్రచారం చేసే ప్రముఖుల వివరాలు ఎన్నికల సంఘానికి అందిస్తే వీరికయ్యే ఖర్చును అభ్యర్థి ఖర్చు కింద పరిగణించరు. టీడీపీ మాత్రం ఈ వివరాలను పంపడంలో జాప్యం చేసింది. ముఖ్యమంత్రి, మంత్రులు, సినీనటుడు బాలకృష్ణల ప్రచార ఖర్చులు అభ్యర్థి ఖాతాలో వేసే అవకాశాలు ఉన్నాయి. మంగళవారం కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్‌లోని 48 వార్డులకు 196 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికలు జరుగనున్నాయి.

ముద్రగడ పాదయాత్రకు మళ్లీ బ్రేక్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఏపీ కాపు ఉద్యమనేత ముద్రగడ పద్మనాభం రిజర్వేషన్ల సాధనకై ఆదివారం మరోసారి పాదయాత్రకు పూనుకున్నారు. ఎలాగైనా పాదయాత్ర చేసి తీరాలన్న పట్టుదలతో ఉన్న ఆయన ఆదివారం తూర్పుగోదావరి జిల్లా కిర్లంపూడి నుంచి యాత్రను ప్రారంభించారు. అనుమతి లేదనే కారణంతో ఆయనను జిల్లాలోని వీరవరం వద్ద పోలీసులు అడ్డుకొని అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా ఆప్రాంతంలో ఉద్రిక్త వాతావరణం నెలకొన్నది. వందల మంది ముద్రగడ అనుచరులు పోలీసులను అడ్డుకునేందుకు ప్రయత్నించారు. పోలీసులకు, అనుచరులకు మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. దీంతో పోలీసులు ఆయన అనుచరులను సైతం అదుపులోకి తీసుకున్నారు. వీరందరినీ బస్సులో తరలించారు. దీంతో మళ్లీ ముద్రగడ పాదయాత్ర ఆగిపోయింది. గత నెల రోజులుగా ఆయనను పోలీసులు గృహ నిర్బంధం చేస్తున్న విషయం తెలిసిందే. పాదయాత్రకు అధికారికంగా ఎలాంటి అనుమతి ఇవ్వలేదని, అందుకే అడ్డుకున్నామని ఏపీ డీజీపీ సాంబశివరావు తెలిపారు.



ఏపీలోని కిర్లంపూడిలో అనుచరులతో పాదయాత్రకు బయలుదేరిన ముద్రగడ పద్మనాభం

బ్లాక్‌మనీని మార్చే హబ్‌గా అమరావతి!

- సింగపూర్ కంపెనీలకు నిధులు మళ్లిస్తున్న చంద్రబాబు
- ప్రజాప్రయోజనాలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు
- ఏపీ మాజీ చీఫ్ సెక్రటరీ ఐవైఆర్ కృష్ణారావు ఆరోపణ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: దేశంలో నల్లధనాన్ని తెల్లధనంగా మార్చుకునేందుకు అమరావతి హబ్‌గా మారిందని ఏపీ మాజీ చీఫ్ సెక్రటరీ ఐవైఆర్ కృష్ణారావు ఆరోపించారు. ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి నిర్మాణ పనుల ముసుగులో నిధులను సీఎం చంద్రబాబునాయుడు సింగపూర్ కంపెనీలకు మళ్లిస్తున్నారని విమర్శించారు. జీవో 179 తీసుకొచ్చి అసెండస్, సింగ్‌బ్రిడ్జ్, సెంబ్‌కార్ప్ వంటి సింగపూర్ కంపెనీలకు నిర్మాణ పనులను అప్పగించారని తెలిపారు. ఏపీ సర్కార్ స్విస్ చాలెంజ్ విధానం అనుసరిస్తున్నదని, వెంటనే జీవో 179ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఏపీ సీఎంకు పంపించిన 19 పేజీల లేఖ సారాంశాన్ని హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఆయన వివరించారు. సింగపూర్‌లో అంతర్గత పరిపాలనలో మాత్రమే నిజాయితీ పాటిస్తారని కృష్ణారావు చెప్పారు. విదేశాల్లో సింగపూర్ చేసే వ్యవహారాలపై చాలామంది ఆర్థికవేత్తలు తీవ్ర అవినీతి ఆరోపణలు వ్యక్తంచేశారని గుర్తుచేశారు. లీక్వాన్ యూ మోడల్ మీదనే అనేక ఆరోపణలు ఉన్నాయని, ప్రజా ప్రయోజనాలకు విరుద్ధంగా ఏపీ ప్రభుత్వం వ్యవహరిస్తున్నదని విమర్శించారు. రాష్ట్ర ప్రయోజనాలను ఫణంగా పెట్టి విదేశీ కంపెనీలకు అనుకూలంగా చట్టాల సవరణ చేశారని ఆరోపించారు. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ తీర్పు రాకముందే సింగపూర్ కంపెనీలకు అమరావతి నిర్మాణ పనులు అప్పగించాల్సిన అవసరం ఏం వచ్చిందని ఆయన ప్రశ్నించారు. ఏపీ ప్రభుత్వ లెక్కలన్నీ గాలిమేడలని, అన్ డైల్యూటెడ్ స్విస్ చాలెంజ్‌ని అమలుచేయవద్దని కేంద్రప్రభుత్వం ఇప్పటికే తేల్చిచెప్పిందని కృష్ణారావు గుర్తుచేశారు. ఇంటర్నేషనల్ బిడ్డింగ్ ద్వారా అమరావతి రాజధాని నిర్మాణ పనులు చేపట్టాలని ఆయన డిమాండ్‌చేశారు.



మీడియాతో మాట్లాడుతున్న ఏపీ మాజీ సీఎస్ ఐవైఆర్ కృష్ణారావు

ఇకపై దేశమంతా ఒకే బస్‌బాడీ!

టీఎస్‌ఆర్టీసీ, ఇతర రాష్ట్ర రవాణా సంస్థల సన్నాహాలు

అవగాహన సదస్సులో సానుకూల అభిప్రాయం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

బస్‌బాడీ తయారీవిధానం ఒక్కో రాష్ట్రంలో ఒక్కో విధంగా ఉన్నది. వాటి ప్రమాణాలు కూడా అలాగే ఉన్నాయి. ఈ నేపథ్యంలో దేశమంతా ఒకే బస్‌బాడీ విధానం అమల్లోకి తీసుకొని రావాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తున్నది. రాష్ట్రాలవారీగా వేర్వేరుగా ఉన్న బస్‌బాడీ తయారీ విధానానికి బ్రేకులు వేయాలని నిర్ణయించింది. ఈ పద్ధతిని నియంత్రిస్తూ ఇటీవల కేంద్రప్రభుత్వం మార్గదర్శకాలు జారీచేసింది. దీంతో ఆ విధానానికి ఆయా రాష్ట్రాల రవాణా సంస్థలు స్వస్తి పలికేందుకు సిద్ధమవుతున్నాయి. ఈ ఏడాది అక్టోబర్ 1 నుంచి ఈ విధానాన్ని అమలు చేసేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఈ విధానంలో ఏఐఎస్-052 బస్‌బాడీ కోడ్ నిర్దేశాలకు అనుగుణంగా నడుచుకోవాల్సి ఉంటుంది. ఇక నుంచి అన్ని రాష్ట్రాల్లో బస్‌బాడీ తయారీలో ఈ పద్ధతిని అనుసరించనున్నారు. దేశంలోని వివిధ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థలు, వాహన తయారీదారులు, రవాణా నియంత్రణ సంస్థల సూచనలు, సలహాలను పరిగణనలోకి తీసుకొని జాతీయ రోడ్డు రవాణా సంస్థ రూపొందించిన నూతన బస్‌బాడీ కోడ్‌పై ఆయా రాష్ట్రాలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించేందుకు వర్క్‌షాపు నిర్వహిస్తున్నారు.



రాష్ట్రంలో మొదటి వర్క్‌షాపు

బస్‌బాడీ ఏఐఎస్-052 కోడ్ విధానంపై టీఎస్‌ఆర్టీసీ తొలిసారి ఇటీవల బస్‌భవన్‌లో వర్క్‌షాపును నిర్వహించింది. జాతీయ రోడ్డు రవాణా సంస్థ ఆదేశాల మేరకు టీఎస్‌ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ జీవీ రమణారావు ఈ వర్క్‌షాపును ఏర్పాటు చేశారు. ఆంధ్రప్రదేశ్, ఒడిశా, గోవా, రవాణా సంస్థల ప్రతినిధులతోపాటు ప్రైవేట్ బస్‌బాడీ తయారీదారులు పాల్గొని దేశవ్యాప్తంగా ఒకే బస్‌బాడీ కోడ్ విధానం అమలుపై చర్చించారు. సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ మేనేజర్ ప్రశాంత్ కాకాడే, శాస్త్రవేత్తలు ఎస్‌హెచ్ అలీ, ఎస్ఎన్ దోలే.. బస్‌బాడీ కోడ్ వల్ల కలిగే ప్రయోజనాలను సదస్సులో వివరించారు. వివిధ రాష్ట్రాల రవాణా సంస్థల ప్రతినిధులు, ప్రైవేట్ బస్‌బాడీ తయారీదారులు, టీఎస్‌ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు రవీందర్, నాగరాజు, వేణుతోపాటు ఇతర అధికారులు సదస్సులో సందేహాలను అడిగి నివృత్తి చేసుకున్నారు. ప్రైవేట్ బస్‌బాడీ తయారీదారులు తమ అభిప్రాయాలను తెలిపారు. ఈ నూతన విధానంతో ప్రయాణికులకు మరింత సౌకర్యంతోపాటు రవాణా భద్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వడం వల్ల బస్‌బాడీ జీవితకాలం మరింత పెరుగుతుందని నిపుణులు చెప్తున్నారు. హైదరాబాద్‌లో జరిగిన వర్క్‌షాపులో దక్షిణాది రాష్ట్రాల రోడ్డు రవాణా సంస్థల నుంచి సానుకూల అభిప్రాయం వ్యక్తమైందని టీఎస్‌ఆర్టీసీ అధికారులు తెలిపారు.

ఏపీ సర్కార్ తీరును నిరసిస్తూ నేడు టీఎస్‌పీఈఏ మహాధర్నా

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: విద్యుత్ ఉద్యోగుల విభజన విషయంలో ఆంధ్రప్రదేశ్ సర్కారు అనుసరిస్తున్న తీరును నిరసిస్తూ సోమవారం మహాధర్నా చేపట్టనున్నట్టు తెలంగాణ రాష్ట్ర పవర్ ఇంజినీర్స్ అసోసియేషన్ (టీఎస్‌పీఈఏ) సెక్రటరీ జనరల్ రత్నాకర్‌రావు తెలిపారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు చెందిన విద్యుత్ ఇంజినీర్ల ఆధ్వర్యంలో మధ్యాహ్నం 12 గంటలకు విద్యుత్ సౌధ ఎదుట మహాధర్నా చేపట్టనున్నట్టు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

1న సీపీఎస్ ఉద్యోగుల సామూహిక సెలవు

సీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు స్థితప్రజ్ఞ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం (సీపీఎస్)ను రద్దు చేయాలని సెప్టెంబర్ 1న రాష్ట్రంలోని సీపీఎస్ ఉద్యోగులు సామూహిక సెలవు పెట్టాలని నిర్ణయం తీసుకున్నట్టు రాష్ట్ర సీపీఎస్ అసోసియేషన్ నాయకులు పేర్కొన్నారు. అసోసియేషన్ అధ్యక్షుడు గంగాపురం స్థితప్రజ్ఞ, ప్రధాన కార్యదర్శి కల్వాల శ్రీకాంతాచారి, కోశాధికారి నరేశ్‌బాబు ఈ మేరకు ఆదివారం ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రవ్యాప్తంగా లక్షా 50వేల మంది ఉద్యోగ, ఉపాధ్యాయులు సెలవు పెడుతున్నారని చెప్పారు. సీపీఎస్ రద్దు ఉద్యమంలో టీఎన్జీవో, టీజీవో, ఉపాధ్యాయ సంఘాలు కలిసిరావడాన్ని స్వాగతించారు.

సీపీఎస్ రద్దుకు 'సెర్ప్' మద్దతు

సీపీఎస్ రద్దు ఉద్యమానికి ఐకేపీ-సెర్ప్ ఉద్యోగుల సంఘం, ఎంఎస్‌సీసీ సంఘాల జేఏసీ మద్దతు ప్రకటిస్తున్నట్టు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కుంట గంగాధర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి సుదర్శన్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సీపీఎస్ వల్ల రిటైర్డ్ ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.